
'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే
నాకు అసలైన పండుగ రోజు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50


సంపుటి: 17
సంచిక: 240

గురువారం 21-11-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

పన్నెండేళ్ల అమ్మాయి పదహారేళ్ల అమ్మాయి గురించి కథ రాస్తే ఎలా ఉంటుంది?! ఏడవతరగతి చదువుతున్న పన్నెండేళ్ల పట్లోళ్ల అక్షయినీ రెడ్డి రాసిన 'ట్రైల్ ఆఫ్ మిస్‌ఫార్చ్యూన్' పుస్తకం ద్వారా మనకు ఈ విషయాలు తెలుస్తాయి. మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి మనవరాలు అక్షయినీ రెడ్డి. "మా నానమ్మ ఎంత స్ట్రాంగ్‌గా ఉంటారో రోజూ చూస్తుంటాను. నానమ్మ, అమ్మ, నాన్న.. మా ఇంట్లోని వ్యక్తులే నాకు స్ఫూర్తి. నానమ్మ లైఫ్ గురించి ఒక బుక్ రాయాలనుకుంటున్నాను...' అంటూ ఎన్నో విషయాలను షేర్ చేసుకుంది.

● కృషి


● నానమ్మ సబితా ఇంద్రారెడ్డితో అక్షయినీ రెడ్డి

నానమ్మ గురించి రాస్తా...

''నాకు కథలపైన ఆసక్తి మొదలైందంటే అమ్మ చెప్పిన స్టోరీస్ వల్లే. రోజూ రాత్రి పడుకునే ముందు అమ్మ రకరకాల కథలు చెబుతుంటుంది. తమ్ముణ్ణి, నన్ను బయటకు తీసుకెళ్లినప్పుడైనా, కాస్త టైమ్ దొరికినా ఏదో చిట్టి కథ ఉంటుంది. సెకండ్ క్లాస్‌లో ఉన్నప్పుడు కథలు చెప్పి, వాటిని షార్ట్ ఫార్మ్‌లో రాసి చూపించమనేది. తర్వాత్తర్వాత పుస్తకాల్లోని కథలు చదివినా, వాటిని ఒక చిన్న పేరాలో రాసి చూపించేదాన్ని. ఈ అలవాటు నాకు పుస్తకాలంటే ఇష్టం పెరిగేలా చేసింది. ఇప్పుడు నా కోసం ఇంట్లో ఓ లైబ్రరీయే ఏర్పాటు చేశారు. ఎక్కువ భాగం ఇంగ్లిష్‌వే ఉంటాయి. ఫారినర్స్ రాసినవి, సుధామూర్తి రచనలు బాగా చదువుతాను. ఒక బుక్ చదివాక బాగా నచ్చితే ఆ బుక్ నుంచి మరొక స్టోరీ రాస్తాను. 'ట్రైల్ ఆఫ్ మిస్ ఫార్చ్యూన్' పుస్తకం అలా రాసిందే. నానమ్మ, నాన్న, అమ్మ, స్కూల్లో టీచర్స్, ఫ్రెండ్స్.. చాలా మెచ్చుకున్నారు.

బలమైన వ్యక్తిత్వం

'ట్రైల్ ఆఫ్ మిస్ ఫార్చ్యూన్' బుక్ లో పదహారేళ్ల అమ్మాయి పేరు ఆటమ్. ఆమె భావోద్వేగాలు ఈ పుస్తకం నిండా ఉంటాయి. ఒక చిన్న వెకేషన్ కోసం తల్లిదండ్రులను ఒప్పించి మెక్సికోకు బయల్దేరుతుంది. అనుకోని సంఘటనలో తల్లి మరణిస్తుంది. తమ కుటుంబం నుంచి దూరమైన ఆంటోనియోను కలుసుకుంటుంది. క్షేమకరం కాని ఆ ప్రాంతంలో ఉండలేక మెక్సికో నుంచి వాళ్లు లండన్‌కు చేరుకుంటారు. అక్కడ జేమ్సన్ అనే వ్యక్తిని కలుస్తారు. జేమ్సన్ కుటుంబంతో ఉండటమూ క్షేమకరం కాదని అర్థమై తండ్రి, ఆంటోనియోలతో కలిసి జర్మనీకి వెళ్లిపోతుంది. జీవితమెప్పుడూ సంతోషంగా ఉండాలనుకునే ఆటమ్ ప్రతినిత్యం సమస్యలతో చేసే ప్రయాణం గురించి ఈ కథ వివరిస్తుంది. ఆ అమ్మాయి స్నేహాలను ఎలా డెవలప్ చేసుకుంటుంది, ఫ్యామిలీని ఎలా చూసుకుంటుంది, ఒకమ్మాయి ఎంత స్ట్రాంగ్‌గా ఉండాలి అనే విషయాలు నేర్పిస్తుంది. ఇంకో విషయం ఏంటంటే హ్యాపీ ఎండింగ్ తప్పక దొరుకుతుంది అనే హోప్‌ని ఇస్తుంది. నా ఫ్రెండ్స్ టైటిల్ విషయంలో, కవర్ పేజీ విషయంలో సాయం చేశారు. ఈ బుక్ కోసం ఏడాది పాటు వర్క్ చేశాను. నిజానికి 16 ఏళ్ల అమ్మాయి ఎలా ఆలోచిస్తుంది అనే విషయాలను గురించి అంతగా మ్యాచ్ చేయలేకపోవచ్చు. నా క్లోజ్ ఫ్రెండ్స్ ఇద్దరూ బుక్స్ బాగా చదువుతారు. వారికి ఈ పుస్తకంలో స్నేహపూర్వక స్వభావం, స్ట్రాంగ్ విల్‌పవర్, వ్యక్తిత్వం బాగా నచ్చాయి. నా ఫ్రెండ్స్‌కు నేను రాసిన స్టోరీ నచ్చింది. నా ఫ్రెండ్స్ ఈ బుక్ కొని చాలా సపోర్ట్ చేశారు. స్కూల్లో అందరూ నన్ను అభినందించారు. కొందరు మంచి విమర్శలు కూడా చేశారు.

ఎంతో నేర్చుకోవాలి...

రచనలు చేయడంలో చాలా నేర్చుకోవాల్సి ఉందని నాకు ఈ పుస్తకం ద్వారా తెలిసి వచ్చింది. వచ్చిన విమర్శల నుంచి కూడా నేర్చుకుంటున్నాను. స్టోరీలో ఒక పాత్రను ఎలా ముందుకు తీసుకెళ్లాలి, ఆ క్యారెక్టర్‌ని ఎలా డెవలప్ చేయాలి, స్టోరీ ప్లాట్ ఎలా రాయాలి.. వంటివి నేర్చుకోవాలి. ఇదంతా తెలుసుకుంటూనే నా రచనల్లో వాటిని ఇంక్లూడ్ చేస్తూ వెళ్లాలని ఉంది. ముఖ్యంగా మా నానమ్మ ఎంత స్ట్రాంగ్‌గా ఉంటారో చూస్తుంటాను. నానమ్మ గురించి ఒక బుక్ రాయాలనుకుంటున్నాను. అందుకు, నేను ఇంకా చాలా నేర్చుకోవాలి.

మంచి రైటర్‌గా, బ్యాడ్మింటన్ క్రీడాకారిణిగా పేరుతెచ్చుకుంటూనే లాయర్‌ని అవ్వాలనే లక్ష్యంతో చదువుకుంటున్నాను. లాయర్‌గా న్యాయం కోసం పోరాటం చేస్తూనే, నా రచనల ద్వారా కొంత మందినైనా ప్రభావితం చేయాలనేది నా ముందున్న లక్ష్యం'' అంటూ తెలిపింది ఈ బాల రచయిత్రి.



టైమ్ క్రియేషన్

ఈ బుక్ రిలీజ్ అయ్యాక మా ఫ్రెండ్స్‌తో సహా కొంతమంది నీకు టైమ్ ఎలా సరిపోతుంది అని అడిగారు. నేను టైమ్‌ను క్రియేట్ చేసుకున్నాను. రోజులో ఒక గంటసేపు ఈ బుక్ కోసం కేటాయించుకున్నాను. మొత్తం ఇరవై ఐదు వేల పదాలు. నేనే స్వయంగా టైప్ చేసి, ఎడిటింగ్ చేసుకుంటూ, తిరిగి మార్పులు చేసుకుంటూ రాశాను. దీనిని బుక్‌గా తీసుకురావడానికి అమ్మవాళ్లకు చెప్పకుండానే నలుగురు పబ్లిషర్స్‌తో మాట్లాడాను. వాళ్లు ఆశ్చర్యపోయారు. పబ్లిషర్స్ అమ్మ వాళ్లను అప్రోచ్ అవడంతో... ఈ పని ఈజీ అయ్యింది.

– నిర్మలారెడ్డి
ఫొటోలు: గడిగె బాలస్వామి

న్యూస్‌మేకర్

విడాకుల లాయర్

ఆస్తిపాస్తులు కనీసం పదివేల కోట్లు ఉన్నవారు విడాకుల కోసం వెళ్లాలంటే వందనా షాను కలుస్తారు. దేశంలో హై ప్రొఫైల్ డివోర్స్ కేసులు చూసే మహిళా లాయర్‌గా వందనా షా పేరు గడించారు. ఏ.ఆర్.రెహమాన్, సాయిరా బానుల విడాకులతో ఆమె మళ్లీ వార్తల్లోకి వచ్చారు. 'విడాకులు ఇప్పించడం మీకు సంతోషమా?' అనడిగితే 'నేను స్వేచ్ఛను ఇప్పిస్తున్నాను' అంటారామె. స్వయంగా డివోర్సీ అయిన వందనా ఆ తర్వాతే లా ప్రాక్టీసు మొదలెట్టారు. వందన పరిచయం, రెహమాన్ విడాకుల పూర్వాపరాలు...

1995లో ఏ.ఆర్. రెహమాన్ పెళ్లయ్యింది. అదే సంవత్సరం అతను సంగీతం చేసిన 'బొంబాయి' విడుదలైంది. 'బొంబాయి'లో హీరోయిన్ పేరు సాయిరా బాను. రెహమాన్ జీవిత భాగస్వామి పేరు కూడా అదే. వచ్చే సంవత్సరం 'బొంబాయి' సినిమా, రెహమాన్ వైవాహిక జీవితం 30 ఏళ్ల ఉత్సవం జరుపుకోవాల్సి ఉంది. కానీ ఒకటి మాత్రమే జరుగుతుంది. ఒకటి జరగదు. సంగీత మాంత్రికుడి జీవితంలో అపశ్రుతి వస్తుందని ఎవరూ ఊహించలేదు. వీరి విడాకుల వ్యవహారాన్ని అడ్వకేట్ వందనా షా చూశారు. అధికారికంగా ఆమే ప్రకటించారు.

గుజరాత్ మూలాలు

1973లో జన్మించిన సాయిరా బాను మూలాలు కచ్‌లో ఉన్నాయి. వారిది గుజరాతి ముస్లిం కుటుంబం. మదురైలో స్థిరపడ్డ ఈ కుటుంబం నుంచి ఒక కుమార్తెను మలయాళ నటుడు రెహమాన్ (రఘు) వివాహం చేసుకుంటే మరో అమ్మాయిని ఏ.ఆర్.రెహమాన్ చేసుకున్నాడు. పెళ్లయ్యాక సాయిరా బాను రెహమాన్‌కు పేరు వచ్చేకొద్దీ ముఖేష్ అంబానీ భార్య నీతా అంబానీకి మిత్రురాలైందని అంటారు. సాయిరా, నీతా మధ్య మంచి స్నేహం ఉందని కథనం. ఇటీవల అంబానీ కుమారుడి పెళ్లిలో రెహమాన్ ప్రత్యేకమైన షో కూడా ఇచ్చాడు. ఇప్పుడు విడాకుల కేసును చూసిన వందనా షా కూడా గుజరాత్‌కు చెందిన అడ్వకేట్. అయితే ఆమె ప్రాక్టీసు ముంబై, పూణెలలో ఉంది.

తల్లి తెచ్చిన కోడలు

రెహమాన్ తల్లి నిర్ణయానికి ఎంతో విలువనిచ్చేవాడు. 'నాకు సమయం లేదు. నేను పెళ్లిచూపులకు తిరగలేను. చదువుకుని, సంగీతం అంటే ఇష్టపడుతూ, వినమ్రతతో ఉండే అమ్మాయిని చూడు' అని మాత్రమే తల్లిని అతడు కోరాడు. తల్లే ఈ సంబంధం తెచ్చింది. పెళ్లయ్యాక రెహమాన్, సాయిరా పరస్పరం ఎంతో గౌరవించుకునేవారు. 'నేను అతని స్వరానికి ఫ్యాన్‌ని' అని సాయిరా రెహమాన్ గురించి వేదికమీద చెప్పింది. రెహమాన్ కూడా ఆమెను వెంటబెట్టుకునే సంగీత యాత్రలు చేసేవాడు. వీరికి ముగ్గురు పిల్లలు. రెహమాన్ రెండు వారాల క్రితమే ఆస్ట్రేలియాలో, అబుదాబీలో లైవ్ షోలు చేశాడు. అతని ఫేస్‌బుక్ పేజ్‌లో ఇంకా భార్యతో ఉన్న ఫోటోనే కవర్ ఫొటోగా ఉంది. వందనా షాకు పరస్పర ఆమోదయోగ్యంగా విడిపోయేలా కేసులను గట్టెక్కిస్తుందనే పేరు ఉంది. అందుకే రెహమాన్‌గానీ, సాయిరాగాని మీడియాకు ఎక్కలేదు. వారిద్దరి నడుమా ఎంతో ప్రేమ ఉన్నా వెనక్కు రాలేనంతగా అగాథాలు ఏర్పడటమే' విడాకులకు కారణం అంటారు వందనా షా.


● సాయిరా బాను, ఏ.ఆర్.రెహమాన్


● వందనా షా

శ్రీమంతుల విడాకులు

వందనా షా శ్రీమంతుల విడాకుల ఎక్స్‌పర్ట్. 'ఆమె విడాకులు ఎక్కువగా ఇప్పిస్తోంది. పెళ్ళిళ్లకు పిలవకండి' అనేవారూ ఉన్నారు. కాని పాలిహిల్స్ (ముంబై)లో ఉండే జంటల విడాకుల కారణాలు అనూహ్యంగా ఉంటాయని అంటారు వందనా షా. 'బోర్‌డమ్', 'బిగ్గర్ బెటర్ డీల్' వల్ల విడిపోయే జంటలు ఎక్కువ అని ఆమె అంటారు. శ్రీమంతుల ఇళ్లలో భార్యాభర్తల మధ్య డబ్బు పంపకం, పిల్లల బాధ్యత ఇవే ప్రధాన సమస్యలనీ, 'ఇగో', 'వివాహేతర సంబంధాలు' తర్వాతి స్థానం అని అంటారామె. 'బాగా డబ్బున్న వారు పెళ్లికి ముందే అగ్రిమెంట్ చేసుకోవడం మంచిది. ఒకవేళ విడిపోతే ఎవరికి ఎంత, పిల్లలకు ఎంత.. ఇవి మాట్లాడుకుంటే అసలు వైవాహిక జీవితంలో గొడవలే రావు' అంటుందామె. ఇక మధ్యతరగతి విడాకులలో 'పిల్లలు ఎదిగొచ్చిన స్త్రీకి ఇక తానేమిటి, తన ఉనికి ఏమిటి అనే సమస్య మొదలయ్యి తన జీవితానికి ప్రాధాన్యత లేదా అనే అసంతృప్తి నుంచి విడాకులు అవుతాయి' అని తెలిపింది వందనా షా. 'పరస్పరం హింసించుకునే పెళ్లి కంటే విడాకులే నయం' అంటుందామె. అయితే పెళ్లితో బాధలు పడుతున్న పురుషుల గురించి కూడా ఆమె మాట్లాడుతుంది. 'బాగా సంపాదించే భార్య తన భర్తను ఇంటిపట్టున ఉండమని కోరడం, అతనిపై ఆధిపత్యం చెలాయించడం చూస్తున్నాం. మగాళ్లు హౌస్ హజ్బెండ్‌లుగా ఉండటాన్ని ఇష్టపడుతున్నా ఆధిపత్యం, అవమానం భరించలేక విడాకులు కోరుతున్నారు' అని తెలిపిందామె. మధ్యతరగతి ఇళ్లలో తల్లిని, భార్యను ఎదురుబొదురు కూచోబెట్టి వారి సమస్యను నేరుగా పరిష్కరించక తప్పించుకు తిరిగే మగవాడు అంతిమంగా విడాకుల దగ్గర తేలుతాడని కూడా ఆమె హెచ్చరిస్తోంది. బహుపరాక్.

● ఫస్ట్ టైమ్

పాదరసం

భారత సంతతికి చెందిన నికీ శర్మ బ్రిటిష్ కొలంబియా(బీసీ) డిప్యూటీ ప్రీమియర్‌గా నియామకం అయింది.

ఈ పదవి చేపట్టిన తొలి ఇండో–కెనడియన్‌గా చరిత్ర సృష్టించింది.

కెనడాలోని లేత్‌బ్రిడ్జ్‌లో పుట్టిన నికీ శర్మ బ్రిటీష్ కొలంబియాలోని స్పార్‌వుడ్‌లో పెరిగింది. ఆమె తల్లిదండ్రులు ఇండియా నుంచి వలస వచ్చారు. తండ్రి పాల్ చిన్న వ్యాపారవేత్త. తల్లి రోజ్ సైంటిస్ట్. 'యూనివర్శిటీ ఆఫ్ ఆల్బెర్టా ఫ్యాకల్టీ ఆఫ్ లా' నుంచి డిగ్రీ పట్టా పుచ్చుకున్న నికీ శర్మ ఆ తరువాత లా ఫర్మ్ 'డోనోవన్ అండ్ కంపెనీ'లో చేరింది.

పర్యావరణ సంస్థ 'స్టాండ్ ఎర్త్' కోసం క్యాంపెయినర్‌గా పనిచేసింది.

2014లో వాంకూవర్ సిటీ మునిసిపల్ ఎన్నికలలో పోటీ చేసి ఓడిపోయింది. ఈ ఓటమి మాట ఎలా ఉన్నా ఆ తరువాతి కాలంలో ఎన్నో ఉన్నత పదవులను చేపట్టింది.

అటార్నీ జనరల్‌గా జాతివివక్ష నిరోధక చట్టాన్ని ప్రవేశపెట్టింది. ఆన్‌లైన్ భద్రతకు సంబంధించి ఎంతో కృషి చేసింది. గత పదిహేనేళ్లుగా ఈస్ట్ వాంకూవర్‌లో నివసిస్తున్న శర్మ ఇద్దరు పిల్లల తల్లి. ఎప్పుడూ చురుగ్గా ఉండే శర్మను 'పాదరసం' అని పిలుస్తుంటారు.


● నికీ శర్మ

● మన(సు)లో మాట

పొద్దస్తమానం సోషల్ మీడియాలోనే!

డాక్టరు గారూ! నా కూతురు వయస్సు 16 సంవత్సరాలు. తను ఈ మధ్య సోషల్ మీడియాలో ఎక్కువ సమయం గడుపుతోంది. అక్కడ ఎక్కువగా అబ్బాయిలతో చాట్ చేయడం, తన ఫోటోలు పెట్టడం చేస్తోంది. మేము ఆంక్షలు పెట్టినప్పుడు విపరీతమైన కోపాన్ని, భావోద్వేగాలను ప్రదర్శించడం, మందలిస్తే నేమో ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించడం సాధారణం అయ్యాయి. ఈ మధ్య చదువు మీద శ్రద్ధ పూర్తిగా తగ్గిపోయింది. మీ సలహా కోసం ఎదురు చూస్తుంటాం.

–స్రవంతి, మహబూబ్‌నగర్



మీరు పడుతున్న వేదన అర్థమవుతోంది. ఈ మధ్య ఇలాంటి సమస్యలను తరచూ గమనిస్తున్నాం. మీ అమ్మాయికి ఉన్న కండిషన్‌ని 'బోర్డర్ లైన్ పర్సనాలిటీ డిజార్డర్' అంటారు. ఇందులోని ప్రధానమైన లక్షణాలు అస్థిరమైన సంబంధాలు, విపరీతమైన భావోద్వేగాలు ఆత్మహత్య బెదిరింపులు, ఆత్మహత్యా ప్రయత్నాలు. వీటికి తోడు మీరు చెప్పినట్టు స్నేహితులను మార్చడం, సంబంధాల స్వభావం కూడా ఈ సమస్యకి సంబంధించినవే! మీ అమ్మాయిని ఒక మంచి సైకియాట్రిస్టుకి చూపించి ఈ సమస్య కోసం వైద్య చికిత్స (మందులు) మానసిక చికిత్స (థెరపీ) ఇప్పించాలి. 'డయలెక్టికల్ బిహేవియర్ థెరపీ' ఆత్మ నియంత్రణను, మానవ సంబంధాలను మెరుగుపరుస్తుంది. సోషల్ మీడియా వినియోగంపై నిర్దిష్ట నిబంధనలు పెట్టడం మంచి ఆలోచన. నిర్ణీతగంటల్లో మాత్రమే ఉపయోగించడం, ఖచ్చిత సమయానికి పరిమితం చేయడం వంటివి, స్పోర్ట్స్, సాంస్కృతిక కార్యక్రమాలు, సామాజిక సేవలకు స్వచ్ఛందంగా సహాయం చేయడం తన పరిస్థితిని మెరుగు పరుస్తాయి. ఆమెతో మాట్లాడేటపుడు తన భావనలను గౌరవిస్తూనే, తనకు సరైన గైడెన్స్ ఇవ్వండి. తన పరిస్థితి మెరుగుపడడానికి సమయం, సహనం అవసరం. అన్నింటికీ మించి మీ కుటుంబ సభ్యుల ప్రేమ ఎంతో అవసరం. మీ ఆరోగ్యం పట్ల కూడా శ్రద్ధ వహించండి. ఆశాజనకంగా ఉండండి. నిదానంగా అన్నీ సర్దుకుంటాయి. ఆల్ ది బెస్ట్.

డా. ఇండ్ల విశాల్ రెడ్డి,
సీనియర్ సైకియాట్రిస్ట్, విజయవాడ.
మీ సమస్యలు, సందేహాలు పంపవలసిన మెయిల్ ఐడీ: sakshifamily3@gmail.com



● పురస్కారం

నీలా ఉంటే...


● నీలా ఇబ్రహీమి

'నువ్వు మాట్లాడకూడదు' అని బెదిరింపులు ఎదుర్కొన్న అమ్మాయి గురించి ఇప్పుడు ప్రపంచం గొప్పగా మాట్లాడుకుంటోంది. 'నువ్వు ఇంటికే పరిమితం కావాలి' అనే అప్రకటిత నిషేధానికి గురైన అమ్మాయి గురించి..'నీలాంటి అమ్మాయి ప్రతి ఇంట్లో ఉండాలి' అంటున్నారు. అఫ్గానిస్తాన్‌కు చెందిన పదిహేడేళ్ల నీలా ఇబ్రహీమి ప్రతిష్ఠాత్మకమైన ఇంటర్నేషనల్ చిల్డ్రన్స్ పీస్ ప్రైజ్ (కిడ్స్ రైట్స్ ప్రైజ్) గెలుచుకుంది. మహిళలు, బాలికల హక్కుల కోసం బలంగా తన గొంతు వినిపించినందుకు నీలా 'కిడ్స్ రైట్స్ ప్రైజ్'కు ఎంపికైంది....

'కిడ్స్ రైట్స్' ఫౌండేషన్ అందించే అంతర్జాతీయ బాలల శాంతి బహుమతి మానవహక్కులు, సామాజిక న్యాయానికి సంబంధించి గణనీయమైన కృషిచేసిన వారికి ఇస్తారు. ప్రపంచవ్యాప్తంగా 47 దేశాల నుంచి 165 మంది నామినీల నుంచి గట్టి పోటీని అధిగమించి ఈ బహుమతికి ఎంపికైంది నీలా ఇబ్రహీమి.

'నీలా ధైర్యసాహసాలకు ముగ్ధులం అయ్యాం' అన్నారు 'కిడ్స్ రైట్స్ ఫౌండేషన్' ఫౌండర్ మార్క్ డల్లార్ట్.

లింగ సమానత్వం, అఫ్గాన్ మహిళల హక్కుల పట్ల నీలా పాట, మాట ఆమె అంకితభావం, ప్రతిఘటనకు ప్రతీకలుగా మారాయి. అఫ్గానిస్థాన్‌లో తాలిబన్‌లు తిరిగి అధికారంలోకి వచ్చిన తరువాత ఊహించినట్లుగానే మహిళల హక్కులను కాలరాయడం మొదలుపెట్టారు.

ఆడపిల్లలు ప్రాథమిక పాఠశాలకు మించి చదువుకోకూడదు. మహిళలు పార్కులు, జిమ్, బ్యూటీ సెలూన్‌లకు వెళ్లడాన్ని నిషేధించారు.

మహిళలు ఇల్లు దాటి బయటికి రావాలంటే పక్కన ఒక పురుషుడు తప్పనిసరిగా ఉండాల్సిందే.

దీనికితోడు కొత్త నైతిక చట్టం మహిళల బహిరంగ ప్రసంగాలపై నిషేధం విధించింది. ఈ పరిస్థితిని ఐక్యరాజ్యసమితి 'లింగ వివక్ష'గా అభివర్ణించింది. తాలిబన్ ప్రభుత్వం మాత్రం ఇది నిరాధారమని, దుష్ప్రచారం అని కొట్టిపారేసింది.

మహిళల హక్కులపై తాలిబన్‌ల ఉక్కుపాదం గురించి నీలా పాడిన శక్తిమంతమైన నిరసన పాట సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఈ పాట అఫ్గాన్ సమాజంపై చూపిన ప్రభావం ఇంతా అంతా కాదు. నీలా 'ఐయామ్ మైసాంగ్' మూవ్‌మెంట్ మహిళల హక్కులపై గొంతు విప్పడానికి ఎంతోమందికి స్ఫూర్తినీ, ధైర్యాన్ని ఇచ్చింది.

'నేను చేసిన పని రిస్క్‌తో కూడుకున్నది. అది అత్యంత ప్రమాదకరమైనదని కూడా. అయితే ఆ సమయంలో నాకు అదేమీ తెలియదు. ఎందుకంటే అప్పుడు నా వయసు పద్నాలుగు సంవత్సరాలు మాత్రమే' అంటూ గతాన్ని గుర్తు చేసుకుంటుంది నీలా. 'అంతర్జాతీయ బాలల శాంతి బహుమతిని గెలుచుకోవడం అంటే అఫ్గాన్ మహిళలు, బాలికల గొంతు ప్రపంచవ్యాప్తంగా ప్రతిధ్వనించడం. తాలిబన్‌ల పాలనలో అనూహ్యమైన సవాళ్లను ఎదుర్కొంటున్న మహిళల హక్కుల కోసం పోరాడాను. పోరాడుతూనే ఉంటాను' అంటూ పురస్కార ప్రదానోత్సవంలో మాట్లాడింది నీలా.

నీలా పట్ల అభిమానం ఇప్పుడు అఫ్గాన్ సరిహద్దులు దాటింది. అంతర్జాతీయ స్థాయిలో ఆమెకు అభిమానులు ఉన్నారు.

అఫ్గాన్‌ను విడిచిన నీలా ఇబ్రహీమి '30 బర్డ్స్ ఫౌండేషన్' సహాయంతో కుటుంబంతో కలిసి కెనడాలో నివసిస్తుంది. 'నేను నా కొత్త ఇంట్లో సురక్షితంగా ఉన్నాను. అయితే అఫ్గానిస్తాన్‌లో ఉన్న అమ్మాయిల గురించి ఎప్పుడూ ఆలోచిస్తుంటాను. ప్రపంచంలో ఏ ప్రాంతంలో మహిళల హక్కులు దెబ్బతిన్నా అది యావత్ ప్రపంచంపై ఏదో ఒకరకంగా ప్రభావం చూపుతుంది' అంటుంది నీలా.

'హర్ స్టోరీ' కో–ఫౌండర్‌గా అఫ్గానిస్థాన్‌లోని అమ్మాయిలు తమ గొంతు ధైర్యంగా వినిపించడానికి ప్రోత్సాహాన్ని ఇస్తోంది.

అఫ్గాన్‌లో మహిళా విద్య, హక్కులకు సంబంధించి జెనీవా సమ్మిట్ ఫర్ హ్యూమన్ రైట్స్ అండ్ డెమోక్రసీ. యూకే హౌజ్ ఆఫ్ లార్డ్స్, కెనడియన్ ఉమెన్ ఫర్ ఉమెన్ ఆఫ్ అఫ్గానిస్థాన్ మాంట్రియల్ సమ్మిట్, టెడ్ వాంకూవర్‌లాంటి వివిధ కార్యక్రమాలలో తన గళాన్ని వినిపించిన నీలా ఇబ్రహీమీ పర్యావరణ కార్యకర్త గ్రెటా థన్‌బర్గ్, నోబెల్ శాంతి బహుమతి గ్రహీత మలాలాతో కలిసి పనిచేస్తోంది.

● ప్రశ్న గుచ్ఛం

లైఫ్ అంటే... పెళ్లి మాత్రమేనా?!

టబు వయసు 53. ఈమధ్యే, నవంబర్ 4న ఆమెకు అభిమానుల నుంచి జన్మదిన శుభాకాంక్షలు, బంధుమిత్రులనుంచి.. 'ఎప్పుడూ వర్కేనా? కాస్త లైఫ్ గురించి కూడా ఆలోచించు..' అనే వివాహ ఆంక్షలూ అందాయి. టబుకు ఏటా ఉండేవే ఈ పుష్పగుచ్ఛాలు. ''ఎప్పుడూ వర్కేనా? కాస్త లైఫ్ గురించి కూడా ఆలోచించు..'' అంటే.. 'పెళ్లి గురించి ఆలోచించు, వయసేం మించిపోలేదు..' అని చెప్పటం.

పెళ్లి మాట అటుంచితే, 'ఎప్పుడూ వర్కేనా? కాస్త లైఫ్ గురించి కూడా ఆలోచించు..' అనే మాట టబును అమితంగా ఆశ్చర్యపరుస్తుందట. 'ఒక వ్యక్తికి వర్కే లైఫ్ ఎందుకు కాకూడదు? లైఫ్‌ని పక్కన పెట్టి ఒక వ్యక్తి వర్క్‌ను మాత్రమే ఎందుకు కోరుకోకూడదు? అని 'ది నాడ్' అనే డిజిటల్ మ్యాగజీన్‌కు ఇచ్చిన తాజా ఇంటర్వ్యూలో ప్రశ్నించారు టబు.

'వర్క్, లైఫ్ నాకు వేర్వేరు కావు. అందుకే నాకు 'వర్క్ – లైఫ్ బ్యాలెన్స్' అనే మాట అర్థం కాదు. జీవితంలో ప్రతిదీ, ప్రతి సమస్యా, ప్రతి పోరాటం, ప్రతి యుద్ధం.. వ్యక్తిగత ప్రాధాన్యాలను బట్టే ఉంటుంది. నాకు వర్క్ తప్ప వేరే జీవితం గురించి తెలియదు. పోల్చి చూసుకోటానికి నాకు వేరే జీవితం కూడా లేదు. నా జీవితంలో వేరే ఎవరైనా ఉంటే ఇంతకన్నా బాగుండేదా లేక, ఇప్పుడున్న జీవితమే మెరుగ్గా ఉండేదా అనేది కూడా నాకు తెలీదు. ఎప్పటికీ తెలియదు. నేనిప్పుడు నా జీవితంతో చాలా సంతోషంగా ఉన్నాను. నేను 20 ఏళ్ల వయసులో లేను కనుక సంతోషానికి నా నిర్వచనం 50లలో ఉన్నట్లే ఉంటుంది. ప్రతి ఒక్కరూ సంతోషంగా ఉండేందుకే ప్రయత్నిస్తారు. అయితే సంతోషం కన్నా కూడా సంతృప్తి ముఖ్యం అనుకుంటాను నేను. అంతకన్నా కూడా మనల్ని మనం యాక్సెప్ట్ చెయ్యాలి' అన్నారు టబు.

ఈ ఏడాది ఆగస్టులో విడుదలైన టబు తాజా రొమాంటిక్ థ్రిల్లర్.. ఔరోన్ మే కహా దమ్ థా.

'ఆ ధైర్యం ఇతరులకు ఎక్కడిది?' అని ఆ టైటిల్‌కి అర్థం.



● టబు



ఇంటిప్స్

అదే రంగు... మరింత రుచి!

- ఆకు కూరలను ఉడికించేటప్పుడు అందులో చిటికెడు చక్కెర వేస్తే ఆకు కూర రంగు మారదు. చూడడానికి ఆకర్షణీయంగా ఉంటుంది.
- ఫ్రీజర్‌లో నుంచి తీసిన పనీర్‌ను అప్పటికప్పుడు వాడితే గట్టిగా... రబ్బరు ముక్కల్లా ఉంటాయి. అందువల్ల కూర చేయడానికి ముందు పది నిమిషాల సేపు వేడినీటిలో వేస్తే పనీర్ ముక్కలు మృదువుగా మారతాయి.
- అల్లం వెల్లుల్లి పేస్ట్ చేసి కొంత వాడిన తర్వాత కొంత ఫ్రిజ్‌లో పెడుతుంటాం. కానీ అది ఫ్రిజ్‌లో ఉన్నప్పటికీ రంగుమారిపోతుంది. కాబట్టి అల్లం వెల్లుల్లి పేస్ట్‌ని గాలి చొరబడని డబ్బాలో పెట్టి ఫ్రీజర్‌లో పెట్టాలి. ఇలా చేస్తే మళ్లీ వాడడానికి గంట ముందు బయటకు తీసి ఉంచాలి. ఈ పేస్టులో కొద్దిగా నూనె లేదా చిటికెడు ఉప్పు కలిపి ఫ్రిజ్‌లో పెడితే రంగు మారదు.


'అభివృద్ధి ఎంత ముఖ్యమో..
సంక్షేమమూ అంతే ముఖ్యం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 | వెల: ₹ 5.50

సంపుటి: 17
సంచిక: 240

గురువారం 21-11-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



మనమే 'ఆసియా' చాంపియన్స్

ఫైనల్లో చైనాపై భారత్ గెలుపు. ఆసియా చాంపియన్స్ ట్రోఫీ సొంతం - 14లో



స్టార్‌షిప్ ప్రయోగం సక్సెస్

స్పేస్ ఎక్స్ 'స్టార్‌షిప్' రాకెట్ ప్రయోగాన్ని ట్రంప్, మస్క్ వీక్షించారు - 6లో



మొదలైన 'గజగజ'!

రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు వేగంగా పడిపోతున్నాయి. అత్యల్పంగా సంగారెడ్డి జిల్లా కోహీర్‌లో 9 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది.

- వివరాలు 2లో ▶



కాలుష్యానికి కళ్లెం

ఢిల్లీ మాదిరే బీజింగ్ నగరమూ కాలుష్యంతో ఉక్కిరిబిక్కిరి అయ్యేది. అయితే, ఆ ముప్పు నుంచి బీజింగ్ ఎలా బయటపడిందంటే...

- వివరాలు 6లో ▶



అమెరికా ఎంబసీ మూసివేత

దాడులు జరిగే అవకాశం ఉందన్న సమాచారంతో ఉక్రెయిన్ రాజధాని కీవ్‌లోని తన ఎంబసీని అమెరికా మూసివేసింది.

- వివరాలు 6లో ▶



మార్కులు కొట్టి.. 'మార్కెట్' పట్టి..

మద్నూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎంపికకు మౌఖిక పరీక్ష నిర్వహించగా ఎక్కువ మార్కులు పొందిన సౌజన్య చైర్‌పర్సన్‌గా ఎంపికయ్యారు.

- వివరాలు 3లో ▶



మళ్లీ మహాయుతి!

- మహారాష్ట్ర బీజేపీ కూటమిదే
- జార్ఖండ్‌లోనూ ఎన్డీఏకే మొగ్గు
- అత్యధిక ఎగ్జిట్ పోల్స్ వెల్లడి
- శనివారం రానున్న ఫలితాలు

మహారాష్ట్ర, జార్ఖండ్‌లో పోలింగ్ ప్రక్రియ ముగియడంతోనే ఎగ్జిట్ పోల్స్ వెల్లువెత్తాయి. మహారాష్ట్రలో బీజేపీ సారథ్యంలోని మహాయుతి కూటమి.. జార్ఖండ్‌లోనూ ఎన్డీఏ కూటమి.. అధికారంలోకి వస్తాయని జోస్యం చెప్పాయి. రెండు రాష్ట్రాల ఫలితాలు శనివారం వెలువడనున్నాయి.

ప్రశాంతంగా 'మహా' ఎన్నికలు

- 60 శాతం పోలింగ్ నమోదు
- జార్ఖండ్ రెండో విడతలో 67.59%..

- వివరాలు 6లో

పరిశ్రమలు పెడుతుంటే ఎందుకంత కడుపుమంట?



మీ హయాంలో ఊళ్లకు ఊళ్లు ఖాళీ చేయించిన్రు

నేను 1,100 ఎకరాలు తీసుకుంటుంటే కాళ్లలో కట్టెలు పెడుతున్నరు

కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌లపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఫైర్

- నాకు భూమి విలువ తెలుసు.. గ్రామాల్లో మనకున్న గౌరవం భూమి
- అందుకే సేకరించే భూమికి మూడింతలు అధికంగా పరిహారమివ్వాలని చెప్పా
- భూ సేకరణ లేకుండా పరిశ్రమలు ఎలా వస్తాయ్? బుద్ధి లేదా కేసీఆర్?
- కేసీఆర్ రూ.1.80 లక్షల కోట్లతో ప్రాజెక్టులు చేపట్టి ఒక్కదాన్నీ పూర్తి చేయలేదన్న సీఎం
- స్థానిక సంస్థల ఎన్నికల్లో బావబామ్మర్దుల సంగతి చెప్తాం అంటూ సవాల్
- వేములవాడ రాజన్న ఆలయంలో పూజలు..అభివృద్ధి పనులకు శంకుస్థాపన

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: 'నేను జెడ్పీ సభ్యుడి నుంచి సీఎం దాకా అన్ని పదవులూ చేపట్టా.. నాకు భూమి విలువ ఏంటో తెలుసు. గ్రామాల్లో మనకు ఉన్న గౌరవం భూమి...నాకు తెల్వదా..? అందుకే సేకరించే భూమికి మూడింతలు అధికంగా పరిహారమివ్వాలని అధికారులకు చెప్పా. ఈ మేరకు చట్ట సవరణ చేయాలని ఆదేశించా. మా వెనకబడిన కొడంగల్‌ను స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి పట్టించుకున్న వారు లేరు. మా ప్రాంతంలో యువతకు ఉపాధి కోసమని పరిశ్రమలు పెడతానంటే కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులకు ఎందుకంత కడుపు మంట? ఎందుకంతదుఃఖం? మీ హయాంలో ప్రాజెక్టుల కోసం ఊళ్లకు ఊళ్లు ఖాళీ చేయించిన్రు. నేను కేవలం 1,100 ఎకరాలు తొండలు కూడా గుడ్లు పెట్టని భూమిని తీసుకుంటుంటే కాళ్లలో

మిగతా 2వ పేజీలో ▶

నాడు నేడు అదే కోడె

వేములవాడ: చిత్రంలోని కోడెను గత మార్చిలో వేములవాడకు వచ్చిన ప్రధాని మోదీ రాజన్నకు మొక్కు చెల్లించారు. అదే కోడెను బుధవారం సీఎం రేవంత్‌రెడ్డి మొక్కు చెల్లించారు. ఇద్దరూ ఇలా ఒకే కోడెను మొక్కు చెల్లించడం యాదృచ్ఛికమంటూ అంతా చర్చించుకున్నారు.

మెరిసిన వరి రైతు.. మునిగిన పత్తి రైతు



ఏటేటా ఖరీఫ్‌లో పెరుగుతున్న వరి విస్తీర్ణం.. తగ్గుతున్న పత్తి, ఇతర పంటల సాగు

- బియ్యానికి డిమాండ్‌తో ధాన్యానికి 'మద్దతు' కన్నా ఎక్కువ ధర
- పత్తి ధరలపై మాత్రం మార్కెట్ మాయాజాలం
- కొన్నేళ్లుగా రైతులకు చుక్కలు చూపిస్తున్న పత్తి
- వరికి ఖర్చు, పని తక్కువ.. పత్తి పంటకు ఈ రెండూ ఎక్కువే... దీనితో వరి వైపు మళ్లుతున్న తీరు

12 లో

● బాబు భాషకు అర్థాలు వేరు

బాదడమే సంపద సృష్టి!

ప్రజలపై యూజర్ చార్జీలు, పన్నులు, టోల్ చార్జీలు.. అదేనా మీ సూత్రం?

ఏపీ సీఎం చంద్రబాబును నిలదీసిన వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్



- స్కామ్‌ల కోసం మెడికల్ కాలేజీలు, పోర్టులు అమ్మేస్తారా?
- సంపద సృష్టి అంటే రోడ్డుపై తిరగాలంటే పన్ను కట్టడమా?
- మా ప్రభుత్వంలో రోడ్ల కోసం రూ.43,036.28 కోట్లు వెచ్చించాం
- 2014–19లో మీరు ఖర్చు చేసింది రూ.24,792.19 కోట్లే
- అయినా నిస్సిగ్గుగా దుష్ప్రచారం.. పైగా సమర్థింపు
- రాష్ట్రంలో ప్రస్తుతం ఎక్కడ చూసినా మాఫియా ముఠాలు
- మద్యం, ఇసుకలో అందిన కాడికి దోపిడీ
- మహిళల అక్రమ రవాణా దుష్ప్రచారమేనని మీ మాటల్లోనే స్పష్టత
- ఐ టీడీపీ ద్వారా మా చెల్లిపై దుష్ప్రచారం చేయించింది మీరు కాదా?

12 లో

కేసీఆర్ రైతు సీఎం.. రేవంత్‌రెడ్డి బూతు సీఎం

మాజీ మంత్రి హరీశ్‌రావు విసుర్లు

- మాట తప్పడం రేవంత్‌కు అలవాటే
- పాలన చేతకాక ఫ్రస్ట్రేషన్‌లో తిట్లు..

- వివరాలు 2లో



తెలంగాణకే 'సాగర్' పగ్గాలివ్వాలి!

- కృష్ణా బోర్డు 19వ సమావేశం ఎజెండాలో రాష్ట్రం డిమాండ్
- డిసెంబర్ 3న జలసౌధలో కీలక భేటీ

13 లో

క్లుప్తంగా...

నేడు హైదరాబాద్‌కు రాష్ట్రపతి రాక

- కోటి దీపోత్సవంలో పాల్గొననున్న ద్రౌపదీ ముర్ము
- శుక్రవారం శిల్పకళావేదికలో లోక్ మంథన్‌కు హాజరు



సాక్షి, న్యూఢిల్లీ/హైదరాబాద్: రెండురోజుల పర్యటన కోసం రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము గురువారం హైదరాబాద్‌కు రానున్నారు. గురు, శుక్రవారాల్లో (21, 22వ తేదీల్లో) ఆమె హైదరాబాద్‌లో వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారు. గురువారం ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో బయలుదేరి సాయంత్రం 6 గంటలకు హైదరాబాద్‌లోని బేగంపేట విమానాశ్రయంలో దిగుతారు. అటునుంచి రాజ్‌భవన్‌కు చేరుకొని 6.20 గంటల నుంచి 7.10 వరకు విశ్రాంతి తీసుకొంటారు. రాత్రి 7.20 గంటలకు ఎన్టీఆర్ స్టేడియానికి చేరుకొని, అక్కడ నిర్వహి స్తున్న కోటి దీపోత్సవ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. తిరిగి రాజ్‌భవన్‌కు చేరుకొని రాత్రి అక్కడే బస చేస్తారు. శుక్రవారం ఉదయం 10.30 గంటలకు శిల్పకళా వేదికలో జరుగుతున్న 'లోక్ మంథన్' కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరవుతారు. మధ్యాహ్నం 12.05 గంటలకు తిరిగి ఢిల్లీ బయలుదేరి వెళ్తారని అధికార వర్గాలు తెలిపాయి.

అబద్ధాల చక్రవర్తి సీఎం రేవంత్

మాజీ మంత్రి పొన్నాల



సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అబద్ధాల చక్రవర్తిగా మారారని, ఆయనకు రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై ఏ మాత్రం అవగాహన లేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత పొన్నాల లక్ష్మయ్య విమర్శించారు. అధికారంలోకి వచ్చిన పది నెలల్లో రైతాంగానికి చేసిందేమీ లేకున్నా.. రాష్ట్రంలో ధాన్యం దిగుబడి పెరగడాన్ని తన ఘనతగా రేవంత్ చెప్పుకొంటున్నారని మండిపడ్డారు. ఆయన బుధవారం మాజీ మంత్రి జోగు రామన్న, పార్టీ నేతలు దాసోజు శ్రవణ్, చాడ కిషన్ రెడ్డి, మోహిద్ ఖాన్‌తో కలిసి తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. నాగార్జునసాగర్ టెయిల్‌పాండ్ నుంచి 3 టీఎంసీల నీటిని పొరుగు రాష్ట్రం తరలించుకు వెళ్లినా.. సీఎం చోద్యం చూశారని విమర్శించారు. కేసీఆర్ హయాంలో నిర్మితమైన ప్రాజెక్టులతో భూగర్భ జలాలు పెరగడం వల్లే అధిక దిగుబడులు వచ్చాయని 'పొన్నాల' స్పష్టం చేశారు. వరంగల్ పర్యటనలో సీఎం రూ.6 వేల కోట్ల విలువైన పథకాలను ప్రకటించినా.. వాటి పూర్తికి గడువు ప్రకటించకపోవడాన్ని ప్రశ్నించారు. రైతు రుణమాఫీ చేశామంటూ సీఎం రేవంత్ పదే పదే అబద్ధాలు చెబున్నారని మాజీ మంత్రి జోగు రామన్న ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ గంజాయి మొక్కలా మారారని పార్టీ నేత దాసోజు శ్రవణ్ విమర్శించారు.

ఎస్సీ, ఎస్టీ కేసుల్లో స్టేషన్ బెయిల్ ఇవ్వొద్దు

తెలంగాణ ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య



సాక్షి, న్యూఢిల్లీ: ఎస్సీ, ఎస్టీ కేసుల్లో అరెస్టయిన వారికి పోలీసులు స్టేషన్ బెయిల్ మంజూరు చేసి బయటికి పంపేస్తున్నారని తెలంగాణ ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య తెలిపారు. ఈ కారణంగా ఉద్యమాలతో తెచ్చుకున్న ఎస్సీ, ఎస్టీ చట్టం నీరుగారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. స్టేషన్ బెయిల్ ఇవ్వొద్దనే డిమాండ్‌తో కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్‌మేఘ్వాల్‌ను కలిసి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. ఆయన బుధవారం తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. దీనిపై ప్రధానమంత్రితో చర్చిస్తామని న్యాయశాఖ మంత్రి హామీ ఇచ్చారని తెలిపారు. లగచర్ల ఘటనపై ఇప్పటికే కలెక్టర్, ఎస్పీలకు నోటీసులు ఇచ్చామన్నారు. వారినుంచి నివేదిక వచ్చాక.. చట్ట ప్రకారం ముందుకెళ్తామని స్పష్టం చేశారు.



మంచి పని చేశార్సార్!
లేకుంటే ఎగ్జిట్‌పోల్స్‌లో గెలుస్తున్నాం.. ఒరిజినల్ పోల్స్‌లో ఓడిపోతున్నాం..!!

మొదలైన 'గజగజ'!



రాష్ట్రంలో వేగంగా పడిపోతున్న ఉష్ణోగ్రతలు | సాధారణం కంటే 2 - 4 డిగ్రీలు తక్కువగా నమోదు | బుధవారం కోహిర్‌లో అత్యల్పంగా 9 డిగ్రీల సెల్సియస్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు వేగంగా పడిపోతున్నాయి. ప్రస్తుత సమయంలో నమోదు కావాల్సిన సాధారణ ఉష్ణోగ్రతల కంటే 2 నుంచి 4 డిగ్రీ సెల్సియస్ వరకు తక్కువ నమోదవుతున్నట్లు వాతావరణ శాఖ గణాంకాలు చెబుతున్నాయి. బుధవారం రాష్ట్రంలో అత్యల్పంగా సంగారెడ్డి జిల్లా కోహిర్‌లో 9 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. ఒకవైపు ఉష్ణోగ్రతలు తగ్గడం, మరోవైపు రాష్ట్రానికి తూర్పు, ఈశాన్య దిశల నుంచి తక్కువ ఎత్తులో బలమైన గాలులు వీస్తుండడంతో చలి తీవ్రత పెరిగింది. వాతావరణంలో ఒక్కసారిగా మార్పులు చోటుచేసుకోవటంతో జ్వరాలు, జలుబు, దగ్గులాంటి అనారోగ్య సమస్యలు పెరుగుతున్నట్లు వైద్యారోగ్య శాఖ బుధవారం వెల్లడించింది. ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది.

రాష్ట్రమంతా పడిపోతున్న ఉష్ణోగ్రతలు

రాష్ట్రంలో బుధవారం కనిష్ట ఉష్ణోగ్రత 9 డిగ్రీల సెల్సియస్‌కు పడిపోయింది. సంగారెడ్డి జిల్లా కోహిర్‌లో 9 డిగ్రీల సెల్సియస్ నమోదు కాగా, కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్‌లో 9.7 డిగ్రీల సెల్సియస్ నమోదైంది. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 20 ప్రాంతాల్లో 13 డిగ్రీల సెల్సియస్ కంటే తక్కువ ఉష్ణోగ్రతలు నమోదైనట్లు వాతావరణ శాఖ తెలిపింది. ప్రధాన పట్టణాల్లో కూడా ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. బుధవారం నిజామాబాద్‌లో గరిష్ట ఉష్ణోగ్రత 32.1 డిగ్రీలు నమోదుకాగా, కనిష్ట ఉష్ణోగ్రత మెదక్‌లో 11.8 డిగ్రీల సెల్సియస్‌గా రికార్డయ్యింది. ఆదిలాబాద్, హనుమకొండ, మెదక్, పటాన్‌చెరు ప్రాంతాల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 4 డిగ్రీలు.. హైదరాబాద్, ఖమ్మం, రామగుండం, రాజేంద్రనగర్ ప్రాంతాల్లో 3 డిగ్రీల సెల్సియస్ తక్కువగా నమోదయ్యాయి. రానున్న మూడురోజులు ఇదే తరహా వాతావరణం ఉంటుందని వాతావరణ శాఖ ప్రకటించింది.

బుధవారం రాష్ట్రంలోని ప్రధాన కేంద్రాల్లో నమోదైన ఉష్ణోగ్రతలు (సెల్సియస్‌లలో)

కేంద్రం	గరిష్టం	కనిష్టం
ఆదిలాబాద్	30.3	12.2
భద్రాచలం	30.2	18.8
దుండిగల్	28.0	15.3
హకీంపేట్	28.5	15.3
హనుమకొండ	30.2	14.5
హైదరాబాద్	28.8	15.1
ఖమ్మం	32.0	18.2
మహబూబ్‌నగర్	29.3	17.7
మెదక్	29.8	11.8
నల్లగొండ	29.0	19.0
నిజామాబాద్	32.1	15.6
రామగుండం	29.2	15.2

కేసీఆర్ రైతు సీఎం..
రేవంత్‌రెడ్డి బూతు సీఎం

మాట తప్పడం రేవంత్‌కు అలవాటే

- వరంగల్ సభలో కేసీఆర్ జపం: మాజీ మంత్రి హరీశ్‌రావు



మదనాపురం మండలం నెలివిడి సమీపంలో రైతులతో మాట్లాడుతున్న మాజీ మంత్రులు హరీశ్‌రావు, శ్రీనివాస్‌గౌడ్

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: 'పంద్రాగస్టులోగా రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేస్తానని కురుమూర్తి వెంకటేశ్వరస్వామిపై ఒట్టు వేసి మోసం చేసిండు సీఎం రేవంత్‌రెడ్డి. ఇటీవల ఆయన కురుమూర్తిస్వామిని దర్శించుకున్నడు. ఒట్టేసి మాట తప్పినందుకు ప్రాయశ్చిత్తం చేసుకుంటాడేమోనని అనుకున్నా. మాట తప్పడం రేవంత్‌రెడ్డికి అలవాటే. కొడంగల్‌లో ఓడిపోతే రాజకీయ సన్యాసం తీసుకుంటానని మాట ఇచ్చి తప్పాడు. ఎన్నికల ముందు బాండ్‌పేపర్ మీద రాసి 100 రోజుల్లో 6 గ్యారంటీలు అమలు చేస్తామని చెప్పి మాట తప్పాడు. పరిపాలన చేతకాక ఫ్రస్ట్రేషన్‌లో తిట్ల పురాణం మొదలుపెడతాడు. కేసీఆర్ రైతు సీఎం అయితే రేవంత్ రెడ్డి బూతు సీఎం.' అని మాజీమంత్రి టి.హరీశ్‌రావు ధ్వజమెత్తారు. బుధవారం మహబూబ్‌నగర్ జిల్లా చిన్నచింతకుంట మండలం అమ్మాపూర్‌లోని కురుమూర్తిస్వామిని మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, నిరంజన్‌రెడ్డి, ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి తదితరులతో కలిసి దర్శించుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు.

ఓటమి భయం మొదలైంది..

'వరంగల్ సభలో రేవంత్‌రెడ్డి తన ప్రసంగంలో 50 సార్లు కేసీఆర్ పేరు జపం చేశాడు. ప్రజలు కేసీఆర్‌ను గుర్తు చేసుకుంటున్నారు. రేవంత్‌లో ఓటమి భయం మొదలై కేసీఆర్‌పై ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారు. వరంగల్‌లో తొమ్మిది రకాల హామీలతో కాంగ్రెస్ రైతు డిక్లరేషన్ చేసింది. సభలో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేస్తారేమో అని ఆశపడ్డాం. రైతులకు పూర్తి రుణమాఫీ చేస్తానని చెప్తాడేమో అనుకున్నాం. కానీ జరగలేదు.

రేవంత్ వచ్చాక బ్రూ ట్యాక్స్ వచ్చింది..

రేవంత్‌రెడ్డి వచ్చినంక బ్రూ(బిల్లులు, రెవెన్యూ) ట్యాక్స్ వచ్చింది. ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్లో బిల్లు రావాలంటే 8 నుంచి 15 శాతం ట్యాక్స్ కట్టాలి. హైదరాబాద్‌లో ఎవరైనా బిల్డింగ్ కట్టాలంటే స్క్వేర్ ఫీట్‌కు రూ.100 ట్యాక్స్ కట్టాలి. పదేళ్లలో తెలంగాణను అభివృద్ధి పథంలో నడిపిన వాళ్లం. ఎన్ని తిట్లు అయినా మేము భరిస్తాం. కానీ ప్రజలను మోసం చేస్తే ఊరుకోం.

తొక్కుకుంటూ అడ్డదారుల్లో..

2014లో కేసీఆర్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 30 లక్షల మెట్రిక్ టన్నుల వడ్లు మాత్రమే పండేవి. కేసీఆర్ దిగిపోయిన నాడు 1.59 లక్షల మెట్రిక్ టన్నుల వడ్లు పండాయి. 66 ఏళ్లు కాంగ్రెస్, టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు ఎందుకు ఇంత పంట పండలేదు? కేసీఆర్ ఘనతను తమ ఘనతగా కాంగ్రెస్ చెప్పుకోవడం సిగ్గుచేటు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినంక ఒక ప్రాజెక్ట్ అయినా కట్టారా..ఒక చెరువు అయినా తవ్వారా.. కనీసం రైతుబంధు అయినా ఇచ్చారా? ఏదీ చేయకుండా పంట ఎలా పెరిగింది. కేసీఆర్ కలుపు మొక్క కాదు కల్పవృక్షం. రేవంత్ రెడ్డే కలుపు మొక్క. సీనియర్ కాంగ్రెస్ నాయకులను తొక్కుకుంటూ అడ్డదారుల్లో ముఖ్యమంత్రి అయ్యావు. గెలిచిన తర్వాత పేదలను, రైతులను తొక్కుకుంటూ అధికారం అనుభవిస్తున్నావు.' అని హరీశ్ విమర్శించారు.

మద్యం అమ్మకపోతే అధికారులకు మెమో

'నెల కింద మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి 90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొంటాం అని చెప్పారు. నిన్న సివిల్ సప్లయ్ కమిషనర్ చౌహాన్ 70లక్షల ధాన్యం కొంటామని ప్రకటించారు. నెల రోజుల్లో 20 లక్షల వడ్లు దళారుల పాలు అయ్యిందని వారే చెప్పక చెబుతున్నారు. కేసీఆర్ పాలనలో చివరి గింజ వరకు ప్రభుత్వమే కొనుగోలు చేసింది. వడ్లు, పత్తి కొనుగోలు గురించి సీఎం అడగడం లేదు. మద్యం కొనుగోలు గురించి మాత్రమే అడుగుతున్నాడు. మద్యం అమ్మకాలకు టార్గెట్ పెట్టి ఎక్సైజ్ అధికారులకు మెమో ఇచ్చిన ఘనత రేవంత్‌రెడ్డిది. ఈ జిల్లా మంత్రి జూపల్లి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గారిని అడుగుతున్నా. మద్యం అమ్మకం జరగడం లేదని అధికారులకు మెమో ఇచ్చారా లేదా?' అని హరీశ్‌రావు ప్రశ్నించారు.

గిగ్ వర్కర్ల కోసం ప్రత్యేక చట్టం

సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటన

- రాహుల్‌గాంధీ సూచన మేరకు నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని గిగ్ వర్కర్ల (డెలివరీ కార్మికులు, క్యాబ్ డ్రైవర్ల వంటి తాత్కాలిక, స్వతంత్ర ఉద్యోగులు) సంక్షేమం కోసం ప్రత్యేక చట్టం రూపొందించనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. గిగ్ వర్కర్లకు ప్రత్యేక చట్టాన్ని రూపొందించాలని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ కోరిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకొన్నట్లు తెలిపారు. గిగ్ వర్కర్ల కోసం ప్రత్యేక చట్టం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డికి రాహుల్‌గాంధీ ఈ నెల 11న లేఖ రాశారు. 'గత దశాబ్ద కాలంగా దేశవ్యాప్తంగా లక్షలాది మంది గిగ్ ఎకానమీలో భాగస్వాములవుతున్నారు. వారికి సామాజిక భద్రత కల్పించడం కోసం చట్టం తెస్తామని మనం ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చాం. మనం పాలిస్తున్న రాష్ట్రాల్లో ఈ మేరకు ముందడుగు వేస్తున్నాం. గిగ్ వర్కర్ల కోసం రాజస్తాన్‌లోని కాంగ్రెస్ ప్రభుత్వమే తొలిసారి చట్టం తీసుకొచ్చింది. ఆ తరహాలోనే తెలంగాణ రాష్ట్రం గిగ్ వర్కర్లకు హామీ ఇచ్చిన విధంగా మీరు కూడా చర్యలు తీసుకోండి. ఇటీవల నేను హైదరాబాద్ వచ్చినప్పుడు కులగణన కోసం మీరు చేస్తున్న కృషికి ముగ్ధుడనయ్యాను. కులగణన తరహాలోనే గిగ్ వర్కర్ల చట్టం కోసం కూడా రాష్ట్రవ్యాప్తంగా సంప్రదింపులు జరిపి అర్థవంతమైన చట్టం తెచ్చేందుకు ప్రయత్నం చేయండి. గిగ్ వర్కర్ల సంక్షేమం విషయంలో తెలంగాణ దేశానికి మార్గం చూపుతుందని ఆశిస్తాను' అని రేవంత్‌కు రాసిన లేఖలో రాహుల్‌గాంధీ తెలిపారు. ఈ లేఖకు సమాధానమిస్తూ బుధవారం సీఎం రేవంత్ ఎక్స్ వేదికగా పోస్టు చేశారు. 'మీ దూరదృష్టి, ఆలోచనలు, శ్రమ మాకు స్ఫూర్తిదాయకం. తెలంగాణలో జరుగుతున్న కులగణన పట్ల మీ సానుకూల స్పందన మాకు మరింత శక్తినిస్తోంది. మీ ఆలోచనలకు అనుగుణంగా తెలంగాణలోని గిగ్ వర్కర్ల కోసం సమగ్ర చట్టం తీసుకొస్తాం' అని సీఎం రేవంత్ వెల్లడించారు.

ఎస్‌డీఎఫ్‌పై నెలరోజుల్లో నివేదిక ఇవ్వండి

ప్రభుత్వ శాఖలకు ఉపముఖ్యమంత్రి భట్టి ఆదేశం



సాక్షి, హైదరాబాద్: ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక అభివృద్ధి నిధి ఖర్చులపై నెలరోజుల్లోగా నివేదిక సమర్పించాలని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రభుత్వ శాఖలను ఆదేశించారు. బుధవారం సచివాలయంలో ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక అభివృద్ధి నిధి (ఎస్‌డీఎఫ్) ద్వారా 32 ప్రభుత్వ శాఖలు చేపడుతున్న కార్యక్రమాలపై భట్టి సమీక్ష నిర్వహించారు. శాఖల వారీగా కేటాయించిన నిధులు, చేసిన ఖర్చు, గతేడాది ఖర్చు చేయకుండా మిగిలిపోయిన నిధులు, ఇతర అంశాలను ఆయన అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టం ప్రకారం అన్ని శాఖల్లో ఒక విధానాన్ని ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అన్ని శాఖల్లో నిధుల ఖర్చును ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి పర్యవేక్షిస్తారన్నారు. అలాగే ఆర్థిక శాఖలో ప్రత్యేకంగా రీసెర్చ్ సెంటర్‌ను ఏర్పాటు చేసి, ప్రత్యేక పథకాలకు రూపకల్పన చేయాలని భట్టి ఆదేశించారు. గిరిజన తండాలకు త్రీఫేజ్ కరెంటు సరఫరా కావాలన్న డిమాండ్ ఉందని, ఆ మేరకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మరో నాలుగు నెలల్లో ఆర్థిక సంవత్సరం ముగుస్తున్న నేపథ్యంలో.. వచ్చే ఆర్థిక సంవత్సరంలో అమలు చేసేందుకు అన్ని శాఖల అధికారులు మంచి పథకాలను రూపొందించాలన్నారు. గత ప్రభుత్వ చర్యల కారణంగా పదేళ్ల పాటు ఆయా పథకాలు పొందలేని అర్హులకు తమ ప్రభుత్వం చేయూత అందిస్తుందన్నారు. ఈ సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, ప్రభుత్వ కార్యదర్శులు శరత్, శ్రీధర్, రాహుల్ బొజ్జా, సీడీఎంఏ కమిషనర్ శ్రీదేవి, ఆర్టీసీ ఎండీ సజ్జనార్ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికలే టార్గెట్!

కాంగ్రెస్ త్రిముఖ వ్యూహం

- ఏడాది పాలనపై ప్రచారం..కులగణన.. స్థానిక ఎన్నికలు
- ఇప్పటికే విజయోత్సవ సభలతో ప్రజల్లోకి సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రులు
- ఇక టీపీసీసీ ఆధ్వర్యంలో ఉత్సవాల నిర్వహణ
- స్థానిక సంస్థల ఎన్నికలకు కేడర్‌ను ఉత్సాహపరచడమే లక్ష్యం
- నేటి విస్తృతస్థాయి సమావేశంలో దిశానిర్దేశం



సాక్షి, హైదరాబాద్: అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్న నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ త్రిముఖ వ్యూహంతో ముందుకెళుతోంది. రాష్ట్ర ఏర్పాటు తర్వాత తొలిసారి దక్కిన అధికారాన్ని ఏడాది కాలంలో ఉపయోగించిన తీరును ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు దేశంలోనే మొదటిసారిగా కులగణన చేపట్టడం, ఈ కులగణన ఆధారంగా రిజర్వేషన్లు పెంచడం ద్వారా స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లే కార్యక్రమాలకు పదును పెడుతోంది. ఇందుకోసం గురువారం టీపీసీసీ విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశాన్ని నిర్వహిస్తోంది. గాంధీభవన్‌లో జరిగే ఈ భేటీకి పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, టీపీసీసీ ఆఫీస్ బేరర్లు, పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, మంత్రులు, కార్పొరేషన్ల చైర్మన్లు, డీసీసీల అధ్యక్షులు, అనుబంధ సంఘాల నేతలు హాజరు కానున్నారు. ఈ సమావేశంలో త్రిముఖ వ్యూహం విజయవంతం చేసేలా పార్టీ కేడర్‌ను సమాయత్తం చేయడంపై చర్చ జరుగుతుందని గాంధీభవన్ వర్గాలు తెలిపాయి.

క్షేత్రస్థాయిలో కార్యక్రమాలకు టీపీసీసీ చీఫ్

పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తుండడం, ఏడాది పాలనపై ప్రతిపక్షాలు ఒంటికాలిపై లేస్తున్న నేపథ్యంలో అన్ని స్థాయిల్లోని పార్టీ కేడర్‌ను కదిలించాలని టీపీసీసీ ప్రణాళికలు రచిస్తోంది. ఇందుకోసం ప్రజాపాలన విజయోత్సవాలను వేదిక చేసుకోనుంది. ఇందులో భాగంగానే సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రులు ఉమ్మడి జిల్లాల వారీగా ఏర్పాటు చేస్తున్న సభలకు వెళ్తున్నారు. గత ఏడాది కాలంలో రాష్ట్రంలో అమలైన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించే ప్రయత్నం చేయడంతో పాటు రాజకీయంగా ప్రతిపక్షాలను కౌంటర్ ఇస్తున్నారు. మరోవైపు ఈ విజయోత్సవాలను పార్టీ ఆధ్వర్యంలో కూడా నిర్వహించేందుకు టీపీసీసీ నిర్ణయించింది. టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ స్వయంగా క్షేత్ర స్థాయిలో జరిగే కార్యక్రమాలకు హాజరు కావాలని యోచిస్తున్నారు. ఈ విజయోత్సవాల్లో భాగంగానే రాష్ట్రంలో జరుగుతున్న కులగణన గురించి కూడా ప్రజలకు వివరించేలా కార్యాచరణ రూపొందిస్తున్నారు. తద్వారా స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయఢంకా మోగించేలా, ఆ మేరకు కేడర్‌ను సిద్ధం చేసేలా ప్రణాళికను అమలు చేయనున్నారు. పార్టీ కేడర్‌ను స్థానిక ఎన్నికల దిశగా కార్యోన్ముఖులను చేయడమే లక్ష్యంగా గురువారం జరగనున్న సమావేశంలో నాయకత్వం దిశానిర్దేశం చేయనున్నట్టు గాంధీభవన్ వర్గాలు వెల్లడించాయి.

మంత్రిగా భర్త.. అధికారిణిగా భార్య

శ్రీధర్‌బాబుకు పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికిన శైలజారామయ్యర్

వేములవాడ వేదికగా అరుదైన దృశ్యం

- సీఎం రేవంత్‌రెడ్డి పర్యటనలో నవ్వులు పూయించిన దంపతులు



మంత్రి శ్రీధర్‌బాబుకు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఆయన భార్య, దేవాదాయ కమిషనర్ శైలజారామయ్యర్. చిత్రంలో మంత్రి పొన్నం

సిరిసిల్ల: మంత్రిగా భర్త.. అధికారిణిగా భార్య.. ఇద్దరూ ఓ అధికారిక కార్యక్రమంలో ఎదురుపడిన ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో బుధవారం జరిగింది. వేములవాడ పర్యటనకు సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం రాగా.. దేవాదాయ కమిషనర్ హోదాలో శైలజారామయ్యర్ వచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణంలో మంత్రులకు పుష్పగుచ్ఛాలు ఇచ్చే క్రమంలో తన భర్త శ్రీధర్‌బాబుకు సైతం శైలజారామయ్యర్ పుష్పగుచ్ఛం ఇచ్చారు. అక్కడే ఉన్న మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కాంగ్రెస్ నేత కేకే మహేందర్‌రెడ్డి, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాలు నవ్వుతూ పలకరించారు. సీఎం రేవంత్‌రెడ్డికి కూడా శైలజారామయ్యర్ పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలకగా.. పక్కనే శ్రీధర్‌బాబు ఉండడంతో అన్నా.. వదిన అంటూ రేవంత్‌రెడ్డి నవ్వుతూ పలకరించడం విశేషం.

పరిశ్రమలు పెడుతుంటే
ఎందుకంత కడుపుమంట?





వేములవాడలో జరిగిన సభకు హాజరైన జనం. వేదికపైకి వస్తున్న సీఎం రేవంత్, మహేశ్‌గౌడ్, పొన్నం, ఆది శ్రీనివాస్, ఉత్తమ్, శ్రీధర్‌బాబు, పొంగులేటి

▶ మొదటి పేజీ తరువాయి

కట్టెలు పెడుతున్నరు. రౌడీ మూకలతో కలెక్టర్, ఆర్డీవోలపై దాడి చేయించారు. భూ సేకరణ లేకుండా పరిశ్రమలు ఎలా వస్తాయ్? బుద్ధి లేదా కేసీఆర్?..' అంటూ సీఎం రేవంత్‌రెడ్డి మండిపడ్డారు. 'రుణమాఫీ మీద లెక్కలు కావాలంటే కేసీఆర్ అసెంబ్లీకి రావాలి. రైతుల భూములు లాక్కున్న హరీశ్ సమాధానం చెప్పాలి. కేటీఆర్ ఉరుకులాట గమనిస్తున్నాం. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బావబామ్మర్దుల సంగతి చెప్తాం. వారికి అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో పరాజయాల పాలై మెదడు పోయింది..' అని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. ప్రజాపాలన – ప్రజా విజయోత్సవాల్లో భాగంగా బుధవారం రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో నిర్వహించిన పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఉదయం 11 గంటలకు హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో వేములవాడ చేరుకున్న సీఎం తొలుత పలువురు మంత్రులతో కలిసి రాజరాజేశ్వరుడి ఆలయంలో కోడె మొక్కులు చెల్లించి పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అద్దాల మండపంలో వేద పండితులు సీఎంను, మంత్రులను ఆశీర్వదించారు. అనంతరం ఆలయ విస్తరణ, ప్రభుత్వ వైద్య కళాశాల హాస్టల్ నిర్మాణం, మూలవాగు నుంచి ఆలయం వరకు రోడ్ల విస్తరణ, అడ్వాన్స్ టెక్నికల్ సెంటర్ (ఏటీసీ) తదితర మొత్తం రూ.679 కోట్ల పనులకు శంకుస్థాపనలు చేశారు. రూ.28 కోట్లతో నిర్మించిన జిల్లా పోలీసు కార్యాలయాన్ని వర్చువల్ విధానంలో ప్రారంభించారు. మిడ్‌మానేరు నిర్వాసితులకు రూ.236 కోట్లతో 4,696 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి నిధులు కేటాయించారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి మాట్లాడారు.

30వ తేదీలోపు మిగిలిన పనులన్నీ పూర్తి

'గత ఎన్నికల సమయంలో సమ్మక్క సారక్క ప్రాంతం నుంచి పాదయాత్ర మొదలుపెట్టిన రోజు కేసీఆర్ గడీలు కూలాలి, రాజన్నను మోసం చేసిన కేసీఆర్‌ను గద్దె దించాలి అనుకున్న. పరిహారం కోసం మిడ్ మానేర్ నిర్వాసితులు చేస్తున్న పోరాటంలో పాల్గొన్న. అధికారంలోకి వస్తే కళికోట ప్రాజెక్టు పూర్తి చేస్తామని చెప్పిన. కొండగట్టు హనుమంతుడి ఆశీర్వచనం తీసుకున్న. ఉమ్మడి జిల్లాలో అసంపూర్తిగా ఉన్నా సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చా. ఈ నెల 30 తేదీ లోపు ఉమ్మడి కరీంనగర్ ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి జిల్లాకు వచ్చి మిగిలిపోయిన పనులన్నీ పూర్తయ్యేలా చూస్తారు. దేశానికి దిశ దశ చూపిన మహనీయుడు పీవీ నరసింహారావు సొంత జిల్లా కరీంనగర్ ప్రజల్లో చైతన్యం ఎక్కువ. సిరిసిల్ల జగిత్యాల రైతాంగ పోరా టాలు మర్చిపోలేం. 2004లో తెలంగాణ ఇస్తామని కరీంనగర్ గడ్డ మీద నుంచే సోనియాగాంధీ మాట ఇచ్చారు. జైపాల్‌రెడ్డి చాతుర్యంతో పొన్నం ప్రభాకర్ పెప్పర్ స్ప్రేలను ఎదుర్కొని కొట్లాడారు. ఆంధ్రలో, కేంద్రంలో ఓడిపోతామని తెలిసినా.. 4 కోట్ల తెలంగాణ వాసులకు ఇచ్చిన మాట కోసం సోని యా తెలంగాణ ఇచ్చారు..' అని రేవంత్ చెప్పారు.

కాంగ్రెస్ మాటిస్తే ఎంత దూరమైనా వెళ్తుంది

'కాంగ్రెస్ మాటిస్తే ఎంత దూరమైనా వెళ్తుంది. పొన్నంను గెలిపిస్తే తెలంగాణ రాష్ట్రం తెచ్చిండు. అదే బండి సంజయ్ గెలిచి ఏం తెచ్చారు? వినోద్‌కుమార్, కేసీఆర్ నిధులు ఇచ్చి ఉంటే ప్రాజెక్టులు ఎందుకు పెండింగ్‌లో ఉన్నాయి? రూ.7 లక్షల కోట్లు అప్పు తెచ్చిన కేసీఆర్ రూ.100 కోట్లతో రాజన్న గుడిని ఎందుకు అభివృద్ధి చేయలేక పోయాడు? మీ ఎమ్మెల్యే నిత్యం ప్రజల కోసమే పని చేసే మనిషి. సిరిసిల్ల మెడికల్ కాలేజీకి హాస్టల్ ఇచ్చాం. గల్ఫ్ కార్మికులకు, వారి కుటుంబాలకు అండగా ఉండేందుకు గల్ఫ్ బోర్డు ఏర్పాటు చేసి రూ.5 లక్షల నష్ట పరిహారం ఇస్తున్నాం. పదేళ్లలో కేసీఆర్ చేయలేని పనిని మేము చేస్తుంటే కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌లు కాళ్లలో కట్టెలు పెట్టేందుకు వస్తున్నారు. నాడు ఆత్మహత్యల్లో తెలంగాణ రెండవ స్థానంలో నిలిచింది. గత పాలనలో కేవలం రూ.11 వేల కోట్ల రుణమాఫీ చేస్తే మేం కేవలం 11 నెలల్లో 23 లక్షల మందికి రూ.18 వేల కోట్లు మాఫీ చేశాం. సోషల్ మీడియాలో నాలుగు పోస్టులు పెట్టి హీరో అనుకుంటున్నారు..' అని సీఎం విమర్శించారు.



గతంలో మోదీ రాజన్నకు కోడె మొక్కు చెల్లించుకుంటున్న దృశ్యం

నిజాన్ని ఎదుర్కోవాలంటే కేసీఆర్ అసెంబ్లీకి రావాలి

'కేసీఆర్.. నువ్వు నిజాన్ని ఎదుర్కోవాలంటే అసెంబ్లీకి రావాలి. నేను 10 నెలల్లో 50 వేల ఉద్యోగాలు ఇచ్చా. అందులో ఒక్కటి తక్కువుందని నిరూపిస్తే ఎల్బీ స్టేడియంలో క్షమాపణ చెప్తా. మేం కాళేశ్వరం నుంచి ఒక్క చుక్క ఎత్తిపోయలేదు. అయినా మన రైతులు రికార్డు స్థాయిలో 1.53 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి చేశారు. కేసీఆర్ రూ.1.80 లక్షల కోట్లతో ప్రాజెక్టులు చేపట్టి ఒక్కదాన్ని కూడా పూర్తి చేయలేదు. కేసీఆర్, హరీశ్‌లు.. రంగనాయక సాగర్, కొండపోచమ్మ సాగర్‌లను తమ ఫామ్‌హౌస్‌లకు నీరు పారించడానికి కట్టారు. రైతుల నుంచి సేకరించిన భూములను హరీశ్ లాక్కున్నారు. దీనిపై ఆయన సమాధానం చెప్పాలి. కేటీఆర్ కూడా ఉరుకులాడుతున్నరు. ఫామ్‌హౌస్‌ల డ్రగ్స్ తీసుకుంటే అరెస్టు వద్దంటున్నాడు. నీ బామ్మర్దిపై కేసు పెట్టొద్దా సన్నాసీ? కుట్రలు చేస్తే ఊచలు లెక్కపెడతావ్..' అని సీఎం అన్నారు. మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ, కొండా సురేఖ, పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా...

90.56 లక్షల ఇళ్లలో సర్వే పూర్తి

ములుగులో లక్ష్యం దాటిపోయిన సర్వే


సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న సామాజిక, ఆర్థిక, విద్యా, ఉద్యోగ, రాజకీయ, కులగణన ముమ్మరంగా సాగుతోంది. బుధవారం సాయంత్రానికి 90,56,383 ఇళ్లలో సర్వే పూర్తి చేసినట్లు ప్రభుత్వం ప్రకటించింది. మొత్తం 1,16,14,349 ఇళ్లకుగాను 90.56,383 ఇళ్లలో సర్వే పూర్తి కావడంతో 78 శాతం లక్ష్యం సాధించినట్లు పేర్కొన్నది. ములుగు జిల్లాలో 98,080 ఇళ్లలో సర్వే నిర్వహించాలని లక్ష్యంగా పెట్టుకోగా, ఏకంగా 100.5 శాతం ఇళ్లలో సర్వే చేసినట్లు తెలిపింది. జీహెచ్ఎంసీ పరిధిలో కూడా సర్వే ప్రక్రియ వేగం పుంజుకుంది.

అత్యధికంగా సర్వే పూర్తయిన జిల్లాలు

జిల్లా	సర్వే శాతం
ములుగు	100.5
జనగామ	99.9
నల్లగొండ	97.7
కామారెడ్డి	93.3
మంచిర్యాల	93.2
యాదాద్రి భువనగిరి	92.3
నిజామాబాద్	91
రాజన్న సిరిసిల్ల	90.9
జగిత్యాల	90.6
జీహెచ్ఎంసీ	55.6

అ భూములు ఎవరివో తేల్చండి

- పటేల్‌గూడ భూములపై హైకోర్టు



సాక్షి, హైదరాబాద్: సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండలం పటేల్‌గూడలోని సర్వే నంబర్ 6, 12లోని భూముల్లో హద్దుల నిర్ధారణ చేపట్టాలని సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్‌ను హైకోర్టు ఆదేశించింది. పిటిషనర్లు, ఇతరులకు నోటీసులు జారీ చేయాలని చెప్పింది. సదరు స్థలాలు సర్వే నంబర్ 6లో ఉన్నట్లు తేలితే చట్టప్రకారం అనుమతి తీసుకుని ఇళ్లు నిర్మించుకునే అవకాశం పిటిషనర్లకు ఇవ్వాలని స్పష్టంచేసింది. ఒకవేళ సర్వే నం. 12లో సదరు స్థలాలు ఉన్నట్లు తేలితే ప్రభుత్వ భూమి కనుక నిబంధనల మేరకు పిటిషనర్ల నుంచి క్రమబద్ధీకరణ దరఖాస్తులు స్వీకరించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. సర్వే ముగిసి ఆ భూముల వివరాలు తేలే వరకు యథాతథస్థితి కొనసాగించాలని ఉత్తర్వులు జారీ చేసింది. హైడ్రా చట్టవిరుద్ధంగా తమ ఇళ్లకు కూల్చివేసిందంటూ దాఖలైన 23 పిటిషన్లపై జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి విచారణ చేపట్టి తీర్పు వెలువరించారు.

మార్కులు కొట్టి... 'మార్కెట్' పట్టి...

మార్కెట్ చైర్ పర్సన్ పదవికి మౌఖిక పరీక్ష!

- ఎక్కువ మార్కులు సాధించిన మహిళకు పగ్గాలు
- జుక్కల్ ఎమ్మెల్యే వినూత్న ప్రయోగం



సౌజన్యను అభినందిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి. చిత్రంలో ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: అనుకోకుండా లభించిన అవకాశాన్ని ఓ మహిళ సద్వినియోగం చేసుకున్నారు. అడిగిన ప్రశ్నలకు మెప్పించేలా సమాధానం ఇచ్చారు. ఏకంగా మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పదవిని చేజిక్కించుకున్నారు. మార్కెట్ కమిటీ పదవికి ప్రశ్నలేంటి? జవాబులేంటి? చైర్ పర్సన్‌ను ప్రభుత్వం నామినేట్ చేస్తుంది కదా.. అనే సందేహాలు తలెత్తుతున్నాయా? అలాంటి సందేహాలు నిజమే..అలాగే ప్రశ్నలకు సరైన జవాబులివ్వడం ద్వారా చైర్ పర్సన్ పదవికి ఎంపికైంది కూడా వాస్తవమే. కామారెడ్డి జిల్లాలో ఈ ఉదంతం చోటు చేసుకుంది. జిల్లాలోని జుక్కల్ నియోజకవర్గ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు ఈ వినూత్న ప్రయోగం చేశారు. మద్నూర్ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ ఎంపికకు మౌఖిక పరీక్ష నిర్వహించారు. పరీక్షలో ఎక్కువ మార్కులు వచ్చిన యువతిని పదవికి ఎంపిక చేశారు.

ప్రశ్నపత్రం రూపొందించి.. పరీక్ష నిర్వహించి..

సాధారణంగా మార్కెట్ కమిటీ చైర్మన్ పేరును అధికార పార్టీకి చెందిన స్థానిక ఎమ్మెల్యేనో లేదా ఆ పార్టీ ముఖ్య నాయకులో ప్రభుత్వానికి ప్రతిపాదించి నామినేట్ చేయిస్తారు. కానీ లక్ష్మీకాంతారావు ఇందుకు భిన్నంగా ఈ పదవికి మౌఖిక పరీక్ష నిర్వహిస్తామని, అందులో ఎక్కువ మార్కులు సాధించిన వారినే చైర్మన్‌గా నియమిస్తామని ప్రకటించారు. దీనికి మార్కెట్ కమిటీ పరిధిలోని మద్నూర్, జుక్కల్, డోంగ్లీ మండలాల నాయకులు కూడా సరే అన్నారు. ఎస్సీ మహిళకు కేటాయించిన ఈ పదవికి నిర్వహించిన మౌఖిక పరీక్షకు స్థానిక నేతల కుటుంబాలకు చెందిన 15 మంది మహిళలు సిద్ధమయ్యారు. దీంతో ఎమ్మెల్యే స్థానిక పార్టీ నేతలతో కలిసి ఓ ప్రశ్నపత్రం రూపొందించారు. మార్కెట్ కమిటీల విధులు, బాధ్యతలు, అభివృద్ధికి సంబంధించిన 15 ప్రశ్నలను పొందుపరిచారు. సెప్టెంబర్ 29న నిర్వహించిన ఈ పరీక్షకు ఆ 15 మందీ హాజరయ్యారు. వీరిలో జుక్కల్ మండలం పెద్ద ఎడ్గి గ్రామానికి చెందిన అయిల్వార్ సౌజన్య అత్యధిక మార్కులు సాధించారు. దీంతో ఆమె పేరును ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు ప్రభుత్వానికి పంపించారు. ఆ మేరకు ప్రభుత్వం తాజాగా సౌజన్యను చైర్ పర్సన్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

15 ప్రశ్నలకు 12 సరైన జవాబులిచ్చిన సౌజన్య

సౌజన్య ఎంఎస్సీ బీఈడీ చదివారు. పరీక్షలో 15 ప్రశ్నలకు గాను 12 ప్రశ్నలకు సరైన సమాధానాలు ఇచ్చారు. ఈ పరీక్షకు ఆయా మండలాలకు చెందిన పూజా సందే, నమేవార్ పద్మ, జి.పార్వతి, వాగ్మారే ప్రియాంక, నమేవార్ అనిత, వాగ్మారే సోని, సంగీత తుకారాం, గైక్వాడ్ రాజాబాయి, కర్మల్‌కార్ సంగీత, అర్పిత అంజనీకర్, ఎడికే రాంబాయితో పాటు మరో ముగ్గురు హాజరయ్యారని సమాచారం. కాగా రాజకీయాల్లో కొత్త ఒరవడిని సృష్టించిన ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావును, చైర్ పర్సన్‌గా నియమితులైన అయిల్వార్ సౌజన్యను రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అభినందించారు. బుధవారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో మార్కెట్ కమిటీ పాలకవర్గ సభ్యులు, నాయకులు మంత్రిని కలిశారు. ప్రతి ఎమ్మెల్యే ఇదే విధంగా ప్రయత్నిస్తే రైతులకు మరింత మెరుగైన సేవలు అందే అవకాశం ఉంటుందని ఈ సందర్భంగా కోమటిరెడ్డి చెప్పారు.

ప్రజాస్వామ్యంలో సరికొత్త అధ్యాయం: సీఎం

మద్నూర్ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్‌గా సౌజన్య ఎంపిక కావడంపై సీఎం రేవంత్‌రెడ్డి 'ఎక్స్'వేదికగా హర్షం వ్యక్తం చేశారు. 'ప్రజాస్వామ్యంలో సరికొత్త అధ్యాయం.. పదవుల ఎంపికలో నయా దృక్పథం..ప్రజా పాలనకు తిరుగులేని సాక్ష్యం..ఈరోజు నిరుపేద కుటుంబానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త, మన ఆడబిడ్డ సౌజన్య మద్నూర్ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్‌గా ఎంపిక కావడం చాలా సంతోషకరమైన విషయం. తొలిసారిగా ఇంటర్వ్యూ పద్ధతిలో, ప్రతిభకు ప్రాధాన్యం ఇస్తూ, మహిళల చదువుకు.. ఆత్మస్థైర్యానికి ప్రోత్సాహమిచ్చేలా జరిగిన ఈ ఎంపిక రాష్ట్రంలో కొత్త ఒరవడిని సృష్టించింది..'అని సీఎం పేర్కొన్నారు. పారదర్శక విధానంలో ఈ పదవికి సౌజన్యను ఎంపిక చేయడంలో కీలక పాత్ర పోషించిన ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు, సహచర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌కు అభినందనలు తెలిపారు.

జాతీయ రహదారుల విస్తరణలో జాప్యం వద్దు

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: జాతీయ రహదారుల విస్తరణ.. కొత్త రోడ్ల నిర్మాణంలో జాప్యానికి కారణమవుతున్న అంశాలను పరిష్కరించుకుంటూ పనుల్లో వేగం పెంచాలని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఎన్‌హెచ్ఏఐ అధికారులను ఆదేశించారు. బుధవారం ఎన్‌హెచ్ఏఐ ఆర్ఓ శశిధర్, పీడీ నాగేశ్వరరావు తదితర అధికారులతో ఆయన సమావేశమై జాతీయ రహదారుల పురోగతిని సమీక్షించారు.

➤ విజయవాడ- నాగ్‌పూర్ సెక్షన్ (ఎన్‌హెచ్-163 జీ)లో నాలుగు వరుసలుగా నిర్మిస్తున్న గ్రీన్ ఫీల్డ్ రహదారికి సంబంధించి 8 ప్యాకేజీలు అవార్డు అయ్యాయని, భూసేకరణలో ఎదురవుతున్న ఇబ్బందుల వల్ల జాప్యం జరుగుతోందని అధికారులు పేర్కొన్నారు. నిర్మాణ సంస్థ ప్రతినిధులతో మాట్లాడిన మంత్రి, భూసేకరణ సమస్యలు లేనిచోట పనులు వేగంగా నిర్వహించాలని సూచించారు. త్వరలోనే మంచిర్యాల, వరంగల్, ఖమ్మం కలెక్టర్లతో సమావేశం ఏర్పాటు చేసి భూసేకరణ అంశాలపై చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.

➤ హైదరాబాద్-డిండి (ఎన్‌హెచ్-765)కి సంబంధించి 85 కి.మీ. రహదారిని రెండు వరుసల నుంచి నాలుగు వరుసలకు విస్తరించే పనుల డీపీఆర్ సిద్ధం చేయాలని, దీనిపై త్వరలో సీఎంతో చర్చిస్తానని వెల్లడించారు.

➤ ఖమ్మం-దేవరపల్లి (ఎన్‌హెచ్-365జీజీ) గ్రీన్ ఫీల్డ్ రహదారి పనుల్లో నాణ్యతను పరీక్షించాలని అధికారులను ఆదేశించారు. 2025 మే లేదా జూన్ కల్లా పనులను పూర్తి చేయాలన్నారు.

➤ 6 వరుసలుగా నిర్మిస్తున్న కర్నూలు-రాయచూర్ (ఎన్‌హెచ్-150సీ) గ్రీన్‌ఫీల్డ్ రహదారిలో మొదటి ప్యాకేజీ పనులు వచ్చే మే-జూన్ కల్లా పూర్తవుతాయని, రెండో ప్యాకేజీలో టన్నెల్స్ వంటి నిర్మాణాలు ఉన్నందున, 2025 డిసెంబర్‌కల్లా పూర్తవుతాయని అధికారులు పేర్కొన్నారు.

➤ హైదరాబాద్-మన్నెగూడ ఎన్‌హెచ్ పనులను 15 రోజుల క్రితం ప్రారంభించామని మంత్రి దృష్టికి తెచ్చారు. ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న రోడ్డు అయినందున, రోడ్డు విస్తరణ పనుల్లో జాప్యం లేకుండా చూడాలని సూచించారు.

ఇఫ్లూ విద్యార్థి ఎన్నికల్లో ఎస్ఎఫ్ఐ కూటమి విజయం

ఉస్మానియా యూనివర్సిటీ: ద ఇంగ్లిష్ అండ్ ఫారెన్ లాంగ్వేజెస్ సెంట్రల్ యూనివర్సిటీ (ఇఫ్లూ) 2024-25కి జరిగిన విద్యార్థి ఎన్నికల్లో ఎస్ఎఫ్ఐ కూటమి విజయం సాధించింది. విద్యార్థి సంఘం అధ్యక్షుడిగా పారిక వికాస్ (టీఎస్ఎఫ్) 431 ఓట్లతో ఏబీవీపీ అభ్యర్థి సుమిత్ (302 ఓట్లు)పై గెలిచాడు. ప్రధాన కార్యదర్శిగా దీనా జార్జి, ఉపాధ్యక్షులుగా ఆర్ష (ఎస్ఎఫ్ఐ), జాయింట్ సెక్రటరీగా నోర మాన్‌సూన్ (ఫెటర్నిటీ) కల్చరల్ సెక్రటరీ సౌమ్య, స్పోర్ట్స్ సెక్రటరీగా అర్బాజ్ (ఎన్ఎస్‌యూఐ) ఎన్నికయ్యారు. ఐసీసీ సభ్యులుగా శ్రేయ (ఏబీవీపీ), లూసిక్ జార్జి (ఇండి), సంద్ర (ఎస్ఎఫ్ఐ) ఎన్నికయ్యారు. ఎస్ఎఫ్ఐ కూటమిలో మూడు విద్యార్థి సంఘాలు (ఎస్ఎఫ్ఐ, టీఎస్ఎఫ్, ఫెటర్నిటీ) ఏడు స్థానాలు గెలుచుకోగా.. ఎన్ఎస్‌యూఐ ఒకటి, ఇండిపెండెంట్ ఒకటి, ఏబీవీపీ ఒక ఐసీసీ (ఇంటర్నల్ కాంప్లెంట్ కమిటీ) గెలుచుకుంది.



నిషాలో ఉండటం అనేది స్వచ్ఛంద పిచ్చితనం.
– సెనెకా

సాక్షి
గురువారం, 21 నవంబర్ 2024

ముందుకు కదలని ముచ్చట

మరో ఏడాది గడిచింది. మరో జీ20 సదస్సు జరిగింది. భారత ప్రధాని మోదీ సహా ప్రపంచ దేశాల పెద్దలు కలిశారన్న మాటే కానీ, ఏం ఒరిగింది? బ్రెజిల్‌లో రెండు రోజులు జరిగిన సదస్సు తర్వాత వేధిస్తున్న ప్రశ్న ఇది. ఈ 20 అగ్రశ్రేణి ఆర్థిక వ్యవస్థల కూటమి ఓ సమష్టి తీర్మానం చేసింది కానీ, తీర్మానంలోని భాషపై అర్జెంటీనా అభ్యంతరాలతో ఏకాభిప్రాయ సాధన కుదరలేదు. ఆకలిపై పోరాటానికి ఒప్పందం, ప్రపంచంలో అత్యంత సంపన్నులపై పన్ను లాంటి అంశాలపై సదస్సులో మాటలు సాగాయి. కానీ, ఉక్రెయిన్‌లో, మధ్యప్రాచ్యంలో... జరుగుతున్న ప్రధాన యుద్ధాల క్రీనీడలు సదస్సుపై పరుచుకున్నాయి. చివరకు సదస్సు చివర జరపాల్సిన విలేఖరుల సమావేశాన్ని సైతం బ్రెజిల్ దేశాధ్యక్షుడు ఆఖరి నిమిషంలో రద్దు చేసుకున్నారు. రష్యాపై ఉక్రెయిన్ క్షిపణి దాడులు, పరిమిత అణ్వస్త్ర వినియోగానికి మాస్కో సన్నద్ధతతో ఉద్రిక్తతలు పెరిగినా అమెరికా అధ్యక్షుడు ఏమీ మాట్లాడకుండానే పయనమయ్యారు. వెరసి, అధికారులు అంటున్నట్టు ఈ 'జీ20 సదస్సు చరిత్రలో నిలిచిపోతుంది' కానీ, గొప్పగా చెప్పుకోవడానికేమీ లేనిదిగానే నిలిచిపోతుంది.

మాటలు కోటలు దాటినా, చేతలు గడప దాటడం లేదనడానికి తాజా జీ20 సదస్సు మరో ఉదాహరణ. నిజానికి, పర్యావరణ పరిరక్షణకు కార్యాచరణ, నిధులు అనేవి ఈ సదస్సుకు కేంద్ర బిందువులు. పర్యావరణ మార్పులను ఎదుర్కోవాల్సిన ప్రాధాన్యాన్ని గుర్తిస్తూ, పరస్పర సహకార ప్రయత్నాలకు కట్టుబడినట్టు సదస్సు పేర్కొంది. కానీ, శిలాజ ఇంధనాల వినియోగం నుంచి క్రమంగా పక్కకు మరలేందుకు స్పష్టమైన ప్రణాళికలేమీ చేయలేకపోయింది. పర్యావరణ పరిరక్షణ నిధులకు సంబంధించీ పురోగతి లేకుండానే ఈ జీ20 ముగిసింది. ప్రపంచ దేశాల నేతలు కృత నిశ్చయాన్ని ప్రకటిస్తూ, బలమైన సూచన ఏదో చేస్తారని 'కాప్–29' ఆశించినా, అలాంటిదేమీ జరగనేలేదు. కాకపోతే, 'జీ20' సదస్సు తుది తీర్మానంలో నిర్దిష్టమైన ఆర్థిక వాగ్దానాలేమీ లేనప్పటికీ, మల్టీలేటరల్ డెవలప్‌మెంట్ బ్యాంకుల సంస్కరణలపై దృష్టి పెట్టినందున అది పరోక్షంగా పర్యావరణ నిధులకు ఉపకరిస్తుందని కొందరు నిపుణుల మాట. కాగా, ప్రపంచం నుంచి దారిద్ర్యాన్ని పూర్తిగా నిర్మూలించాలంటూ జీ20 దేశాలు వచ్చే అయిదేళ్ళను కాలవ్యవధిగా పెట్టుకోవడం సాధ్యాసాధ్యాలతో సంబంధం లేకపోయినా, సత్సంకల్పమని సంతోషించాలి.

2008 ఆర్థిక సంక్షోభం అనంతరం వాషింగ్టన్‌లో జరిగిన జీ20 నేతల తొలి సమావేశానికి హాజరయ్యానని గుర్తు చేసుకుంటూ, పదహారేళ్ళ తర్వాత ఇప్పటికీ ప్రపంచం ఘోరమైన పరిస్థితిలో ఉందని బ్రెజిల్ అధ్యక్షుడన్న మాట నిష్ఠురసత్యం. ఆకలి, దారిద్ర్యం ఇప్పటికీ పీడిస్తూనే ఉన్నాయి. దీనికి తప్పుడు రాజకీయ నిర్ణయాలే కారణమన్న ఆయన మాట సరైనదే. ఆకలి, దారిద్ర్యంపై పోరాటానికి ప్రపంచ కూటమి స్థాపన మంచి ఆలోచనే. కానీ, ఇన్నేళ్ళుగా ఇలాంటివెన్నో సంకల్పాలు చేసుకున్నా, ఎందుకు నిర్వీర్యమయ్యాయన్నది ఆలోచించాల్సిన అంశం. పేరుకు కూటమి అయినా జీ20లోని సభ్య దేశాల మధ్య యుద్ధాలు సహా అనేక అంశాలపై భిన్నాభిప్రాయాలున్నాయన్నది సదస్సు ఆరంభం కాక ముందు నుంచీ తెలిసినదే. అందుకే, ఈ సదస్సును అతిగా అంచనా వేస్తే ఆశాభంగమే. కొన్ని విజయాలున్నా అధిక శాతం అంతర్జాతీయ శక్తుల మధ్య విభేదాలే సదస్సులో బయటపడ్డాయి. ఏ దేశాల పేర్లూ ఎత్తకుండా శాంతి సూక్తులకే జీ20 పరిమితమైంది.

సమష్టి లక్ష్యం కోసం పలుదేశాలు కలసి కూటములుగా ఏర్పడుతున్నా, అవి చక్రబంధంలో చిక్కుకొని అడుగు ముందుకేయలేని పరిస్థితి ఉందని అర్థమవుతోంది. ఇటీవలి ప్రపంచ పర్యావరణ పరిరక్షణ సదస్సు 'కాప్29', ఇరవై ఒక్క ఆసియా – పసిఫిక్ దేశ ఆర్థిక వ్యవస్థల వేదిక 'ఆసియా – పసిఫిక్ ఆర్థిక సహకార మండలి', జీ20ల్లో ఎదురైన ప్రతిష్టంభనలే అందుకు తార్కాణం. అవి ఇప్పుడు సమష్టి సవాళ్ళను పరిష్కరించే వేదికలుగా లేవు. వ్యాపార సంరక్షణవాద విధానాలు, భౌగోళిక – రాజకీయ శత్రుత్వాల యుద్ధభూములుగా మారిపోయాయి. ఈ వైఫల్యం వర్ధమాన ఆర్థిక వ్యవస్థలకు అశనిపాతం. అమెరికా, యూరోపియన్ యూనియన్ లాంటివి స్వేచ్ఛా వాణిజ్య సిద్ధాంతం నుంచి పక్కకు జరిగాయి. ఫలితంగా తక్కువ కూలీ ఖర్చు, సరళమైన పర్యావరణ ప్రమాణాలున్న వర్ధమాన దేశాలకు మునుపటి సానుకూలత ఇప్పుడు లేదు. పారిశ్రామికీకరణ వేళ సరళతర నిబంధనలతో లబ్ధి పొందిన పెద్ద దేశాలు, తీరా ఇప్పుడలాంటి ఆర్థిక అవకాశాలేమీ లేకుండానే వర్ధమాన దేశాలను సుస్థిరాభివృద్ధి వైపు నడవాలని కోరడం అన్యాయమే.

ప్రపంచాన్ని పీడిస్తున్న అంశాలపై దృష్టి సారించడంలో జీ20 విఫలమవడం విషాదం. పర్యావరణ సంక్షోభం, దారిద్ర్యం, ఉత్పాతాల లాంటి అనేక సవాళ్ళు కళ్ళెదుటే ఉన్నా, వాటి పరిష్కారం బదులు రష్యా, చైనాలను ఏకాకుల్ని చేయాలన్నదే జీ7 దేశాల తాపత్రయం కావడమూ తంటా. భౌగోళిక – రాజకీయ వివాదాలు అజెండాను నిర్దేశించడంతో జీ20 ప్రాసంగికతను కోల్పోతోంది. సమాన అవకాశాలు కల్పించేలా కనిపిస్తున్న బ్రిక్స్ లాంటి ప్రత్యామ్నాయ వేదికల వైపు పలు దేశాలు మొగ్గుతున్నది అందుకే. జీ20 లాంటి బహుళ దేశాల వ్యవస్థల కార్యాచరణను ఇతరేతర అంశాలు కమ్మివేస్తే అసలు లక్ష్యానికే చేటు. పరస్పర భిన్నాభిప్రాయాల్ని గౌరవిస్తూనే దేశాలు సద్భావంతో నిర్మాణాత్మక చర్చలు జరిపితే మేలు. ఏ కూటమైనా శక్తిమంతులైన కొందరి వేదికగా కాక, అందరిదిగా నిలవాలి. పశ్చిమదేశాలు ఆ సంగతి గ్రహిస్తేనే, జీ20 లాంటి వాటికి విలువ. విశ్వ మానవాళికి ప్రయోజనం. వచ్చే ఏడాది సౌతాఫ్రికాలో జరిగేనాటికైనా జీ20 వైఖరి మారుతుందా?

దిస్సనాయకే విజయం సంపూర్ణం

విశ్లేషణ



టంకశాల అశోక్

సెప్టెంబర్‌లో శ్రీలంక అధ్యక్షునిగా అనూహ్య విజయం సాధించిన అనూర కుమార దిస్సనాయకే, తాజాగా పార్లమెంట్ ఎన్నికల్లో సైతం మూడింట రెండొంతుల సీట్లు గెలుచుకున్నారు. శ్రీలంక 77 సంవత్సరాల చరిత్రలోనే ఎవరికీ లేని ఘన విజయం ఇది. మార్క్సిస్టు–లెనినిస్టు పార్టీ అయినప్పటికీ, వాళ్ల పార్టీ సింహళ జాతివాదం విషయంలో తీవ్ర వైఖరి తీసుకుంది. అదే కారణంగా ఇండియా పట్ల వ్యతిరేకత చూపింది. కానీ ఈ ఎన్నికల్లో ఆయనకు అన్ని వర్గాల ఆదరణ లభించడం, ఆయన కూడా ఇండియాతో సత్సంబంధాలకు ప్రయత్నాలు చేస్తుండటం విశేషం. చైనా, ఇండియాలలో దేనికీ ప్రత్యేకంగా అనుకూలమో, వ్యతిరేకమో కాదనీ, ఇరువురి మధ్య సమతుల్యత పాటించగలమనీ ప్రకటించటం గమనించదగ్గది.

శ్రీలంక అధ్యక్షునిగా గత సెప్టెంబర్‌లో అనూహ్య విజయం సాధించిన అనూర కుమార దిస్సనాయకే, ఈనెల 15న వెలువడిన పార్లమెంట్ ఎన్నికల ఫలితాల్లో మూడింట రెండొంతుల సీట్లు గెలిచారు. ఇది శ్రీలంక 77 ఏళ్ల చరిత్రలోనే ఎవరికీ లేని ఘన విజయం. అధ్యక్ష ఎన్నికలలో దిస్సనాయకేకు పోలైన ఓట్లు 55.89 శాతం కాగా, ఇపుడు మరొక సుమారు 10 శాతం పెరిగాయి. పార్లమెంట్ మొత్తం స్థానాలు 225 కాగా, ఆయన పార్టీ జనతా విముక్తి పెరమున (జేవీపీ) నాయకత్వాన గల నేషనల్ పీపుల్స్ పవర్ (ఎన్‌పీపీ) కూటమి గెలుచుకున్నవి 159. ఇందులో ప్రత్యక్ష ఎన్నికలు జరిగిన 196 సీట్లు, శ్రీలంక రాజ్యాంగం ప్రకారం ప్రపోర్షనల్ రిప్రజెంటేషన్ పద్ధతి కిందకు వచ్చే 29 సీట్లు ఉన్నాయి. ఆ విధంగా మొత్తం 225లో ఎన్‌పీపీ బలం 160 అవుతున్నది. అయితే, అధ్యక్ష ఎన్నికలలో దిస్సనాయకేకు తమిళుల స్థావరం అనదగ్గ శ్రీలంక ఉత్తర భాగమైన జాఫ్నా, తమిళులతో పాటు ముస్లింలు గణనీయంగాగల తూర్పు ప్రాంతాలలో, రాజధాని కొలంబో నగరంలో ఎక్కువ ఆదరణ లభించలేదు. సజిత్ ప్రేమదాస నాయకత్వంలోని సామగి జన బలవేగాయ (ఎస్‌జేబీ) వంటి ప్రతిపక్షాలు, ఇల్లంకి తమిళ అరసు కచ్చి (ఐటీఏకే) వంటి తమిళ పార్టీలు అక్కడి ఓట్లను తెచ్చుకున్నాయి. ప్రేమదాస పార్టీ సుమారు 33 శాతం ఓట్లు, మాజీ అధ్యక్షుడు రణిల్ విక్రమసింఘే శ్రీలంక ఫ్రీడం పార్టీ (ఎస్ఎల్ఎఫ్‌పీ) 17 శాతం ఓట్లు సంపాదించగలిగాయి. ఇపుడు పార్లమెంట్‌లో ప్రేమదాస పార్టీ 40 సీట్ల స్థాయిలో నిలదొక్కుకుని ప్రతిపక్ష హోదా పొందనుండగా, తమిళుల పార్టీ ఆరుకు, రణిల్ పార్టీ ఫ్రంట్ నాలుగుకు, మాజీ అధ్యక్షుడు మహింద రాజపక్ష పార్టీ రెండుకు పరిమితమయ్యాయి.

తమిళ ఈలమ్‌కు వ్యతిరేకం

వాస్తవానికి జేవీపీ లోగడ రెండుమార్లు ప్రభుత్వంపై భారీ ఎత్తున సాయుధ తిరుగుబాట్లు జరిపిన మార్క్సిస్టు–లెనినిస్టు పార్టీ అయినప్పటికీ, సింహళ జాతివాదం విషయంలో తీవ్ర వైఖరి తీసుకుంది. తమిళ ఈలంను వ్యతిరేకించటమే గాక, రాజీవ్‌గాంధీ – జయవర్ధనే మధ్య 1987లో జరిగిన ఒప్పందం ప్రకారం తమిళ ప్రాంతాలకు ఇండియాలోవలె కనీసం ఒక మేర ఫెడరల్ అధికారాలకు సైతం ససేమిరా అన్నది. ఇండియాపట్ల జేవీపీ వ్యతిరేకతకు కారణాలలో ఈ 1987 ఒప్పందంతో పాటు, రాజీవ్‌గాంధీ అక్కడకు ఇండియన్ పీస్ కీపింగ్ ఫోర్స్ (ఐపీకేఎఫ్) పేరిట సైన్యాన్ని పంపటం వంటివి ప్రధానమైనవి. నేను శ్రీలంక వెళ్లినపుడు జేవీపీ నాయకులు కొలంబో శివార్లలోని తమ ప్రధాన కార్యాలయంలో ఈ మాటలు స్వయంగా చెప్పారు. ఈలం పోరాటంతో నిమిత్తం లేకుండా కూడా, తమిళులకు ఇండియా సానుభూతి ఎల్లప్పుడూ ఉండటం, శ్రీలంక మధ్య ప్రాంతాలలోని తమిళ తేయాకు తోటల కూలీలకు శ్రీలంక పౌరసత్వం కోసం ఇండియా పట్టుబట్టడం వంటివి ఇతర కారణాలు. నిజానికి తేయాకు తోటల తమిళులు ఎల్‌టీటీఈ, ఈలం లక్ష్యానికి పెద్ద మద్దతుదారులు కారు. వారి సమస్యలు వేరే. ఈ విషయాలు జేవీపీకి కూడా తెలుసు. అయినప్పటికీ అనుమానాలు తొలగిపోలేదు. ఇదే తరహా అనుమానాలు తూర్పున బట్టికలోవా, పశ్చిమాన రాజధాని కొలంబో ప్రాంతాలలో తగినంత సంఖ్యలోగల ముస్లిముల పట్ల కూడా ఉన్నాయి. తమిళులకు ఇండియా వలె, ముస్లిములకు పాకిస్తాన్ మద్దతు ఉందనేది వారి మరొక ఆరోపణ.



సాహసించి పార్లమెంటు రద్దు

ఎన్నికల సందర్భంలో ఈ చర్చ అంతా ఎందుకంటే, ఈ విధమైన దీర్ఘకాలపు విభేదాలు ఉండినప్పటికీ తమిళులు, ముస్లిములు పార్లమెంట్ ఎన్నికలలో తమ సంప్రదాయిక పార్టీలను, ఇతర జాతీయ పార్టీలను తిరస్కరించి దిస్సనాయకే కూటమిని బలపరచటం. ఈ మార్పులోని రహస్యమేమిటి? ఒకటి, ఉన్నత వర్గాలను మినహాయిస్తే అన్ని తరగతుల, అన్ని ప్రాంతాల సామాన్య ప్రజలు సంప్రదాయిక, పెద్ద పార్టీలతో విసిగిపోయారు. రెండు, తాము దేశాన్ని బాగుపరచగలమన్న దిస్సనాయకే మాటను నమ్మారు.

శ్రీలంకలో రాజ్యాంగం ప్రకారం ఎగ్జిక్యూటివ్ అధ్యక్ష విధానం ఉంది. అయినప్పటికీ పూర్తి స్థాయి క్యాబినెట్ నియామకానికి, కొన్ని విధాన నిర్ణయాలకు పార్లమెంట్ ఆమోదం అవసరం. అందుకు పార్లమెంట్‌లో ఆధిక్యత, వీలైతే మూడింట రెండు వంతుల మెజారిటీ కావాలి. లేనిదే దిస్సనాయకే అధ్యక్ష ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన హామీలను సరిగా అమలు పరచలేరు. పాత పార్లమెంట్‌లో 225 స్థానాలలో గల మూడంటే మూడు స్థానాలతో చేయగలిగింది శూన్యమైనందున, వెంటనే సాహసించి పార్లమెంట్‌ను రద్దు చేశారు. దేశంలో మార్పులు తెచ్చేందుకు మూడింట రెండు వంతుల ఆధిక్యత నివ్వవలసిందిగా ప్రజలను కోరారు. చివరకు ఆ విధంగానే తీర్పు చెప్పారు ప్రజలు. శ్రీలంకలో పదవీ కాలం ఇండియాలో వలెనే అయిదేళ్ళు. మార్పులు తెచ్చేందుకు దిస్సనాయకేకు తగినంత సమయం ఉందన్నమాట. ఏదెంత జరుగుతుందన్నది అట్లుంచితే, 55 సంవత్సరాల వయసుగల ఆయనను విద్యార్థి దశ నుంచి గమనిస్తున్న వారికి, ఆయన ఆలోచనలు, ఆచరణ పట్ల మాత్రం ఎటువంటి సందేహాలు ఉన్నట్లు కనిపించదు.

ఇండియాతో సత్సంబంధాలు?

దిస్సనాయకే ప్రభుత్వం చేయవలసింది చాలా ఉంది. 2022లో ప్రజల నుంచి విస్తృతమైన నిరసనలకు కారణమైన ఆర్థికరంగ దివాళాను సరిదిద్దటం, ధరల నియంత్రణ, నిరుద్యోగ సమస్యకు పరిష్కారం అందులో ప్రధానమైనవి. దానితోపాటు ప్రజలపై పన్నుల భారం తగ్గిస్తామనీ, స్థానిక వ్యాపారులను ఆదుకోగలమనీ, అవినీతిపై కఠిన చర్యలుండగలవనీ, ప్రభుత్వంలో వృథా ఖర్చులు లేకుండా చూడగలమనీ కూడా అన్నారాయన. కానీ రుణభారం తక్కువ కాకపోగా, అధ్యక్షుడైనప్పుడు తక్షణ అవసరాల కోసం ఐఎంఎఫ్ నుంచి 2.9 బిలియన్ డాలర్ల కొత్త అప్పు తీసుకున్నారు. చైనాతో సత్సంబంధాలు గతం నుంచే ఏ పార్టీ పాలించినా ఉండగా, ఇండియా విమర్శకుడైన దిస్సనాయకే ఈ పరిస్థితుల దృష్ట్యా ఇండియాతోనూ సత్సంబంధాలకు, ఆర్థిక సహకారానికి ప్రయత్నాలు ఇప్పటికే మొదలుపెట్టారు. తన ఎన్నికకు ముందే భారతదేశాన్ని సందర్శించి ఆయన, ఆ తర్వాత విదేశాంగ మంత్రి విజిత హెరాత్‌ను కూడా పంపారు. భారత ప్రభుత్వం అవసరమైన హామీలనిచ్చింది కూడా. తాము చైనా, ఇండియాలలో దేనికీ ప్రత్యేకంగా అనుకూలమో, వ్యతిరేకమో కాదనీ, ఇరువురి మధ్య సమతుల్యత పాటించగలమని దిస్సనాయకే మొదట్లోనే ప్రకటించటం గమనించదగ్గది. ఇప్పటికే విదేశాంగ మంత్రితోపాటు, ప్రజాసేవలో సుదీర్ఘ అనుభవంగల హరిణి అమరసూరియను ప్రధానిగా నియమించిన ఆయన, కేబినెట్‌ను కూడా ఏర్పాటు చేశారు. విధాన ప్రకటనలు, బడ్జెట్‌ను తెచ్చినపుడు పూర్తి స్పష్టత వస్తుంది.

ఇవన్నీ చేసినా తమిళులు, ముస్లిముల సమస్యలు ప్రత్యేకమైనవి గనుక అందుకు పరిష్కారాలను కనుగొనటం ఒక సవాలు. ప్రభాకరన్ మరణం తర్వాత ఈలం నినాదం లేకుండా పోయిందిగానీ, వారికి భూములు, భాష, సమానావకాశాలు, వివక్షల తొలగింపు, పౌర హక్కులు వంటి సమస్యలు నేటికీ కొనసాగుతున్నాయి. ముస్లిములకు కూడా తమపట్ల వివక్ష వంటి సమస్యలున్నాయి. తేయాకు తోటలలో పనిచేసే తమిళుల సమస్యలు వేరే. వాటిని పరిష్కరించే బాధ్యత ప్రభుత్వంపై ఉంటుంది. ఇవి క్రమంగానైనా పరిష్కార మార్గంలో సాగని పక్షంలో ఏదో ఒక రోజున తిరిగి సమస్యల రూపంలో ముందుకొస్తాయి. వీటన్నింటినీ గమనిస్తూ కొత్త ప్రభుత్వం శ్రీలంక చరిత్రలో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించగలదని ఆశించాలి.

వ్యాసకర్త సీనియర్ సంపాదకుడు

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

జవాబుందా?



రష్యా నిజంగానే గొప్పది. అమాయకమైనది అయితే, ఒకప్పుడు సోవియట్ కూటమిలో ఉన్న ప్రతి దేశం నాటో కూటమిలో చేరడానికి ఎందుకు పరుగిడుతోంది? మెక్సికో లేదా కెనడా ఎందుకు అమెరికా వ్యతిరేక కూటముల్లో చేరడానికి ఉబలాటపడటం లేదు? దీనికి పుతిన్ సానుభూతిపరులు ఏం చెబుతారు?

– హారిస్ సుల్తాన్, నాస్తికుడు


ఎన్నికల తంతు



భారతదేశంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడాలంటే, ఉత్తరప్రదేశ్‌లో జరిగిన మొత్తం తొమ్మిది ఉప ఎన్నికల్లో మళ్లీ ఎన్నికలు జరగాలి. యూపీ పోలీసులు, అధికారులు ఎన్నికలను పరిహాసంగా మార్చేశారు.

– షాహిద్ సిద్ధికీ, రాజ్యసభ మాజీ సభ్యుడు

బద్ధకమే శత్రువు



మన అతిపెద్ద పోటీదారు బద్ధకం. ఉన్నదానితో తృప్తి చెందడం అనేది ఇతర బాహ్య సవాళ్ల కన్నా వేగంగా వృద్ధిని ఆపగలదు. విజయం సాధించాలంటే, మనం నిరంతరం సరిహద్దులను దాటాలి. చురుకుదనంతో ఉండాలి.

– హర్ష్ మారీవాలా, పారిశ్రామికవేత్త

ఈవీలకు మారాలి!



కాలుష్యం విపరీతంగా పెరిగినప్పుడు ఒకటి, రెండు వారాలపాటు నిర్మాణ పనులను ఆపడాన్ని నేను సమర్థించను. ఇది రెక్కాడితేగానీ డొక్కాడని పేద కార్మికులకు ఎక్కువగా నష్టం చేస్తుంది. ప్రధాన కారణం వాహనాల పొగ. అందుకోసమే స్వచ్ఛ ఇంధనాలు, విద్యుత్ వాహనా(ఈవీ)లకు మారాలి.

– రాజేష్ సహానీ, ఇన్వెస్టర్

నియంత్రణలో ఉందా?



డిప్రెషన్ అనేది ఒక మృగం లాంటిది. అది మనల్ని ప్రకాశవంతమైన రోజును కూడా అంతులేని తుపానులా భావించేలా చేస్తుంది. మరి మీరు మీ మృగాన్ని ఎలా నియంత్రిస్తున్నారు?

– ఆరిఫ్ అలీ, జోక్‌స్టర్

వెలుగు జిలుగుల జానపద జాతర

భారతీయ సాంస్కృతిక వారసత్వం ప్రతిబింబించేందుకు వేడుక సిద్ధమైంది. 'లోక్ మంథన్' పేరుతో నవంబర్ 21 నుంచి 24 వరకు మహోత్తరమైన 'జానపద జాతర' హైదరాబాద్ శిల్పారామంలో కనుల విందు చేయనున్నది. 'ప్రజ్ఞా ప్రవాహ' సంస్థ 2016 నుంచి ప్రతి రెండేళ్లకోసారి దేశంలోని ఒక్కో రాష్ట్రంలో లోక్ మంథన్ కార్యక్రమం నిర్వహిస్తోంది. విదేశాల నుంచి సైతం ఒక్కో తెగ, ఒక్కో జాతికి సంబంధించిన ఆచార వ్యవహారాలను ప్రతిబింబించే కళాకారులు దాదాపు 1500 మంది ఈ 'జానపద జాతర'లో తమ కళలను ప్రదర్శిస్తారు. భిన్నత్వంలో ఏకత్వం చాటే ఈ మేళా ప్రారంభోత్సవానికి భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు హాజరవుతారు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ అగ్ర నేత మోహన్ భాగవత్‌తో పాటూ అనేకమంది కేంద్రమంత్రులూ వస్తున్నారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి లోక్‌మంథన్ ఆహ్వాన కమిటీ గౌరవ అధ్యక్షులుగా కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్నారు.




భారతీయ జానపద కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనల ద్వారా ఈ దేశమంతా ఒకటేననే ఏకత్వాన్ని నిరూపించడమే లోక్ మంథన్ ప్రధాన లక్ష్యం. 'జాతీయ గిరిజన గౌరవ దివస్' పేరుతో భగవాన్ బిర్సా ముండా 150వ జయంతి పురస్కరించుకొని నిర్వహించే ఈ వేడుక మరింత ప్రాధాన్యత సంతరించుకుంది. సదస్సులు, సమావేశాల ఆధారంగా ప్రపంచంలోని వనవాసి, గిరివాసి సమస్యలను చర్చించి, వాటి పరిష్కారానికి మార్గాన్ని కూడా అన్వేషిస్తారు. సంప్రదాయ సాంస్కృతిక వాయిద్యాలు, పనిముట్లు ప్రదర్శిస్తారు. ఈ జాతరలో ప్రపంచవ్యాప్తంగా ఉన్న భారతీయ సాంస్కృతిక వారసత్వానికి చెందినవారు కూడా వచ్చి ప్రదర్శనలిస్తారు.

ఇండోనేషియా కళాకారులు రామాయణం ఆధారంగా ప్రదర్శించే 'కేచక్' నృత్య ప్రదర్శన ఆకట్టుకుంటుంది. ప్రపంచంలో అబ్రహామిక్ మతాలకు పూర్వమున్న మతాలు, సంస్కృతుల వారు సైతం లోక్‌మంథన్‌కు హాజరవుతున్నారు. వీరిలో సిరియాలోని రోమోలు, ఆర్మేనియాలోని యజిదీలు (సూర్యపుత్రులు), లిథువేనియా వాసులు సైతం ఉన్నారు. అబ్రహామిక్ మతాల రాకకు పూర్వం ఆ యా దేశాలలో ఆచరించిన, నేటికీ ఆచరిస్తున్న సూర్యారాధన, యజ్ఞం (అగ్నిని పూజించడం) నిర్వహణ విధానాలను వీరు హైదరాబాద్ లోక్‌మంథన్‌లో చేసి చూపిస్తారు. ఈ సందర్భంగా జరిగే ఎగ్జిబిషన్‌లో తెలంగాణ, త్రిపుర, ఛత్తీస్‌గఢ్, ఉత్తరాఖండ్, మధ్యప్రదేశ్‌తో సహా 10 రాష్ట్రాలకు చెందిన విభిన్న కళలు, సంప్రదాయ ఆహారం, సంప్రదాయ గ్రామీణ క్రీడలు, సాహిత్యం, ఇతర సాంస్కృతిక అంశాలపై చర్చలు ఉంటాయి. భారతీయ ప్రజలు ఏ ప్రాంతంలో నివసిస్తున్నా... వారి అందరి సాంస్కృతిక పునాదులు జానపదంలోనే ఉన్నాయి. మన మూలాలను ఒకసారి అందరికీ చాటిచెప్పే లక్ష్యంతో జరుగుతున్న ఈ జాతరకు అందరూ ఆహ్వానితులే. ఉత్సవాలు జరిగే నాలుగు రోజులూ శిల్పారామంలోకి ప్రజలందరికీ ఉచిత ప్రవేశం ఉంటుంది.

– పగుడాకుల బాలస్వామి; ప్రచార ప్రసార ప్రముఖ్, వీహెచ్‌పీ, తెలంగాణ రాష్ట్రం
(నేటి నుంచి 'లోక్ మంథన్' ప్రారంభం)

భూ సేకరణా... భూ ఆక్రమణా?

అభిప్రాయం



డా॥ బూర నర్సయ్య గౌడ్

ఈమధ్య దక్షిణ కొరియాకు చెందిన షూ ఆల్స్ కంపెనీ తాము ఇక్కడ 300 కోట్లతో షూ కంపెనీ పెడతామనీ, అందుకు కావలసిన 750 ఎకరాల భూమి ఇస్తే 87 వేల మందికి ఉపాధి కల్పిస్తామనీ ప్రగల్భాలు పలికింది. తెలంగాణలో ఎకరం కోటి రూపాయలనుకున్నా 300 కోట్ల పెట్టుబడికి 750 కోట్ల విలువైన భూమి అడిగారన్నమాట. అదే విధంగా ఒక స్మార్ట్ హెల్త్ సిటీ పెట్టడానికి 5,000 ఎకరాలు కావాలని అర్జీ పెట్టింది ఇదే కంపెనీ. దక్షిణ కొరియాలో ప్రధాన కార్యాలయం ఉన్న ఈ కంపెనీ కేవలం 5–10 ఎకరాల విస్తీర్ణంలోనే ఉంది. ఇది 'చారణా కోడికి బారణా మసాలా' అన్నట్లు ఉంది. ఇక ఈ మధ్య ప్రగతి పేరుతో భూసేకరణ చేయడం పేద, మధ్య తరగతి రైతుల పట్ల ఉరితాడులా పరిణమించింది. భూమి ధరలు పెరగటంతో చిన్న, సన్న కారు రైతులు ధనవంతులు అయ్యే సమయానికి, ప్రభుత్వమే భూ దోపిడీకి పాల్పడి ప్రజలను దారిద్ర్యంలోకి నెడుతోంది. ఉన్నోడికి రవ్వంత పోయినా కొండంత లాభం వస్తే, లేనోడు రోడ్డున పడుతున్నాడు. ప్రభుత్వం ఎకరాకు ఇచ్చే పరిహారం, కనీసం గుంట ప్లాట్ కొనుక్కోవడానికి సరిపోవడం లేదు. ప్రగతి వలన భూముల విలువ పెరిగి వందల, వేల ఎకరాలు ఉన్న వారు ప్రపంచ కుబేరులుగా ఎదుగుతున్నారు. ఒకసారి మార్కెట్ విలువ, ప్రభుత్వ పరిహారం విశ్లేషిస్తే... చౌటుప్పల్ దగ్గర ఎకరం 2 కోట్లు ఉంటే ప్రభుత్వం కేవలం 10 లక్షలు; జహీరాబాద్ దగ్గర 1.5 నుండి 2 కోట్లు ఎకరానికి ధర ఉంటే 7–10 లక్షలు మాత్రమే ఇస్తోంది. ప్రభుత్వం భూస్వామిగా కాకుండా, ఒక మానవతా దృక్పథంతో ఆలోచించాలి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం స్పష్టం చేయవలసిన విషయాలు కొన్ని ఉన్నాయి.

తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వం లేదా ప్రభుత్వ సంస్థలు (తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్) సేకరించిన భూమి ఎంత, అందులో ఎన్ని పరిశ్రమలు ఉన్నాయి, వాటి వలన ఎంతమందికి ఉపాధి కల్గుతుంది వంటి వివరాలతో ఒక శ్వేతపత్రం (వైట్ పేపర్) విడుదల చేయాలి. కొత్తగా సేకరించే భూమి... పరిశ్రమలు, ఇతర వ్యాపార, వాణిజ్య సంస్థల కొరకా లేదా పూర్తిగా ప్రజా అవసరాల కొరకా అనేది స్పష్టం చేయాలి. గతంలో ప్రభుత్వం వివిధ సంస్థలకు ఇచ్చిన భూమిలో ఎంత పెట్టుబడి పెట్టారనే విషయం తేల్చాలి.

ఇప్పటికే వివిధ సంస్థలు, వ్యక్తులు లేదా ట్రస్టులకు వివిధ ఉద్దేశాలతో కేటాయించిన భూమిలో వేరే వ్యాపారాలు, సంస్థలు నెలకొన్నాయేమో చూడాలి. భూములు సేకరించే ముందు, నిర్వాసితులు అవుతున్న ప్రజల, రైతుల ప్రయోజనాలనే ముఖ్యంగా ప్రభుత్వం గమనంలో ఉంచుకోవాలి. ఆ భూముల వలన వచ్చే ప్రయోజనాలలో నిర్వాసితులకు సింహభాగం దక్కాలి. ఒక ప్రాజెక్ట్ లేదా రోడ్డు వచ్చినప్పుడు పరిసర ప్రాంతాలలో భూముల విలువ పెరుగుతుంది. కాబట్టి, నిర్వాసితులకు కూడా ఆ లాభం దక్కేలా చూడాలి.

ప్రస్తుతం ప్రభుత్వం దగ్గర ఉన్న భూమిని మొదట ఉపయోగించిన తర్వాత, కొత్త భూ సేకరణకు శ్రీకారం చుట్టాలి. అలాగే ఒక ప్రాజెక్టులో కేవలం ఎకరం, రెండు ఎకరాల భూమి ఉన్న రైతు సర్వం కోల్పోతే వారు రోడ్డున పడతారని గమనించాలి. అదే ఎక్కువ భూమి ఉన్నవారు కొంత పోయినా, మిగతా భూమి విలువ పెరగటం వలన వారికి లాభం కలుగుతుంది. అందువల్ల భూమిని కోల్పోయేవారు ఒక్కొక్కరు ఎంతెంత శాతం భూమిని కోల్పోతున్నారనే విషయాన్ని గుర్తించాలి. ఆ ప్రాతిపదికన పరిహార చెల్లింపు ఉండాలి.



ప్రాజెక్టులలో నిర్వాసితులకు భాగస్వామ్యం కల్పించాలి. ఉదాహరణకు ఔటర్ రింగ్ రోడ్ మొత్తం నిర్మాణ వ్యయం రూ. 6,690 కోట్లు. ఇందులో రోడ్డు నిర్మాణానికి సేకరించిన భూమి 5,500 ఎకరాలు. రైతులకు చెల్లించిన మొత్తం కేవలం రూ. 250 కోట్లు మాత్రమే. రోడ్డుకు అటు, ఇటు ఉన్న రైతుల భూముల విలువ లక్షల కోట్లకు పెరిగింది. కాంట్రాక్టర్ లాభపడ్డాడు. ప్రభుత్వం 7,300 కోట్లకు అంటే ఏడాదికి 240 కోట్లకు లీజుకు ఇచ్చింది. ప్రస్తుతం ఔటర్ రింగ్ రోడ్డుపై సంవత్సరానికి రూ. 550 కోట్ల రాబడి ఉంది. మున్ముందు అది ఏడాదికి రూ. 1,000 కోట్లు దాటే అవకాశం ఉంది. అదే రిజిస్ట్రేషన్ విలువ ఇచ్చి, మార్కెట్ విలువ ప్రకారం ఆ కంపెనీలో నిర్వాసితులకు షేర్ ఇచ్చి ఉంటే, వచ్చే 30 సంవత్సరాలు నిర్వాసిత రైతులకు నెలకు కొంత పరిహారం అందేది. అలానే పారిశ్రామిక వాడలు, కంపెనీలకు భూములు ఇచ్చినప్పుడు నిర్వాసిత రైతులకు భూమి మార్కెట్ విలువ ప్రకారం షేర్ ఇవ్వడం వలన వారు కూడా ఆ ప్రాజెక్టులో భాగస్వాములు అయ్యే అవకాశం ఉంది.

వేల ఎకరాలు ల్యాండ్ బ్యాంకు ఉన్న కంపెనీల దగ్గర నుండి భూమిని సేకరించి వివిధ ప్రాజెక్టుల వల్ల నిర్వాసితులైన వారికి ప్రత్యేకించి చిన్న, సన్నకారు రైతులకు ఇవ్వడం వలన ఎవ్వరికీ నష్టం లేకుండా ప్రగతి సాగుతుంది. అలానే వారికి హైదరాబాద్ పరిసర ప్రాంతాలలో ప్రభుత్వ లే ఔట్లలో ప్లాట్ కేటాయిస్తే న్యాయం జరుగుతుంది. విద్య, ఆరోగ్య రంగాల్లో ప్రత్యేక వెసులుబాట్లు, స్వయం ఉపాధికి లోన్లు... అవీ వడ్డీ రహిత రుణాలు అందించడం; ప్రభుత్వ ఉద్యోగాల్లో కొంత కోటా కేటాయించడం... ఇలా పలు విధాలుగా భూ నిర్వాసితులకు ఒక భరోసా కల్పించవలసిన అవసరం ఉంది.

బదిలీ చేయదగిన అభివృద్ధి హక్కులు (టీడీఆర్) లాంటివి ఇవ్వడం వలన వారికి అధికంగా ఆర్థిక సుస్థిరత కలుగుతుంది. జీహెచ్‌ఎమ్‌సీ పరిధిలో ప్రభుత్వం భూ సేకరణ చేసినప్పుడు, టీడీఆర్ ఇవ్వడం తెలిసిందే. అదే విధంగా భూ నిర్వాసిత కుటుంబాలకు రిజిస్ట్రేషన్ విలువను కాకుండా, ప్రస్తుత మార్కెట్ విలువకు అనుగుణంగా టీడీఆర్ ఇవ్వడం వలన వారికి లబ్ధి జరుగుతుంది. ఉదారణకు ఆర్ఆర్ఆర్ (రీజినల్ రింగ్ రోడ్) కొరకు దాదాపు 9,000 ఎకరాలు కావాలి. ప్రస్తుతం ఏరియాను బట్టి మార్కెట్ విలువ ఎకరం రూ. 50 లక్షల నుండి రూ. 3 కోట్ల వరకు ఉంది. కానీ ప్రభుత్వం రిజిస్ట్రేషన్ వేల్యూ మీదనే పరిహారం చెల్లిస్తుంది. దీని వలన రైతులు, ముఖ్యంగా సర్వం కోల్పోయే చిన్న, సన్న కారు రైతులు తీవ్రంగా నష్ట పోతారు. వారికి పరిహారమే కాకుండా, టీడీఆర్ కూడా ఇస్తే కొంత వెసులుబాటు కలుగుతుంది.

చాలా సందర్భాలలో చిన్న, సన్న కారు రైతులు, ముఖ్యంగా బీసీ, ఈబీసీ, ఎస్సీ, ఎస్టీ రైతులే ప్రాజెక్టుల్లో భూములు కోల్పోతున్నారు. వివిధ కంపెనీల పేరు మీద వేలాది ఎకరాలు ఉన్నాయి. వాటిలో పరిశ్రమలు పెట్టాలనే ఆలోచన ఎవరికీ రావడం లేదు. కేవలం పేద రైతులే టార్గెట్ కావడం బాధకారం. తెలంగాణ ప్రభుత్వం మానవీయ కోణంతో ఆలోచించి నిర్ణయాలు తీసుకుంటే మొత్తం దేశానికే ఆదర్శంగా నిలుస్తుంది.

వ్యాసకర్త భువనగిరి మాజీ ఎంపీ

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీక మాసం, **తిథి:** బ.షష్ఠి రా.8.33 వరకు, తదుపరి సప్తమి, **నక్షత్రం:** పుష్యమి రా.7.41 వరకు, తదుపరి ఆశ్లేష, **వర్జ్యం:** లేదు, **దుర్ముహూర్తం:** ఉ.9.56 నుండి 10.44 వరకు, తదుపరి ప.2.25 నుండి 3.13 వరకు, **అమృతఘడియలు:** ప.1.12 నుండి 2.54 వరకు ; **రాహుకాలం:** ప.1.30 నుండి 3.00 వరకు, **యమగండం:** ఉ.6.00 నుండి 7.30 వరకు, **సూర్యోదయం:** 6.12, **సూర్యాస్తమయం:** 5.20.

నిజాం షుగర్స్ నుంచి 'డెల్టా' ఔట్?



- భాగస్వామ్యం నుంచి బయటకు వెళ్లనున్న సంస్థ
- ఈ నేపథ్యంలో పునరుద్ధరణ కోసం కన్సల్టెంట్‌గా 'క్యాపిటల్ ఫార్చ్యూన్స్' ను ఎంపిక చేసిన ప్రభుత్వం
- ఆస్తుల విలువ, యూనిట్ల స్థితిగతుల మదింపు బాధ్యత అప్పగింత
- వచ్చే ఏడాది మార్చిలోగా తుది నివేదిక ఇవ్వాలని ఆదేశం
- దశలవారీగా ఇచ్చే మధ్యంతర నివేదికల ఆధారంగా భవిష్యత్తుపై నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: నిజాం డెక్కన్ షుగర్స్ లిమిటెడ్ (ఎన్‌డీఎస్‌ఎల్) పునరుద్ధరణ ప్రక్రియలో భాగంగా.. ఇందులో భాగస్వామ్యం ఉన్న డెల్టా పేపర్స్ లిమిటెడ్ సంస్థ తన 51 శాతం వాటాను ఉపసంహరించుకుని బయటికి వెళ్లనుంది. నిజాం షుగర్స్‌ను పునరుద్ధరించినా తాము నడపలేమంటూ డెల్టా సంస్థ గతంలోనే రాష్ట్ర ప్రభుత్వానికి స్పష్టత ఇచ్చింది. ఈ నేపథ్యంలో సంస్థ ఆస్తుల విలువ, యూనిట్ల సాంకేతిక స్థితిగతులను మదింపు చేయడంతోపాటు న్యాయపరమైన అంశాలపై సలహాలు, సూచనల కోసం ప్రభుత్వం 'క్యాపిటల్ ఫార్చ్యూన్స్'అనే సంస్థను కన్సల్టెంట్‌గా ఎంపిక చేసింది. వచ్చే ఏడాది మార్చిలోగా పూర్తి వివరాలతో తుది నివేదిక సమర్పించాలని ఆదేశించింది. ప్రైవేటు భాగస్వామ్య సంస్థ వాటాను తిరిగి చెల్లించాక.. నిజాం షుగర్స్‌ను ఏ తరహాలో నడపాలనే అంశంపై స్పష్టత రానుంది.

తొలుత రుణ విముక్తి చేసి..

నిజాం షుగర్స్‌ను పునరుద్ధరిస్తామన్న హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది జనవరి 12న మంత్రులు శ్రీధర్‌బాబు చైర్మన్‌గా, దామోదర్ రాజనర్సింహ వైస్ చైర్మన్‌గా ఎనిమిది మంది సభ్యులతో కమిటీని ఏర్పాటు చేసింది. పునరుద్ధరణకు అనుకూలంగా ఈ కమిటీ ఇచ్చిన ప్రతిపాదనలను ఆగస్టులో కేబినెట్ ఆమోదించింది. 2015లో ఎన్‌డీఎస్‌ఎల్ యూనిట్లు మూతపడేనాటికి సంస్థ ఆస్తుల విలువ సుమారు రూ.400 కోట్లుగా లెక్కించారు. మరోవైపు బ్యాంకర్లు వడ్డీతో కలిపి ఈ సంస్థకు ఇచ్చిన రుణ మొత్తాన్ని రూ.390 కోట్లుగా పేర్కొన్నాయి. అయితే ప్రభుత్వం బ్యాంకర్ల కన్సార్షియంతో సంప్రదింపులు జరిపి వన్ టైమ్ సెటిల్‌మెంట్ కింద రూ.190 కోట్లు చెల్లించడంతో నిజాం షుగర్స్‌కు రుణ విముక్తి కలిగింది. రుణ విముక్తి కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.171 కోట్లు, డెల్టా పేపర్స్ రూ.19 కోట్లు చెల్లించాయి.

'డెల్టా'తప్పుకోవడంపైనా మార్గనిర్దేశం

కన్సల్టెన్సీ సంస్థ న్యాయపరమైన అంశాలు, ఆస్తుల విలువ, యూనిట్ల సాంకేతిక స్థితిగతులను మదింపు చేయడంతోపాటు యూనిట్ల పునరుద్ధరణకు సంబంధించిన సాంకేతిక, ఆర్థికపరమైన ఖర్చులపై కసరత్తు ప్రారంభించింది. 51 శాతం వాటా కలిగిన డెల్టా పేపర్స్ భాగస్వామ్యం నుంచి తప్పుకోవడంపైనా కన్సల్టెన్సీ సంస్థ మార్గనిర్దేశం చేయాల్సి ఉంటుంది. కన్సల్టెన్సీ సంస్థకు అవసరమైన సమాచారాన్ని ఎన్‌డీఎస్‌ఎల్ తరఫున ఎప్పటికప్పుడు అందించేందుకు గతంలో చక్కెర పరిశ్రమ విభాగంలో డిప్యూటీ డైరెక్టర్ హోదాలో రిటైరైన ఓ అధికారిని సమన్వయకర్తగా నియమించినట్టు తెలిసింది. కన్సల్టెన్సీ సంస్థ ఇచ్చే మధ్యంతర నివేదికల ఆధారంగా నిజాం షుగర్స్ పునరుద్ధరణ తీరుతెన్నులపై చర్చించనున్నారు. ఈ మేరకు 26 లేదా 28వ తేదీన శ్రీధర్‌బాబు నేతృత్వంలోని ప్రత్యేక కమిటీ సమావేశం జరుగుతుందని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి.

'ప్రైవేటు'చేతుల్లోకే నిజాం షుగర్స్?

నిజాం షుగర్స్ నుంచి డెల్టా పేపర్స్ సంస్థ బయ టికి వెళ్లనున్న నేపథ్యంలో.. దానిని ఎవరు నడపాలనే ప్రశ్న తలెత్తుతోంది. ప్రభుత్వ లేదా సహకార రంగంలో నడపడం సాధ్యం కాదనే అభిప్రాయం ప్రభుత్వ వర్గాల్లో నెలకొంది. ఈ నేపథ్యంలో నిర్వహణకు ముందుకొచ్చే ప్రైవేటు సంస్థలకు లీజు ప్రాతిపదికన ఇవ్వడమో లేదా విక్రయించడమో జరుగుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

క్లుప్తంగా...

యాదాద్రి ఆలయానికి స్వర్ణ తాపడం ప్రారంభం



బంగారు రేకులకు పూజలు చేస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ విమాన గోపురానికి బంగారు రేకులు బిగించే పనులు అర్చకులు బుధవారం చేపట్టారు. చెన్నైలోని స్మార్ట్ క్రియేషన్‌లో రూపొందిన బంగారు రేకులకు ఆలయ ముఖ మండపంలో పూజలు నిర్వహించారు. అనంతరం విమాన గోపురానికి రేకుల బిగింపు పనులను ప్రారంభించారు. వచ్చే ఏడాది శ్రీస్వామివారి బ్రహ్మోత్సవాలకల్లా బంగారు తాపడం పనుల పూర్తికి అధికారులు చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో భువనగిరి కలెక్టర్ హనుమంతరావు, వైటీడీఏ వైస్ చైర్మన్ కిషన్‌రావు, అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి, ఈవో భాస్కర్‌రావు పాల్గొన్నారు.

పోలీసులపై 'ధిక్కార కేసు'

- హైకోర్టులో పట్నం శ్రుతి పిటిషన్

సాక్షి, హైదరాబాద్: సుప్రీంకోర్టు తీర్పును ఉల్లంఘిస్తూ లగచర్ల ఘటన కేసులో తన భర్త పట్నం నరేందర్‌రెడ్డిని పోలీసులు అక్రమంగా అరెస్టు చేశారంటూ పట్నం శ్రుతి హైకోర్టులో ధిక్కార పిటిషన్ దాఖలు చేశారు. అధికారులు సత్యనారాయణ, నారాయణరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, అబ్దుల్ రవూఫ్‌లను కఠినంగా శిక్షించాలని కోరారు. డీకే బసు వర్సెస్ పశ్చిమ బెంగాల్ స్టేట్ 1997 కేసులో అరెస్టుకు సంబంధించి సుప్రీంకోర్టు పలు మార్గదర్శకాలు ప్రకటించిందన్నారు. 'అరెస్టు చేసే పోలీసు సిబ్బంది వారి హోదాతో కచ్చితమైన, కనిపించే గుర్తింపును, పేరు ట్యాగ్‌లను కలిగి ఉండాలి. కుటుంబసభ్యుల సమక్షంలోనే అరెస్టు సమయాన్ని పేర్కొనాలి. అరెస్టు సమాచారాన్ని స్నేహితుడికి, బంధువుకు తెలియజేయాలి. అరెస్టయిన వ్యక్తి తన న్యాయవాదిని కలవడానికి అనుమతించాలి. కానీ ఇలాంటి మార్గదర్శకాలను పోలీసులు పాటించలేదు'అని పేర్కొన్నారు. అమానవీయంగా తన భర్తను అరెస్టు చేశారన్నారు. గురు లేదా శుక్రవారం ఈ పిటిషన్ విచారణకు రానుంది.

ఉసురు తీసిన వరికొయ్యల పొగ



రాజయ్య

కోహెడ రూరల్(హుస్నాబాద్): పొలంలోని వరి కొయ్యలను తగులబెట్టడంతో వచ్చిన పొగ ఓ రైతు ప్రాణం తీసింది. సిద్దిపేట జిల్లా కోహెడ మండలం తంగళ్లపల్లిలో లింగాల రాజయ్య (58) అనే రైతు బుధవారం తన పొలంలో వరి కొయ్యలను కాల్చేందుకు నిప్పు పెట్టాడు. ఇతరుల పొలాలకు మంటలు తాకకుండా అదుపుచేసే ప్రయత్నంలో.. పొగతో ఊపిరాడక మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



బల్వంత్‌గౌడ్

మొయినాబాద్: అప్పుల బాధ తాళలేక ఓ రైతు బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండల పరిధిలోని పెద్ద మంగళారంలో బుధవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన సిద్ధాంతి బల్వంత్‌గౌడ్ (48) తనకున్న ఎకరా పొలంతో పాటు మరికొంత పొలాన్ని కౌలు కు తీసుకున్నాడు. నాలుగైదేళ్లుగా పంటలు సరిగా పండటం లేదు. దీంతో వ్యవసాయానికి చేసిన అప్పులు తీర్చే మార్గం లేక మనస్తాపానికి గురయ్యాడు. ఈక్రమంలో ఉదయం 6.30 గంటలకు పొలానికి వెళ్లి చింతచెట్టుకు ఉరేసుకున్నాడు. పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడికి భార్య శైలజ, కొడుకు, కూతురు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

దాచిన బంగారం దోచేసింది

- కూతురి ఇంటి ఎదుట తల్లిదండ్రుల నిరసన




కూతురి ఇంటి ముందు ధర్నా చేస్తున్న మల్లయ్య, శివమ్మ

గౌతంనగర్ (హైదరాబాద్): దైవదర్శనానికి వెళ్తున్న దంపతులు దాచి పెట్టమంటూ తమ కూతురికి సుమారు 30 తులాల బంగారాన్ని ఇచ్చారు. తిరిగొచ్చాక బంగారం ఇవ్వమని అడిగితే.. కూతురు ససేమిరా అంది. దీంతో ఆమె ఇంటి ముందు తల్లిదండ్రులు నిరసనకు దిగారు. రైల్వే విశ్రాంత ఉద్యోగి మల్లయ్య, శివమ్మ దంపతులు రెండేళ్ల క్రితం దైవదర్శనానికి వెళ్లేప్పుడు కూతురు బాలమణికి సుమారు 30 తులాల బంగారాన్ని దాచిపెట్టమని అప్పగించారు. తిరిగి వచ్చాక బంగారం ఇవ్వమని కోరగా.. కూతురు ససేమిరా అనడంతో తల్లిదండ్రులు అప్పట్లోనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. కానీ పోలీసులు పట్టించుకోకపోవడంతో ఇటీవల మానవ హక్కుల సంఘం ప్రతినిధులను సంప్రదించారు. వారితో కలిసి వాణినగర్‌లో బుధవారం కూతురు ఇంటి ముందు నిరసన చేపట్టారు.

ఆయనేమన్నా టెర్రరిస్టా?

- పట్నం నరేందర్‌రెడ్డి అరెస్టు విధానాన్ని తప్పుబట్టిన హైకోర్టు
- మాజీ ఎమ్మెల్యేను అకస్మాత్తుగా ఎందుకు అరెస్టు చేశారు?
- కుటుంబ సభ్యులకు చెప్పి చట్టపరంగా అరెస్టు చేయవచ్చు కదా?
- ఇతర నిందితుల వాంగ్మూలాలను ఇవ్వాలని ప్రభుత్వానికి ఆదేశం



సాక్షి, హైదరాబాద్: వికారాబాద్ జిల్లా లగచర్ల ఘటనలో కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అరెస్టు విధానాన్ని హైకోర్టు తప్పుబట్టింది. ఆయన ఏమైనా టెర్రరిస్టా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. కేబీఆర్ పార్కు వద్ద ఉదయం వాకింగ్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యేను బహిరంగ ప్రదేశంలో అరెస్టు చేయాల్సిన అవసరం ఏమొచ్చిందని నిలదీసింది. ఆయన పరారీలో లేరు కదా.. ఇంటికి వచ్చిన తర్వాత కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి చట్టప్రకారం అరెస్టు చేయొచ్చు కదా అని పేర్కొంది. గాయపడ్డ వారి వివరాల పక్కన ప్రశ్నార్థకం పెట్టడంపై అభ్యంతరం వ్యక్తం చేసింది. అంటే వైద్యుడికే స్పష్టత లేదా అని అడిగింది. నరేందర్‌రెడ్డి మరో నిందితుడికి రెండు నెలల కాలంలో 84 సార్లు ఫోన్ చేశారన్న పోలీసుల వాదనపై ఆక్షేపించింది. ఇద్దరూ ఒకే పార్టీకి చెందిన వారైనప్పుడు నేరపూరిత కుట్రపైనే మాట్లాడుకున్నారని ఎలా చెప్పగలరని ప్రశ్నించింది. నరేందర్‌రెడ్డికి ప్రమేయం ఉందంటూ నిందితులు చెప్పిన వాంగ్మూలాల కాపీలను తమ ముందు ఉంచాలని ఆదేశించింది. తనను అరెస్టు చేసి రిమాండ్ చేయడాన్ని సవాల్ చేస్తూ నరేందర్‌రెడ్డి హైకోర్టులో దాఖలుచేసిన పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్ బుధవారం విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది గండ్ర మోహన్‌రావు, ప్రభుత్వం తరఫున పీపీ పల్లె నాగేశ్వర్‌రావు వాదనలు వినిపించారు.

పిటిషన్‌ను అనుమతిస్తే దర్యాప్తుపై ప్రభావం: పీపీ

'నరేందర్‌రెడ్డికి ఎలాంటి సమాచారం ఇవ్వకుండా అరెస్టు చేశారు. నవంబర్ 11న రిమాండ్ డైరీలో ఆయన పేరు లేదు. నవంబర్ 13 నాటి డైరీలో చేర్చారు. ఆయనపై పెట్టిన సెక్షన్లలో ఒకటి తప్ప అన్నీ ఐదేళ్లలోపు శిక్ష పడే కేసులే. ఇతర నిందితులు నరేందర్‌రెడ్డి పేరు చెప్పారంటూ చట్టవిరుద్ధంగా అరెస్టు చేశారు. ఘటన జరిగిన రోజున ఆయన నుంచి మరో నిందితుడి (ఏ–4)కి ఒకే ఒక్క కాల్ వెళ్లింది. అలాంటప్పుడు ఘటన వెనుక ఆయన ఉన్నట్లు ఎలా చెబుతారు? రాజకీయ కోణంలోనే మాజీ ఎమ్మెల్యేను ఇరికించే ప్రయత్నం చేస్తున్నారు. ఆయన ఏమీ చెప్పకున్నా.. కేటీఆర్ పేరు చెప్పినట్లు, నేరాన్ని అంగీకరించినట్లు తప్పుడు నివేదికను ట్రయల్‌కోర్టుకు అందజేశారు. తోపులాటలో జరిగిన చిన్న గాయాలను రాద్ధాంతం చేయాలని చూస్తున్నారు'అని గండ్ర మోహన్‌రావు వాదనలు వినిపించారు. 'ప్రజలను రెచ్చగొట్టేలా నరేందర్‌రెడ్డి మాట్లాడారు. దీని కోసమే మరో నిందితుడికి రెండు నెలల్లో 84 సార్లు కాల్ చేశారు. నరేందర్‌రెడ్డిని ఇంటి వద్దే అరెస్టు చేశాం. విచారణ సాగుతోంది. ఈ దశలో పిటిషన్‌ను అనుమతిస్తే దర్యాప్తుపై ప్రభావం చూపుతుంది. ఆయన పిటిషన్‌ను కొట్టివేయాలి. నరేందర్‌రెడ్డిని పోలీసుల కస్టడీకి ఇవ్వాలన్న పిటిషన్‌పై వికారాబాద్ కోర్టు విచారిస్తోంది'అని పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదనలు వినిపించారు.

ప్రాథమిక విచారణ చేశారా?

వాదనలు విన్న న్యాయమూర్తి.. 'ఇంటి వద్దే అరెస్టు చేస్తే, విచారణ సమయంలో సలీమ్ అనే వ్యక్తి సమాచారం ఎందుకు ఇచ్చారు? సొంత పార్టీ వ్యక్తితో మాట్లాడినంత మాత్రాన అరెస్టు చేస్తారా? ఇతర నిందితుల స్టేట్‌మెంట్లు కాకుండా నరేందర్‌రెడ్డి పాత్రపై ప్రాథమిక విచారణ చేశారా? మీరు చెబుతున్నట్లు కుట్రకోణం ఉంటే ఘటన జరిగిన రోజున ఇద్దరి మధ్య ఒకే కాల్ ఎందుకు ఉంటుంది? లగచర్ల ఘటనలో అధికారులకు పెద్దగా గాయాలు కాలేదని నిమ్స్ వైద్యుల నివేదిక చెబుతోంది. లక్ష్మయ్య, దేవేందర్, హన్మంత్ వాంగ్మూలాలను అందజేయండి'అంటూ తీర్పు రిజర్వు చేశారు. అయితే తమ వాదనలకు కొంత సమయం కావాలని పీపీ విజ్ఞప్తి చేయడంతో గురువారానికి వాయిదా వేశారు.

నరేందర్‌రెడ్డి కస్టడీ తీర్పు రిజర్వ్

- నరేందర్‌రెడ్డిని చర్లపల్లి నుంచి కొడంగల్ కోర్టుకు తీసుకొచ్చిన పోలీసులు
- దారి పొడవునా గట్టి బందోబస్తు



వికారాబాద్: లగచర్ల ఘటన కేసులో పట్నం నరేందర్ రెడ్డిని పూర్తి స్థాయిలో విచారించేందుకు కస్టడీకి ఇవ్వాలని పోలీసుల తరఫు న్యాయవాదులు కొడంగల్ కోర్టులో వాదన లు వినిపించారు. అయితే, నరేందర్‌రెడ్డి తరఫు న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ.. లగచర్ల ఘటన సమయంలో అక్కడ లేని వ్యక్తిపై హత్యాయత్నం కేసు ఎలా పెడతారన్నారు. ఆయనను ఇప్పటికే విచారించినట్లు పోలీసులు రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నారని, అందువల్ల కస్టడీ పిటిషన్‌ను కొట్టివేయాలని కోరారు. కేసులో ఏ–1గా ఉన్న నరేందర్‌రెడ్డి కస్టడీ కోరుతూ పోలీసులు కోర్టులో పిటిషన్ వేయగా, ఆయన సమక్షంలోనే దీనిపై విచారణ చేయాలన్న నిందితుడి తరఫు న్యాయవాదుల అభ్యర్థనను న్యాయస్థానం అనుమతించింది. దీంతో చర్లపల్లి జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న ఆయనను పోలీసులు బుధవారం కొడంగల్ కోర్టుకు తరలించారు. ఈ సమయంలో దారి పొడవునా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. వాదనలు విన్న అనంతరం జడ్జి తీర్పును 22వ తేదీకి రిజర్వు చేశారు.

కొడంగల్ నుంచే రేవంత్‌రెడ్డి పతనం: పట్నం

సీఎం రేవంత్‌రెడ్డి పతనాన్ని కొడంగల్ నుంచే మొదలు పెడతానని లగచర్ల ఘటనలో రిమాండ్ ఖైదీగా ఉన్న పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు. కొడంగల్ కోర్టుకు హాజరైన ఆయన, బయటకు వచ్చిన తర్వాత న్యాయవాదులతో కలిసి మీడియాతో మాట్లాడారు. ఫార్మా బాధిత రైతులకు మద్దతిస్తే తనపై అక్రమ కేసులు పెడతారా? అని ప్రశ్నించారు. సీఎం, ఇంటెలిజెన్స్, పోలీసుల వైఫల్యంతో జరిగిన దాడిని పక్కదారి పట్టించేందుకే తనపై కేసులు పెట్టారని ఆరోపించారు.

లగచర్ల దాడి బీఆర్‌ఎస్ గూండాల పనే!

- నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి



వికారాబాద్, కొడంగల్ రూరల్: వికారాబాద్ జిల్లా లగచర్లలో జిల్లా కలెక్టర్‌తోపాటు ఇతర అధికారులపై దాడిచేసింది రైతులు కాదని.. బీఆర్‌ఎస్ గూండాలని నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి ఆరోపించారు. బీఆర్‌ఎస్ నేతలు కేటీఆర్, నరేందర్‌రెడ్డి కలిసి కొందరిని రెచ్చగొట్టి దాడులు చేయించారని మండిపడ్డారు. ఎస్టీ కార్పొరేషన్ చైర్మన్ బెల్లయ్యనాయక్, రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డితో కలిసి బుధవారం ఆయన వికారాబాద్ కలెక్టరేట్‌కు వచ్చారు. కలెక్టర్ ప్రతీక్‌జైన్‌ను పరామర్శించి కొడంగల్ చేరుకున్నారు. అక్కడి నుంచి పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డితో కలిసి లగచర్లకు వెళ్లారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. కేటీఆర్ కుట్రను నరేందర్‌రెడ్డి అమలు చేశారని ధ్వజమెత్తారు. నిజానిజాలు అందరికీ తెలియజెప్పేందుకే తాము లగచర్లకు వచ్చామని పేర్కొన్నారు.

అభివృద్ధికి బీఆర్‌ఎస్సే అడ్డు: కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ప్రతిపక్షాలకు మింగుడు పడటం లేదని మల్లు రవి విమర్శించారు. హైదరాబాద్‌లో మూసీ సుందరీకరణకు, లగచర్లలో ఫార్మాసిటీ ఏర్పాటుకు బీఆర్‌ఎస్ పార్టీ అడ్డు తగులుతోందని ధ్వజమెత్తారు. రైతులకు ఇష్టం లేకుండా ఎకరా భూమిని కూడా ప్రభుత్వం తీసుకోదని స్పష్టంచేశారు. రేవంత్‌రెడ్డిని సీఎం పదవి నుంచి దించేందుకు బీఆర్‌ఎస్ కుట్రలు చేస్తోందని బెల్లయ్యనాయక్ ఆరోపించారు.

కేసీఆర్ బాటలోనే రేవంత్‌రెడ్డి: తమ్మినేని



సూర్యాపేట: ఫార్మా కంపెనీ కోసం రైతులను నిర్బంధించి భూసేకరణ చేయడం సరికాదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. వామపక్ష నేతలతో కలసి గురువారం లగచర్లకు వెళ్తామని ఆయన చెప్పారు. రైతులకు అండగా నిలవడంతోపాటు బాధిత కుటుంబాలను పరామర్శిస్తామని తెలిపారు. బుధవారం ఆయన సూర్యాపేట జిల్లా కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ, సీపీఐ, సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ, ప్రజాపంథా, ఇతర వామపక్ష పార్టీలతో కలసి బాధిత రైతుల సమస్యలు తెలుసుకుని ముఖ్యమంత్రితో మాట్లాడతామని వివరించారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 2013 భూసేకరణ చట్టం అమలు చేయకుండా భూములు సేకరించారని, ఇప్పుడు కేటీఆర్ రైతుల పక్షాన మాట్లాడడం విడ్డూరంగా ఉందని అన్నారు. లగచర్లలో ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్లిన కలెక్టర్, ఇతర అధికారులపై దాడిచేయడం సరికాదన్నారు. గతంలో ఫార్మా సిటీని వ్యతిరేకించిన సీఎం రేవంత్‌రెడ్డి.. ఇప్పుడు లగచర్లలో భూసేకరణ జరపడం ఏమిటని ప్రశ్నించారు. రంగారెడ్డి జిల్లాలో ఫార్మా సిటీకి సేకరించిన 15 వేల ఎకరాలను రద్దుచేసి లగచర్లలో ఫోర్త్‌సిటీ పేరుతో రైతుల నుంచి భూములను బలవంతంగా తీసుకోవడం తగదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పరిపాలనపై విజయోత్సవాలకు సిద్ధపడడం హాస్యాస్పదంగా ఉందని విమర్శించారు.

కేటీఆర్ ధర్నాకు అనుమతి నిరాకరణ!

మహబూబాబాద్‌లో మహాధర్నా తలపెట్టిన బీఆర్‌ఎస్

- 'లగచర్ల'గిరిజనులకు సంఘీభావంగా నిర్వహించాలని నిర్ణయం
- అనుమతి ఇవ్వని జిల్లా ఎస్పీ.. బైఠాయించి నిరసన తెలిపిన బీఆర్‌ఎస్ నేతలు



ఎస్పీ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహిస్తున్న ఎంపీ వద్దిరాజు, మాజీ ఎంపీ కవిత తదితరులు

మహబూబాబాద్ రూరల్: 'లగచర్ల'గిరిజనులకు సంఘీభావంగా మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించ తలపెట్టిన మహాధర్నాకు పోలీసులు అనుమతి నిరాకరించారు. దీనితో బీఆర్‌ఎస్ నేతలు ఎస్పీ క్యాంపు కార్యాలయం ఎదుట బుధవారం రాత్రి ధర్నాకు దిగడం ఉద్రిక్తతకు దారి తీసింది. మాజీ ఎంపీ మాలోత్ కవిత, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీలు సత్యవతి రాథోడ్, పోచంపల్లి శ్రీనివాసరెడ్డి, తక్కెళ్లపల్లి రవీందర్‌రావు తదితరులు ఎస్పీ కార్యాలయం ఎదుట బైఠాయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ''మహాధర్నాకు అనుమతి కోసం రెండు రోజులుగా ప్రయత్నిస్తున్నాం. తొలుత అనుమతి ఇస్తామని పోలీసులు చూచాయగా చెప్పారు. తీరా ఎస్పీ అనుమతి ఇవ్వలేమంటూ నిరాకరించారు. ఇది కాంగ్రెస్ ప్రభుత్వ పిరికి పంద చర్య''అని నేతలు మండిపడ్డారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి దాకా ఎస్పీ కార్యాలయంలో కూర్చోబెట్టి చివరి నిమిషంలో అనుమతి ఇవ్వబోమని చెప్పటం ఏమిటని నిలదీశారు. ధర్నా సందర్భంగా అవాంఛనీయ ఘటనలు జరగకుండా నియంత్రించలేమని, పోలీసులు చెప్పటం చూస్తే వారి దుస్థితి ఏమిటో అర్థమవుతుందని వ్యాఖ్యానించారు. అయితే బీఆర్‌ఎస్ నేతలు ఆందోళనకు దిగినా... పోలీసుల నుంచి స్పందన రాలేదు. దీనితో ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ అక్కడే నిద్రకు ఉపక్రమించారు. ఈ ధర్నాలో జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ ఆంగోత్ బిందు, మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్, మున్సిపల్ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, ఇతర బీఆర్‌ఎస్ నేతలు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తిని 100 మందికి అస్వస్థత

- నారాయణపేట జిల్లా మాగనూర్ స్కూళ్లో ఘటన
- భోజనం చేసిన వెంటనే విద్యార్థులకు తీవ్ర కడుపునొప్పి
- విషయం చెప్పినా పట్టించుకోని టీచర్లు
- పరిస్థితి విషమించటంతో ఆస్పత్రులకు తరలింపు
- ఘటనపై సీఎం రేవంత్ సీరియస్.. సమగ్ర విచారణకు ఆదేశం
- పాఠశాలలా? ప్రాణాలు తీసే విషవలయాలా?: హరీశ్‌రావు



విద్యార్థులకు చికిత్స చేస్తున్న వైద్యులు

సాక్షి, హైదరాబాద్/మాగనూర్: మధ్యాహ్న భోజనం విషతుల్యం కావటంతో100 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. ఈ ఘటన నారాయణపేట జిల్లా మాగనూర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. పాఠశాలలో మధ్యాహ్న భోజనంలో అన్నం, పప్పు, గుడ్డు వడ్డించారు. ఆహారం తిన్న కొద్దిసేపటికే సుమారు వందమంది విద్యార్థులు తీవ్రమైన కడుపునొప్పితో బాధపడ్డారు. ఆ విషయం టీచర్లకు చెప్పగా 'మీరు రోజూ ఇలాగే చెప్తున్నారు'అని బెదిరించినట్లు తెలిసింది. కానీ, కడుపునొప్పి మరింత తీవ్రం కావటంతో మధ్యాహ్నం 3 గంటల సమయంలో కొందరు విద్యార్థులు వాంతులు చేసుకొన్నారు. దీంతో టీచర్లు స్థానిక ఆస్పత్రికి సమాచారమిచ్చారు. స్థానిక ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు స్కూలుకు వచ్చి విద్యార్థులకు ప్రాథమిక చికిత్స అందించినా కొందరి పరిస్థితి మెరుగుపడకపోవటంతో మండల వైద్యాధికారి అఫ్రోజ్‌కు సమాచారం అందించారు. ఆయన స్కూలుకు వచ్చి విద్యార్థులను పరీక్షించారు. తొలుత 10 మందిని మక్తల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కాసేపటికి ప్రైవేట్ అంబులెన్స్‌లో మరో 9 మంది విద్యార్థులను మక్తల్ ఆస్పత్రికి పంపించారు. వీరిలో 15 మందిని మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రికి తరలించారు. వీరిలో ప్రియాంక, అనిల్, నందిని పరిస్థితి విషమంగా ఉంది. పరిస్థితి కొంచం మెరుగ్గా ఉన్న ఇతర గ్రామాల విద్యార్థులను టీచర్లు ఇంటికి పంపించివేశారు. ఇళ్లకు చేరుకున్న తర్వాత కొందరు విద్యార్థులు అస్వస్థతకు గురికాగా.. తల్లిదండ్రులు వారికి స్థానిక ఆస్పత్రిలో చికిత్స చేయించారు. మొత్తం వందమంది విద్యార్థులకు ఫుడ్‌పాయిజన్ అయినట్లు గుర్తించారు. కాగా, కడుపులో నొప్పిగా ఉందని చెప్పిన కొందరు విద్యార్థులను టీచర్లు కొట్టినట్లు చెపుతున్నారు.

ఇక్కడ ఫుడ్‌పాయిజన్ మొదటిసారి కాదు!

విద్యార్థులు అస్వస్థతకు గురైన విషయం తెలుసుకొన్న డీఈఓ అబ్దుల్ ఘనీ పాఠశాలకు చేరుకుని విచారణ చేపట్టారు. అయితే ఈ పాఠశాలలో విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ కావడం ఇది మూడోసారి అని విద్యార్థి సంఘాల నాయకులు డీఈఓతో వాగ్వాదానికి దిగారు. వంట ఏజెన్సీ, పాఠశాల హెచ్‌ఎం (ఇన్‌చార్జ్ ఎంఈఓ) నిర్లక్ష్యం కారణంగానే ఫుడ్ పాయిజన్ అయ్యిందని ఆరోపించారు. విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలకు చేరుకుని వంట ఏజెన్సీని తక్షణమే మార్చాలని హెచ్‌ఎంతో వాగ్వాదానికి దిగారు. ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి కూడా పాఠశాలకు చేరుకుని ఘటనపై పూర్తి విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డీఈఓను, ఎస్‌ఐ అశోక్‌బాబును ఆదేశించారు. ఎమ్మెల్యే తన వాహనంతోపాటు ప్రైవేట్ అంబులెన్స్‌లో విద్యార్థులను ఆస్పత్రికి తరలించారు.

సీఎం సీరియస్: మాగనూర్ ఘటనపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధ్యులపై వెంటనే కఠినచర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. విద్యార్థుల అస్వస్థత విషయం తెలియగానే వారి ఆరోగ్య పరిస్థితిని సీఎం అడిగి తెలుసుకొన్నారు. బాధిత విద్యార్థులకు వెంటనే మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. సంఘటనపై విచారణ జరిపి నివేదిక అందజేయాలని సీఎంవో అధికారులకు సూచించారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకూడదని సీఎం హెచ్చరించారు. విద్యార్థుల అస్వస్థతపై బీఆర్‌ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. పాఠాలు నేర్చుకోవడం కాదు.. ప్రాణాలతో బయటపడితే చాలు అనే పరిస్థితిని కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిందని ఆరోపించారు. 'గురుకులాలా లేక నరక కూపాలా? ప్రభుత్వ పాఠశాలలా లేక ప్రాణాలు తీసే విషవలయాలా?'అని ప్రశ్నించారు.

కాలుష్యానికి కళ్లెం

బీజింగ్ చెప్పిన పాఠం

చైనా రాజధానిలో 2013 నుంచి పటిష్ట చర్యలు

- కాలుష్య కారక పరిశ్రమల మూసివేత
- ఎలక్ట్రిక్ వాహనాలకు ప్రోత్సాహం
- ప్రజల సహకారంతో ప్రభుత్వ చర్యలు సఫలం
- క్రమంగా మెరుగుపడిన వాయు నాణ్యత
- ఢిల్లీకి ఇదో కనువిప్పు కావాలి



దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం ప్రజల ప్రాణాలు తోడేస్తోంది. విషపూరితమైన గాలి పీలుస్తున్న జనం ఆసుపత్రులపాలవుతున్నారు. ఇప్పటికే అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నవారు వాయు కాలుష్యం కాటుకు ప్రాణాలు కోల్పోతున్నారు. లాన్సెట్ ప్లానెటరీ హెల్త్ జర్నల్ నివేదిక ప్రకారం.. కాలుష్యం కారణంగా ఢిల్లీలో ప్రతిఏటా దాదాపు 12,000 మంది మరణిస్తున్నారు. లక్షలాది మంది అనారోగ్యానికి గురవుతున్నారు. నగరంలో ప్రతిఏటా నమోదవుతున్న మొత్తం మరణాల్లో 11.5 శాతం మరణాలకు కాలుష్యమే కారణం కావడం గమనార్హం. ఢిల్లీ ఒక గ్యాస్ చాంబర్‌గా మారిందనడంలో అతిశయోక్తి లేదు. ఢిల్లీలో ఇప్పుడున్న పరిస్థితులే 2013 దాకా చైనా రాజధాని బీజింగ్‌లోనూ కనిపించేవి. కానీ, ప్రస్తుతం బీజింగ్ సిటీ కాలుష్యం ముప్పు నుంచి చాలావరకు బయటపడింది. ప్రజలు స్వచ్ఛమైన గాలి పీల్చుకుంటున్నారు. ఇదంతా ఎలా సాధ్యమైందన్నది ఆసక్తికరం. వాయు కాలుష్యంపై పోరాటం విషయంలో చైనా అనుభవాలు, సాధించిన విజయాల నుంచి ప్రపంచ దేశాలు నేర్చుకోవాల్సిన పాఠాలెన్నో ఉన్నాయి. వాయునాణ్యత సూచీ (ఏక్యూఐ) మంగళవారం బీజింగ్‌లో 137 కాగా, ఢిల్లీలో 750గా నమోదైంది. ఢిల్లీలో కాలుష్యం ఏ స్థాయిలో ఉందో దీన్నిబట్టి అర్థం చేసుకోవచ్చు. కాలుష్యం ఉత్పత్తి అయ్యే విషయంలో ఢిల్లీ, బీజింగ్‌లో ఒకేలాంటి పరిస్థితులు ఉన్నాయి. శిలాజ ఇంధనాల వాడకం, వాహనాల నుంచి వెలువడే ఉద్గారాలు, బొగ్గుతో నడిచే థర్మల్ విద్యుత్ కేంద్రాలు, కాలుష్యం వెదజల్లే పరిశ్రమలు రెండు నగరాల్లోనూ ఉన్నాయి. పంజాబ్, హరియాణా, ఉత్తరప్రదేశ్, రాజస్తాన్ రాష్ట్రాల్లో పంట వ్యర్థాల దహనం ఢిల్లీకి ఉన్న అదనపు ముప్పు. గ్రీన్‌హౌస్ వాయువుల ఉద్గారాల్లో చైనాది ప్రపంచంలోనే మొదటి స్థానం. మొత్తం ప్రపంచ ఉద్గారాల్లో డ్రాగన్ దేశం వాటా 30 శాతం. అయినప్పటికీ బీజింగ్ ప్రజలకు స్వచ్ఛమైన గాలి ఎలా అందుతోంది? ఈ విషయంలో ప్రభుత్వం తీసుకున్న చర్యలేమిటి? బీజింగ్‌లో కాలుష్యం నానాటికీ పెరిగిపోతుండడాన్ని చైనా రియల్ ఎస్టేట్ కంపెనీ 'సోహో' అధినేత, బిలియనీర్ పాన్ షియి 2011లో తొలిసారిగా సోషల్ మీడియా పోస్టు ద్వారా బాహ్య ప్రపంచం దృష్టికి తీసుకొచ్చారు. 2013లో కాలుష్య వ్యతిరేక పోరాటం ప్రారంభించారు. ఈ పోరాటంలో తొలుత యువత పాలుపంచుకున్నారు. క్రమంగా ఇదొక ప్రజా పోరాటంగా మారింది. వాయు కాలుష్యం పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ బీజింగ్ ప్రజలు రోడ్లపైకి వచ్చారు. తమ ప్రాణాలు కాపాడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ రెండు వారాలపాటు అవిశ్రాంతంగా ఆందోళన కొనసాగించారు. ప్రభుత్వం దిగివచ్చింది. కాలుష్యంపై యుద్ధం ప్రకటిస్తున్నట్లు అప్పటి చైనా అత్యున్నత నాయకుడు లీ కెఖియాంగ్ స్పష్టం చేశారు. పేదరికంపై జరుగుతున్న యుద్ధం తరహాలో కాలుష్యంపైనా యుద్ధం సాగిస్తామని తేల్చిచెప్పారు. అంతేకాదు కాలుష్య నియంత్రణ చర్యలను ఎప్పటికప్పుడు స్వయంగా పర్యవేక్షించారు. అధికారులను పరుగులు పెట్టించారు.

నేషనల్ ఎయిర్ యాక్షన్ ప్లాన్

- కాలుష్యాన్ని కట్టడి చేయడానికి చైనా సర్కారు 'నేషనల్ ఎయిర్ యాక్షన్ ప్లాన్' విడుదల చేసింది. ఇందుకోసం 100 బిలియన్ డాలర్లు కేటాయించింది.
- బీజింగ్‌లో మొట్టమొదటిసారిగా 2013లో వాయు నాణ్యత గణాంకాలను ప్రచురించారు. అప్పటిదాకా ఈ సమాచారం కోసం అమెరికా రాయబార కార్యాలయంపై ఆధారపడాల్సి వచ్చేది.
- 2013 నుంచి సొంతంగానే సమాచారం సేకరించి, ప్రజలకు చేరవేయడం ప్రారంభించారు.
- జాతీయ వాయు కార్యాచరణ ప్రణాళికలో భాగంగా కాలుష్యాన్ని 25 శాతం తగ్గించాలని ప్రభుత్వ అధికారులు లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. సీరియస్‌గానే రంగంలోకి దిగారు.
- తీవ్ర కాలుష్యానికి కారణమవుతున్న 100 ఫ్యాక్టరీలను మూసివేశారు. మరికొన్నింటిని ఆధునీకరించారు.
- కాలుష్య ఉద్గారాల విషయంలో కఠినమైన నిబంధనలు అమల్లోకి తీసుకొచ్చారు. కాలం చెల్లిన 2 కోట్ల పాత వాహనాలను రోడ్డెక్కనివ్వలేదు. వాటిని స్క్రాప్‌గా మార్చేశారు.
- 2 లక్షల పారిశ్రామిక బాయిలర్లను ఉన్నతీకరించారు. పాత వాటి స్థానంలో ఆధునిక బాయిలర్లు అమర్చారు.
- బొగ్గు ఆధారిత విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలకు మంగళం పాడేశారు. సహజ వాయువుతో కరెంటును ఉత్పత్తి చేసి, 60 లక్షల ఇళ్లకు సరఫరా చేస్తున్నారు.
- విద్యుత్‌తో నడిచే వాహనాలు బీజింగ్ రోడ్లపై పరుగులు తీస్తున్నాయి. పెట్రోల్, డీజిల్‌తో నడిచే వాహనాలు అతి తక్కువగా కనిపిస్తుంటాయి. ఎలక్ట్రిక్ వాహనాల వాడకాన్ని ప్రభుత్వం ఎంతగానో ప్రోత్సహిస్తోంది. వాటికి పలు రాయితీలు అందిస్తోంది.
- 2013లో చైనా ప్రభుత్వం ప్రారంభించిన చర్యలు సత్ఫలితాలు ఇచ్చాయి. రాజధానిలో వాయు కాలుష్యం తగ్గడం మొదలైంది. గాలి నాణ్యత క్రమంగా మెరుగుపడింది. ప్రభుత్వం చేపట్టిన చర్యలకు ప్రజలు కూడా పూర్తిస్థాయిలో సహకరించడంతో బీజింగ్ సిటీ ఇప్పుడు కాలుష్య రహిత నగరంగా మారింది.

– సాక్షి, నేషనల్ డెస్క్

ఇండియా చేయాల్సిందేమిటి?

ఇండియాలో కేవలం ఢిల్లీ మాత్రమే కాదు, హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, అహ్మదాబాద్, కోల్‌కతా, ముంబై, పుణే, వారణాసి, పట్నా తదితర పెద్ద నగరాలతోపాటు ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలు కూడా కాలుష్యం ఊబిలో చిక్కుకున్నాయి. ప్రపంచంలోని అత్యంత కాలుష్యభరిత నగరాల జాబితాలో ఇండియా సిటీల స్థానం భద్రంగా ఉంటోంది. కాలుష్యాన్ని తరిమికొట్టి స్వచ్ఛంగా మార్చడానికి బీజింగ్ మోడల్‌ను ఆదర్శంగా తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. కాలుష్యం నుంచి జనానికి విముక్తి కల్పించడానికి బలమైన రాజకీయ సంకల్పం కావాలని చెబుతున్నారు. నిపుణుల సూచనలు ఏమిటంటే..

- కాలుష్య నియంత్రణను కేవలం స్థానిక ప్రభుత్వాలకే వదిలివేయకూడదు. ఇందుకోసం జాతీయ స్థాయిలో పటిష్టమైన కార్యాచరణ ప్రణాళిక అవసరం.
- వాయు నాణ్యతను మెరుగుపర్చడానికి అందుబాటులో ఉన్న వనరులను సక్రమంగా వినియోగించుకోవాలి.
- శిలాజ ఇంధనాల వాడకానికి కళ్లెం వేయాల్సిందే.
- పెరుగుతున్న జనాభాకు తగ్గట్టుగా మౌలిక సదుపాయాలు పెరగాలి. అస్తవ్యస్తమైన పట్టణ ప్రణాళిక కాలుష్యానికి కారణమవుతోంది. ఈ పరిస్థితి మారాలి.
- కాలుష్య నియంత్రణ చర్యల్లో ప్రజల భాగస్వామ్యం తప్పనిసరి.
- వ్యాపారం, వాణిజ్యం, ఎగుమతులతోపాటు రాజకీయ పలుకుబడి సాధించే విషయంలో చైనాతో పోటీ పడుతున్న భారత్ కాలుష్య నియంత్రణ విషయంలో ఎందుకు పోటీపడడం లేదన్నదే నిపుణుల ప్రశ్న.
- చక్కటి ప్రణాళికాబద్ధమైన ప్రజా రవాణా వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావాలి. ప్రైవేట్ వాహనాల వినియోగం తగ్గిపోవాలి. ప్రజలు సొంత వాహనాలు కాకుండా ప్రజా రవాణా సాధనాలను ఉపయోగించుకుంటే కాలుష్యం చాలావరకు తగ్గిపోతుంది.

మళ్లీ మహాయుతి!

మహారాష్ట్ర బీజేపీ కూటమిదే

- జార్ఖండ్‌లోనూ ఎన్డీఏకే మొగ్గు
- అత్యధిక ఎగ్జిట్ పోల్స్ వెల్లడి
- శనివారం రానున్న ఫలితాలు



న్యూఢిల్లీ: బీజేపీ సారథ్యంలోని మహాయుతి కూటమి మహారాష్ట్రలో అధికారం నిలుపుకోనుందని ఎగ్జిట్ పోల్స్ జోస్యం చెప్పాయి. జార్ఖండ్‌లో కూడా ఎన్డీఏ కూటమిదే పై చేయని తేల్చాయి. రెండు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ బుధవారం సాయంత్రం ముగిసింది. ఆ వెంటనే ఆ రాష్ట్రాల ఫలితాలపై ఎగ్జిట్ పోల్స్ వెలువడ్డాయి. బీజేపీ, శివసేన (షిండే), ఎన్సీపీ (అజిత్)లతో కూడిన మహాయుతి విజయం ఖాయమని దాదాపుగా అన్ని సంస్థలూ అంచనా వేశాయి. కాంగ్రెస్, శివసేన (యూబీటీ), ఎన్సీపీ (ఎస్పీ)లతో కూడిన విపక్ష మహా వికాస్ అఘాడీ ఓటమి చవిచూడనున్నట్టు చెప్పాయి. ఒక్క లోక్‌పోల్ మాత్రమే ఎంవీఏ గెలుస్తుందని పేర్కొంది. 288 అసెంబ్లీ స్థానాలకు గాను ఆ కూటమికి 150కి పైగా స్థానాలు వస్తాయని, మహాయుతి 130 లోపే సాధిస్తుందని అంచనా వేసింది. జార్ఖండ్‌లో నవంబర్ 13, 20 తేదీల్లో రెండు విడతల్లో పోలింగ్ జరగ్గా మహారాష్ట్రలో బుధవారం ఒకే విడతలో ముగియడం తెలిసిందే. రెండు రాష్ట్రాల్లోనూ శనివారం ఓట్ల లెక్కింపు జరిగి ఫలితాలు వెలువడతాయి.

జార్ఖండ్‌లో టఫ్ ఫైట్

జార్ఖండ్‌లో అధికార జేఎంఎం–కాంగ్రెస్ కూటమికి, బీజేపీ సారథ్యంలోని విపక్ష ఎన్డీఏ కూటమికి మధ్య హోరాహోరీ సాగిందని ఎగ్జిట్ పోల్స్ తేల్చాయి. అత్యధిక పోల్స్ ఎన్డీఏకే మొగ్గుతున్నట్టు పేర్కొన్నాయి. బొటాబొటి మెజారిటీతో అధికారం దక్కించుకోవచ్చని అభిప్రాయపడ్డాయి. ఈ అంచనాల నేపథ్యంలో అక్కడ చివరికి హంగ్ వచ్చినా ఆశ్చర్యం లేదని పరిశీలకులు భావిస్తున్నారు. ఒక్క యాక్సిస్ మై ఇండియా మాత్రమే జేఎంఎం కూటమి గెలుస్తుందని అంచనా వేసింది. 81 అసెంబ్లీ సీట్లకు గాను దానికి 53 సీట్లొస్తాయని, ఎన్డీఏ కూటమి 25కు పరిమితమవుతుందని పేర్కొంది. మహారాష్ట్రపై తమ అంచనాలను గురువారం ప్రకటించనున్నట్టు సంస్థ తెలిపింది.

మహారాష్ట్ర

మొత్తం స్థానాలు 288
మెజారిటీ మార్కు 145

సంస్థ	మహాయుతి	ఎంవీఏ	ఇతరులు
మాట్రైజ్	150-170	110-130	8-10
చాణక్య	152-160	130-138	6-8
టైమ్స్‌నౌ–జేవీసీ	159	116	
పీమార్క్	137-157	126-146	2-8
ఎలక్టోరల్ ఎడ్జ్	150	121	20
పోల్ డైరీ	122-186	69-121	12-29
పీపుల్స్ పల్స్	182	97	10
దైనిక్ భాస్కర్	125-140	135-150	20-25
లోక్‌పోల్	115-128	151-162	5-14
పోల్ ఆఫ్ పోల్స్	158	125	

జార్ఖండ్

మొత్తం స్థానాలు 81
మెజారిటీ మార్కు 41

సంస్థ	ఎన్డీఏ	ఇండియా	ఇతరులు
యాక్సిస్ మై ఇండియా	53	25	3
మాట్రైజ్	42-47	25-30	4
చాణక్య	45-50	35-38	
టైమ్స్‌నౌ–జేవీసీ	40-44	30-40	
పీపుల్స్ పల్స్	42-48	24-37	
దైనిక్ భాస్కర్	37-40	36-39	0-2
పోల్ ఆఫ్ పోల్స్	42-50	24-37	

సిరియాపై ఇజ్రాయెల్ దాడులు

36 మంది మృతి

డమాస్కస్: సిరియాలో చారిత్రక నేపథ్యమున్న పాల్మెరా పట్టణంపై ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడుల్లో 36 మంది ప్రాణాలు కోల్పోయారు. 50 మందికిపైగా గాయపడ్డారు. చాలా భవనాలు నేలమట్టమయ్యాయి. ఆస్తినష్టం జరిగింది. రోమన్ ఆలయ ప్రాంగణాలకు సమీపంలోనే పాల్మెరా పట్టణముంది. ఇరాన్ దన్నుతో ఎదుగుతున్న మిలిటెంట్ సంస్థల ఆయుధాగారాలు, స్థావరాలపై తరచూ ఇజ్రాయెల్ వైమానిక దాడులకు పాల్పడుతోందని సిరియాలోని సనా వార్తాసంస్థ ప్రకటించింది. అయితే దాడులపై స్పందించేందుకు ఇజ్రాయెల్ సైన్యం నిరాకరించింది.

ఉక్రెయిన్‌లో అమెరికా ఎంబసీ మూసివేత

- కీవ్‌పై దాడులు జరిగే అవకాశం ఉన్నట్లు సమాచారంతో అప్రమత్తం
- ఎంబసీలను తాత్కాలికంగా మూసివేసిన ఇటలీ, స్పెయిన్, గ్రీస్

కీవ్: ఉక్రెయిన్ రాజధాని కీవ్‌లోని తమ రాయబార కార్యాలయాన్ని(ఎంబసీ) అమెరికా బుధవారం ఉదయం మూసివేసింది. కీవ్ నగరంపై రష్యా సైన్యం డ్రోన్లు, క్షిపణులతో దాడికి పాల్పడే అవకాశం ఉన్నట్లు కచ్చితమైన సమాచారం అందడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు అమెరికా అధికారులు వెల్లడించారు. భద్రతాపరమైన కారణాలతో ముందు జాగ్రత్తగా ఎంబసీని తాత్కాలికంగా మూసివేసినట్లు తెలియజేశారు. కీవ్‌లోని తమ పౌరులను అమెరికా ప్రభుత్వం అప్రమత్తం చేసింది. సైరన్లు మోగినప్పుడు సురక్షిత ప్రాంతాలకు చేరుకోవాలని సూచించింది. ఇటలీ, స్పెయిన్, గ్రీస్ దేశాలు సైతం కీవ్‌లోని తమ ఎంబసీలను బుధవారం మూసివేశాయి. యునైటెడ్ కింగ్‌డమ్(యూకే) ఎంబసీ యథాతథంగా పనిచేసింది. మరోవైపు ఉక్రెయిన్–రష్యా యుద్ధానికి మంగళవారం 1,000 రోజులు పూర్తయ్యాయి. రెండు దేశాల మధ్య మళ్లీ ఉద్రిక్తతలు పెరిగిపోయాయి. అమెరికా సరఫరా చేసిన దీర్ఘశ్రేణి క్షిపణులను రష్యాపై ప్రయోగించడానికి ఉక్రెయిన్‌కు జో బైడెన్ ప్రభుత్వం అనుమతి ఇవ్వడం అగ్నికి ఆజ్యం పోసినట్లు అయ్యింది.

రష్యా సైన్యానికి ల్యాండ్ మైన్స్‌తో అడ్డుకట్ట!

- మేమిచ్చిన మందుపాతరలు వాడడానికి ఉక్రెయిన్‌కు అనుమతిస్తాం
- అమెరికా రక్షణ శాఖ మంత్రి లాయిడ్ ఆస్టిన్ వెల్లడి

కీవ్: యుద్ధంలో రష్యాను పూర్తిస్థాయిలో కట్టడి చేయడమే లక్ష్యంగా ఉక్రెయిన్‌కు అమెరికా అండదండలు అందిస్తోంది. అమెరికా అందజేసిన లాంగ్‌రేంజ్ క్షిపణులను రష్యాపై ప్రయోగించడానికి అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ నుంచి ఇప్పటికే అనుమతి లభించింది. దీంతో రష్యా భూభాగంలో సుదూర ప్రాంతంలో ఉన్న లక్ష్యాలపై సులువుగా దాడులు ఉక్రెయిన్‌కు అవకాశం లభించింది. అమెరికా మరో శుభవార్త చెప్పింది. తాము సరఫరా చేసిన యాంటీ పర్సనల్ ల్యాండ్ మైన్స్ ఉపయోగించానికి ఉక్రెయిన్‌కు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వనున్నట్లు అమెరికా రక్షణ శాఖ మంత్రి లాయిడ్ ఆస్టిన్ ప్రకటించారు. ఆయన బుధవారం లావోస్‌లో మీడియాతో మాట్లాడారు. యుద్ధంలో రష్యా సైన్యం వ్యూహం మార్చేస్తుండడంతో ఉక్రెయినవైపు నుంచి కూడా వ్యూహం మార్చక తప్పడం లేదని అన్నారు. రష్యా పదాతి దళాలు మున్ముందుకు చొచ్చుకొస్తున్నాయని చెప్పారు. ఆయా దళాలను నిలువరించాలంటే యాంటీ పర్సనల్ ల్యాండ్ మైన్స్ ఉపయోగించాల్సి ఉంటుందని వెల్లడించారు. ఈ ల్యాండ్ మైన్స్ పెద్దగా ప్రమాదకరం, ప్రాణాంతకం కాదని లాడిన్ ఆస్టిన్ వివరణ ఇచ్చారు. శత్రు సైన్యం కదలికలను నియంత్రించడానికి ఇవి దోహదపతాయని చెప్పారు.

భారత్, చైనా రక్షణ మంత్రుల భేటీ

పరస్పర నమ్మకం మరింత పెంచుకోవాలని నిర్ణయం



న్యూఢిల్లీ: ఆసియాన్ ప్రాంతీయ భద్రతా సదస్సులో భాగంగా వియ త్నాం రాజధాని లావోస్‌లో భారత రక్షణ మంత్రి రాజ్‌నాథ్, చైనా రక్షణ మంత్రి డాంగ్ జున్‌లు బుధవారం భేటీ అయ్యారు. 2020లో తూర్పు లద్దాఖ్‌లో ఇరు సైన్యాల ఘర్షణలు, ఉద్రిక్తతల తర్వాత సన్నగిల్లిన పరస్పర నమ్మకాన్ని మళ్లీ నిలబెట్టుకునేందుకు కృషిచేయాలని ఇరుదేశాల రక్షణ మంత్రులు నిర్ణయించారు. తూర్పు లద్దాఖ్‌లో రెండు దేశాల సైనికులు వేలాదిగా మొహరించి నెలల తరబడి ఉద్రిక్తతలు కొనసాగి ఇటీవల సైనికుల ఉపసంహరణ మొదలైన వేళ జరిగిన ఈ భేటీ ప్రాధాన్యత సంతరించుకుంది. పరస్పర విశ్వాసం, నమ్మకం పెంపొందించుకునేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించేందుకు ప్రణాళికలు రూపొందించాల్సి ఉందని భారత రక్షణ శాఖ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొంది. జీ20 శిఖరాగ్ర సదస్సు సందర్భంగా బ్రెజిల్‌లోని రియో డీ జనీరో సిటీలో భారత విదేశాంగ మంత్రి జైశంకర్, చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీలు సోమవారం భేటీ అయిన తర్వాత మరో దేశంలో భారత్, చైనా అత్యున్నతస్థాయి నేతలు భేటీకావడం గమనార్హం. '' భారత్, చైనా చిరకాలం పొరుగుదేశాలుగా మసులుకోవాల్సిందే. అందుకే పొరుగుదేశాల మధ్య ఘర్షణ కంటే గణనీయ సహకారం ప్రధానం. బలగాల ఉపసంహరణతో పరస్పర నమ్మకం పాదుకొల్పుదాం'' అని రాజ్‌నాథ్ సింగ్ వ్యాఖ్యానించారు.

ప్రశాంతంగా మహారాష్ట్ర ఎన్నికలు

60 శాతం ఓటింగ్ నమోదు ● ఓటు హక్కు వినియోగించుకున్న పలువురు ప్రముఖులు

ముంబై/రాంచీ: మహారాష్ట్ర శాసనసభ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. మొత్తం 288 స్థానాల్లో బుధవారం ఒకే విడతలో పోలింగ్ నిర్వహించారు. కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టడంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోలేదు. సాయంత్రం 5 గంటలకల్లా 60 శాతం ఓటింగ్ నమోదైంది. నక్సల్స్ ప్రభావిత గడ్చిరోలీ జిల్లాలో 69.63 శాతం, ముంబైలో 51.41 శాతం ఓటింగ్ నమోదైనట్లు ఎన్నికల సంఘం అధికారులు ప్రకటించారు. ఈసారి రాష్ట్రవ్యాప్తంగా 1,00,186 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. 4,100 మంది అభ్యర్థులు పోటీపడ్డారు. బాలీవుడ్ నటులు షారుక్ ఖాన్, సల్మాన్ ఖాన్, అక్షయ్ కుమార్, రణబీర్ కపూర్, రితేశ్ దేశ్‌ముఖ్, జెనీలియా తదితరులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్ భగవత్ నాగపూర్‌లో ఓటు వేశారు. శివసేన(యూబీటీ) అధ్యక్షుడు ఉద్ధవ్ ఠాక్రే తన మేనల్లుడికి, మహారాష్ట్ర నవనిర్మాణ సేన(ఎంఎన్ఎస్) అధ్యక్షుడు రాజ్ ఠాక్రే తన కుమారుడికి ఓటు వేయడం విశేషం. మాహిమ్‌లో రాజ్ ఠాక్రే తనయుడు అమిత్ ఠాక్రే పోటీ చేస్తున్నారు. బాంద్రా ఈస్ట్ స్థానంలో ఉద్ధవ్ ఠాక్రే మేనల్లుడు వరుణ్ సర్దేశాయ్ పోటీకి దిగారు. రాష్ట్రంలో ఈ నెల 23న ఎన్నికల ఫలితాలు వెలువడుతాయి. మరోవైపు ఉత్తర ప్రదేశ్, పంజాబ్, కేరళ, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో 15 అసెంబ్లీ నియోజకవర్గాల్లో కూడా బుధవారం ఉప ఎన్నికలు నిర్వహించారు.

స్వతంత్ర అభ్యర్థి మృతి

మహారాష్ట్ర ఎన్నికల్లో బీడ్ అసెంబ్లీ స్థానం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగిన బాలా సాహెబ్ షిండే(43) బుధవారం మృతిచెందారు. ఒకవైపు పోలింగ్ కొనసాగుతుండగానే ఆయన ప్రాణాలు కోల్పోవడం స్థానికంగా విషాదం సృష్టించింది. బీడ్ పట్టణంలోని ఛత్రపతి సాహూ విద్యాలయ పోలింగ్ బూత్‌లో మధ్యాహ్నం 2 గంటల సమయంలో ఆయన ఒక్కసారిగా కుప్పకూలారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాలు విడిచారు.

జార్ఖండ్ రెండో విడతలో 67.59 శాతం ఓటింగ్

జార్ఖండ్‌లో రెండో/చివరి విడత అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. రెండో విడతలో భాగంగా బుధవారం 38 నియోజకవర్గాల్లో పోలింగ్ నిర్వహించారు. సాయంత్రం 5 గంటలవరకు 67.59 శాతం ఓటింగ్ నమోదైనట్లు ఎన్నికల సంఘం అధికారులు ప్రకటించారు. మొత్తం 12 జిల్లాల్లో 14,218 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు. ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభమైంది. కొన్ని సమస్యాత్మక కేంద్రాల్లో సాయంత్రం 4 గంటలకే పోలింగ్ ప్రక్రియను ముగించారు. మిగిలిన కేంద్రాల్లో సాయంత్రం 5 గంటల దాకా పోలింగ్ కొనసాగింది. సమయం ముగిసినప్పటికీ వరుసులో నిల్చున్నవారికి ఓటు వేసే అవకాశం కల్పించారు. జాంతారా జిల్లాలో అత్యధికంగా 76.16 శాతం ఓటింగ్ నమోదైంది. బొకారో జిల్లాలో అతి తక్కువగా 60.97 శాతం ఓటింగ్ నమోదైంది. జార్ఖండ్‌లో జరుగుతున్న ప్రజాస్వామ్య వేడుకలో ఓటర్లంతా ఉత్సాహంగా పాల్గొనాలని ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం ఉదయం పిలుపునిచ్చారు. ప్రజలు వేసే ప్రతి ఓటు రాష్ట్రాన్ని మరింత బలోపేతం చేయడానికి తోడ్పడుతుందని చెప్పారు. జార్ఖండ్‌లో ఈ నెల 13న తొలి విడత పోలింగ్ జరిగిన సంగతి తెలిసిందే. ఈ నెల 23న ఫలితాలు వెల్లడి కానున్నాయి.



బుధవారం నాగపూర్‌లో ఓటేశాక ఆనందంతో వేలిపై గుర్తు చూపిస్తున్న తొలిసారి ఓటర్లు

గయానాతో 10 ఒప్పందాలు

ప్రధాని మోదీకి అపూర్వ స్వాగతం ● అధ్యక్షుడు ఇర్ఫాన్ అలీతో భేటీ

జార్జిటౌన్: పలు రంగాల్లో ద్వైపాక్షిక బంధాన్ని మరింత బలోపేతం చేసుకోవాలని భారత్, గయానా నిర్ణయించాయి. వ్యవసాయం, హైడ్రోకార్బన్లు మొదలుకుని ఫార్మా, డిజిటల్ పేమెంట్ల దాకా 10 రంగాల్లో కీలక ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. సైనికంగా గయానాకు కీలక మద్దతు అందజేస్తామని ప్రధాని నరేంద్ర మోదీ హామీ ఇచ్చారు. మూడు దేశాల పర్యటనలో భాగంగా బుధవారం గయానా చేరుకున్న ఆయనకు అపూర్వ స్వాగతం పలికింది. జార్జిటౌన్ విమానాశ్రయంలో అధ్యక్షుడు ఇర్ఫాన్ అలీ, పలువురు మంత్రులు మోదీని స్వయంగా స్వాగతించారు. గత 56 ఏళ్లలో అక్కడ పర్యటించిన తొలి భారత ప్రధానిగా మోదీ నిలిచారు. తన పర్యటనతో ఇరు దేశాల మైత్రీ బంధం సుదృఢమవుతుందని ఆయన ఆశాభావం వెలిబుచ్చారు. గయానాలో జన్ ఔషధీ కేంద్రం ఏర్పాటుకు కూడా నిర్ణయం జరిగింది. పలు ప్రాంతీయ, అంతర్జాతీయ అంశాలపై నేతలిద్దరూ లోతుగా చర్చించారు. ఇరు దేశాల సంబంధాల్లో మోదీ పర్యటన ఒక మైలురాయిగా నిలిచిపోతుందని ఇర్ఫాన్ అలీ అన్నారు. ఆయన్ను నేతల్లో చాంపియన్‌గా అభివర్ణించారు. మోదీ పాలన తీరు అద్భుతమన్నారు. భేటీ అనంతరం నేతలిద్దరూ మొక్కలు నాటారు. గయానా, గ్రెనెడా, బార్బడోస్ ప్రధానులు కూడా మోదీతో భేటీ అయ్యారు. తర్వాత గయానాలోని భారతీయులతో ప్రధాని భేటీ అయ్యారు. 185 ఏళ్ల కింద అక్కడికి వలస వెళ్లిన భారతీయులు ఇప్పటికీ దేశ పతాకను సగర్వంగా రెపరెపలాడిస్తున్నారంటూ ప్రశంసించారు. గయానాలో 3.2 లక్షల మందికి పైగా ఎన్నారైలున్నారు.



మోదీతో గయానా అధ్యక్షుడు ఇర్ఫాన్ అలీ

ఫిబ్రవరి 15 నుంచి సీబీఎస్ఈ 10, 12 తరగతి పరీక్షలు

న్యూఢిల్లీ: సీబీఎస్ఈ 10వ, 12వ తరగతి బోర్డు పరీక్షలు వచ్చే ఏడాది ఫిబ్రవరి 15వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు సీబీఎస్ఈ బుధవారం ప్రకటించింది. పదో తరగతి పరీక్షలు మార్చి 18వ తేదీన ముగియ నున్నాయి. 12వ తరగతి పరీక్షలు ఏప్రిల్ నాలుగో తేదీన ముగియనున్నాయి. సీబీఎస్ ఈ 86 రోజుల ముందుగానే బోర్డ్ పరీక్షల తేదీలను ప్రకటించడం ఇదే తొలిసారి. '' ప్రతి రెండు సబ్జెక్ట్ పరీక్షల మధ్య సరిపోను వ్యవధి ఉండేలా చూశాం. 40,000 సబ్జెక్ట్ కాంబినేషన్లను దృష్టిలో ఉంచుకుని పరీక్ష తేదీల ను సిద్ధంచేశాం.


అత్యుత్తమ సిటీ లండన్

లండన్: ప్రపంచంలో అత్యుత్తమ నగరాల జాబితాలో వరసగా పదోసారి లండన్ అగ్రస్థానంలో నిలిచింది. తర్వాత టాప్–10 స్థానాల్లో న్యూయార్క్, పారిస్, టోక్యో, సింగపూర్, రోమ్, మాడ్రిడ్, బార్సిలోనా, బెర్లిన్, సిడ్నీ నిలిచాయి. 2025 ఏడాదికి సంబంధించిన టాప్–100 జాబితాలో అత్యధికంగా అమెరికాలోని 36 నగరాలు స్థానం సంపాదించడం విశేషం. అయితే కనీసం టాప్–100 కూడా భారతీయ నగరాలకు చోటు దక్కకపోవడం విచారకరం. సహజసిద్ధ వాతావరణం, ఇక్కడే జీవించాలనేంతగా జీవన అనుకూల పరిస్థితులు, సంప్రదాయాలు, రాత్రి జీవితం తదితరాలను పరిగణనలోకి తీసుకుని రీసోనెన్స్ కన్సల్టెన్సీ, ఇప్సోస్‌లు సంయుక్తంగా 2025 ఏడాదికి అత్యుత్తమ నగరాల జాబితాను సిద్ధంచేశాయి.

స్టార్‌షిప్ ప్రయోగం పాక్షికంగా విజయవంతం

- బూస్టర్ క్యాచింగ్ ప్రక్రియ చివరి క్షణంలో నిలిపివేత
- గల్ఫ్ ఆఫ్ మెక్సికో జలాల్లో కూలిపోయిన బూస్టర్





ట్రంప్‌తో మస్క్

టెక్సాస్: చంద్రుడితోపాటు అంగారక గ్రహంపై భవిష్యత్తులో చేపట్టబోయే ప్రయోగాల కోసం స్పేస్ ఎక్స్ సంస్థ అభివృద్ధి చేస్తున్న 'స్టార్‌షిప్' రాకెట్‌కు సంబంధించిన ఆరో ప్రయోగాన్ని మంగళవారం టెక్సాస్‌లో నిర్వహించారు. ఇందులో ఒక దశ విఫలం కాగా, మరో దశ విజయవంతమైంది. అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్‌తోపాటు స్పేస్‌ఎక్స్ అధినేత ఎలాన్ మస్క్ ఈ ప్రయోగాన్ని స్వయంగా వీక్షించారు. దాదాపు 400 అడుగుల(121 మీటర్లు) పొడవైన స్టార్‌షిప్ రాకెట్‌ను స్థానిక కాలమానం ప్రకారం మంగళవారం సాయంత్రం 5 గంటలకు స్పేస్‌ఎక్స్ లాంచ్‌ప్యాడ్ నుంచి ప్రయోగించారు. ఇందులోని 33 శక్తివంతమైన రాప్టర్ ఇంజన్లను మండించడంతో స్టార్‌షిప్ స్పేస్‌క్రాఫ్ట్ అంతరిక్షంలోకి దూసుకెళ్లింది. కొద్ది సేపటి తర్వాత స్పేస్‌క్రాఫ్ట్ నుంచి సూపర్ హెవీ బూస్టర్ విజయవంతంగా విడిపోయింది. భూమివైపు తిరుగు ప్రయాణం ఆరంభించింది. షెడ్యూల్ ప్రకారం మళ్లీ లాంచ్‌సైట్ వద్దకే చేరుకోవాలి. అక్కడున్న మర చేతులు బూస్టర్‌ను జాగ్రత్తగా ఒడిసిపట్టుకోవాలి. కానీ, ఇంతలో సాంకేతిక సమస్య ఎదురుకావడంతో బూస్టర్ క్యాచింగ్ ప్రక్రియను నిలిపివేశారు. బూస్టర్‌ను నింగిలోనే దారి మళ్లించారు. దాంతో అది గల్ఫ్ ఆఫ్ మెక్సికో జలాల్లో కూలిపోయింది. ఖాళీగా ఉన్న స్టార్‌షిప్ స్పేస్‌క్రాఫ్ట్ మాత్రం షెడ్యూల్ ప్రకారమే 90 నిమిషాలపాటు భూమిచుట్టూ చక్కర్లుకొట్టింది. చివరకు హిందూ మహాసముద్రంలో సురక్షితంగా ల్యాండైంది. స్టార్‌షిప్ రాకెట్‌ప్రయోగ దృశ్యాలను స్పేస్ ఎక్స్ సంస్థ సోషల్ మీడియాలో పోస్టు చేసింది. గత నెలలో చేపట్టిన స్టార్‌షిప్ ఐదో ప్రయోగం విజయవంతమైన సంగతి తెలిసిందే. లాంచ్ సైట్ వద్దకు బూస్టర్ క్షేమంగా తిరిగొచ్చింది. మర చేతులు దాన్ని జాగ్రత్తగా అందుకున్నాయి. ఈ ప్రయోగం ద్వారా స్పేస్‌ఎక్స్ సంస్థ చరిత్ర సృష్టించింది.

సాక్షి హైదరాబాద్

గురువారం । 21 । నవంబర్ । 2024



స్టాక్ లేదు!
విద్యుత్ పరికరాలు కోసం రూ.లక్షల చొప్పున డీడీలు చెల్లించిన అనేక మంది గృహ, వాణిజ్య, పారిశ్రామిక వినియోగదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. -8లో



నేచర్ లవర్స్
వ్యాయామం, జాగింగ్, ఫిట్‌నెస్‌పై నగరవాసులు ఆసక్తి చూపిస్తున్నారు. ఇటీవల కాలంలో ఫిట్‌నెస్ కోసం సహజ వాతావరణాన్ని కోరుకుంటున్నారు. - సిటీప్లస్‌లో

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం 29.0/15.0
నగరంలో గురువారం ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉదయం పొగమంచు వాతావరణం ఉంటుంది. గరిష్ఠంగా 29, కనిష్ఠంగా 15 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

భూ సమీకరణకు సై!

- ఇక్కడ రక్షణ శాఖకు 221 ఎకరాలు; పట్టా భూములు 29 ఎకరాలు
- మూసీ పరీవాహక ప్రాంతంలో 70 ఎకరాలు
- ఆయా స్థలాల సేకరణకు ఎంఆర్‌డీసీఎల్ నిర్ణయం
- అపార్ట్‌మెంట్లు, వాణిజ్య భవనాల కూల్చివేత
- పరిహారంగా వేరే చోట స్థలం లేదా అపార్ట్‌మెంట్ల నిర్మాణం
- డిఫెన్స్ స్కూల్ మినహా మైదానం, శిక్షణ కేంద్రాల తరలింపు

బాపూఘాట్ వద్ద మూసీ సుందరీకరణకు నిర్ణయం

సాక్షి, సిటీబ్యూరో: మూసీ పునరుజ్జీవం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంకల్పించారు. హైదరాబాద్ రూపురేఖలు మార్చే విధంగా నదీ పరీవాహక ప్రాంతం అభివృద్ధి చేయాలని మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎంఆర్‌డీసీఎల్) నిర్ణయించింది. తొలుత బాపూఘాట్ వద్ద మూసీ సుందరీకరణ పనులు చేపట్టనున్నారు. ఇప్పటికే ఎంఆర్‌డీసీఎల్, రెవెన్యూ, రక్షణ శాఖ అధికారుల సంయుక్తంగా సర్వే నిర్వహించారు. బాపూఘాట్ వద్ద కేంద్ర రక్షణ శాఖకు చెందిన 221 ఎకరాలు, ప్రైవేట్ వ్యక్తుల పట్టా భూములు 39 ఎకరాలు, మూసీ పరీవాహక ప్రాంతంలో మరో 70 ఎకరాలు ఉన్నట్లు గుర్తించారు. దీంతో మూసీ అభివృద్ధి పనుల కోసం ఆయా భూములను సమీకరించాలని ఎంఆర్‌డీసీఎల్ అధికారులు నిర్ణయించారు.

- ఉస్మాన్‌సాగర్ నుంచి బాపూఘాట్ వరకు 11.5 కి.మీ. హిమాయత్‌సాగర్ నుంచి బాపూఘాట్ వరకు ఉన్న 8.5 కి.మీ. మూసీ నదీ సుందరీకరణకు అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. మూసీ పునరుజ్జీవానికి సంబంధించి డీపీఆర్ రూపొందించే బాధ్యతను సింగపూర్ సంస్థ మన్ హార్ట్ సంస్థకు ప్రభుత్వం అప్పగించింది. ఈ సంస్థ తొలిదశలో బాపూఘాట్ వరకు 21కి.మీ. మేర నదీ సుందరీకరణపై డీపీఆర్‌ను అందించనుంది. ఆ తర్వాతే ఈ ప్రాంత అభివృద్ధిపై ఎంఆర్‌డీసీఎల్ ముందడుగు వేయనుంది.

డిఫెన్స్ స్కూల్ మినహా మిగిలినవి వేరే చోటకు..

బాపూఘాట్ వద్ద రక్షణ శాఖకు 221 ఎకరాలు భూములుండగా.. ఇందులో రంగారెడ్డి జిల్లాలో 171, హైదరాబాద్ జిల్లాల్లో 50 ఎకరాలు కేంద్రీకృతమై ఉన్నాయి. ఈ ప్రాంతంలో రక్షణ శాఖ పాఠశాల, మైదానం, శిక్షణ సంస్థలున్నాయి. వీటిలో పాఠశాల మినహా గ్రౌండ్, శిక్షణ కేంద్రాలను వేరే చోటుకు తరలించేందుకు ఎంఆర్‌డీసీఎల్ అధికారులు నిర్ణయించారు. ఈ ప్రతిపాదనకు డిఫెన్స్ అధికారులు సూత్రప్రాయంగా అంగీకరించినట్లు తెలిసింది. బాపూఘాట్ వద్ద ప్రభుత్వానికి 34 ఎకరాల భూములుండగా.. ఇందులో 27 ఎకరాలు బాపూఘాట్‌వి.. 7 ఎకరాలు పర్యాటక శాఖవి. ఆయా భూములు రాష్ట్ర ప్రభుత్వ అధీనంలోనే ఉండటంతో వీటి సమీకరణకు ఇబ్బందులుండవు.

అపార్ట్‌మెంట్ల కూల్చివేత అనివార్యం..

బాపూఘాట్ వద్ద ప్రైవేట్ వ్యక్తులకు చెందిన పట్టా భూములు 39 ఎకరాలున్నాయి. వీటిని ప్రభుత్వం సమీకరించాల్సి ఉంది. ఆయా భూముల్లో అపార్ట్‌మెంట్లు, వ్యక్తిగత గృహాలు, వాణిజ్య సముదాయాలున్నాయి. టిప్పుఖాన్ వంతెన సమీపంలో 5 అంతస్తులలో 440 అపార్ట్‌మెంట్లు భవనం ఉంది. దీన్ని కూల్చడం అనివార్యమని ఎంఆర్‌డీసీఎల్ అధికారి ఒకరు తెలిపారు. పరిహారంగా వేరే చోట స్థలాలు ఇవ్వడం లేదా గేటెడ్ కమ్యూనిటీలో 5 అంతస్తుల భవనాన్ని నిర్మించి ఇవ్వడం, ఇతర ప్రత్యామ్నాయాలను యంత్రాంగం పరిశీలిస్తోంది.



ఎవరికి ఎన్ని భూములు?

- కేంద్ర రక్షణ శాఖ: 221 ఎకరాలు రంగారెడ్డి జిల్లా పరిధిలో 171, హైదరాబాద్ జిల్లా పరిధిలో 50 ఎకరాలు
- రాష్ట్ర ప్రభుత్వం: 34 ఎకరాలు ఇందులో బాపూఘాట్‌కు చెందినవి 27 ఎకరాలు; రాష్ట్ర పర్యాటక శాఖకు చెందినవి 7 ఎకరాలు
- ప్రైవేట్ వ్యక్తులకు చెందిన పట్టా భూములు: 39 ఎకరాలు
- మూసీ పరివాహక ప్రాంతం: 70 ఎకరాలు

సర్టిఫికెట్ల ధ్రువీకరణ

ప్రహసనమేమీ కాదు





హైదరాబాద్‌లోనే అటెస్టేషన్, అపోస్టిల్‌లు

- ఇమ్మిగ్రేషన్ ప్రక్రియలో అత్యంత కీలకం
- ఇప్పటికీ అనేక మంది ఢిల్లీ వరకు పయనం
- సేవలు వినియోగించుకోండి
- రీజినల్ పాస్‌పోర్టు అధికారి స్నేహజ

సాక్షి, సిటీబ్యూరో:

విద్య, ఉద్యోగం సహా వివిధ వీసాలపై విదేశాలకు వెళ్లే వారికి ఇమ్మిగ్రేషన్ ప్రక్రియలో ఆయా సర్టిఫికెట్ల ధ్రువీకరణ అత్యంత కీలకం, అనివార్యం. సాంకేతికంగా అటెస్టేషన్, అపోస్టిల్‌గా పిలిచే ఈ ప్రక్రియ పెద్ద ప్రహసనం అనే భావన అనేకమందిలో ఉంది. ఈ కారణంగానే ఏజెంట్లను ఆశ్రయించి అధిక మొత్తం చెల్లించడమో, ఢిల్లీ వరకు వెళ్లి దీన్ని పూర్తి చేసుకోవడమో జరుగుతోంది. అయితే.. హైదరాబాద్ రీజినల్ పాస్‌పోర్టు కార్యాలయం అధీనంలో ఉన్న బ్రాంచ్ సెక్రటేరియట్ ఈ ప్రక్రియల్ని చేపడుతుందని రీజినల్ పాస్‌పోర్టు ఆఫీసర్ (ఆర్పీఓ) జొన్నలగడ్డ స్నేహజ పేర్కొన్నారు. ఈ అంశానికి సంబంధించి ఆమె బుధవారం 'సాక్షి'తో మాట్లాడారు.

తెలుగు రాష్ట్రాలకు ఒకే బ్రాంచ్ సెక్రటేరియట్

విదేశాలకు వెళ్లి ఉద్యోగం చేయాలంటే విద్యార్హత పత్రాలతో పాటు జనన, వివాహ ధ్రువీకరణ పత్రాలతో పాటు వ్యాపార, వాణిజ్య సంబంధం అంశాల్లో కమర్షియల్ డాక్యుమెంట్లు సైతం అటెస్టేషన్, అపోస్టిల్ అనివార్యం. ఈ ధ్రువీకరణ ప్రక్రియ పూర్తి అయితేనే ఆయా దేశాల్లో ఆ సర్టిఫికెట్లు చెల్లుబాటవుతాయి. దరఖాస్తుదారులు సమర్పించే పత్రాలను పరిశీలించి, సరిచూసి అవి సరైనవే అంటూ సర్టిఫై చేయడాన్నే అటెస్టేషన్, అపోస్టిల్ అంటారు. ఇందులో భాగంగా ఆయా ధ్రువపత్రాలకు వెనక అపోస్టిల్ స్టిక్కర్‌తో పాటు స్టాంపు, సంతకం చేస్తారు. ఈ సేవల్ని అందించడం కోసం కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ (ఎంఈఏ) దేశ వ్యాప్తంగా బ్రాంచ్ సెక్రటేరియట్లను నిర్వహిస్తోంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లకు సంబంధించింది సికింద్రాబాద్‌లోని రీజినల్ పాస్‌పోర్టు కార్యాలయం అధీనంలో ఉంది.

దరఖాస్తులను సచివాలయాల్లో సమర్పించాలి

ధ్రువీకరణ ప్రక్రియల్ని ఆర్పీఓ అధీనంలోని బ్రాంచ్ సెక్రటేరియట్ చేస్తున్నప్పటికీ.. దరఖాస్తుదారులు మాత్రం నేరుగా సంప్రదించే అవకాశం లేదు. ఆయా రాష్ట్ర సచివాలయాల్లోని సాధారణ పరిపాలన శాఖ (జీఏడీ) ఆధ్వర్యంలో పని చేసే కౌంటర్లలోనే పత్రాలు సమర్పించాల్సి ఉంటుంది. దీనికి ముందు మీ సేవ, ఆన్‌లైన్ విధానాల్లో నిర్దేశిత రుసుము చెల్లించి, స్లాట్ బుక్ చేసుకోవాలి. ఆ విభాగం అధికారులు ఆయా సర్టిఫికెట్లు జారీ చేసిన విద్యా సంస్థ, ప్రభుత్వ విభాగం, చాంబర్లను సంప్రదించి వాటి విశ్వసనీయతను నిర్ధారించే జీఏడీ సిబ్బంది అథంటికేట్ అంటూ స్టాంప్ వేసి, సంతకం చేసి దరఖాస్తుదారుకు తిరిగి ఇస్తారు. ఈ ప్రక్రియలోనూ సాధారణ, తత్కాల్ అనే విధానాలు అమలులో ఉన్నాయి. ఆపై దరఖాస్తుదారు ఎంఈఏ అధీకరణతో పని చేసే ఏజెన్సీల ద్వారా ఈ సర్టిఫికెట్లను ఆర్పీఓ బ్రాంచ్ సెక్రటేరియట్‌కు పంపాల్సి ఉంటుంది.

అదే రోజు ధ్రువీకరణ ప్రక్రియ పూర్తి

రాష్ట్ర ప్రభుత్వం అధీనంలో ఉండే జీఏడీ నుంచి ఆర్పీఓలోని బ్రాంచ్ సెక్రటేరియట్‌కు అధీకృత అధికారుల వివరాలను చేరతాయి. వీరి వివరాలు, సంతకాలు, స్టాంపులను ఆయా ఏజెన్సీల నుంచి వచ్చిన దరఖాస్తుదారు సర్టిఫికెట్లపై ఉన్న వాటితో సరిచూస్తారు. అన్నీ సరిపోలితే అటెస్టేషన్, అపోస్టిల్ ప్రక్రియ పూర్తి చేస్తారు. ఈ సర్టిఫికెట్లు మళ్లీ ఏజెన్సీ ద్వారానే దరఖాస్తుదారుడికి చేరతాయి.

ఇక్కడ చదివిన విదేశీ విద్యార్థులకూ తప్పనిసరి..



కేవలం భారత్ నుంచి విదేశాలకు వెళ్లే వారికే కాదు.. ఆయా దేశాల నుంచి వచ్చి, ఇక్కడ విద్యనభ్యసించి తిరిగి వెళ్లే వారికీ అటెస్టేషన్, అపోస్టిల్ అనివార్యం. అప్పుడు ఇక్కడి విద్యా సంస్థలు జారీ చేసిన సర్టిఫికెట్లు అక్కడ చెల్లుబాటు అవుతాయి. ఎంఈఏ అధీకరణతో పని చేసే ఏజెన్సీల వివరాల కోసం వెబ్‌సైట్‌ను (www.mea.gov.in/ apostille.htm) సందర్శించాలి. అలాగే అటెస్టేషన్, అపోస్టిల్ అంశాల్లో ఇబ్బందులు ఉంటే ఈ-మెయిల్ ఐడీ (hobs.hyderabad@mea.gov.in) ద్వారా సంప్రదించాలి. ప్రస్తుతం ప్రతి నెలా 200 వరకు దరఖాస్తులు వస్తున్నాయి. - జొన్నలగడ్డ స్నేహజ, రీజినల్ పాస్‌పోర్టు ఆఫీసర్

యూఏఈ, సౌదీ వంటి దేశాలు అటెస్టేషన్‌ను, హెగ్ కన్వెన్షన్‌లో ఉన్న మిగిలిన 126 దేశాలు అపోస్టిల్‌ను అంగీకరిస్తున్నాయి. బ్రాంచ్ సెక్రటేరియేట్ అటెస్టేషన్‌ను ఉచితంగా, అపోస్టిల్‌ను ఒక్కో పత్రానికి రూ.50 చొప్పున వసూలు చేసి పూర్తి చేస్తోంది. ఏజెన్సీ మాత్రం సర్వీస్ చార్జీగా ఒక్కో పత్రానికి రూ.84 (స్కానింగ్ ఫీజు రూ.3 అదనం) తీసుకునేందుకు ఎంఈఏ అనుమతిచ్చింది. బ్రాంచ్ సెక్రటేరియట్ ఒకసారి చేసిన అటెస్టేషన్, అపోస్టిల్ జీవితకాలం చెల్లుబాటు అవుతుంది.

ఆదర్శప్రాయులు చుక్కా రామయ్య



చుక్కా రామయ్య పుస్తకాలను ఆవిష్కరిస్తున్న అధ్యాపకులు

లక్డీకాపూల్ : విద్యారంగంలో బోధకులకు, సాధకులకు ప్రముఖ విద్యావేత్త చుక్కా రామయ్య ఆదర్శప్రాయులని పలు కళాశాల ప్రిన్సిపాళ్లు పేర్కొన్నారు. రామయ్య 98వ జన్మ దినోత్సవం సందర్భంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని 50 కాలేజీల్లో ఆయన రాసిన విద్యారంగ పుస్తకాల ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించినట్లు ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్ల సంఘం నేత కేఎస్ రామారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి పాఠం, ఓనమాలు, జ్ఞాపకాలు, నడక, బడి పంతుళ్లకు రాజకీయాలు, లెక్కలతో నా ప్రయోగాలు పుస్తకాలను ఆవిష్కరించారన్నారు. ఈ సందర్భంగా అధ్యాపకులు ఐఐటీ కోసం రామయ్య చేసిన కృషిని విద్యార్థులకు వివరించారు. తెలంగాణ మట్టి గర్వించదగ్గ విద్యావేత్తను గుర్తు చేసుకోవడం తెలంగాణ సమాజం బాధ్యతగానే భావిస్తోందన్నారు. జీవితకాలం తరగతి గదికే తనను అంకితం చేసుకున్న ధన్యజీవి చుక్కా రామయ్య అని ఆయన పేర్కొన్నారు.

ఏసీబీకి చిక్కిన ఇద్దరు ఎస్‌ఎఫ్‌ఏలు



లంచం డబ్బులతో పట్టుబడిన ఎస్‌ఎఫ్‌ఏలు సలీంఖాన్, రమేష్

బంజారాహిల్స్: జీహెచ్‌ఎంసీ జూబ్లీహిల్స్ సర్కిల్ -18 పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న ఇద్దరు శానిటరీ ఫీల్డ్ అసిస్టెంట్లు అవినీతి నిరోధక శాఖకు చిక్కారు. ఫీల్డ్ అసిస్టెంట్లు సలీంఖాన్, రమేష్‌లు ఓ కాఫీ షాప్‌నకు సంబధించి నిబంధనలు సరిగా పాటించడం లేదని, భారీ మొత్తంలో చెల్లించాలంటూ యజమానితో పేర్కొన్నారు. జరిమానా అవసరం లేకుండా చేయాలంటే తమకు రూ.60,000 ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆ మేరకు రూ.25 వేలు ఇస్తానని కాఫీ షాప్ యజమాని అంగీకరించారు. ఈ క్రమంలో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించగా.. రూ.25,000 కరెన్సీ నోట్లకు రసాయనాలను చల్లి పంపించారు. ఆ డబ్బును నేరుగా తీసుకువెళ్లి సదరు ఫీల్డ్ అసిస్టెంట్లకు బాధితుడు ఇచ్చారు. అదే సమయంలో ఏసీబీ అధికారులు చేరుకుని కెమికల్ టెస్ట్ నిర్వహించగా వారిద్దరి వేలి ముద్రలు ఉండడంతో అరెస్టు చేసి ఏసీబీ కోర్టులో హాజరుపర్చారు. ఎవరైనా లంచం అడిగితే 1064 టోల్‌ఫ్రీ నంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఏసీబీ అధికారులు సూచించారు.

నేటి నుంచి లోక్‌మంథన్

సాక్షి, సిటీబ్యూరో: నగరం వేదికగా నిర్వహిస్తున్న లోక్‌మంథన్ కార్యక్రమాన్ని గురువారం ఉదయం 10 గంటలకు మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు ప్రారంభించనున్నారు. ఈ నెల 24 వరకు లోక్ మంథన్- 24 భాగ్యనగర్ పేరిట ఉత్సవాలు నిర్వహించనున్నారు. 2016లో భోపాల్, 2018లో రాంచి, 2022లో గౌహతిలో ఈ ఉత్సవాలు జరిగాయి. 21న ప్రారంభోత్సవాల్లో భాగంగా ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి. 100కు పైగా కళలు, 1,500 మంది కళాకారులు పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు.

రియాక్టర్ పేలి కార్మికుడి దుర్మరణం

మరో ముగ్గురికి తీవ్ర గాయాలు

- వీరిలో ఇద్దరి పరిస్థితి విషమం
- జీడిమెట్లలోని అరోర్ పరిశ్రమలో ప్రమాదం
- అనుభవం లేని వారితో పనులు చేయిస్తున్న యాజమాన్యం



అనిల్‌కుమార్ యాదవ్ (ఫైల్)

జీడిమెట్ల: జీడిమెట్లలోని అరోర్ ఫార్మాస్యూటికల్స్ పరిశ్రమలో రియాక్టర్ శుభ్రపరుస్తుండగా రసాయన చర్య జరిగి భారీ పేలుడు సంభవించడంతో ఓ కార్మికుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ముగ్గురు కార్మికులకు తీవ్ర గాయాలయ్యాయి. జీడిమెట్ల ఫైర్ ఇన్‌స్పెక్టర్, సూరారం ఇన్‌స్పెక్టర్ చెప్పిన వివరాల ప్రకారం.. బుధవారం ఉదయం 6 గంటల సమయంలో మొదటి షిఫ్ట్ డ్యూటీకి కార్మికులు అరోర్ పరిశ్రమలోకి వెళ్లారు. ఉదయం 11 గంటల ప్రాంతంలో సూరారం కాలనీకి చెందిన అనిల్‌కుమార్ యాదవ్ (42) అనే కార్మికుడు పరిశ్రమలోని ఓ రియాక్టర్‌ను సాల్వెంట్స్‌తో శుభ్రపరుస్తున్నాడు. ఈ క్రమంలో ఒక్కసారిగా భారీ పేలుడు సంభవించింది. పేలుడు ధాటికి అనిల్‌కుమార్ యాదవ్ అక్కడికక్కడే మృతి చెందాడు. అక్కడే ఉన్న మరో ముగ్గురు కార్మికులు గోపి, శ్రీనివాస్, బలరాంలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను పరిశ్రమ యాజమాన్యం సికింద్రాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించింది. వీరిలో ఇద్దరు కార్మికుల పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

సమాచారం ఇవ్వకుండా మృతదేహాన్ని ఎందుకు తరలించినట్టు?

మృతుడి బంధువులకు, పోలీసులకు సమాచారం ఇవ్వకుండానే పరిశ్రమ యాజమాన్యం అనిల్‌కుమార్ మృతదేహాన్ని ప్రమాద స్థలి నుంచి తరలించారు. విషయం తెలుసుకున్న సూరారం ఇన్‌స్పెక్టర్, ఫైర్ అధికారి శేఖర్ రెడ్డి పరిశ్రమ లోపలికి వెళ్లారు. తమకు సైతం యాజమాన్యం ఎలాంటి వివరాలు తెలపలేదని వారు చెప్పారు. ప్రమాదానికి అసలు కారణమేంటి? ఎలా జరిగింది? అని మృతుడి బంధువులకు పరిశ్రమ యాజమాన్యం ఎలాంటి సమాధానం చెప్పకపోవడంతో అతడి బంధువులు పరిశ్రమ యాజమాన్యంపై ఓ దశలో గొడవకు దిగారు. అనిల్‌కుమార్ యాదవ్‌కు భార్య సునీత, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని బంధువులు పరిశ్రమ యాజమాన్యాన్ని డిమాండ్ చేస్తున్నారు.

ఇదే పరిశ్రమలో గత ఏడాది ఇద్దరు కార్మికుల మృతి

ఇదే పరిశ్రమలో గత ఏడాది మార్చిలో రియాక్టర్ క్లీన్ చేస్తూ కుమార్ సెరెన్, నరేంద్ర అనే ఇద్దరు కార్మికులు మృతి చెందారు. తాజాగా బుధవారం రియాక్టర్ క్లీన్ చేస్తున్న అనిల్‌తో పాటు మరో ముగ్గురు కాంట్రాక్ట్ కార్మికులుగా పని చేస్తున్నట్లు సమాచారం. ప్రొడక్షన్ టెక్నీషియన్‌లతోనే రియాక్టర్‌ను శుభ్రపరిచే పనులు చేయించింది పరిశ్రమ యాజమాన్యం. రియాక్టర్‌లపై సరిగా అవగాహన లేని కార్మికులతో పని చేయించడంతోనే వరుస ప్రమాదాలు చోటుచేసుకుంటున్నట్లు ఆరోపణలున్నాయి.



పరిశ్రమ బాధ్యులను నిలదీస్తున్న మృతుడి బంధువులు

లెక్క తేల్చేస్తారు!



ఓఆర్ఆర్ పరిధిలో క్యాన్ సర్వేకు శ్రీకారం

- మూడేళ్లుగా ఓఆర్ఆర్ పరిధిలోని ప్రాంతాలు
- తాజాగా కనెక్షన్ నిగ్గు తేల్చే పనిలో జలమండలి

సాక్షి, సిటీబ్యూరో: ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) పరిధిలోని నల్లా కనెక్షన్ల లెక్క తేల్చేందుకు క్యాన్ సర్వేకు జలమండలి శ్రీకారం చుట్టింది. మూడేళ్లుగా నుంచి ఓఆర్ఆర్ పరిధిలోని 193 గ్రామాలకు తాగునీటి సరఫరా చేస్తోంది. అప్పట్లో గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల నుంచి వివరాలు సేకరించిన కనెక్షన్లకు తాత్కాలికంగా క్యాన్ నంబర్లను కేటాయించింది. ప్రస్తుతం కనెక్షన్ల సంఖ్య రెండున్నర లక్షలకుపైగా చేరింది. అందులో కొన్నింటికి మీటర్లు బిగించగా, మరికొన్నింటికి మీటర్లు లేకుండానే పైపులైన్ పరిమాణాన్ని బట్టి నెలవారీ సగటు బిల్లులు జారీ చేస్తూ వస్తోంది. అయితే.. నీటి సరఫరా లెక్కలకు సరిపడా బిల్లుల్లో కనీసం 30 శాతం కూడా వసూలు కాని పరిస్థితి నెలకొంది. దీంతో తాజాగా కనెక్షన్ల నిగ్గు తేల్చేందుకు జలమండలి సిద్ధమైంది.

ఇంటింటికీ సర్వే..

శివారు ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహించేలా జలమండలి ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది. జనరల్ మేనేజర్ స్థాయి నుంచి మేనేజర్ స్థాయి వరకు అధికారులు రంగంలో దిగేలా చర్యలు చేపట్టింది. సర్వేలో నల్లా కనెక్షన్ నంబరు, నీటి మీటర్ ఉందా? లేదా? ఇంటి పరిస్థితి, కనెక్షన్ కేటగిరీ ఇతరత్రా వివరాలు సేకరిస్తున్నారు. సదరు నివాసానికి నిబంధనలకు అనుగుణంగా నిర్దేశిత కేటగిరీలో కనెక్షన్ ఉందా? లేదా? అని పరిశీలిస్తారు. ఒకవేళ డొమెస్టిక్ కనెక్షన్ ఉండి వాణిజ్య కార్యకలాపాలు కొనసాగుతుంటే తక్షణమే కమర్షియల్ కేటగిరీకి బదలాయిస్తారు. ఇళ్లు/భవన సముదాయానికి ఆక్యుపెన్సీ సర్టిఫికేట్ (ఓసీ) ఉందా? లేదా? పరిశీలిస్తారు. ఓసీ లేకుండా కనెక్షన్ ఉంటే నిబంధనల ప్రకారం నెలవారీ బిల్లు జారీ అయ్యేలా చర్యలు చేపట్టనున్నారు.

అక్రమ కనెక్షన్ల గుర్తింపు లక్ష్యం

క్యాన్ సర్వేలో అక్రమ కనెక్షన్ల గుర్తింపు లక్ష్యంగా జలమండలి పావులు కదుపుతోంది. సర్వేలో అక్రమ కనెక్షన్లను గుర్తించడం, వాటిని నిబంధనలకు అనుగుణంగా క్రమబద్ధీకరించడం, కనెక్షన్లకు మీటర్లు బిగించడం, పెండింగ్ బిల్లులైతే చెల్లింపునకు నోటీసులు ఇవ్వడం వంటి చర్యలు చేపట్టనున్నారు. శివార్లలో నివాస, భవన సముదాయాల నిర్మాణాలు పెరిగిపోవడంతో క్యాన్ సర్వేపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలుస్తోంది.

సర్వేపై రీ సర్వే

శివారు ప్రాంతాల్లో క్యాన్ సర్వే పూరి స్థాయిలో సక్రమంగా నిర్వహించే విధంగా జలమండలి చర్యలు తీసుకొంటోంది. సర్వే పూర్తి కాగానే ఆయా వివరాలు విజిలెన్స్ విభాగానికి అప్పగించి క్రాస్ చెక్ కోసం రీ సర్వే పేరుతో విచారణ జరిపించాలనీ యోచిస్తోంది. సర్వే సమయంలో అక్రమాలకు పాల్పడే సిబ్బందిపై చర్యలు చేపట్టాలని జలమండలి భావిస్తోంది.

శునకంపై కినుక!



వీధి కుక్కల దత్తతకు విముఖత

- పెంపకానికి వెనకాడుతున్న నగర ప్రజలు
- ఫలించని జీహెచ్‌ఎంసీ ప్రయత్నాలు

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ నగరంలో వీధికుక్కల బెడద సమసిపోవడం లేదు. ప్రతియేటా పలువురు కుక్కకాట్ల బారిన పడుతుండటం.. పసిపిల్లలు ప్రాణాలు కోల్పోతుండటం..హైకోర్టులో సుమోటోగా ప్రజాప్రయోజన వ్యాజ్యాలు దాఖలవుతుండటం.. పలువర్గాల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో కుక్కల దాడులను తగ్గించేందుకు జీహెచ్‌ఎంసీ చేపడుతున్న కార్యక్రమాలతో బెడద తగ్గడం లేదు. కుక్కలకు సంతాన నిరోధక శస్త్రచికిత్సలు, యాంటీ రేబిస్ వ్యాక్సినేషన్ల వల్ల ఈ సమస్య సమసిపోవడం లేదు. ఈ నేపథ్యంలో వీధి కుక్కల సంఖ్యను వీలైనంత తగ్గిస్తే ఫలితం ఉంటుందని భావించిన జీహెచ్‌ఎంసీ.. వీధి కుక్కలను దత్తత తీసుకోవాల్సిందిగా కోరుతోంది. ప్రజల నుంచి మాత్రం అందుకు సరైన స్పందన రావడం లేదు. వీధి కుక్కలను దత్తత తీసుకునేందుకు నగర ప్రజలు ఆసక్తి చూపడం లేదు.

ప్రత్యేక జాతులపైనే ఆసక్తి

నగరంలో కుక్కలను పెంచుకునే వారు గణనీయంగానే ఉన్నారు. చాలామంది వారు కోరుకునే జాతి కుక్కలనే కొనుగోలు చేసి పెంచుకుంటున్నారు తప్ప.. ఉచితంగా వచ్చినా వీధి కుక్కలను దత్తత తీసుకునేందుకు ముందుకు రావడం లేదు. కుక్కలను కుటుంబ సభ్యులుగా చూసుకునే వాళ్లు జర్మన్ షెఫర్డ్ (ఆల్సేషియన్), లాబ్రడార్, గోల్డెన్ రెట్రీవ్స్, షిజు, పగ్స్ తదితర జాతుల్నే పెంచుకుంటారని, ఇండీస్‌గా వ్యవహరించే వీధి కుక్కలను పెంచుకోరని జీహెచ్‌ఎంసీ అధికారులు చెబుతున్నారు. కుక్కలను చాలామంది తమ స్టేటస్ సింబల్‌గా పెంచుకుంటారని, వారికిష్టమైన జాతి కుక్కలనే పెంచుకుంటారని అభిప్రాయపడ్డారు. గత సంవత్సరం వీధి కుక్కల దాడిలో నాలుగేళ్ల బాలుడు మరణించాక.. వీటి నివారణకు జీహెచ్‌ఎంసీ చర్యలు చేపట్టింది. వీధి కుక్కలను పెంచుకోవాల్సిందిగా ప్రజలకు సూచిస్తున్నా స్పందన కనిపించడం లేదు. అప్పటి నుంచి 3093 వీధి కుక్కలను మాత్రం దత్తత తీసుకున్నారు. నగరంలో వీధి కుక్కల సంఖ్య 5 లక్షలకు పైగానే ఉంది. ఈ లెక్కన వీటి ఉధృతి ఎంతగా ఉందో అంచనా వేయొచ్చు.

ఔదార్యం ఉన్నా..

మూగజీవాలంటే ప్రేమ, కరుణ, జాలి ఉన్నవారు సైతం వీధికుక్కల దత్తతకు మాత్రం ముందుకు రావడం లేదు. నగరంలో ఎందరో ప్రతిరోజూ ఈ కుక్కలకు ఆహారం పెడతారు. వాటి కోసం ప్రత్యేకంగా మాంసం కొని వేసేవారు సైతం ఉన్నారు. కానీ.. పెంచుకోమంటే మాత్రం వెనకాడుతున్నట్లు ఓ అధికారి తెలిపారు. ఈ నేపథ్యంలో కాలనీ సంఘాలు, జంతు ప్రేమికులు, తదితరులతో సమావేశాలు జరుపుతూ పెంచుకునేందుకు మొగ్గు చూపేలా ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. కనీసం ఒక వీధిలో ఉండే కుక్కల్ని కొందరు చేరదీస్తే.. వీధిలోని వారికి మచ్చికయ్యే అవి వారికి రక్షణగానూ ఉంటాయని, దొంగల భయం వంటివి ఉండవని చెబుతూ వారిని ఒప్పిస్తున్నట్లు తెలిపారు.

పరిష్కారమెప్పుడో..

జీహెచ్‌ఎంసీ తీసుకుంటున్న చర్యల వల్ల ఈ సమస్య తగ్గదని భావించిన హైకోర్టు సైతం నగరంలో ఈ సమస్య పరిష్కారానికి తగిన మార్గాలు వెతకాల్సిందిగా, యానిమల్ వెల్ఫేర్ బోర్డ్ ఆఫ్ ఇండియా (ఏడబ్ల్యూబీఐ)వంటి సంస్థల సిఫార్సులు అమలు చేయాల్సిందిగా తాజాగా సూచించింది. కుక్కలు రెచ్చిపోకుండా ఉండేందుకు 7127 ప్రాంతాల్లో నీటి గిన్నెలు ఏర్పాటు చేసి వాటికి నీరందిస్తున్నట్లు జీహెచ్‌ఎంసీ అధికారులు తెలిపారు.

గతంలోనూ డా.బి.జనార్దన్‌రెడ్డి జీహెచ్‌ఎంసీ కమిషనర్‌గా ఉన్నప్పుడు 'మా ఇంటి నేస్తం' పేరిట వీధి కుక్కల దత్తత కార్యక్రమాలు చేపట్టారు. కొంతకాలం వరకు నిర్వహించిన ఈ కార్యక్రమాలు ఆ తర్వాత మానేశారు. తిరిగి గత సంవత్సరం వీధి కుక్కల దాడిలో బాలుడి మరణానంతరం వివిధ చర్యల్లో భాగంగా దత్తతనూ ఓ కార్యక్రమంగా తీసుకున్నారు. కానీ.. ప్రజల నుంచి స్పందన మాత్రం కనిపించడం లేదు.



రాణాకు చేరిన కుక్క పంచాయితీ

ఆరుగురిపై కేసు నమోదు

బంజారాహిల్స్: పెంపుడు కుక్క మీద ఉన్న ప్రేమ రెండు కుటుంబాలను పోలీస్ స్టేషన్ మెట్లు ఎక్కించింది. బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్న ఈ సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి.. బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 12 లోని ఎమ్మెల్యే కాలనీలో నివసించే చాంద్ షేక్ ఒక విదేశీ కుక్కను అల్లారుముద్దుగా పెంచుకుంటున్నారు. పక్క ప్లాట్‌లో నివసించే రుచిక అగర్వాల్ అనే యువతికి సైతం ఈ కుక్క అంటే ఎనలేని ప్రేమ. ఈ కుక్కతో ఆమె అనుబంధాన్ని మరింతగా పెంచుకుంది. అంతేకాకుండా కుక్కను తన ఇంటికి తీసుకెళ్తూ ఆహారం కూడా అందించేది. తరచూ ప్రయాణాలు చేసే ఈ పెంపుడు కుక్క యజమాని చాంద్ షేక్ ఎక్కడికైనా వెళ్లినప్పుడు కుక్క బాగోగులు చూసుకోవడానికి రుచిక అగర్వాల్ కు అప్పగించేవాడు. ఈ నెల 12వ తేదీ నుంచి 15వ తేదీ వరకు చాంద్ షేక్ విదేశాలకు వెళ్లారు. ఈ క్రమంలోనే తన పెంపుడు కుక్కను చూసుకోవాల్సిందిగా రుచిక అగర్వాల్ కు అప్పగించి వెళ్లాడు. అయితే ఈ కుక్క అంటే చాంద్ షేక్ తండ్రి షేక్ సుభానికి కూడా మహా ప్రాణం. తాను అల్లారు ముద్దుగా చూసుకునే కుక్క పక్కింట్లో ఉండటాన్ని జీర్ణించుకోలేక షేక్ సుభాని రుచిక ఇంటికి వెళ్లి కుక్కను తనతో పాటు తీసుకొని వచ్చాడు. దీంతో రుచిక కోపం పట్టలేక కుక్క మీద ఉన్న ప్రేమతో సుభానితో గొడవకు దిగింది. ఇద్దరి మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. కుక్క కోసం రుచికతో పాటు ఆమె సోదరుడు ఆమె వద్ద పనిచేసే వికాస్, జేమ్స్, ఆమె వదిన గొడవ పడ్డారు. కుక్కను తీసుకెళ్లేందుకు ప్రయత్నించగా సుభాని అడ్డుకున్నాడు. ఈ గొడవలో సుభానికి స్వల్ప గాయాలయ్యాయి. ఆగ్రహం పట్టలేక రుచికాపై విరుచుకుపడ్డాడు. దీంతో తనను తిట్టాడంటూ రుచిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న సుభాని కొడుకు చాంద్ షేక్ కూడా తన తండ్రిని కొట్టారంటూ పోలీసులకు ప్రతి ఫిర్యాదు చేశాడు. ఇరు వర్గాల ఫిర్యాదులపై పోలీసులు సెక్షన్ 329(4), 115(2), 351(2), రెడ్ విత్ 3(5) బీఎన్ ఎస్ కింద ఆరుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య పేరిట గోల్డ్ మెడల్



ఓయూ వీసీకి చెక్కు అందచేస్తున్న మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్ర మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత, ఓయూ పూర్వవిద్యార్థి పొన్నాల లక్ష్మయ్య తన పేరిట లైబ్రరీ సైన్స్ విభాగానికి గోల్డ్ మెడల్ ప్రకటించారు. బుధవారం లైబ్రరీ జాతీయ వారోత్సవాల సందర్భంగా డా.బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ లైబ్రరీలో ఏర్పాటు చేసి పుస్తక ప్రదర్శనలు తిలకించారు. అనంతరం పొన్నాల లక్ష్మయ్య మాట్లాడుతూ విద్యార్థి దశ నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఓయూ తనకు ఎంతో ఇచ్చిందని..తిరిగి ఏదో ఒకటి ఇవ్వాలనే ఉద్దేశంతో పొన్నాల ఫౌండేషన్ ద్వారా గోల్డ్ మెడల్ ప్రకటించినట్లు చెప్పారు. ప్రతిఏటా స్నాతకోత్సవ కార్యక్రమంలో లైబ్రరీ సైన్స్ విభాగంలో అత్యధిక మార్కులు సాధించిన పీజీ విద్యార్థికి గోల్డ్ మెడల్ ప్రదానం చేయాలని వీసీ ప్రొ.కుమార్‌కు రూ.5.50 లక్షల చెక్కును అందచేశారు. ఈ నిధుల నుంచి ప్రతి ఏటా లభించే వడ్డీతో పొన్నాల ఫౌండేషన్ గోల్డ్ మెడల్‌ను అందచేస్తామని వీసీ ప్రొ.కుమార్ పేర్కొన్నారు.

చలి వణికిస్తోంది

సాక్షి, సిటీబ్యూరో: మహానగరంతోపాటు శివారు ప్రాంతాల్లో చలి వణికిస్తోంది. గత వారం రోజులుగా రాత్రి పూట కనిష్ట ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. బుధవారం రాత్రి చలి తీవ్రత మరింత పెరిగింది. నగరంలో సగటున కనిష్ఠ ఉష్ణోగ్రతలు 15.1 డిగ్రీల సెల్సియస్‌కు పడిపోయాయి. శివార్లలో మాత్రం అత్యల్పంగా సగటున 12.1 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదవుతోంది. తెల్లవారు జామున పొగ మంచు కమ్మేస్తున్నా..ఆ తర్వాత పగటి గరిష్ఠ ఉష్ణోగ్రత కూడా తగ్గుముఖం పట్టింది. బుధవారం సగటున 29.2 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2 నుంచి 3 డిగ్రీలు తగ్గుముఖం పట్టాయి. అత్యల్ప ఉష్ణోగ్రత పటాన్‌చెరులో నమోదైంది. కనిష్ఠ ఉష్ణోగ్రతలు మరింత తగ్గే అవకాశాలు ఉన్నట్లు హైదరాబాద్ వాతావరణ శాఖ వెల్లడించింది.

నగర శివారులో కనిష్ఠ ఉష్ణోగ్రతలు ఇలా

ప్రాంతం	డిగ్రీలు
పటాన్‌చెరు	12.2
రాజేంద్రనగర్	13
హయత్‌నగర్	14.6
హకీంపేట	15.3
దుండిగల్	15.3

మద్యానికి డబ్బులు ఇవ్వలేదని..

అల్వాల్: మద్యం తాగేందుకు తల్లి డబ్బులు ఇవ్వలేదని మనస్తాపం చెంది ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన అల్వాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..మచ్చబొల్లారం గోపాల్‌నగర్‌లో నివసించే పుత్తడి శేఖర్(38) డ్రైవింగ్ చేస్తూ ఉండేవాడు. ఇతనికి భార్య, ఇద్దరు సంతానం. ఇటీవల మద్యానికి బానిసైన శేఖర్ బుధవారం ఇంటికి వచ్చి మద్యం తాగడానికి డబ్బులు కావాలని తల్లిని అడగటంతో ఆమె నిరాకరించింది. దీంతో శేఖర్ ఇంట్లోకి వెళ్లి గడియ పెట్టుకొని హాలులో ఉన్న సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

స్టాక్ లేదు!





స్టోర్స్‌లో విద్యుత్ పరికరాలు లేక ఇబ్బందులు

- సీటీపీటీలు, ఎల్టీహెచ్ఎల్‌పీ కేబుల్స్, ఫిన్స్, డిస్కుల కొరత
- మెటల్ పార్ట్స్, సింగిల్ కోర్ కేబుల్స్ సైతం లేవట..
- డీడీలు చెల్లించి నాలుగైదు మాసాలైనా చేతికందని విద్యుత్ పరికరాలు
- స్టోర్స్ చుట్టూ కాంట్రాక్టర్ల ప్రదక్షిణలు..స్టాక్ లేదంటున్న ఇంజనీర్లు
- ఆందోళనలో గృహ, వాణిజ్య వినియోగదారులు

సాక్షి, సిటీబ్యూరో: –రాజేంద్రనగర్ సర్కిల్ గగన్‌పహాడ్‌కు చెందిన సత్యనారాయణ..ఈ ఏడాది జులై 26న 11కేవీ సీటీపీటీ సెట్ సహా 11 కేవీ హెచ్‌టీ టీవీఎం 20/5ఏ కోసం రూ.6.38 లక్షలు డీడీ చెల్లించారు. ఇప్పటికీ విద్యుత్ పరికరాలు సరఫరా కాలేదు. కాంట్రాక్టర్ రంగారెడ్డి స్టోర్స్‌కు చేరుకుని మెటీరియల్ ఇవ్వాల్సిందిగా కోరగా, స్టాక్ లేదని తిప్పి పంపారు.

- సైనిక్‌పురికి చెందిన ఎస్.నాగలక్ష్మి ఎల్‌టీ ఎక్స్‌ఎల్‌పీఈ కేబుల్ 1 కోర్ 120 స్క్వైర్ ఎంఎం సహా మరో పది పరికరాలకు ఆగస్టు 10న డీడీ కట్టారు. మూడు నెలలైనా ఇప్పటికీ కేబుల్ ఇవ్వలేదు. ఇక సైనిక్‌పురి సెక్షన్‌కు చెందిన వర్ధన్ ప్రాజెక్ట్స్ సాధన విహార్ విద్యుత్ మెటీరియల్స్ కోసం జులై 1న డీడీ కట్టారు. ఇప్పటికీ మెటీరియల్ అందలేదు. విద్యుత్ కాంట్రాక్టర్ స్వయంగా స్టోర్‌కు చేరుకుని ఆరా తీస్తే..వారం క్రితమే మెటీరియల్ వచ్చిందని, ఆ వెంటనే స్టాక్ ఖాళీ అయిందని ఇంజనీర్లు సెలవిచ్చారు. మళ్లీ ఎప్పుడు వస్తుందని ప్రశ్నిస్తే? కనీస సమాధానం లేదు.
- ఇది కేవలం సత్యనారాయణ, నాగలక్ష్మి, వర్ధన్ ప్రాజెక్ట్స్ వినియోగదారులకు ఎదురైన చేదు అనుభవమే కాదు..విద్యుత్ పరికరాలు కోసం రూ.లక్షల చొప్పున డీడీలు చెల్లించిన అనేక మంది గృహ, వాణిజ్య, పారిశ్రామిక వినియోగదారులు ఎదుర్కొంటున్న ఇబ్బంది.

డీడీలు కట్టి..నాలుగైదు మాసాలైనా..

కొత్త పరిశ్రమలు, వ్యాపార, వాణిజ్య సముదాయాలు, బహుళ అంతస్తుల భవనాల్లో విద్యుత్ పనులను ప్రైవేటు కాంట్రాక్టర్లే చేస్తున్నారు. నిర్మాణ సమయంలోనే సదరు వినియోగదారుడు డిస్కంకు దరఖాస్తు చేసుకుంటారు. ఇంజనీర్లు క్షేత్రస్థాయిలో పర్యటించి, ఇందుకు అవసరమైన విద్యుత్ పోల్స్, కండక్టర్, మెటల్ పార్ట్స్, ఇన్సులేటర్లు, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్, కేబుల్స్, సీటీపీటీలు, ఏబీ స్విచ్‌లు, పీటీ ఆర్‌లు, ఆర్ఎంయూలు, ఆయిల్ డ్రమ్స్, క్రాస్ ఆర్మ్‌లు, ఫ్యూజ్ సెట్స్, మీటర్లు, ప్యానల్ బోర్డులకు అంచనాలు రూపొందించి ఇవ్వగా, సదరు వినియోగదారులు డీడీ రూపంలో డిస్కంకు ఆ మొత్తాన్ని చెల్లిస్తుంటారు. నిజానికి ప్రైవేటు మార్కెట్లో ఆయా విద్యుత్ పరికరాలన్నీ దొరుకుతున్నప్పటికీ..సరఫరాలో నాణ్యత, షార్ట్ సర్క్యూట్‌ల నియంత్రణ పేరుతో తామే వాటిని స్వయంగా సరఫరా చేయనున్నట్లు డిస్కం ప్రకటించింది. ఇందుకోసం ప్రత్యేకంగా పర్చేజింగ్ అండ్ మెటీరియల్ మేనేజ్‌మెంట్ విభాగాన్ని ఏర్పాటు చేసి, ఆ మేరకు ఆయా తయారీ సంస్థల నుంచి అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ప్రభుత్వం నిర్ణయించిన ఎస్ఎస్ఆర్ ధరల ప్రకారం మొత్తం 121 రకాల విద్యుత్ పరికరాలను ఆయా తయారీ సంస్థల నుంచి దిగుమతి చేసుకుని, హైదరాబాద్, రంగారెడ్డి స్టోర్స్‌లో నిల్వ చేస్తుంది. అటు నుంచి సర్కిళ్ల/డివిజన్ల వారీగా దరఖాస్తు దారులకు(సీరియల్ నంబర్ల ఆధారంగా) ఆయా విద్యుత్ పరికరాలను పంపిణీ చేయాల్సి ఉంది. కానీ నెలలు గడిచినా..స్టోర్స్‌కు ఆయా పరికరాలు రావడం లేదు.

లంచం ఇస్తే ఓకే..

కాగా విద్యుత్ పరికరాల సరఫరాకు డిమాండ్‌కు మధ్య భారీ వ్యత్యాసం ఉండటాన్ని ఇంజనీర్లు క్యాష్ చేసుకుంటున్నారు. రూ.5000 ఇస్తే చాలు దరఖాస్తు సీనియార్టీతో సంబంధం లేకుండా కోరిన పరికరాలను అప్పగిస్తున్నట్లు ఆరోపణలు లేకపోలేదు. అంతేకాదు నిర్దేశించిన తూకానికి తక్కువగా కండక్టర్ అప్పగిస్తున్నారు. ఒక్కో డ్రమ్ నుంచి రెండు నుంచి ఐదు కేజీల వరకు తగ్గిస్తున్నట్లు తెలిసింది. ఇన్సులేటర్లు, పిన్స్ ఇవ్వకుండా, గుట్టుగా వాటిని ప్రైవేటు దుకాణాలకు తరలిస్తున్నట్లు తెలిసింది.

కాంట్రాక్టర్లపై పెరుగుతున్న ఒత్తిడి



డీడీ కట్టిన వారం పది రోజుల్లోనే మెటీరియల్ అందజేయాల్సి ఉంది. కానీ పర్చేజింగ్ అండ్ మెటీరియల్ మేనేజ్‌మెంట్ విభాగంలో పనిచేస్తున్న కొంత మంది ఇంజనీర్లు ఉద్దేశ పూర్వకంగానే కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు. ఎప్పటికప్పుడు ఇండెంట్లు పంపించి, పరికరాలను దిగుమతి చేసుకోవడంలో తీవ్ర జాప్యాన్ని ప్రదర్శిస్తున్నారు. స్టాక్ రాలేదనే సాకుతో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు. వినియోగదారుల నుంచి ఒత్తిడి పెరుగుతుండటంతో విధిలేని పరిస్థితుల్లో కాంట్రాక్టర్లే ఆయా పరికరాలను ప్రైవేటుగా కొనుగోలు చేసి, పనులు చేయాల్సి వస్తోంది.

– ప్రదీప్‌రెడ్డి, సీనియర్ ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్

శామీర్‌పేట పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన డీజీపీ



శామీర్‌పేట్: శామీర్‌పేట పోలీస్ స్టేషన్‌ను బుధవారం సాయంత్రం తెలంగాణ డీజీపీ డా. జితేందర్ సందర్శించారు. సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని శామీర్‌పేట పోలీస్ స్టేషన్‌లోని కేసుల దర్యాప్తులో చొరవ చూపడంతో పాటు వాటి పరిష్కారం దిశగా కృషి చేస్తున్న సిబ్బందిని ఆయన అభినందించారు. అంతేకాకుండా పోలీస్ స్టేషన్ పరిసర ప్రాంతాల్లో పచ్చదనం నిర్వహణపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. కేసుల విచారణ వేగవంతం, ఆన్‌లైన్ అప్‌డేట్ తదితర అంశాల్లో కేంద్ర ప్రభుత్వం నుండి ఉత్తమ పోలీస్ స్టేషన్ ఎంపికలో భాగంగా తెలంగాణ డీజీపీ శామీర్‌పేట పోలీస్ స్టేషన్‌ను సందర్శించినట్లు విశ్వసనీయ సమాచారం. మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి, పేట్ బషీరాబాద్ ఏసీపీ రాములు, డీఐ గంగాధర్, ట్రాఫిక్ ఏసీపీ వెంకట్‌రెడ్డి, శామీర్‌పేట సీఐ శ్రీను, సీఐ శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

పరువునష్టం కేసు విచారణకు సీఎం రేవంత్ గైర్హాజరు

సిటీ కోర్టులు : బీజేపీ దాఖలు చేసిన పరువు నష్టం కేసు విచారణకు బుధవారం సీఎం రేవంత్‌రెడ్డి గైర్హాజరయ్యారు. తదుపరి విచారణ గురువారానికి వాయిదా పడింది. లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా మే, 4న భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ప్రకాశం స్టేడియంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన బహిరంగా సభలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లను రద్దు చేస్తుందని అసత్యపు ఆరోపణలు చేశారని భారతీయ జనతాపార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు నాంపల్లి కోర్టులో పరువు నష్టం కేసు దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసు విచారణ బుధవారం నాంపల్లిలోని స్పెషల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్, ఎక్సైజ్ కోర్టులో జరిగింది. ఈ కేసు విచారణకు పిటిషనర్ కాసం వెంకటేశ్వర్లు హాజరుకాగా సీఎం రేవంత్‌రెడ్డి గైర్హాజరు అయ్యారు. ఆయన తరపున న్యాయవాది పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన జడ్జి శ్రీదేవి తదుపరి విచారణను వాయిదా వేసింది.

అక్రిడిటేషన్‌తో సంబంధం లేకుండా పథకాలు

సమాచారశాఖ కమిషనర్‌కు టీఎస్‌జేయూ వినతి

సాక్షి, హైదరాబాద్: జర్నలిస్టుల భద్రతకు రక్షణ చట్టం రూపొందించి అమలు చేయాలని, అక్రిడిటేషన్ కార్డులతో సంబంధం లేకుండా సంక్షేమ పథకాలను అందించాలని ప్రభుత్వాన్ని తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్స్ యూనియన్ (టీఎస్‌జేయూ) కోరింది. ఈ మేరకు బుధవారం సమాచార, పౌర సంబంధాల శాఖ కమిషనర్ హరీశ్ కుమార్‌ను నేషనల్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (ఇండియా) జాతీయ ఉపాధ్యక్షుడు నారగొని పురుషోత్తం, టీఎస్‌జేయూ రాష్ట్ర అధ్యక్షుడు మెరుగు చంద్రమోహన్, ప్రధాన కార్యదర్శి తోకల అనిల్ కుమార్, కోశాధికారి పాపాని నాగరాజు, రాష్ట్ర నేత క్రాంతికుమార్‌లు కలిసి వినతిపత్రం సమర్పించారు. జర్నలిస్టుల వృత్తి భద్రత, హక్కులను కాపాడడం ప్రభుత్వ బాధ్యతని వారు స్పష్టం చేశారు. జర్నలిస్టులపై దాడులు, బెదిరింపులను నివారించాలని కోరారు. అక్రిడిటేషన్ కార్డులు పొందని అనేక మంది జర్నలిస్టులు.. తమ వృత్తి సేవలను కొనసాగించడంలో తీవ్రమైన ఆర్థిక, వృత్తిపరమైన సమస్యలను ఎదుర్కొంటున్నారని కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లారు. జర్నలిస్టులపై దాడుల నివారణ కోసం కమిటీలను నియమించాలని విన్నవించారు. బాధితులకు న్యాయం అందించడానికి రాష్ట్రంలోని అన్ని జిల్లాలు, రాష్ట్ర స్థాయిలో కమిటీలను పునరుద్ధరించాలని కోరారు. జర్నలిస్టులకు ఇళ్ల, స్థలాలు కేటాయించేందుకు ప్రస్తుత యూనియన్ల ఆధ్వర్యంలో నిర్వహించే సంఘాలకు మాత్రమే కాకుండా.. ప్రభుత్వం స్వయంగా దరఖాస్తులు స్వీకరించాలని సూచించారు. దీనిపై కమిషనర్ సానుకూలంగా స్పందిస్తూ..డిమాండ్ల అమలుకు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్టు టీఎస్‌జేయూ నేతలు వెల్లడించారు.

నాంపల్లి కోర్టుకు ఎమ్మెల్యే రాజాసింగ్

సిటీ కోర్టులు: గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ పలుకేసుల్లో నాంపల్లి కోర్టుకు హాజరయ్యారు. శ్రీరామనవమి ర్యాలీ, గత ఎన్నికల్లో చేపట్టిన ప్రచార ర్యాలీల సందర్భంగా సిటీలో ట్రాఫిక్‌కు అంతరాయం జరిగిందని, దీని ద్వారా వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని, అంతేకాకుండా సోషల్ మీడియాలో తప్పుడు స్పీచ్‌లు ఇచ్చారని ఆయనపై పలువురు సిటీలోని ఆయా పోలీస్ స్టేషన్‌లలో ఫిర్యాదుచేయడంతో ఐపీసీ 295–ఏ, 188, 298తో పాటు పలు సెక్షన్ల కింద కేసులు నమోదయ్యాయి. ఇందులో భాగంగా బుధవారం నాంపల్లిలోని స్పెషల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ జరిపిన విచారణకు ఆయన హాజరయ్యారు. ఆయనతోపాటు న్యాయవాది కరుణసాగర్ హాజరయ్యారు. అయితే ఈ కేసుల్లో పలువురు ఫిర్యాదుదారులు, సాక్షులు గైర్హాజరయ్యారు. దీంతో విచారణను డిసెంబర్ 19కి వాయిదా వేశారు.

కనీస వేతనాలందించాలి

సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్రంలోని 495 కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు, 31 అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్స్‌లో పనిచేస్తున్న 12 వేల మంది ఉద్యోగులకు కనీస వేతనాలు అందించాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ అధ్యక్షులు జంగయ్య డిమాండ్ చేశారు. బుధవారం ఇక్కడ జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అనాథ, పాక్షిక అనాథ, బాలికల ఉన్నతి కోసం కృషి చేస్తున్న ఈ సిబ్బంది విషయంలో గత ప్రభుత్వం అన్యాయం చేసిందని, రేవంత్ రెడ్డి సర్కారైనా స్పందించి న్యాయం చేయాలని ఆయన కోరారు. లేకుంటే పోరాటాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు.

13వ అంతస్తు పైనుంచి దూకి ఐటీ ఉద్యోగి ఆత్మహత్య



మాదాపూర్: ఐటీ ఉద్యోగి భవనంపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మాదాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. మాదాపూర్ ఇన్స్‌పెక్టర్ కృష్ణమోహన్ తెలిపిన వివరాల ప్రకారం గుంటూరు జిల్లా నెమలి కలాన్‌కి చెందిన వంగ నవీన్ రెడ్డి (24) మాదాపూర్‌లోని మైండ్‌స్పేస్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేస్తున్నాడు. ఆ భవనంలోని 12–సి 13వ అంతస్తు నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్యకు గల కారణాలు వెల్లడి కాలేదు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

22న సైబరాబాద్ పరిధిలో ట్రాఫిక్ ఆంక్షలు

గచ్చిబౌలి: భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నగర పర్యటనలో భాగంగా ఈ నెల 22వ తేదీ శుక్రవారం సైబరాబాద్ పరిధిలో కొన్ని చోట్ల ట్రాఫిక్ ఆంక్షలు విధించినట్లు సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ తెలిపారు. ముఖ్యంగా ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉండే సమయాలైన ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఎన్ఐఏ నుంచి ఐకియా రూట్లో, కేబుల్ బ్రిడ్జి నుంచి మీనాక్షి రూట్లో, బయో డైవర్సిటీ కూడలి నుంచి సైబర్‌టవర్స్ రూట్లో, మాదాపూర్ నుంచి కొత్తగూడ వరకున్న రూట్లలో ట్రాఫిక్ ఆంక్షలు అమలులో ఉంటాయని అధికారులు స్పష్టం చేశారు. ఆ రోజు ఆయా సమయాల్లో ఈ మార్గాలలో రాకపోకలు నిర్వహించే ఐటీ, ఇతర ఉద్యోగులు, అధికారులు ప్రత్యామ్నాయ మార్గాలలో రాకపోకలు సాగించాలని సూచించారు. మరిన్ని వివరాలకు సైబరాబాద్ ట్రాఫిక్ హెల్ప్‌లైన్ నెంబర్ 8500411111 అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు.

వస్త్ర దుకాణంలో అగ్నిప్రమాదం



మంటలు చెలరేగిన దృశ్యం

రాజేంద్రనగర్: శివరాంపల్లి ప్రధాన రహదారిలో ఉన్న ఓ వస్త్ర దుకాణంలో షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం జరిగింది. పోలీసులు, బాధితుడు తెల్పిన వివరాల మేరకు రవి అనే వ్యక్తి మూడు షట్టర్లలో శ్రీ లక్ష్మీ క్లాత్ స్టోర్, బ్యాంగిల్ స్టోర్లను నిర్వహిస్తున్నాడు. అతనితోపాటు షాపులో ముగ్గురు పనిచేస్తున్నారు. బుధవారం మధ్యాహ్నం సడన్‌గా విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ జరిగి మంటలు అంటుకున్నాయి. సిబ్బంది అప్రమత్తమయ్యే లోపు మొత్తం మంటలు వ్యాపించాయి. దీంతో దుకాణం సిబ్బంది, యజమాని బయటికి పరుగులు తీశారు. మూడు షట్టర్లలో దట్టమైన పొగలు నిండుకోవడంతో పాటు మంటలు చెలరేగడంతో స్థానికులు ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది రెండు గంటలు శ్రమించి మంటలు ఆర్పివేశారు. ఈ సంఘటనలో రూ.15 లక్షల వరకు ఆస్తినష్టం జరిగినట్లు బాధితుడు వాపోయారు. విషయం తెలుసుకున్న రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ సంఘటన స్థలానికి చేరుకుని ప్రమాదం గురించి అడిగి తెలుసుకున్నారు.

హెడ్ కానిస్టేబుల్‌పై కేసు నమోదు

బంజారాహిల్స్: మామ ఆస్తిలో తనకు కూడా వాటా ఇవ్వాలని కోరుతూ లంగర్ హౌస్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ ఎండీ షాహీద్‌ఖాన్..తన మామను తీవ్రంగా కొట్టడమే కాకుండా అంతుచూస్తానని బెదిరించడంతో జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో బాధితుడు ఫిర్యాదు చేశాడు. దీంతో ఆయనపై క్రిమినల్ కేసు నమోదైంది. వెంకటగిరిలో నివసిస్తున్న అబ్దుల్ వాహీద్ అల్లుడు ఎండీ షాహీద్‌ఖాన్ లంగర్ హౌస్ ట్రాఫిక్ పీఎస్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. కొంతకాలంగా తన మామను ఆస్తిలో వాటా ఇవ్వాలంటూ డిమాండ్ చేస్తున్నాడు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి వాహీద్ దుకాణానికి వచ్చిన షాహీద్‌ఖాన్ గొడవపడి..హెల్మెట్‌తో తలపై, ముఖంపై, కళ్లపై తీవ్రంగా కొట్టాడు. దీంతో వాహీద్‌కు తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. తన పోలీసు పవర్‌ను ఉపయోగించి అంతుచూస్తానని బెదిరిస్తున్నాడని వాహీద్ తనయుడు మొహిద్ జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు నిందితుడిపై బీఎన్ఎస్ సెక్షన్ 118 (1), 351 (2) కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఫిలింనగర్‌కి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం తలమానికం కావాలి

- ఎమ్మెల్యే దానం నాగేందర్

ఫిలింనగర్: పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయాన్ని ఫిలింనగర్‌కే తలమానికంగా నిలిచేలా నిర్మించాలని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్‌లోని వినాయకనగర్ బస్తీ పర్వతాంజనేయ స్వామి ఆలయ ఆవరణంలో నూతనంగా నిర్మించనున్న పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి ఆలయ నిర్మాణానికి బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. కొండ ప్రాంతం కావడంతో ఇక్కడ ఆలయాన్ని అద్భుతంగా నిర్మించాలని తన సహాయ సహకారాలు ఉంటాయని నిర్వాహకులకు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఆలయ భూమికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బస్తీవాసులు వీరేష్‌చారి, లింగాచారి, విష్ణు, శాంతికుమార్, రవిరాజా, తిరుపతయ్య, సికిందర్‌రెడ్డి, కృష్ణప్రసాద్, నర్సింహాచారి, రవీందర్‌చారి, రమేష్, ఈశ్వర్, శ్రీశైలం, మహేష్ చారి తదితరులు పాల్గొన్నారు.

సర్వేను పరిశీలించిన డిప్యూటీ సీఎం పేషీ అధికారిణి



సమగ్ర సర్వేను పరిశీలిస్తున్న నవికాహర్షే

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డునెంబర్–13లోని శ్రీరామ్‌నగర్ బస్తీలో జరుగుతున్న సామాజిక, ఆర్థిక, కుటుంబ, కులగణన సర్వేను ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పేషీ నుంచి వచ్చిన అధికారిణి నవికాహర్షే పరిశీలించారు. బుధవారం ఆమె బస్తీలో పర్యటించి సమగ్ర కుటుంబ సర్వే జరుగుతున్న ఇళ్లకు వెళ్లి ఎన్యుమరేటర్లు నమోదు చేసుకుంటున్న వివరాలను అడిగి తెలుసుకుంటున్నారు. బుధవారం ఉదయం సర్కిల్–18 డీఎంసీ ప్రశాంతి, సూపర్‌వైజర్ భావ్‌సింగ్, ఎన్యుమరేటర్ వాసవి తదితరులు బస్తీలో సర్వే జరుగుతున్న ప్రాంతాల్లో ఆమెకు వివరాలు తెలియజేశారు.

పంజగుట్టలో కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి పర్యటన



సమస్యను పరిశీలిస్తున్న కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి

వెంకటేశ్వరకాలనీ: పంజగుట్టలో జూబ్లీ మెడికల్ హాల్, ఢిల్లీ వాలా స్వీట్ హౌస్ గల్లీల్లో నిత్యం సీవరేజీ ఓవర్ ఫ్లోతో పాటు మంచినీరు లీక్ అవుతూ ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఫిర్యాదులు రావడంతో బుధవారం వెంకటేశ్వరకాలనీ కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి అక్కడ పర్యటించారు. దీంతో ఆమె బంజారాహిల్స్ సెక్షన్ మేనేజర్ శివకుమార్‌ను ఈ సమస్యను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ప్రతిరోజూ డ్రైనేజీ ఓవర్‌ఫ్లో ఫిర్యాదులు తనకు అందుతున్నాయని, ఇక ముందు సమస్య రాకుండా చూసుకోవాలన్నారు.

ఉత్సాహంగా క్విజ్ కాంపిటేషన్స్



క్విజ్ కాంపిటేషన్స్‌లో విద్యార్థులు

ఫిలింనగర్: జూబ్లీహిల్స్‌లోని బీవీబీపీ ఆత్మకూరి రామారావు స్కూల్‌లో ఇంటర్ హౌస్ క్విజ్ కాంపిటేషన్స్ ఉత్సాహంగా జరిగాయి. స్కూల్ ఆడిటోరియంలో జరిగిన ఈ పోటీల్లో 11, 12 గ్రేడ్స్‌కు చెందిన విద్యార్థులు పాల్గొని ప్రతిభను చాటారు. 'వరల్డ్ ఎఫైర్స్ విత్ యాన్ ఇండియన్ లెన్స్' థీమ్‌తో జరిగిన క్విజ్ కాంపిటేషన్ సైన్స్, ఎకనామీ, గ్లోబల్ అంశాలపై కొనసాగింది. అర్జున, కృష్ణ, శ్రీరామ్, వశిష్ట గ్రూపులకు చెందిన విద్యార్థులు పోటాపోటీగా తలబడి తమ ప్రతిభకు కనబర్చారు. ఇందులో కృష్ణ గ్రూపు మొదటి స్థానంలో, శ్రీరామ గ్రూపు రెండో స్థానంలో నిలిచింది.

రూ.15 లక్షలతో ప్రభుత్వ పాఠశాలలో అభివృద్ధి పనులు



టీచర్లు, నేతల సమావేశంలో పి.విజయారెడ్డి

వెంకటేశ్వరకాలనీ: వెంకటేశ్వరకాలనీ డివిజన్ పరిధిలోని పంజగుట్ట బస్తీ కమిటీ విజ్ఞప్తి మేరకు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, ఖైరతాబాద్ కార్పొరేటర్ పి.విజయారెడ్డి బుధవారం పంజగుట్ట ప్రతాప్‌నగర్‌లోని ప్రభుత్వ పదవ స్కూల్‌ను సందర్శించారు. పాఠశాల అభివృద్ధిలో భాగంగా హైదరాబాద్ జిల్లా మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి ఈ పాఠశాల సమస్యలను తీసుకువెళ్లి ప్రత్యేక నిధులు మంజూరు చేయించారు. దీనిలో భాగంగా రూ.15 లక్షల వ్యయంతో ఈ పాఠశాలలో బోర్‌వెల్, ఆర్వో ప్లాంట్, విద్యార్థినులకు మరుగుదొడ్లు, లైట్లు, ఫ్యాన్లు, బెంచీలు, కుర్చీలు ఏర్పాటు చేయనున్నారు. అలాగే తలుపులు, కిటికీలకు మరమ్మతులు చేయిస్తున్నారు. జరుగుతున్న పనులను ఆమె పరిశీలించి ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. ఇక్కడి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.

'మాలల సింహ గర్జన' సభను విజయవంతం చేయండి

రహమత్‌నగర్: నగరంలో డిసెంబర్ 1న జరిగే మాలల సింహగర్జన సభను విజయవంతం చేయాలని ఆ సంఘం నాయకులు కోరారు. బోరబండ డివిజన్‌లో బుధవారం ఇంటింటికి తిరిగి కరపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సింహగర్జన కో చైర్మన్ పవనం శివ శంకర్ మాల (బొట్టు శివ) మాట్లాడుతూ మాలల తమ హక్కుల కోసం ఏకం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జైభీమ్ యాదగిరి, పుల్లయ్య, బాలరాజు, చిట్టి, ఆలివేలు పాల్గొన్నారు.

- సుందరీకరణలో గోడలపై పల్లె అందాలు
- పాదచారులు, వాహనదారులకు కొత్త అనుభూతి
- అద్భుత చిత్రాలతో మారిన జంట సర్కిళ్ల రూపురేఖలు

ఎన్నెన్నో వర్ణాలు.. గోడలపై చిత్రాలు..!



బంజారాహిల్స్ రోడ్ నెం. 13లో

బంజారాహిల్స్: నగర సుందరీకరణ పనుల్లో భాగంగా జంట సర్కిళ్లు అయిన జూబ్లీహిల్స్, ఖైరతాబాద్ రహదారులు, కూడళ్ల రూపురేఖలు పూర్తిగా మారిపోతున్నాయి. గతంలో ఏ జంక్షన్ లోనూ పది నిమిషాలు ఉండలేని పరిస్థితి నుంచి ఇప్పుడు ఖైరతాబాద్, పంజగుట్ట, సోమాజిగూడ, నాగార్జున సర్కిల్, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, కేన్సర్ ఆస్పత్రి చౌరస్తా ఇలా ఎక్కడైనా ఎంత సేపైనా ఉండే విధంగా ఆయా కూడళ్లను అధికారులు సుందరీకరిస్తున్నారు. రంగురంగుల ప్రతిమలు ఏర్పాటు చేయడంతో పాటు కేబీఆర్ పార్కు వంటి జంక్షన్‌లో చారిత్రక విలువలు కలిగిన కొండపల్లి బొమ్మలను సైతం ఏర్పాటు చేశారు. తాజాగా అన్ని ప్రధాన రోడ్ల వెంట వెళ్తుంటే ఏ గోడ చూసినా కూడా కళాత్మకంగా తీర్చిదిద్దిన చిత్రాలు వాహనదారులు, పాదచారులను కట్టిపడేస్తున్నాయి. ఆ చిత్రాలు చూస్తుంటే మన నగరంలోనా.. లేక మరో దేశంలో ఉన్నామా అనే అనుభూతిని పాదచారులకు కలిగిస్తున్నాయంటే అతిశయోక్తి కాదు. ఖైరతాబాద్‌లోని విద్యుత్ సౌధ ప్రహరీతో పాటు ఎదురుగా ఉన్న ఆస్కి భవనం, ప్రెస్‌క్లబ్, ఆర్టీఏ కార్యాలయం, పంజగుట్ట ఫ్లై ఓవర్, బంజారాహిల్స్ రోడ్ నెం. 13 మంత్రుల నివాసం ప్రాంగణం ఎదురుగా, బంజారాహిల్స్ రోడ్ నెం. 2 షేక్‌పేట మండల కార్యాలయం, పంజగుట్ట శ్మశాన వాటిక వద్ద చిత్రకారులు గీసిన చిత్రాలు అబ్బురపరుస్తున్నాయి. పట్టణంలో పల్లె సొగసులు అన్నట్లుగా పల్లె చిత్రాలను, మానవ నాగరికతను, రంగు రంగుల పువ్వులు, అబ్బురపరిచే జంతువుల చిత్రాలతో ఆయా గోడలు నిండుగా కనువిందు చేస్తున్నాయి.



ఖైరతాబాద్ ప్రధాన రహదారిలో...



ఖైరతాబాద్...



షేక్‌పేట మండల కార్యాలయం ముందు..

సత్కారం



రాష్ట్ర గవర్నర్‌ను సత్కరిస్తున్న ఫౌండేషన్ ఎస్.ఆదినారాయణ

లిబర్టీ: నిరంతరం సమాజ హితం కోసం పని చేస్తున్న వ్యక్తులు, సంస్థలకు బాసటగా నిలవాలని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు ఆదిలీలా ఫౌండేషన్ ప్రతినిధి బృందం విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు గవర్నర్‌కు వినతిపత్రం సమర్పించి శాలువా పుష్పగుచ్ఛాలతో ఫౌండేషన్ జాతీయ అధ్యక్షులు ఎస్.ఆదినారాయణ ఆత్మీయ సత్కారం చేశారు. కళారూపాల రక్షణ, సాహిత్య సాంస్కృతిక రంగాల సదస్సులు నిర్వహించడంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తున్న సంస్థలకు అండగా నిలవాలని విన్నవించారు. ఈ బృందంలో మాతృదేవోభవ సంస్థ జాతీయ అధ్యక్షులు కే.బీ. శ్రీధర్ తదితరులున్నారు.

మురళి స్వామికి ఘనస్వాగతం



మురళి స్వామికి ఘనస్వాగతం పలుకుతున్న నారికెళ్ల నరేష్ ..

పంజగుట్ట: తెలుగు రాష్ట్రాల నుంచి మొట్టమొదటిసారిగా శబరిమల అయ్యప్ప దేవాలయ స్వామిసన్నిధిలో ప్రధాన అర్చకునిగా ఒక సంవత్సరంపాటు పూజలు అందించిన మురళిస్వామి నగరానికి రావడంతో ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఆయనకు ఘనస్వాగతం పలికి అక్కడ నుంచి బాజా బజంత్రీలతో సోమాజిగూడ అయ్యప్ప స్వామి దేవాలయానికి తీసుకుని వచ్చారు. అక్కడ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మురళి స్వామిని ఘనంగా సత్కరించారు. గతంలో సోమాజిగూడ అయ్యప్ప స్వామి దేవాలయం ప్రధాన అర్చకునిగా ఉన్న మురళిస్వామి ఇకపై కూడా ప్రధాన అర్చకునిగా కొనసాగుతారు. సోమాజిగూడ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు నారికెళ్ల నరేష్ మురళి స్వామిని ఘనంగా సత్కరించారు.

ఆర్థిక సహాయం



రహమత్‌నగర్: ప్రమాదవశాత్తు మృతి చెందిన ఓ కార్మికుడి కుటుంబానికి సీఐటీయూ నాయకులు ఆర్థిక సహాయం అందించారు. ఎస్పీఆర్ హిల్స్ వినాయకనగర్ బస్తీకి చెందిన భవన నిర్మాణ కార్మికుడు దత్తు (56) గత సంవత్సరం అమీన్‌పూర్ ప్రాంతంలో పనిచేస్తున్న సమయంలో బండరాళ్లు పడి చనిపోయాడు. అప్పటి నుంచి మృతుని భార్య, పిల్లలు జీవనాధారం కోల్పోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో విషయం తెలుసుకున్న నాయకులు సదరు గృహ యజమానితో మాట్లాడి మృతుని కుటుంబానికి రూ. 4 లక్షలు ఆర్థిక సహాయం అందించే విధంగా ఒప్పించారు. ఈ క్రమంలోనే బుధవారం మృతుని నివాసానికి వెళ్లి వారి కుటుంబ సభ్యులకు రూ. 4 లక్షల చెక్కును సీఐటీయూ జోన్ కన్వీనర్ స్వామి, సీపీఎం నాయకుడు శేషగిరిరావు తదితరులు అందించారు. ఈ సందర్భంగా సీఐటీయూ, సీపీఎం నాయకులకు మృతుని కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

వైభవంగా పూర్ణాహుతి వేడుకలు



పూర్ణాహుతి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

వెంకటేశ్వరకాలనీ: బంజారాహిల్స్‌లోని బసవతారకం కేన్సర్ ఆస్పత్రి ఆవరణలోని విజయగణపతి ఆలయంలో పది రోజులుగా జరుగుతున్న రుద్రయాగ సహిత నవచండీ మహాయాగ పూజా మహోత్సవ వేడుకలు బుధవారం ముగిశాయి. ముగింపు సందర్భంగా చంద్రమౌళీశ్వర స్వామికి విశేష ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం నిర్వహించిన పూర్ణాహుతి వేడుకల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు విష్ణుభట్ల ఆంజనేయ చయనులు మాట్లాడుతూ లోక కల్యాణం కోసం పది రోజులపాటు ఈ నవచండీ మహాయాగాన్ని నిర్వహించినట్లు తెలిపారు.

కరెంట్ లేనప్పుడు తప్పితే లిఫ్టులు బాగానే పనిచేస్తాయి

- ప్రకాష్ ఆర్ట్స్ ప్రాజెక్ట్ హెడ్ మల్లికార్జున్

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డునెంబర్–2లోని ఎల్వీప్రసాద్ ఎదురుగా ఉన్న ఫుట్‌ఓవర్ బ్రిడ్జితో పాటు ముఫకంజా ఇంజినీరింగ్ కళాశాల ముందున్న ఎఫ్ఓబీల లిఫ్టులు, ఎస్కలేటర్లు బాగానే పనిచేస్తున్నాయని ప్రకాష్ ఆర్ట్స్ ప్రాజెక్ట్ హెడ్ మల్లికార్జున్ వెల్లడించారు. మంగళవారం ఉదయం ఎల్వీప్రసాద్ ఎదురుగా ఉన్న ఎఫ్ఓబీ విద్యుత్ సరఫరాలో అంతరాయం వల్ల కొద్దిసేపు లిఫ్టులు, ఎస్కలేటర్లు పని చేయలేదని, ఇక్కడ కరెంటు సిబ్బంది చెట్ల కొమ్మలు కొట్టేస్తుండడం వల్ల కరెంటు సరఫరా నిలిపివేయడంతో ఈ సమస్య తలెత్తిందన్నారు. ఈ రెండు ఎఫ్ఓబీల లిఫ్టులు, ఎస్కలేటర్లు యథావిధిగా పాదచారులకు అందుబాటులో ఉంటున్నాయని, కేవలం కరెంటు పోయినప్పుడు మాత్రమే 5 నుంచి 10 నిమిషాలపాటు నిలిచిపోతాయన్నారు. ఎల్వీప్రసాద్ ఎఫ్ఓబీ లిఫ్టులు, ఎస్కలేటర్ల పరిస్థితి బాగానే ఉందని, ఎక్కడా లోపాలు కూడా లేవని ఆయన వెల్లడించారు. దీని పనితీరును ఎప్పటికప్పుడు తాము రోజూ పరిశీలిస్తుంటామన్నారు. కేవలం చెట్ల కొమ్మలు కొట్టేసినప్పుడు కరెంటు సరఫరా నిలిపివేసినప్పుడు మాత్రమే సమస్య ఉంటుంది తప్పితే మిగతా 24 గంటలు ఇవి నడుస్తూనే ఉంటాయన్నారు. ఇదిలా ఉండగా ఎఫ్ఓబీల లిఫ్టులు, ఎస్కలేటర్ల పనితీరును సంబంధిత అధికారులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

సన్మానం



శ్రీనివాస్‌ను అభినందిస్తున్న అడిషనల్ కలెక్టర్, గ్రంథాలయ సంస్థ కార్యదర్శి

రహమత్‌నగర్: గ్రంథాలయ వారోత్సవాల భాగంగా విధి నిర్వహణలో విశిష్ట సేవలందించినందుకు రహమత్‌నగర్ లైబ్రరియన్ శ్రీనివాస్‌ను హైద్రాబాద్ జిల్లా అడిషనల్ కలెక్టర్ కదిరవన్, గ్రంథాలయ కార్యదర్శి పద్మజలు బుధవారం సన్మానించి ఆయన అందిస్తున్న సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి అంకితభావంతో సేవలందించాలని కోరారు.

అయ్యప్పస్వాములకు క్షమాపణలు చెప్పాలి

పంజగుట్ట: ఎంతో పవిత్రమైన అయ్యప్ప మాల ధరించి వాటి నియమాలు బేఖాతరు చేసిన ప్రముఖ మెగా హీరో రామ్‌చరణ్ యావత్ హిందూ సమాజానికి, అయ్యప్ప స్వాములకు బహిరంగ క్షమాపణ చెప్పాలని అయ్యప్ప జాయింట్ యాక్షన్ కమిటీ డిమాండ్ చేసింది. ఐదు రోజుల్లో బహిరంగ క్షమాపణ చెప్పకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జేఏసీ కన్వీనర్లు ఎస్.బుచ్చిరెడ్డి గురుస్వామి, రాధాకృష్ణ గురుస్వామి, ప్రేమ్ గాంధీ గురుస్వామిలు మాట్లాడుతూ రామ్ చరణ్ ఎవరో మిత్రునికి మాట ఇచ్చారని మండల దీక్షలో దర్గాకు వెళ్లడమే కాకుండా అయ్యప్ప నియమాలను బేఖాతరు చేయడం సరికాదన్నారు. సెలబ్రిటీలు మాలధారణ చేయడం ఎంతో సంతోషకరమని కానీ మండల కాలం నిష్టగా ఉండేలా గురుస్వాముల సూచనలు పాటించాలని సూచించారు. ఈ సమావేశంలో ప్రదీప్ గురుస్వామి, సుదర్శన్ గురుస్వామి పాల్గొన్నారు.

అంబేడ్కర్ వర్సిటీలో సంతకాల సేకరణ

బంజారాహిల్స్: రాష్ట్రంలోని పేద వర్గాలకు ఉన్నత విద్యను దూరం చేయాలని ప్రభుత్వం కుట్ర పన్నుతోందని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ జేఏసీ నేతలు ఆరోపించారు. విశ్వవిద్యాలయ పదెకరాల స్థలం జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయానికి కేటాయించాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఉద్యోగులు బుధవారం కూడా నిరసన కొనసాగించారు. ప్రభుత్వం తన ఆలోచనను వెంటనే ఉపసంహరించుకోవాలని ఉద్యోగులు డిమాండ్ చేస్తూ సంతకాల సేకరణ కార్యక్రమంలో పాల్గొని సంతకాలు చేశారు. ఈ ఈ సందర్భంగా ఐక్య కార్యాచరణ సమితి (జేఏసీ) చైర్‌పర్సన్ పల్లవీ కాబ్డే, కన్వీనర్ వడ్డాణం శ్రీనివాస్, సెక్రటరీ జనరల్ వేణుగోపాల్‌రెడ్డిలు మాట్లాడుతూ విశ్వవిద్యాలయ అధ్యాపక, అధ్యాపకేతర ఉద్యగులు, ఉద్యోగ సంఘాల నేతలు, విద్యార్థుల నుంచి ఉద్యోగుల డిమాండ్‌కు మద్దతుగా సంతకాలు సేకరించి రాష్ట్ర గవర్నర్ ముఖ్యమంత్రికి పంపించనున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా ఈ నెల 27న విశ్వవిద్యాలయంలో వంటావార్పు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆనంద్ పవార్, ఎల్వీకేరెడ్డి, చంద్రకళ, రజని, యాకేష్ దైద, ఉదయిని, నరసింహులు, శివమ్మ, కాంతం ప్రేమ్‌కుమార్, కిషోర్, రాఘవేంద్ర, పాండు, షబ్బీర్, రాములు తదితరులు ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

వ్యభిచార గృహంపై దాడి

ఖైరతాబాద్: వ్యభిచారం నిర్వహిస్తున్న ఓ గృహంపై పోలీసులు దాడిచేసి నిర్వాహకులతో పాటు విటుడిని అదుపులోకి తీసుకున్నారు. ఖైరతాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధి ఎర్రమంజిల్‌లోని తాజ్‌కృష్ణ రోడ్డులో భానువిల్లా 101 ఫ్లాట్‌లో వ్యభిచారం నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు పోలీసులు బుధవారం దాడిచేసి నిర్వాహకులు గంద్ర నర్సింహులు, ధరణికోట బూరమ్మ అలియాస్ రూటమ్మలతోపాటు విటుడు సంఘ సందీప్ (40)లను అదుపులోకి తీసుకున్నారు. నిర్వాహకులు కొంతకాలంగా వివిధ రాష్ట్రాల నుంచి యువతులను తీసుకువచ్చి వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సర్వే సిబ్బంది సమన్వయంతో పనిచేయాలి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న సీఎన్ రెడ్డి

రహమత్‌నగర్: కులగణన సర్వేలో ఎన్యుమరేటర్స్, సూపర్‌వైజర్లు సమన్వయంతో పనిచేసి ప్రభుత్వ లక్ష్యాన్ని పూర్తిచేయాలని కార్పొరేటర్ సీఎన్‌రెడ్డి సూచించారు. బ్రహ్మశంకర్‌నగర్ కమ్యూనిటీ హాల్లో బుధవారం ఏర్పాటు చేసిన సర్వే సిబ్బంది సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన సమయంలో సర్వే పూర్తి చేయాలని సిబ్బందిని కోరారు. ఎలాంటి అనుమానాలకు తావు లేకుండా సర్వే ఉండాలని తెలిపారు. డివిజన్‌లో కొన్ని బస్తీల్లో సర్వే మందకొడిగా సాగుతున్నట్లు తమకు ఫిర్యాదులు అందుతున్నాయని అలా జరుగకుండా వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. డివిజన్ కాంగ్రెస్ నాయకులు, బస్తీ అధ్యక్షులు సర్వే సిబ్బందికి సహకరించాలని సూచించారు. ఏఎంసీ బాలరాజు, కాంగ్రెస్ నాయకులు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

పెండింగ్ పనులు పూర్తి చేయండి



రహమత్‌నగర్: రహమత్‌నగర్ డివిజన్‌లో పెండింగ్ పనులు వెంటనే చేపట్టాలని కాంగ్రెస్ నాయకులు బుధవారం సర్కిల్–19 డీఎంసీ జకీయా సుల్తానాను కోరారు. ఈ మేరకు హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్‌కు సిఫారసు చేసిన లేఖను రాష్ట్ర ఎస్ఎస్‌యూఐ అధ్యక్షుడు వెంకటస్వామి, నగర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి భవాని శంకర్, డివిజన్ నాయకుడు గ్యార నాగరాజులు డీఎంసీకి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రహమత్‌నగర్ డివిజన్ అమూల్ బేకరి వద్ద ఓపెన్ నాలా సమస్యతో పాటు నిలిచిపోయిన కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు చేపట్టాలని వారు కోరారు.

క్రైం కార్నర్..

యువకుడి అదృశ్యం

వెంగళరావునగర్: తిరుపతి వెళ్ళిన యువకుడు అదృశ్యమైన సంఘటన మధురానగర్ పీఎస్‌లో చోటుచేసుకుంది. పోలీసులు కథనం ప్రకారం ... శ్రీకాకుళం ప్రాంతానికి చెందిన బి.ప్రకాశ్ స్థానిక కార్మికనగర్‌లో ఉంటూ కార్మికుడిగా జీవనం సాగిస్తున్నాడు. అతని కుమారుడు రవి కుమార్ గత 15 ఏళ్ళుగా శ్రీకాకుళంలోని అత్త వద్ద ఉంటున్నాడు. 12వ తేదీ తండ్రికి ఫోన్ చేసి తిరుపతి వెళుతున్నట్లుగా, 13వ తేదీ దర్శనం చేసుకున్నానని, 14న తిరుపతి నుంచి సికింద్రాబాద్ వస్తున్నానని చెప్పాడు. అయితే 15న ప్రకాశ్ తన కుమారుడికి ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. దీంతో ఆందోళన చెందిన ప్రకాశ్ మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రేమ, పెళ్లి పేరుతో మోసం

వెంగళరావునగర్: పెళ్ళి చేసుకుంటానని నమ్మించి యువతిని మోసం చేసిన యువకుడిపై మధురానగర్ పీఎస్‌లో కేసు నమోదైంది. పోలీసులు కథనం ప్రకారం... మధురానగర్ పీఎస్ పరిధిలో నివసించే ఓ యువతి శ్రీనగర్ కాలనీలోని ఓ బ్యూటీ సెలూన్‌లో ఉద్యోగం చేస్తుంది. ఆ సమయంలో కూకట్‌పల్లికి చెందిన రావి రాజేష్‌తో పరిచయం అయింది. వారి పరిచయం కాస్త స్నేహంగా మారి అనంతరం ఇరువురు ప్రేమించుకున్నారు. ఈ క్రమంలో ఆమెను పెళ్ళి చేసుకుంటానని నమ్మించి రాజేష్ శారీరకంగా లోబర్చుకున్నాడు. అంతేకాకుండా బేగంపేటలో ఓ గదిని తీసుకొని కలిసి ఉన్నారు. ఈ క్రమంలో పెళ్లి గురించి అడగ్గా గదిని ఖాళీ చేసి కూకట్‌పల్లిలోని తన సోదరి ఇంటికి వెళ్ళి ఉంటున్నాడు. అయితే రాజేష్‌కు వేరే అమ్మాయితో నిశ్చితార్థం జరుగుతుందని తెలిసిన సదరు యువతి రాజేష్ తండ్రికి ఫోన్ చేసి తనను ప్రేమ, పెళ్ళి పేరుతో మోసం చేసిన విషయాన్ని తెలియజేసింది. ఆయన మాత్రం తమ కుమారుడికి ఈనెల 14న వేరే అమ్మాయితో నిశ్చితార్థం అయిందని సమాధానం చెప్పాడు. దీంతో తనను మోసం చేసిన రాజేష్‌పై చర్యలు తీసుకోవాలని యువతి మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఖైరతాబాద్: సైఫాబాద్ డివిజన్ పరిధిలోని విద్యుత్ మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రాంతాల వారీగా విద్యుత్ సరఫరా నిలినివేస్తున్నట్లు సైఫాబాద్ డివిజన్ అసిస్టెంట్ మేనేజర్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి 1గంట వరకు ఎపీపీఎస్సీ ఫీడర్ పరిధిలో పటేల్‌నగర్, ఎగ్జిబిషన్ ఏరియా, ఎపీహెచ్‌బీ కాలనీ, అజంతా గేట్ ఫీడర్ పరిధిలో సరోజిని నాయుడు డిప్లొమా కాలేజీ, అజంతా గేట్, నిజాం కాలేజ్ 11కెవీ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిజాం కాలేజ్, లా కాలేజ్, యునైటెడ్ ఇన్సూరెన్స్ బిల్డింగ్, కింగ్ కోటీ షేర్‌గేట్, భారతి విద్యాభవన్, గన్‌ఫౌండ్రీ, సూర్యలోక్ కాంప్లెక్స్ ఏరియాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

వెంగళరావునగర్‌లో..

వెంగళరావునగర్: స్వరాజ్‌నగర్, సుందర్‌నగర్ 11కెవీ ఫీడర్లు బోరబండ, ఆల్విన్ సబ్‌స్టేషన్ల పరిధిల్లో జరుగుతున్న మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంటవరకు స్వరాజ్‌నగర్, సైట్–2, సాయిబాబానగర్, పద్మావతినగర్, అల్లాపూర్, బంజారానగర్, సుందర్‌నగర్, మోడల్ కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని గ్రీన్‌లాండ్స్ సీబీడీ ఏడీఈ చరణ్‌సింగ్ బుధవారం తెలిపారు. అదేవిధంగా భరత్‌నగర్, బేగంపేట 11కెవీ ఫీడర్లు ఐడీపీఎల్, ఈఎస్ఐ సబ్‌స్టేషన్ల పరిధిల్లో జరుగుతున్న మరమ్మతుల వల్ల హెచ్‌పీ రోడ్, లక్ష్మీకళ, శ్రీరాములు థియేటర్ల ఏరియా, అశ్వినీ హెయిర్ ఆయిల్ లైన్స్‌తో పాటుగా బాపూనగర్, జస్టిస్ రమణ లైన్, అప్పర్ వాటర్‌ట్యాంక్, ఆంధ్రాబ్యాంక్ లైన్లలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని దీనిని గమనించగలరని పేర్కొన్నారు.

నగరంలో నేడు

- మాదాపూర్‌లోని శిల్పారామం వేదికగా లోక్ మంథన్–2024 కార్యక్రమం ఉదయం 11 గంటలకు జరుగుతుంది.
- ఎన్టీఆర్ స్టేడియంలో సాయంత్రం 5.30 నుంచి రాత్రి 10 గంటల వరకు కార్తీక మాసం సందర్భంగా కోటి దీపోత్సవం జరుగుతుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

కొత్వాల్ కుటుంబ వివరాలు సర్వేలో నమోదు



సర్వేలో వివరాలు అందజేస్తున్న నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్

బంజారాహిల్స్: సమగ్ర కుటుంబ సర్వేలో భాగంగా ఎన్యుమరేటర్లు బుధవారం నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ కుటుంబ వివరాలను నమోదు చేశారు. సర్వేలో భాగంగా జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్–78లోని భరణి లేఅవుట్‌లోని సీవీ ఆనంద్ నివాసానికి జూబ్లీహిల్స్ సర్కిల్–18 డీసీ ప్రశాంతి, జూబ్లీహిల్స్ వార్డు ఇన్‌చార్జి ఆఫీసర్ విజయ్‌కుమార్, సర్వే సూపర్‌వైజర్ రాజ్‌కుమార్, ఎన్యుమరేటర్ నీరజ వెళ్లారు.

23న బీసీ కమిషన్ బహిరంగ విచారణ

హైదరాబాద్ రెవెన్యూ అధికారి వెంకటాచారి



సాక్షి,సిటీబ్యూరో: బీసీ కమిషన్ బహిరంగ విచారణ చేపట్టనున్న నేపథ్యంలో బీసీ తరగతులవారు సామాజిక, ఆర్థిక, విద్యా రంగాలకు సంబంధించి సలహాలు, సూచనలను కమిషన్‌కు ఇవ్వాలని హైదరాబాద్ జిల్లా రెవెన్యూ అధికారి ఈ.వెంకటాచారి సూచించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ కుల సంఘాల వారితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో సామాజికంగా, విద్యాపరంగా, ఆర్థికంగా వెనుకబడిన తరగతుల స్థితిగతులపై విచారణ నిర్వహించేందుకు బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, కమిటీ సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, బాల లక్ష్మి, బీసీ వెల్ఫేర్ కమిషనర్ సభ్య కార్యదర్శి ఈనెల 23న హైదరాబాద్ కలెక్టరేట్(లక్డీకాపూల్)లో ఉదయం 10.00 గంటల నుంచి సాయంత్రం 4.00 గంటల వరకు బహిరంగ విచారణ చేపట్టనుందని తెలిపారు.సూచనలు, సలహాలను కమిషన్‌కు అఫిడవిట్ రూపంలో అందించాలని సూచించారు. అఫిడవిట్ ఒరిజినల్ సెట్ ఒకటితోపాటు 5 జిరాక్స్ సెట్లను ఇవ్వవలసి ఉంటుందని అన్నారు. అఫిడవిట్ స్వీకరణకు 3 కౌంటర్ల ఏర్పాటుతో రిసెప్షన్, అప్లికేషన్ల వెరిఫై, అసిస్టెన్స్ కోసం సలహాలు, మార్గదర్శనం చేసేందుకు డిప్యూటీ తహసీల్దార్, సహాయ బీసీ సంక్షేమ అధికారులను నియమించినట్లు తెలిపారు. సమావేశంలో బీసీ సంక్షేమ శాఖ ఉపసంచాలకులు జి.ఆశన్న, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి ఇలియాజ్ అహ్మద్, సహాయ బీసీ సంక్షేమ అధికారి టి.నరసింహులు, వివిధ కుల సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పన్నులు ఎగ్గొట్టేలా.. ఖజానాకు గండి కొట్టేలా..

వాణిజ్య పన్నుల శాఖలో అక్రమార్కుల హవా



- డీలర్లకు తప్పుడు మార్గాలు చూపుతున్న వైనం
- పట్టించుకోని ఉన్నతాధికారులు
- ఏసీబీ వలకు చిక్కినా.. మారని ఉద్యోగుల తీరు

సాక్షి, సిటీబ్యూరో: వాణిజ్య పన్నులశాఖ అవినీతిపరుల అడ్డాగా మారుతోంది. అక్కడ అక్రమార్కులు ఆడింది ఆట పాడిందిపాట. అవినీతికి అలవాటు పడిన పలువురు ఉద్యోగులు ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతూ తమ జేబులు నింపుకుంటున్నారు. వీరు అక్రమార్జన కోసమే వాణిజ్య పన్నులశాఖ ఉద్యోగాల్లోకి వచ్చారా.. అనే అనుమానం తలెత్తుతోంది. ఒకవైపు పన్నుల వసూలుకు ఉన్నతాధికారులు శ్రమిస్తుంటే, మరోవైపు కొందరు సిబ్బంది అప్రతిష్ట పాలు చేస్తున్నారు. డీలర్లకు పన్నులు ఎగ్గొట్టే అక్రమ మార్గాలు చూపుతూ అందినంత దండుకుంటున్నారు. డిపార్ట్‌మెంట్‌లోని పలువురు ఉన్నతాధికారులు దోస్తానా పెంచి లంచాల దుకాణం తెరుస్తున్నారు. మరోవైపు ఉద్యోగుల వేధింపులు భరించలేక కొందరు బాధితులు ఏసీబీని ఆశ్రయిస్తున్నారు.

కార్యాలయాలే వ్యాపార కేంద్రాలుగా..

పన్నులు కట్టడం కోసం లేదా ఏమైనా ఇబ్బందులు తలెత్తి కార్యాలయానికి ఎవరైనా డీలర్ వస్తే చాలు.. ఉద్యోగులు బహిరంగంగానే వారికి ఆఫర్ ఇస్తున్నారు. ముడుపులు ముట్టజెబితే పని చేసి పెడతామని వారికి ఆశపెడుతున్నారు. పలు డివిజన్లు, సర్కిల్ కార్యాలయాల్లో రెండు రకాల ఉద్యోగులు ఉన్నారు. కొందరు కార్యాలయంలో ఉండి డీలర్లను మేనేజ్ చేస్తుండగా, మరికొందరేమో డీలర్ల వద్దకు వెళ్లి వారికి కావాల్సిన పనులు చేసి పెడుతున్నారు. మరో రకం ఉద్యోగులు కూడా ఉన్నారు. వీరు ఏ పనీ చేయరు, కేవలం పైరవీల మాత్రమే చేస్తారు. ముడుపులు ముట్టజెబితే చాలు, పన్నుల చెల్లింపు విషయంలో ఎంత క్లిష్ట సమస్య అయినా వీరు ఇట్టే పరిష్కరిస్తారు. ఇంత జరుగుతున్నా జాయింట్ కమిషనర్లకు ఏ విషయమూ తెలియదా అనే అనుమానాలు తలెత్తుతున్నాయి.

ఏళ్లు గడుస్తున్నా ఓకే చోటా..

ఆరేళ్ల నుంచి ఆ శాఖలో బదిలీలులేవు. స్థానచలనం కలిగించేందుకు ఉన్నతాధికారులు సాహసించలేదు. కాసులు కురిపించే వాణిజ్య శాఖలో జాయింట్ కమిషనర్ మొదలు సీనియర్, జూనియర్ అసిస్టెంట్ వరకు ఏళ్ల తరబడి ఒకేచోట తిష్ట వేశారు. ప్రభుత్వ ఆదాయార్జన శాఖలో పనిచేసే అధికారులను రెండేళ్లకోసారి బదిలీ చేయాల్సి ఉంటుంది. ఏళ్ల తరబడి ఒకే చోటా తిష్టవేసి ఉండటంతో ఆ శాఖలో అవినీతి తారస్థాయికి చేరుకుంది. దీనికి నిదర్శనం శాఖలోని పలువురు ఉద్యోగులు ఇటీవల ఏసీబీకి పట్టుబడటమే. శాఖలో అవినీతి తగ్గాలంటే బదిలీల ప్రక్రియ జరగాలి. సర్కిళ్లలో దీర్ఘకాలికంగా సీట్లకు అతుక్కుపోయిన వారిని తక్షణమే బదిలీ చేయాలని ఉద్యోగుల సంఘాల నేతలు పలువురు అభిప్రాయపడుతున్నారు.

'బీసీల సమరభేరి'కి రండి..!

- మహేష్‌కుమార్‌గౌడ్‌కు బీసీ సంక్షేమ సంఘం ఆహ్వానం



మహేష్ కుమార్‌గౌడ్‌కు ఆహ్వానపత్రికను అందజేస్తున్న గుజ్జ కృష్ణ

కాచిగూడ: జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ఆధ్వర్యంలో ఈ నెల 25న రవీంద్రభారతిలో నిర్వహించనున్న 'బీసీల సమరభేరి'సభకు హాజరుకావాలని కోరుతూ టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌ను సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ నేతృత్వంలో ప్రతినిధులు బుధవారం కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా గుజ్జ కృష్ణ మాట్లాడుతూ దేశ జనగణనలో కులగణన చేపట్టాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టి బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని, క్రీమీలేయర్‌ను ఎత్తివేయాలంటూ కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ పార్టీ ఒత్తిడి చేయాలని కోరారు. బీసీల కోసం కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని, కేంద్ర బడ్జెట్‌లో బీసీలకు రూ.2 లక్షల కోట్లు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి తంగెళ్ళముడి నందగోపాల్, వర్కింగ్ ప్రెసిడెంట్ నీల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆ శిశువులపై ప్రత్యేక శ్రద్ధ అవసరం

- 'ప్రిమెచ్యూర్ డే' అవగాహన సదస్సులో ఆర్.వి.కర్ణన్



సదస్సును ప్రారంభిస్తున్న కర్ణన్. చిత్రంలో డాక్టర్ ఎస్.రవికుమార్, డాక్టర్ నరేందర్, డాక్టర్ ఉషారాణి, డాక్టర్ వినోద్

నాంపల్లి: నెలలు నిండక ముందే పుట్టిన శిశువులపై అదనపు సంరక్షణ, ఎక్కువ శ్రద్ధ అవసరమని రాష్ట్ర కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆర్.వి.కర్ణన్ అన్నారు. 'ప్రపంచ ప్రిమెచ్యూర్ డే'ను పురస్కరించుకుని బుధవారం నిలోఫర్ ఆసుపత్రిలో 'నెలలు నిండక ముందే జన్మించే శిశువుల సంరక్షణ– తీసుకోవాల్సిన జాగ్రత్తలు' అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నెలలు నిండక ముందే జన్మించే శిశువులు అనారోగ్య సమస్యలను తమ వెంట తెచ్చుకుంటారని అన్నారు. వీరు ఎదిగే క్రమంలో కూడా ఎన్నో రకాల సమస్యలకు లోనవుతుంటారని పేర్కొన్నారు. నిలోఫర్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.రవికుమార్ మాట్లాడుతూ ప్రసవానంతరం తల్లులు పోషకాహారం తీసుకోకపోతే అసహజ నరాల అభివృద్ధికి దారితీస్తుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ స్వప్న, ఉస్మానియా మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ నరేందర్, ప్రొఫెసర్ టి.ఉషారాణి, ఆర్ఎంఓ నాగజ్యోతి, వైద్యులు డాక్టర్ వినోద్‌కుమార్, డాక్టర్ గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ యార్డుల్లో వసతులు కల్పించాలి

తెలంగాణ మేధావుల సంఘం చైర్మన్ డాక్టర్ కేశవులు

సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో రైతులకు కనీస సదుపాయాలు కల్పించాలని తెలంగాణ మేధావుల సంఘం చైర్మన్ డాక్టర్ కేశవులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. వ్యవసాయ రాష్ట్రమైన తెలంగాణలో రైతులు తమ ఉత్పత్తులను విక్రయించుకోవడానికి అవస్థలు పడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. పలు రాష్ట్రాల్లో అధునాతన ఏర్పాట్లతో మార్కెట్ యార్డులు రైతులకు వరంగా ఉన్నాయని, తెలంగాణలో మాత్రం వర్షం కురిస్తే యార్డుల్లోనే పంటల ఉత్పత్తులు తడిసిపోయే పరిస్థితి నెలకొందని అన్నారు. సరిపడా ఎలక్ట్రానిక్ తూకాలు, తాగునీటి సౌకర్యం, రైతులకు విశ్రాంతి గదులు లేవని, పంట విస్తీర్ణాలు, రికార్డు స్థాయిలో ఉత్పత్తులు పెరుగుతున్నా మార్కెట్ యార్డుల విస్తరణ కొరవడిందని పేర్కొన్నారు. చాలాచోట్ల తరాజులు, బాట్లతోనే తూకాలు నిర్వహిస్తుండటంతో రైతులు నష్టపోతున్నారని పేర్కొన్నారు. చాలా యార్డుల్లో వేబ్రిడ్జీలు లేవన్నారు. వరంగల్ యార్డులో మూడు వేబ్రిడ్జీలున్నా ఆపరేటర్ లేక వాటిని నిర్వహించడంలేదని, గత్యంతరం లేక రైతులు ప్రైవేటు వేబ్రిడ్జీలను ఆశ్రయిస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలోని యార్డుల్లో 64 చోట్ల చిన్న గోదాములే ఉన్నాయని, అవి ప్రస్తుత అవసరాలకు సరిపోవడం లేదన్నారు. మిగిలిన యార్డుల్లో స్థలాలున్నా గోదాముల నిర్మాణం చేపట్టలేదని ఆయన విచారం వ్యక్తం చేశారు.

తాబేళ్లు, చేపలు మృత్యువాత

- నాంపల్లి పబ్లిక్‌గార్డెన్ బావిలో ఘటన
- కాలుష్యం, విషప్రయోగంపై అనుమానాలు



బావిలో మృతి చెందిన చేపలు

నాంపల్లి: పబ్లిక్‌గార్డెన్ బావిలోని చేపలు, తాబేళ్లు అనుమానాస్పదస్థితిలో మృత్యువాత పడ్డాయి. శాసనమండలి సభా ప్రాంగణం ముఖద్వారంలో చరిత్రాత్మక నేపథ్యమున్న ఈ బావి ఒకప్పుడు గార్డెన్స్‌లోని చెట్లకు నీరందించేది. ఇప్పుడు బోర్లనీరు వినియోగించడం వల్ల దాని ప్రాముఖ్యత క్రమంగా తగ్గుతూ వచ్చింది. అప్పట్లో బావి నుంచే విధాన సభ, విధాన పరిషత్ ప్రాంగణాలకు నీటి సరఫరా అయ్యేది. ఈ బావిలో ఎంతో విలువైన నక్షత్ర తాబేళ్లు, సాధారణ తాబేళ్లు, రకరకాల చేపలు ఉండేవి. పబ్లిక్ గార్డెన్ పార్కు వాకర్స్, సందర్శకులను ఇవి కనువిందు చేసేవి. అయితే అకస్మాత్తుగా ఈ బావిలోని చేపలు, తాబేళ్లు మృత్యువాత పడి నీటిపైన తేలియాడుతూ కనిపించడంతో అందరూ విస్మయానికి గురయ్యారు. బావిలోకి కాలుష్య కారకాలేమైనా చేరాయా లేక ఎవరైనా విష ప్రయోగం చేశారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. అయితే మునుపటి మాదిరిగా బయటి వ్యక్తులు బావి దరిదాపుల్లోకి వెళ్లడానికి వీలు లేకుండా చుట్టూ ఫెన్సింగ్ చేసినా, ఇంత భద్రత ఉన్నా ఇలాంటి ఘటన చోటు చేసుకోవడం గమనార్హం.

లగచర్ల ఘటనకు కేటీఆరే కారకుడు



సమావేశంలో అభివాదం చేస్తున్న గిరిజన సంఘాల నాయకులు

- గిరిజన శక్తి ప్రతినిధుల ఆరోపణ

పంజగుట్ట: వికారాబాద్ జిల్లా లగచర్లలో జరిగిన ఘటనకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆరే కారకుడని, అమాయక గిరిజనులను రెచ్చగొట్టి వారిని బలిపశువు చేశారని, వెంటనే ఆయనను అరెస్టు చేయాలని గిరిజన శక్తి డిమాండ్ చేసింది. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీమంత్రి రవీంద్ర నాయక్, గిరిజన శక్తి వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ వెంకటేష్ చౌహాన్, రాష్ట్ర అధ్యక్షుడు శరత్ నాయక్ మాట్లాడుతూ లగచర్ల, పరిసర గ్రామాల భూములను రాష్ట్ర ప్రభుత్వం కొంతకాలంగా ఇండస్ట్రియల్ పార్క్ కోసం సేకరిస్తోందన్నారు. ఈ క్రమంలో ఈ నెల 11వ తేదీన కేటీఆర్, మాజీ ఎమ్మెల్యే, అతని అనుచరులు ఆ ప్రాంతంలోని అమాయక గిరిజనులను రెచ్చగొట్టి దాడిలో పాల్గొనేలా చేశారని పేర్కొన్నారు. అధికారులపై దాడి చేయాలని ఘటనకు ముందే మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి గ్రామ ప్రజలకు బహిరంగంగా చెప్పారని గుర్తుచేశారు. త్వరలోనే గిరిజన శక్తి ఆధ్వర్యంలో నిజనిర్ధారణ కమిటీగా ఏర్పడి లగచర్ల, పరిసర గ్రామాల్లో పర్యటిస్తామని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి అమాయక గిరిజనులపై పెట్టిన కేసులు ఉపసంహరించుకోవాలని విజ్ఞప్తి చేస్తామన్నారు. సమావేశంలో వివిధ గిరిజన సంఘాల నాయకులు అంజయ్య, శ్రీరామ్, సురేందర్, రమేష్, హనుమంతు, అమర్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

యూజీసీ చైర్మన్‌తో అగ్రకల్చర్ వర్సిటీ వీసీ భేటీ



యూజీసీ చైర్మన్‌ను కలిసిన వీసీ జానయ్య

ఏజీవర్సిటీ: యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యూజీసీ) చైర్మన్ డాక్టర్ జగదీశ్వర్‌ను ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ అల్దాస్ జానయ్య న్యూఢిల్లీలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు జానయ్య వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా ఇరువురూ జాతీయ విద్యావిధానం ప్రాధాన్యత, ఆవశ్యకతపై చర్చించారు. ఈ విధానంపై ఉన్న అపోహలను డాక్టర్ జగదీశ్వర్ నివృత్తి చేశారు. భవిష్యత్తు అవసరాలకనుగుణంగా వ్యవసాయ వర్సిటీ విస్తరణపై కూడా పలు సూచనలు చేశారు. వచ్చేనెల 20 తేదీన జరగనున్న వ్యవసాయ విశ్వవిద్యాలయం వజ్రోత్సవాలకు హాజరుకావాలని కోరగా డాక్టర్ జగదీశ్వర్ సానుకూలంగా స్పందించినట్లు వీసీ తెలిపారు. వర్సిటీలో నిర్మించతలపెట్టిన విద్యార్థినుల వసతిగృహ నిర్మాణానికి యూజీసీ సహకారం అందిస్తుందని హామీ ఇచ్చినట్లు తెలిపారు. డాక్టర్ జగదీశ్వర్, జానయ్యల స్వస్థలం నల్లగొండ జిల్లా మామిడాల కావడం గమనార్హం. ఇద్దరమూ చిన్నప్పుడు కలిసి చదువుకుని ఆడుకున్నట్లు వీసీ తెలిపారు. ఈ సందర్భంగా చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నట్లు పేర్కొన్నారు.

మత్స్యకారుల రక్షణ చట్టం తీసుకురావాలి

- మన ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు చొప్పరి శంకర్



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ చొప్పరి శంకర్ ముదిరాజ్

కాచిగూడ: రాష్ట్రంలోని మత్స్యకారులకు రక్షణ చట్టం తీసుకురావాలని మన ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చొప్పరి శంకర్ ముదిరాజ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం హైదర్‌గూడలోని మహాసభ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రపంచ మత్స్య దినోత్సవం సందర్భంగా ఈ నెల 21వ తేదీన మహాసభ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా మత్స్య దినోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. మత్స్య రంగంలో దళారీ వ్యవస్థను అరికట్టి మత్స్యకారులే మార్కెటింగ్ చేసుకునే అవకాశం కల్పించాలని కోరారు. యాభై సంవత్సరాలు నిండిన మత్స్యకారులకు పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. జీవో నంబర్ 6ను అమలు చేయడంతో పాటు కొత్త సొసైటీలను ఏర్పాటు చేసి 18 ఏళ్లు నిండిన మత్స్యకారులకు సభ్యత్వాలు కల్పించాలన్నారు. కార్యక్రమానికి ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, టీఎండీసీ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్, నీలం మధు ముదిరాజ్ తదితరులు హాజరవుతారని తెలిపారు. సమావేశంలో మహాసభ ప్రతినిధులు శివయ్య, ముదిరాజ్, మద్దెల సంతోష్, పగిడాల సుధాకర్, గొడుగు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గిగ్ కార్మికుల హక్కులను కాపాడాలి

సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్రంలో గిగ్, ప్లాట్‌ఫామ్ కార్మికుల హక్కులు కాపాడే విధంగా తక్షణమే చర్యలు చేపట్టాలని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారని తెలంగాణ గిగ్, ప్లాట్‌ఫామ్ వర్కర్స్ యూనియన్ వ్యవస్థాపక అధ్యక్షుడు షేక్ సలావుద్దీన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో 4.2 లక్షల మందికిపైగా గిగ్, ప్లాట్‌ఫామ్ కార్మికులు ఉన్నారని పేర్కొన్నారు. ఆరోగ్యం, ప్రసూతి సెలవులు, ప్రమాద బీమా వంటి సామాజిక భద్రతా ప్రయోజనాలను అందించేందుకు సంక్షేమబోర్డును ఏర్పాటు చేయాలని, కర్ణాటకలో మాదిరిగా ట్యాక్సీ చార్జీల నియంత్రణ, న్యాయమైన వేతనాల కోసం చర్యలు చేపట్టాలని సూచించారు.

పట్టణ, గ్రామీణ విద్యార్థులకు ఒకే విద్యాబోధన

'పిల్లలు – ప్రజావాణి' కార్యక్రమంలో చిన్నారెడ్డి ఆకాంక్ష



బుధవారం ప్రజాభవన్‌లో జరిగిన 'పిల్లలు-ప్రజావాణి' అనే కార్యక్రమంలో మాట్లాడుతున్న చిన్నారెడ్డి. చిత్రంలో ప్రత్యేక అధికారి దివ్య తదితరులు

లక్డీకాపూల్: గ్రామీణ ప్రాంత విద్యార్థులకు సమకాలీన అంశాలతోపాటు పాఠ్యాంశాలపై డిజిటల్ ఆన్‌లైన్ తరగతులు నిరంతరంగా నిర్వహించాల్సిన ఆవశ్యకత ఉందని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జి.చిన్నారెడ్డి అభిప్రాయపడ్డారు. బుధవారం మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో రాష్ట్రంలోని 10 ఉమ్మడి జిల్లాల ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులతో యూనిసెఫ్ సారథ్యంలో అలయెన్స్ ఫర్ చైల్డ్ రైట్స్, మహిత సంస్థ ' పిల్లలు – ప్రజావాణి ' అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన చిన్నారెడ్డి మాట్లాడుతూ పట్టణాలు, నగర విద్యార్థులకు నూతన పద్ధతుల్లో విద్యాభ్యాస అవకాశాలు ఉంటాయని, గ్రామీణ విద్యార్థులకు ఇలాంటివి ఉండవన్నారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్తానని ఆయన చెప్పారు. విద్యారంగాన్ని అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి ఎంతో కృషి చేస్తున్నారని, అందులో భాగంగా 25 ఎకరాల విస్తీర్ణంలో సమీకృత విద్యాలయాల నిర్మాణాలను చేపట్టారని అన్నారు. కార్యక్రమంలో ప్రజావాణి ప్రత్యేకాధికారి దివ్య దేవరాజన్, చైల్డ్ ప్రొటెక్షన్ కమిషన్ చైర్మన్ శ్రీనివాసరావు, కార్మిక శాఖ అదనపు కమిషనర్ గంగాధర్, విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ వెంకటలక్ష్మి, మహిళా శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ మోతె మహిత, ప్రోగ్రాం డైరెక్టర్ రమేష్ శేఖర్‌రెడ్డి, యూనిసెఫ్ ప్రతినిధులు ఖ్యాతి తివారీ, ప్రసన్ సేన్ తదితరులు పాల్గొన్నారు.

వెటరన్ క్రీడాకారులను ఆదుకుంటాం

రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన శివసేనారెడ్డి



క్రీడాకారుడు అఫ్జల్‌ను పరామర్శిస్తున్న శివసేనారెడ్డి తదితరులు

గన్‌ఫౌండ్రీ: రాబోయే నూతన క్రీడా పాలసీలో వెటరన్ క్రీడాకారులను ఆదుకోవడానికి ప్రత్యేక నిబంధనలు రూపొందిస్తామని రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన శివసేనారెడ్డి తెలిపారు. ఈ మేరకు బుధవారం వెటరన్ క్రీడాకారుడు డీఎంకే అఫ్జల్‌ను ఆయన ఇంటికి వెళ్లి కలిశారు. ఈ సందర్భంగా శివసేనారెడ్డి మాట్లాడుతూ 1962లో జకార్తాలో జరిగిన ఏసియన్ గేమ్స్‌లో ఇండియాకు స్వర్ణ పతకం సాధించిన ఫుట్‌బాల్ జట్టులో అఫ్జల్ సభ్యుడని గుర్తుచేశారు. వెటరన్ క్రీడాకారులను ప్రోత్సహించి వారికి అండగా నిలబడాలనే ఉద్దేశంతో రూ.3 లక్షల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఆర్థికంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న అఫ్జల్‌కు చెక్కు అందజేశారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ అథారిటీ ఎండీ సోనీ బాలాదేవి, షబ్బీర్ అలీ, అముల్‌రాజ్ పాల్గొన్నారు.

తులసి, ఉసిరి చెట్లకు పెళ్లంట!

భక్తులకు కనువిందు.. పసందైన విందు



తులసి-ఉసిరి చెట్లకు వివాహం చేస్తున్న వేద పండితులు



హాజరైన భక్తులు

వెంగళరావునగర్: వినడానికి కొద్దిగా విడ్డూరంగా ఉన్నా, చూడటానికి కొంత వింతగా ఉన్నా వేద పండితుల సాక్షిగా రెండు చెట్లు ఒక్కటయ్యాయి. వెంగళరావునగర్ కాలనీలో తులసి మొక్కకు, ఉసిరి చెట్టుకు వివాహం జరిపించారు. మహిళలు భారీగా తరలివచ్చారు ఈ వివాహానికి. పెళ్లి తంతు అనంతరం నిర్వాహకులు భోజన కార్యక్రమాలను కూడా ఏర్పాటు చేశారు. పెద్దమ్మతల్లి యువ సంకల్ప్ ఆధ్వర్యంలో బుధవారం మధ్యాహ్నం ఈ వివాహ వేడుకలు కన్నుల పండువగా జరిగాయి. ఈ సందర్భంగా నిర్వాహకులైన అర్జున్ అండ్ కమిటీ నేతలు మాట్లాడుతూ కార్తీకమాసంలో ప్రజలంతా ఐక్యంగా, సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ తులసి-ఉసిరి చెట్లకు వివాహం జరిపించినట్లు చెప్పారు. గత పదేళ్ళుగా ఈ వివాహ కార్యక్రమాలను జరిపిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అర్జున్‌తోపాటు కమిటీ మెంబర్లు సుగుణ, లావణ్య, దివ్య, మణి, సౌజన్య, ఆమని, ప్రవీణ తదితర కాలనీవాసులు పాల్గొన్నారు.

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్, గురువారం, 21 నవంబర్ 2024





మాతృత్వం

ఓ మధురానుభూతి!


- పిల్లల్ని కనడం, పెంచడం, భారం అనుకోవద్దు..
- పనితో పాటు కుటుంబాన్ని బ్యాలెన్స్ చేసుకున్నాం: నటి రమ్యకృష్ణ

సాక్షి, సిటీబ్యూరో: మాతృత్వం.. ఓ మధురానుభూతి అని ప్రముఖ నటి రమ్యకృష్ణ పేర్కొన్నారు. పిల్లలు వద్దనుకుంటున్న వారి సంఖ్య పెరిగిపోతోందని, పిల్లల్ని కనడం, పెంచడం భారంగా భావిస్తున్నారని చెప్పారు. అలా అనుకోవద్దని తాము కూడా వృత్తితో పాటు కుటుంబాన్ని బ్యాలెన్స్ చేసుకున్నామని తెలిపారు. నగరంలోని ఓ హోటల్‌లో ఒయాసిస్ ఫర్టిలిటీ సెంటర్ 15వ వార్షికోత్సవం బుధవారం జరిగింది. ముఖ్య అతిథిగా ప్రముఖ నటి రమ్యకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఒయాసిస్ ఫర్టిలిటీ సెంటర్ వ్యవస్థాపకురాలు డాక్టర్ దుర్గారావును ఫర్టిలిటీ, ఐవీఎఫ్‌కు సంబంధించి ఆమె పలు ప్రశ్నలను అడిగి నివృత్తి చేసుకున్నారు. జపాన్‌లో కొన్నేళ్లుగా యువ జనాభా విపరీతంగా తగ్గిపోతోందని, పూర్తిగా వృద్ధుల జనాభా పెరుగుతోందని, ఈ నేపథ్యంలో అక్కడి ఆర్థిక వ్యవస్థ దారుణంగా దెబ్బతింటోందని డాక్టర్ దుర్గారావు పేర్కొన్నారు. మన దేశంలో కూడా సంతానోత్పత్తి రేటు 1.8 ఉందని, అది 2కు పైగా ఉండాల్సిన అవసరం ఉందని వివరించారు. ఈ సందర్భంగా ఒయాసిస్ ఫర్టిలిటీ సెంటర్ ద్వారా జన్మించిన పలువురు పిల్లలకు స్కాలర్‌షిప్‌లు అందజేశారు. వీరంతా రేపటి చాలెంజర్లని, రేపటి రోజును తీర్చిదిద్దే వారిని సమాజానికి అందించినందుకు గర్వంగా ఉందని వివరించారు.

ఆడపిల్లల్లో భావోద్వేగ సమతుల్యాన్ని పెంచే.. సీడ్స్ ప్రోగ్రామ్

సాక్షి, సిటీబ్యూరో: ఆడపిల్లల్లో ప్రవర్తనా నైపుణ్యాలతో వారి జీవితాల రూపాంతర క్రమాన్ని తెలియజేసే 'సీడ్స్ ప్రోగ్రామ్' నగరంలోని మూసాపేట్ వేదికగా శ్రీసత్య సాయి విద్యా మందిర్ (అనాథ, నిరుపేద ఆడపిల్లల పాఠశాల)లో ఘనంగా ప్రారంభమైంది. ది గెస్టాల్ట్ బిహేవియర్ ఇంటెలిజెన్స్ ఇనిస్టిట్యూట్ ఎల్ఎల్‌పి, సాయిసేవాసంగ్ ఆధ్వర్యంలోని శ్రీసత్యసాయి విద్యామందిర్ సంయుక్త భాగస్వామ్యంతో సీడ్స్ ప్రోగ్రామ్‌ను బుధవారం ప్రారంభించారు. ఇందులో అన్ని వయస్సుల ఆడపిల్లల్లో అనుకూలత, స్థిరత్వం, భావోద్వేగ సమతుల్యాన్ని పెంపొందించేందుకు ఈ నూతన ప్రవర్తనా నైపుణ్యాల మోడల్ రూపొందించామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మెరిడియన్ స్కూల్స్ అధ్యక్షురాలు లలితనాయుడు ఇంజేటి, జి.నారాయణమ్మ ఇంజినీరింగ్ కళాశాల వైస్ ప్రెసిడెంట్ విద్యారెడ్డి గునంపల్లి, సుశీలా ఒరుగంటి తదితరులు పాల్గొన్నారు.





ఇందిరా పార్కు

నేచర్.. లవర్స్

జిమ్స్‌కు బదులుగా ప్రకృతిలో వ్యాయామానికి నగరవాసుల ఆసక్తి

- జిమ్ కల్చర్ కూడా బాగానే ఉన్నప్పటికీ కొందరు నేచురాలిటీకే సై..
- సిటీ నలుమూలలా ప్రకృతి పరవశంతో ఉద్యానవనాలు, పార్కులు
- కేబీఆర్, ఓయూ, గచ్చిబౌలి లేక్, మృగవాణి పార్కు తదితర స్పాట్స్
- కుటుంబ సమేతంగా ఆదరణ పొందుతున్న ఈ జాగింగ్‌పై కథనం

నిత్యం తీరిక లేని నగర జీవన విధానం.. మానసిక ఒత్తిడి, శారీరక శ్రమ, అసహజ ఆహారం.. ఈ కాంక్రీట్ జంగిల్‌లో ఆరోగ్యకరమైన జీవన విధానానికి అనువైన ఒక్క అంశం కూడా లేకపోవడం దురదృష్టకరం, అనివార్యం. అలా అని అనారోగ్యాన్ని ఎవరు కోరుకుంటారు.., కాసింతైనా వ్యాయామం, జాగింగ్ ఇంకేవో ఫిట్నెస్ క్రియలకు నగరవాసులు ఆసక్తి చూపిస్తుండటం విధితమే. అయితే.. ఈ మధ్య కాలంలో ఫిట్నెస్ కోసం సహజ వాతావరణాన్ని కోరుకుంటున్నారు. ఫిట్నెస్, వ్యాయామం ఇలా ఎదైనా సరే జిమ్ లోనే వెతుక్కునే వారు. ఈ సంస్కృతిలో భాగంగా నగరంలో ప్రతి ఏరియాకు కనీసం ఒకటి, రెండైనా జిమ్‌లు వెలిశాయి. కానీ.. నేచురాలిటీ, పచ్చని ప్రకృతి పారవశ్యాన్ని కోరుకునే నగరవాసులు ఈ మధ్య పెరిగిపోతున్నారు. వీరి ఆలోచనలు, అవసరానికి తగిన కొన్ని నేచురల్ స్పాట్స్‌ను సైతం ఎంపిక చేసుకుని.. ఆరోగ్య, ఆహ్లాదం, ఆనందం పొందుతున్నారు. ఇందులో భాగంగా నగరం నలుమూలలా ఉన్న పార్కులు, ఉద్యానవనాలు ఇతర ప్రాంతాల గురించి ఓ లుక్కేద్దామా..?!!

\- సాక్షి, సిటీబ్యూరో





హైదరాబాద్ వైబ్స్



కేబీఆర్ పార్కు

హిల్ పార్క్.. కేబీఆర్

చుట్టంతా కాంక్రీట్ జంగిల్.. ఎడతెరిపిలేని వాహనాల రద్దీ.. పొగతో వాయు కాలుష్యం, వాహనాల శబ్దాలతో శబ్ద కాలుష్యం. ఇలాంటి నెగిటివిటీ మధ్య కొలువైన పచ్చని పారవశ్యంతో, అద్భుతమైన జీవవైవిధ్యంతో కొలువై ఉన్న మినీ ఫారెస్ట్ కేబీఆర్ పార్క్. ప్రకృతిలో జాగింగ్ అనగానే సిటీజనులకు మొదట గుర్తొచ్చేది కేబీఆర్ పార్క్ మాత్రమే.. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, మాదాపూర్, హైటెక్ సిటీ, గచ్చిబౌలి వంటి తదితర ప్రాంతాలకు చెందిన వ్యాయామ–ప్రకృతి ప్రియుల స్వర్గధామంలా మారింది కేబీఆర్ పార్క్. సువిశాలమైన విస్తీర్ణం, నెమళ్లు, కుందేళ్లు, పక్షులతో ప్రకృతి పారవశ్యాన్ని పంచడంతో పాటు.. నగర రద్దీకి అనుగుణంగా పార్కింగ్‌కూ అవకాశం ఉండటంతో ఈ హైటెక్ పీపుల్స్ అంతా ఈ పార్క్ బాట పడుతున్నారు.



ప్రకృతి పారవశ్యం.. కృత్రిమ హంగులు

ప్రకృతి అందాలకు తోడు కృత్రిమ హంగులకు తోడైన జాగింగ్ స్పాట్ కాజాగూడ పెద్ద చెరువు. ఈ మధ్య కాలంలో ఈ చెరువు పూడిక తీసి, చుట్టూ అదనపు ఆకర్షణలతో పాటు విశాలమైన రోడ్లు సైతం వేయడంతో.. సమీప ప్రాంతాలకు చెందిన జాగింగ్ ఔత్సాహికులు ఈ వేదికపై వాలిపోతున్నారు. ఇక్కడ పెద్దగా కమర్షియల్ భవనాలు, ట్రాఫిక్ రద్దీ వంటి సమస్యలు లేకపోవడంతో జనాలు ఎక్కువగానే వస్తున్నారు. ఇక్కడ ఏర్పాటు చేసిన ఆకర్షణీయమైన బొమ్మలతో సెల్ఫీ స్పాట్‌గానూ మారింది. దీనికి సమీపంలోనే కొంత కాలం క్రితమే అభివృద్ధి చేసి జాగింగ్, వ్యాయామం వంటి ప్రియులకు అనువైన ప్రదేశంగానూ మారింది 'మల్కం చెరువు'. ఇక లండన్, సిడ్నీని తలపించే రాయదుర్గం, మాదాపూర్ మధ్యలో కొలువైన అందాల చెరువు 'దుర్గం చెరువు'. పొద్దున్నే వాహనాల రాకపోకలు ప్రారంభమైనప్పటికీ ఇక్కడ జాగింగ్‌ను ఎంజాయ్ చేసేవారు ఎందరో.. కేబుల్ బ్రిడ్జ్ దీనికి అదనపు ఆకర్షణ. కొండాపూర్ సమీపంలో ఎప్పటి నుంచో ప్రకృతి ప్రియులను జాగింగ్‌కు పిలుస్తున్న వనాలు బొటానికల్ గార్డెన్, పాలపిట్ట పార్క్. పాలపిట్ట పార్క్‌లో ప్రత్యేకంగా సైక్లింగ్ ట్రాక్ కూడా ఉండటం విశేషం.



బొటానికల్ గార్డెన్

మినీ ఫారెస్ట్.. జింకల సందడి

రెసిడెన్షియల్ ఏరియా ఎక్కువగా ఉన్న బోడుప్పల్ వంటి ప్రాంతాలవాసులకు ప్రశాంతత అందిస్తోంది స్థానిక 'శాంతి వనం'. వాకింగ్, జాగింగ్, రన్నింగ్ వంటి అన్ని వ్యాయామాలకు అనువైన విశాల అటవీ ప్రాంతం ఉండటం దీని ప్రత్యేక. ఇక్కడ ఒక కిలోమీటర్, అంతకు మించి వాకింగ్ ట్రాక్‌లు కూడా ఉన్నాయని స్థానికులు తెలిపారు. ఎల్‌బీనగర్ దాటుకుని నగర శివార్లలో కనుచూపుమేర పచ్చని చీర కట్టుకుని ఉదయాన్నే జాగింగ్‌కు ఆహ్వానిస్తోంది నారపల్లి సమీపంలోని 'నందనవనం'. జింకలు, నెమళ్లు, అరుదైన పక్షిజాతులు ఇక్కడ దర్శమిస్తూ మరింత ఉత్సాహం, ఆహ్లాదాన్ని అందిస్తున్నాయి. నగరవాసులను ఆకర్షించడానికి ఇందులో బల్లలు, హట్స్, ముఖ్యంగా తీగల వంతెనలను సైతం నిర్మించారు.

వందల ఎకరాల్లో.. సువిశాల వాతావరణంలో..

నగర శివారుల్లోనే కాదు.. నగరంలో మధ్యలో వందల ఎకరాల్లో ఆవరించి ఉన్న ప్రకృతి సంపద ఉస్మానియా యూనివర్సిటీ. ఎన్నో ఏళ్లుగా నగరవాసులకు జాగింగ్, వ్యాయామం, యోగా, క్రీడలకు కేంద్రంగా సేవలందిస్తోంది ఉస్మానియా క్యాంపస్. చుట్టుపక్కల నుంచి దాదాపు 10, 15 కిలోమీటర్ల నుంచి సైతం ఇక్కడి వాతావరణం కోసం నగరవాసులు వస్తుంటారు. నగరం నడిబొడ్డున, అసెంబ్లీ ఆనుకుని ఉన్న పబ్లిక్ గార్డెన్ కూడా నగరవాసులతో ఏళ్లుగా మమేకమై పోయింది. దీంతో పాటు నారాయణగూడ, హిమాయత్ నగర్‌కు సమీపంలోని మోల్కోటీ పార్క్ కూడా ఉదయం–సాయంత్రం వాకర్లకు అనువైన ప్రదేశంతో పాటు అద్భుతమైన వాతావరణాన్ని అందిస్తోంది. జలగం వెంగళరావుపార్క్, నెహ్రూ పార్క్ ఇలా నగరం నలుమూలలా అక్కడక్కడా విశాలమైన విస్తీర్ణంలో ఉన్న ఎన్నో పార్కులు నగరవాసుల ఆరోగ్య సంరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్నాయి.

జాయ్.. మిక్స్

సాక్షి, సిటీబ్యూరో: ఓ వైపు లైవ్ మ్యూజిక్ మరోవైపు మ్యాజిక్ షో.. ఫొటో కార్నర్.. టేస్టీ డిన్నర్.. కేక్ మిక్సింగ్ అంటే విందు వినోదాల కలగలుపు.. పండగకు ముందే మేలుకొలుపు.. గచ్చిబౌలిలోని షెరటాన్ హైదరాబాద్‌లో బుధవారం నిర్వహించిన కేక్ మిక్సింగ్ ఈవెంట్ ఆనందోత్సాహాలను పంచింది. డ్రై ఫ్రూట్స్, ఆల్కహాల్ డ్రింక్స్.. తదితర ముడిపదార్థాలను కలపడానికి ఆహూతులు పోటీపడ్డారు. కార్యక్రమంలో హోటల్ అతిథులు, సిబ్బంది పాల్గొన్నారు.







మనం.. థియేటర్‌తో మమేకం!

- భారీ థియేటర్ ఫెస్టివల్ కోసం నగరం సిద్ధం
- దేశ, విదేశాల నుంచి భారీగా కళాకారుల రాక
- 24 నుంచి డిసెంబర్ 17 వరకు సందడి

సాక్షి, సిటీబ్యూరో: థియేటర్ అంటేనే ఎమోషన్.. భాష, ప్రాంతం, వయసు తేడా లేకుండా కళను మాత్రమే చూసేందుకు వేదికగా మనం థియేటర్ ఫెస్టివల్ నిలుస్తోంది. యాక్టింగ్, మ్యూజిక్, స్క్రిప్ట్ రైటింగ్, లైటింగ్, డైరెక్షన్ ఇలా పలు రకాల కళలను పరిచయం చేసేందుకు ఈ ఫెస్టివల్‌ను ప్రారంభించారు. గతేడాది ప్రారంభించిన 'మనం' థియేటర్ ఫెస్టివల్ విజయవంతం కావడంతో ఈ ఏడాది కూడా ఘనంగా జరుపుతున్నారు. ఈనెల 24వ తేదీ నుంచి వచ్చేనెల 17వ తేదీ వరకు ఈ ఫెస్టివల్ జరగనుంది. ఈ ఏడాది టుగెదర్, వి బిలాంగ్ థీమ్‌తో ఈ ఫెస్టివల్‌ను 'వి అజ్ కలెక్టివ్' సంస్థ నిర్వహిస్తోంది. ఈ ఫెస్టివల్‌ను తమ కళా నైపుణ్యాన్ని ప్రదర్శించేందుకు దేశంలోని పలు రాష్ట్రాల నుంచే కాకుండా విదేశాల నుంచి కూడా కళాకారులు తరలి రానున్నారు. ఆస్ట్రేలియా నుంచి రోడ్రిగో కాల్డెరాన్‌తో పాటు నిమ్మీ రాఫెల్, వినయ్ కుమార్, పూజా సరూప్, షీనా ఖాలీద్ వంటి ప్రఖ్యాత కళాకారులు ఈ ఫెస్టివల్‌లో ప్రధాన ఆకర్షణగా నిలవనున్నారు. ఫెస్టివల్‌లో పలు ప్రదర్శనలతో పాటు అద్భుతమైన చర్చలు, వర్క్‌షాప్స్ కూడా నిర్వహించనున్నారు. రానున్న తరానికి థియేటర్ ప్రాముఖ్యతను వివరించడమే లక్ష్యంగా ఈ వర్క్‌షాప్స్, చర్చలు జరగనున్నాయి.

ఆహా.. ఏమి రుచి



- విభిన్న పాకశాస్త్ర నైపుణ్యాలతో సరికొత్త మెనూ
- లోకల్ మొదలు కాంటినెంటల్ వరకు రుచులు
- ఫుడ్ లవర్స్ కోసం బోగన్‌విల్లాలో ఏర్పాటు

సాక్షి, సిటీబ్యూరో: విభిన్న రంగాల్లో వైవిధ్యాన్ని ప్రదర్శిస్తున్న హైదరాబాద్ నగరం విభిన్న రకాల వంటల్లోనూ సాంస్కృతిక వైవిధ్యాన్ని, కలినరీ ఎవల్యూషన్ ప్రదర్శిస్తోంది. ఇందులో భాగంగానే జూబ్లీహిల్స్‌లోని బోగస్ విల్లా రెస్టారెంట్‌లో నగరంలోని ఫుడ్ లవర్స్ కోసం సరికొత్త మెనూ ఆవిష్కరించారు. స్థానిక, ప్రపంచ రుచుల మిశితంతో ఏర్పాటు చేసిన ఈ వంటకాలను బుధవారం నగరవాసులకు పరిచయం చేశారు. ఇందులో భాగంగా నిపుణులైన చెఫ్‌ల బృందంచే ప్రత్యేకంగా తయారు చేసిన సింగపూర్ చిల్లీ మడ్ క్రాబ్, క్రీమీ మఖ్నీ సాస్‌లో బటర్ చికెన్ టోర్టెల్లి, శాఖాహారుల కోసం ప్రత్యేకంగా గుమ్మడికాయ క్వినోవా కిచ్డీ వంటి వంటకాలు భోజనప్రియుల నోరూరిస్తున్నాయి. ఈ మెనూలో క్రిస్పీ అవోకాడో వెడ్జెస్ వంటి స్టార్టర్లు, హైదరాబాదీ మరగ్ వంటి మనోహరమైన సూప్‌లు కూడా ఉన్నాయి. ఈ సందర్భంగా బోగస్ విల్లా రెస్టారెంట్ మాతృ సంస్థ జూసీ సహ వ్యవస్థాపకురాలు అపర్ణా గొర్రెపాటి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరి అభిరుచికి అనుగుణమైన వంటకాలతో తెలుగు మొదలు కాంటినెంటల్ వరకు విభిన్న డిష్‌లను అందిస్తున్నామని సంతోషం వ్యక్తం చేశారు.



మెరిసిన వరి రైతు... మునిగిన పత్తి రైతు



- ఏటేటా ఖరీఫ్‌లో పెరుగుతున్న వరి విస్తీర్ణం.. తగ్గుతున్న పత్తి, ఇతర పంటల సాగు
- బియ్యానికి డిమాండ్‌తో ధాన్యానికి 'మద్దతు' కన్నా ఎక్కువ ధర
- పత్తి ధరలపై మాత్రం మార్కెట్ మాయాజాలం
- కొన్నేళ్లుగా రైతులకు చుక్కలు చూపిస్తున్న పత్తి
- వరికి ఖర్చు, పని తక్కువ.. పత్తి పంటకు ఈ రెండూ ఎక్కువే
- దీనితో వరి వైపు మళ్లుతున్న తీరు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో రైతుల ఆలోచన మారుతోంది. కష్టంతో కూడుకున్న వాణిజ్య పంటల కంటే సంప్రదాయ వరి సాగువైపు రైతులు మొగ్గు చూపుతున్నారు. రాష్ట్రంలో కాళేశ్వరం, ఇతర ప్రాజెక్టులతో పెరిగిన సాగునీటి వనరులతోపాటు కష్టం, ఖర్చు తక్కువ, ఆదాయం ఎక్కువ అనే ఉద్దేశంతో వరి వైపు మళ్లుతున్నారు. దీనితో ఏటేటా రాష్ట్రంలో వరి సాగు విస్తీర్ణం పెరుగుతూ వస్తోంది. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి వరితోపాటు పత్తి కూడా ప్రధాన పంటగా కొనసాగుతోంది. కానీ పత్తి ధరలు పడిపోతుండటం, దాని సాగు ఖర్చు ఎక్కువగా ఉండటంతో ఆ రైతులు మెల్లగా వరి సాగు చేపడుతున్నారని వ్యవసాయ వర్గాలు చెబుతున్నాయి. పదేళ్ల క్రితం వరకు కరీంనగర్, వరంగల్, మెదక్ ఉమ్మడి జిల్లాల్లో సాగునీటి సౌకర్యం లేని ప్రాంతాల్లో ఎక్కువగా పత్తిసాగు చేసేవారు. ఇప్పుడీ ప్రాంతాల్లో పత్తి తగ్గిపోయి, వరి పెరిగింది. ప్రస్తుతం నల్లగొండ, ఆదిలాబాద్, మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లాల్లో అధికంగా.. ఖమ్మం, వరంగల్‌లలో ఓ మోస్తరుగా పత్తి సాగు జరుగుతోంది. కానీ భవిష్యత్తులో ఈ జిల్లాల్లోనూ సాగు తగ్గే అవకాశం ఉందని వ్యవసాయ అధికారులు అంచనా వేస్తున్నారు. పత్తి మాత్రమేకాకుండా పప్పు ధాన్యాలు, నూనె గింజల సాగు పట్ల కూడా రైతుల్లో ఆసక్తి తగ్గుతోందని పేర్కొంటున్నారు.

రాష్ట్రంలో ఖరీఫ్ పంటల విస్తీర్ణం ఇలా (ఎకరాల్లో)..

ఏడాది	వరి	పత్తి	మొక్కజొన్న	పప్పులు	నూనెగింజలు
2022	64,46,973	50,00,401	6,21,130	6,61,027	4,59,761
2023	65,00,873	44,77,937	5,27,474	5,51,556	4,88,809
2024	65,49,230	43,76,043	5,46,865	5,90,947	4,27,577

ఈ ఏడాది మునిగిన పత్తి రైతు

రాష్ట్రంలో ఈ ఖరీఫ్ సీజన్‌లో 43.76 లక్షల ఎకరాల్లో పత్తి సాగైంది. 2022 సంవత్సరంతో పోలిస్తే ఇది సుమారు 7 లక్షల ఎకరాల మేర తక్కువ. కేంద్ర ప్రభుత్వం పత్తికి కనీస మద్దతు ధర రూ.7,521గా నిర్ణయించింది. కానీ కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో నిర్లక్ష్యం వహించడంతో రైతుకు గిట్టుబాటు ధర అందలేదు. సెప్టెంబర్‌లో కురిసిన వర్షాలు, వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా పంట దిగుబడి కూడా తగ్గింది. పైగా పత్తి ధర తగ్గడంతో రైతుల్లో ఆందోళన వ్యక్తమైంది. రాష్ట్రంలోని పలు వ్యవసాయ మార్కెట్లలో పత్తి క్వింటాల్‌కు రూ.5,300 నుంచి రూ.7,000 వరకు మాత్రమే ధర పలికింది.

దేశంలోనే మూడో స్థానం

ఖరీఫ్ సీజన్‌లో దేశవ్యాప్తంగా 2.74 కోట్ల ఎకరాల్లో పత్తి సాగు జరిగింది. అత్యధిక సాగులో మహారాష్ట్ర, గుజరాత్ తొలి రెండు స్థానాల్లో.. తెలంగాణ మూడో స్థానంలో ఉన్నాయి. ఈ సీజన్‌లో దేశవ్యాప్తంగా 1.60 కోట్ల టన్నుల పత్తి దిగుబడి వస్తుందని అంచనా వేయగా.. అందులో తెలంగాణలో 25.33 లక్షల టన్నుల మేర వస్తుందని రాష్ట్ర మార్కెటింగ్ శాఖ వర్గాలు అంచనా వేశాయి. ఇన్నాళ్లూ ఒక ఏడాది ధర గిట్టుబాటు కాకపోయినా.. మరుసటి ఏడాదైనా అందుతుందన్న ఆశతో రైతులు పత్తి సాగును కొనసాగిస్తూ వస్తున్నారు. కానీ గత రెండు, మూడేళ్లుగా తెలంగాణ రైతులు పత్తికి బదులు ఇతర పంటల వైపు చూస్తున్నట్లు వ్యవసాయ శాఖ వర్గాలు చెబుతున్నాయి.



వరి దిగుబడి పెరగడంతో ఆనందం

ఈ ఖరీఫ్‌లో వరి సాగు చేసిన రైతులకు వాతావరణం కూడా కలసి వచ్చింది. రాష్ట్రంలో సుమారు 66 లక్షల ఎకరాల్లో వరిసాగవగా.. అందులో 40 లక్షల ఎకరాల్లో సన్న రకాలు, 26 లక్షల ఎకరాల్లో దొడ్డు రకాలు వేశారు. వరి కోతకు వచ్చే వరకు అకాల వర్షాల బాధలేకపోవడం, గతంతో పోలిస్తే చీడ, పీడలు, తెగుళ్లు తక్కువగా ఉండటంతో ఈసారి వరి దిగుబడి భారీగా పెరిగింది. వ్యవసాయ శాఖ అంచనాల ప్రకారం వరి దిగుబడి 150 లక్షల మెట్రిక్ టన్నులకుపైనే. వరికి మద్దతు ధర రూ.2,320కాగా... నల్లగొండ, నిజామాబాద్ జిల్లాల్లో మేలు రకం సన్న ధాన్యాన్ని రూ.2,500 నుంచి రూ.3,000 ధరతో మిల్లర్లు, వ్యాపారులు కొనుగోలు చేశారు. దేశంలోనే కాకుండా అంతర్జాతీయంగా కూడా బియ్యానికి పెరిగిన డిమాండ్‌తో ధరలు పెరిగాయి. ఇక 70 లక్షల టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయనున్నట్లు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని కనీస మద్దతు ధరకు తీసుకుంటుండటం, గతంలో కన్నా దిగుబడి పెరగడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇక కొనుగోలు కేంద్రాలకు వచ్చే సన్నధాన్యానికి ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.500 చొప్పున బోనస్ ఇస్తామనడంపైనా హర్షం వ్యక్తమవుతోంది.



బుధవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

'ప్రాసిక్యూటర్స్' అసోసియేషన్ అధ్యక్షుడిగా రాంరెడ్డి



రాంరెడ్డి



కె.శ్రీవాణి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ కేడర్ ప్రాసిక్యూటర్స్ వెల్ఫేర్ అండ్ డిపార్ట్‌మెంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా అల్లూరి రాంరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతనంగా ఏర్పడిన ఈ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ ఎన్నికలు ఈనెల 19న జరిగాయి. ఆన్‌లైన్ విధానంలో జరిగిన ఈ ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కేడర్ ప్రాసిక్యూటర్లు పాల్గొన్నారు. ఈమేరకు ఎన్నికల అధికారి శ్రీనివాస్‌రెడ్డి బుధవారం ఫలితాలను ప్రకటించారు. ఉపాధ్యక్షుడిగా పి.సత్యనారాయణ, పి.రవికిరణ్, ప్రధాన కార్యదర్శిగా కె.శ్రీవాణి (ఏపీపీ గ్రేడ్–1), ట్రెజరర్‌గా ఆర్.రాఘవేందర్, అదనపు కార్యదర్శులుగా కె.శంకర్, జి.ప్రణయ్ ఎన్నికైనట్లు తెలిపారు. అలాగే మహిళా ప్రతినిధిగా సాంబ దుర్గాబాయ్, సునీతతో పాటు 11 మంది ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా ఎన్నికయ్యారు. ఈ కార్యవర్గం ఎన్నికపై రాష్ట్ర వ్యాప్తంగా డిప్యూటీ ప్రాసిక్యూటర్లు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, న్యాయవాదులు హర్షం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా రాంరెడ్డి మాట్లాడుతూ.. పీపీల సమస్యలు పరిష్కరించేందుకు అహర్నిశలు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు.

అవి ప్రజా వంచనోత్సవాలు

ఏలేటి మహేశ్వర్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వ ఆధ్వర్యంలో జరుగుతున్నవి విజయోత్సవాలు కావని, అవి ప్రజా వంచనోత్సవాలు అని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా అన్ని విధాలుగా మోసం చేసిందని ధ్వజమెత్తారు. గత 11 నెలల్లో ఏం చేశారో శాఖల వారీగా శ్వేత పత్రాలు విడుదల చేయాలని ఆయన సీఎం రేవంత్‌రెడ్డిని డిమాండ్ చేశారు. 'ఈ ఏడాదిలో రేవంత్‌రెడ్డి, అయన ఆస్థాన మంత్రులు బాగుపడ్డారు. వేల కోట్ల అవినీతి జరిగింది. బ్లాక్ మెయిల్ చేసి, సెటిల్‌మెంట్ చేసుకుంటున్నారు' అని ఆరోపించారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి ఎగవేతల ముఖ్యమంత్రిగా నిలిచిపోయారని ఎద్దేవా చేశారు. ఆరు గ్యారంటీల్లో ఒక్కటైనా అమలు చేశారా? అని ప్రశ్నించారు. ఒక అసమర్థుడు సీఎం అయితే రాష్ట్రం ఏ రకంగా దివాళా తీస్తుందో.. రేవంత్ రెడ్డిని చూస్తే చెప్పవచ్చని అన్నారు. తెలంగాణను మరింత అప్పుల పాలు చేసినందుకు విజయోత్సవాలు నిర్వహిస్తున్నారా అని ప్రశ్నించారు. రేవంత్ తన ఏడాది పాలనలో చెప్పుకోవడానికి ఏమీలేక ప్రధాని మోదీ, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిపై అభాండాలు వేస్తున్నారన్నారు. 'రాష్ట్ర విభజన గురించి మోదీ ఎప్పుడూ వ్యతిరేకంగా మాట్లాడలేదని, రేవంత్‌రెడ్డే టీడీపీలో ఉన్నప్పుడు తెలంగాణను వ్యతిరేకించారని మహేశ్వర్‌రెడ్డి అన్నారు.

చంద్రబాబు భాషకు అర్థాలు వేరు

బాదడమే సంపద సృష్టి!

ప్రజలపై యూజర్ ఛార్జీలు, పన్నులు, టోల్ ఛార్జీలు.. అదేనా నీ సూత్రం?

సీఎం చంద్రబాబును నిలదీసిన వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్




అధికారంలోకి వచ్చి ఆరు నెలలు కాకుండానే సంపద సృష్టి పేరుతో రూ.18 వేల కోట్లు కరెంటు బిల్లులు బాదేశారు. ఇందులో రూ.6,072 కోట్లకు సంబంధించిన బాదుడు నవంబర్ బిల్లుల్లోనే ప్రారంభమైంది. మరో రూ.11 వేల కోట్ల బాదుడు తర్వాతి నెలలో ఉంటుంది. బాదుడే బాదుడు కార్యక్రమంలో భాగంగా కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌తో సమావేశమై జీఎస్టీ మీద ఒక శాతం సర్ చార్జ్ విధించి, ఆ మేరకు నిధులు రాష్ట్ర ప్రభుత్వానికి ఇవ్వాలని సీఎం చంద్రబాబు కోరారు. సంపద సృష్టి అంటే ఇలా ప్రజలపై జీఎస్టీ పన్ను భారం మోపడమేనా?

చంద్రబాబును సూటిగా ఓ ప్రశ్న అడుగుతున్నా.. నీ తల్లిదండ్రులెవరో ఈ రాష్ట్ర ప్రజలకు ఎప్పుడైనా చూపించావా? వాళ్లతో కలిసి ఉన్నావా? రాజకీయంగా నువ్వు ఎదిగాక.. వారిని నీ ఇంటికి పిలిచి భోజనం పెట్టావా? వాళ్లిద్దరూ కాలం చేస్తే కనీసం తల కొరివి అయినా పెట్టావా? ఎలాంటి మానవతా విలువలు లేని వ్యక్తి చంద్రబాబు. రాజకీయాల కోసం ఏమైనా చేస్తాడు. ఏ గడ్డయినా తింటాడు. ఏ అబద్ధమైనా ఆడతాడు. ఏ మోసమైనా చేస్తాడు. ఇలాంటి వ్యక్తితో యుద్ధం చేస్తున్నాం. రాష్ట్ర ప్రజలందరినీ కోరేది ఒక్కటే. ఈ యుద్ధంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలి.

- వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి, అమరావతి: 'సంపద సృష్టి అంటే ప్రజలపై యూజర్ ఛార్జీలు, పన్నులు, టోల్ ఛార్జీలు, విద్యుత్ ఛార్జీలు బాదడమేనా? మేం సృష్టించిన సంపద మెడికల్ కాలేజీలు, పోర్టులను స్కామ్‌ల కోసం అమ్మేయడమేనా?' అని ముఖ్యమంత్రి చంద్రబాబును వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ నిలదీశారు. చంద్రబాబు సంపద సృష్టిస్తానన్న ప్రతిసారి ప్రజల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. 'సంపద సృష్టిస్తా' అన్నది చంద్రబాబు ఊత పదం (కామన్ డైలాగ్)గా మారిందని చెప్పారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'చంద్రబాబు సంపద సృష్టిలో భాగంగా మెడికల్ కళాశాలలను, రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తున్న మూడు పోర్టులను అమ్మేస్తున్నారు. పోర్టులకు సంబంధించి దాదాపు 50 శాతం పనులు పూర్తయ్యాయి. మారిటైం బోర్డు పెట్టి పోర్టుల నిర్మాణానికి అడ్డంకులు లేకుండా ఫైనాన్షియల్ టై అప్ చేశాం. బ్యాంకులు ప్రత్యేకంగా లోన్లు ఇస్తున్నాయి. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం కడుతున్న పోర్టులు, మెడికల్ కాలేజీలు భవిష్యత్తులో రూ.లక్షల కోట్ల సంపద అవుతుంది. నాగార్జునసాగర్ కట్టడానికి అప్పట్లో రూ.600 కోట్లు–రూ.900 కోట్లు అయినట్టుంది. ఇప్పుడు సాగర్ లాంటి ప్రాజెక్టును కట్టాలంటే ఎన్ని వేల కోట్లు కావాలి? ఈ రోజు కట్టే పోర్టులు, వైద్య కళాశాలల విలువ కూడా అంతే. ఇలాంటివి కడితేనే రాష్ట్ర ప్రభుత్వానికి అదనపు ఆదాయం తయారవుతుంది. దీన్ని సంపద సృష్టి అంటారు. చంద్రబాబు మాత్రం సంపద సృష్టి పేరుతో స్కామ్‌లు చేస్తున్నారు. తనకు కావాల్సిన వాళ్లకు పోర్టులు, వైద్య కళాశాలలను అమ్మేస్తున్నారు' అని మండిపడ్డారు. 'కేంద్ర ప్రభుత్వం జాతీయ రహదారులపై టోల్ వసూలు చేస్తున్న మాదిరిగా గ్రామీణ రహదారులపైనా రాష్ట్ర ప్రభుత్వం టోల్ వసూలు చేయాలని అసెంబ్లీలో చంద్రబాబు చెబుతున్నారు. అంటే ప్రయాణికులు రోడ్లపై తిరిగే దానికి యూజర్ చార్జీలు వసూలు చేస్తారట. దీనినే సంపద సృష్టిగా చంద్రబాబు అభివర్ణిస్తున్నారు. పన్నులతో బాదేసి సంపద సృష్టి అంటే ఆశ్చర్యంగా ఉంది. పైగా ఎన్నికలకు ముందు చంద్రబాబు, ఆయన దత్తపుత్రుడు రోడ్లపై విపరీతమైన దుష్ప్రచారం చేశారు. వాళ్ల ఐదేళ్ల కాలంలో రోడ్ల కోసం రూ.24,792.19 కోట్లు ఖర్చు చేస్తే, మా హయాంలో రూ.43,036.28 కోట్లు వెచ్చించాం. ఇంత ఖర్చు చేసినా కూడా దుష్ప్రచారం ఎదుర్కొన్నాం. బాబు మాత్రం నిస్సిగ్గుగా సమర్థించుకుంటున్నారు' అని నిప్పులు చెరిగారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్ ఇంకా ఏమన్నారంటే..



బినామీలకు దోచిపెట్టేందుకే అసైన్డ్‌పై దుష్ప్రచారం

- అసైన్డ్ భూములపై నిస్సిగ్గుగా అబద్ధాలు.. తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు. మా ప్రభుత్వం రాక ముందు పేరుకే దళితులకు భూమి ఉండేది. దానిని అమ్ముకునే స్వేచ్ఛ లేదు. ఇంట్లో వాళ్లకు అత్యవసర పరిస్థితులు ఎదురైనా, వారసుల పేరుపైకి బదిలీ చేయాలన్నా అగమ్యగోచర పరిస్థితి ఉండేది. రిజిస్ట్రేషన్ చేసి అమ్ముకోలేని నిస్సహాయ స్థితిలో శనక్కాయలకు.. పావలాకు, పది పైసలకు వేరే వాళ్లు కొనుక్కొని అనుభవించే వారు.
- మేము అధికారంలోకి వచ్చాక పేదల జీవితాలు మార్చాలని ఆలోచించాం. 20 ఏళ్లు దాటిన అసైన్డ్ భూమి ఉన్న వారికి చట్ట ప్రకారం అన్ని హక్కులు కల్పిస్తూ సొంత భూములుగా మార్చాం. ఆ సొంత భూములను అమ్ముకుంటారా? వాళ్ల పిల్లలకు ఇచ్చుకుంటారా? వాళ్ల ఇష్టం. ఈ లోగా ఎవరైనా భూములు కొనుగోలు చేసి ఉంటే కూడా అవన్నీ ఒరిజినల్ అసైనీలకు వెళ్లిపోతాయి. వాళ్ల పేరుతోనే పట్టా వస్తుంది. కొన్న వాళ్లకు పట్టా రాదు. ఇలా హక్కులిచ్చి 15.21 లక్షల మంది రైతులకు, పేదలకు మంచి చేస్తే కూటమి నాయకులు నిస్సిగ్గుగా బురద వేస్తున్నారు. మళ్లీ పేదల దగ్గర నుంచి హక్కులు తీసుకోవడానికి అడుగులు వేస్తున్నారు. చట్టాన్ని రద్దు చేయడం ద్వారా వారి హక్కులను రద్దు చేయనున్నారు. ఆ తర్వాత అవే భూములను పెత్తందార్లు 10 పైసలకు, 20 పైసలకు కొనుక్కోవచ్చు. వీళ్లకు మాత్రమే మంచి రేటు ఉండాలి. పేదలకు మంచి రేటు రాకూడదు.
- చంద్రబాబు ఇచ్చిన ఒక మెమో ద్వారా 2.06 లక్షల ఎకరాలను ఉద్దేశ పూర్వకంగా నిషేధిత జాబితా (22ఏ)లో పెట్టారు. 98 వేల మంది రైతులను నానా కష్టాలకు గురి చేస్తున్నారు. మేము నిషేధిత జాబితా నుంచి విముక్తి కల్పించి.. రైతులకు వారి భూములపై సర్వ హక్కులు కల్పించాం. అది తప్పంటున్నారు.
- ల్యాండ్ పర్చేజ్ స్కీం కింద ఎస్సీ కార్పొరేషన్ రుణాలను రద్దు చేసి 22వేల ఎకరాల భూమిని పంపిణీ చేశాం. 2.06 లక్షల ఎకరాల చుక్కల భూముల సమస్యలను పరిష్కరించి ఏకంగా 1.07 లక్షల మంది రైతుల కుటుంబాలుకు మేలు చేశాం. 33 వేల ఎకరాల షరతుల భూములపై 22 వేల మంది రైతులకు సర్వ హక్కులు కల్పించాం. ఇదంతా వాళ్లు తప్పంటున్నారు.

ఐదేళ్లలో ఒక్కరికైనా సెంటు స్థలం ఇచ్చావా?

- చంద్రబాబు హయాంలో ఒక్క నిరుపేద కుటుంబానికి కనీసం ఒక్క సెంటు స్థలమైనా ఇచ్చారా? మేము 30.60 లక్షల కుటుంబాలకు అక్క చెల్లెమ్మల పేరుపైనే రిజిస్ట్రేషన్ చేసి ఇంటి స్థలాలు ఇచ్చాం. ఇందులో 21 లక్షల ఇళ్ల నిర్మాణం చేపట్టాం. 9.02 లక్షల ఇళ్లను పూర్తి చేశాం. మిగిలిన 11 లక్షల ఇళ్లు పునాదులు దాటి వివిధ దశల్లో నిర్మాణాల్లో ఉన్నాయి. ఏకంగా 17 వేల జగనన్న కాలనీల్లో ఏకంగా ఊళ్లే తయారవుతున్నాయి. ఆ ఇళ్లన్నీ పూర్తయితే జగన్‌కు ఎక్కడ మంచి పేరు వస్తుందోననే దురుద్దేశంతో చంద్రబాబు హౌసింగ్ కార్యక్రమాన్ని ఆపేశారు.
- మా ప్రభుత్వ హయాంలో సిమెంట్, స్టీలు, ఇతర సామగ్రిని సబ్సిడీపై, ఇసుకను ఉచితంగా ఇచ్చే వాళ్లం. ఇవి కాకుండా రూ.35 వేలు పావలా వడ్డీకి రుణంగా ఇచ్చే వాళ్లం. రూ.1.80 లక్షల డబ్బులు రాష్ట్ర ప్రభుత్వం తరఫున అందించే వాళ్లం. అంతటి బృహత్తర కార్యక్రమాన్ని నిలిపి వేసినందుకు నిరుపేదలందరూ చంద్రబాబును తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టుకుంటున్నారు. పేదల ఇళ్ల గురించి ఎవ్వరూ పట్టించుకోవట్లేదు. ఎందుకు అసెంబ్లీ నడుపుతున్నారో.. ఎందుకు ప్రభుత్వాన్ని నడుపుతున్నారో వీళ్లకే తెలీదు.

మద్యం, ఇసుక అంతా స్కామ్..

- రాష్ట్రంలో ప్రజలకు అవసరమైన పనులు పూర్తిగా పక్కకు వెళ్లిపోయాయి. ఎక్కడ చూసినా మాఫియా ముఠాలు దోచుకుంటున్న పరిస్థితి. చంద్రబాబు అధికారంలోకి వస్తే నాణ్యమైన లిక్కర్ ఇస్తానన్నారు. మద్యం రేటు తగ్గిస్తానన్నారు. ఆశ్చర్యం ఏమంటే.. గతంలో చంద్రబాబు హయాంలో అవే డిస్టలరీలు.. మా హయాంలో అవే.. ఇప్పుడు కూడా అవే డిస్టలరీలు. మద్యం ఆదాయంలో చీప్ లిక్కర్ నుంచే 85 శాతం వస్తుంది. చంద్రబాబు వచ్చిన తర్వాత చీప్ లిక్కర్‌లో నాణ్యత తగ్గించారు. ప్రజల ఆరోగ్యాన్ని నాశనం చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కొత్త బ్రాండ్లను తీసుకొచ్చారు. ఎప్పుడూ మనం వినని, చూడని బ్రాండ్లు అవి.
- అన్ని చోట్లా బెల్టు షాపులను ప్రోత్సహిస్తున్నారు. ఒక్కో బెల్టు షాపునకు.. ఒక్కో గ్రామంలో పోటీ పెట్టి వేలం వేస్తున్నారు. రూ.2 లక్షలకు పాడుకున్న వాడికే ఇస్తున్నారు. ఇలా మాఫియా రాజ్యం నడుస్తోంది. మద్యాన్ని ఎమ్మార్పీకి అమ్మకోవాలంటే పోటీ ఎందుకు? ఎమ్మెల్యేలు మనుషులను ఎందుకు కిడ్నాప్ చేయించాలి.. ఎందుకు ఎవరినీ పాడనివ్వకుండా చేయాలి? వేరేవాళ్లకు వచ్చినా షాపులు నడుపుకోలేని పరిస్థితికి ఎందుకు నెట్టేయాలి? ఎమ్మార్పీ ప్లస్ మాఫియాకు కమీషన్ రావాలనే ఇదంతా చేస్తున్నారు. ప్రభుత్వం నడుపుతున్న షాపులన్నీ తీసేశారు. ప్రైవేటు మాఫియాను తీసుకొచ్చి అన్ని రకాలు స్కాములకు తెరదీశారు. ఇసుక పరిస్థితి కూడా అంతే. హామీ ఇచ్చినట్లు ఎక్కడా ఉచితంగా ఇవ్వడం లేదు. వైఎస్సార్‌సీపీ హయాంలో కంటే ఎక్కువ ధరకు అమ్ముతున్నారు. గతంలో ఆ డబ్బు ప్రభుత్వ ఖజానాకు చేరేది. ఇప్పుడు అధికార పార్టీ నేతల జేబుల్లోకి వెళ్తోంది.

ఉద్యోగులకు ఐఆర్ ఎక్కడ?

- చంద్రబాబు ఉద్యోగులను మోసం చేస్తున్నారు. ఎన్నికలకు ముందు ఒకటవ తేదీనే జీతం అన్నారు. ఈ నెలలో మూడు వారాలు అయిపోతున్నా చాలా మందికి జీతాలు ఇవ్వలేదు. ఉద్యోగులు అందరూ ఐఆర్ కోసం ఎదురు చూస్తున్నారు. మా ప్రభుత్వం వచ్చిన నెలలోపే 27 శాతం ఐఆర్ ఇచ్చాం. చంద్రబాబు వచ్చి ఆరు నెలలు అవుతున్నా ఇంకా ఐఆర్ ఊసే ఎత్తట్లేదు. దీనికి తోడు రెండు డీఏలు పెండింగ్. మా హయాంలో పీఆర్సీ చైర్మన్‌ను నియమించి, సరైన సమయంలో ఉద్యోగులకు మంచి చేస్తే.. చంద్రబాబు వచ్చిన తర్వాత పీఆర్సీ చైర్మన్‌ను బలవంతంగా రాజీనామా చేయించారు. మరి కొత్త పీఆర్సీ చైర్మన్ నియమించాలా లేదా? ఆ ప్రక్రియే ప్రారంభం కాలేదు.
- మరో వైపు వలంటీర్లు, బేవరేజెస్ కార్పొరేషన్‌లో పని చేస్తున్న వారి ఉద్యోగాలను పీకేశారు. 104, 108 ఉద్యోగులు జీతాల కోసం ధర్నాలు చేస్తుంటే.. వాళ్లను పీకడానికి రెడీ అవుతున్నారు. టాయిలెట్స్ నిర్వహణకు సంబంధించి ఆయాలకు జీతాలు సరిగా లేవు. ఆర్పీలు నెలల తరబడి జీతాల కోసం వేచి చూస్తున్నారు. ఆశా వర్కర్లు ధర్నాలు చేస్తున్నారు. వాళ్లకు ఎన్నికల సమయంలో రిటైర్‌మెంట్ బెనిఫిట్స్, పదవీ విరమణ వయస్సు పెంపు, బీమా సౌకర్యం, జీతాల పెంపు, మట్టి ఖర్చుల కింద రూ.20 వేలు ఇస్తామని ప్రకటించారు. దానిని మేనిఫెస్టోలో పెట్టారు. ఇప్పుడు వాళ్ల గురించి పట్టించుకునే పరిస్థితి లేదు.

మోసాలు, అక్రమాలు, వైఫల్యాలు నిలదీస్తే అక్రమ కేసులా?

- సూపర్ సిక్స్‌లు లేవు.. సూపర్‌సెవెన్‌లు లేవు.. మరో వైపు అన్ని రకాలుగా రాష్ట్రం వైఫల్యం చెందింది. ఎవరైనా హక్కుల కోసం, న్యాయం కోసం సోషల్ మీడియాలో ప్రస్తావిస్తే చాలు దారుణంగా వేధిస్తున్నారు. పోలీసులను అన్యాయంగా వాడుకుంటున్నారు. ఎమ్మెల్యేల ద్వారా వాళ్ల నియోజకవర్గాల్లో ప్రైవేటు మాఫియా ముఠాను తయారు చేసి కొట్టిస్తున్నారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటున్నారు. ఇష్టానుసారంగా తప్పుడు కేసులు పెడుతున్నారు. అక్రమ నిర్బంధాలు (ఇల్లీగల్ డిటెన్షన్) చేస్తున్నారు. తీవ్రమైన మానవ హక్కుల ఉల్లంఘనకు పాల్పడుతున్నారు.
- కొట్టాం.. వీడియోలు తీశాం.. చూసి ఆనందించండి.. అని స్థానిక పోలీసులు పై వాళ్లకు పంపిస్తూ శాడిజం ప్రదర్శిస్తున్నారు. పైగా థర్డ్ డిగ్రీ దెబ్బలు చూపిస్తున్నారు. న్యాయ ప్రక్రియ ముందుకు వెళ్లకుండా చేసేందుకు ఎఫ్ఐఆర్‌లు అప్లోడ్ చేయడం లేదు. ఎఫ్ఐఆర్‌ల కోసం బాధితుల బంధువులు పోలీస్ స్టేషన్ల ఎదుట ధర్నాలు చేస్తున్నారు. ఇలా తప్పుడు కేసులతో అరెస్ట్ అయిన వారిని న్యాయవాదులు కష్టపడి బెయిల్‌పై బయటకు తీసుకొస్తుంటే మరో కేసు పెట్టి అరెస్ట్ చేసే కార్యక్రమాలు జరుగుతున్నాయి. తుదకు సినీ దర్శకులను కూడా వదలడం లేదు. వాళ్లేమో ఇష్టానుసారం సినిమాలు తీయొచ్చట.
- రాష్ట్రంలో గతంలో ఎన్నడూ లేని తప్పుడు సంప్రదాయానికి నాంది పలుకుతున్నారు. ఒక వైపు కేసులు పెట్టడం, మరొక వైపు ఎవరైనా మాట్లాడితే అన్యాయంగా దూషించడం. ఇంకొక వైపు దుష్ప్రచారాలు చేయడం. ఇది చంద్రబాబు నైజం. టాపిక్ డైవర్షన్, తప్పుడు ప్రచారం, అబద్ధాలు, మోసాలు చేయడంలో చంద్రబాబు స్పెషలిస్ట్. ప్రత్యర్థుల వ్యక్తిత్వ హననం (క్యారెక్టర్ అసాసినేట్) చేయడంలో ప్రసిద్ధుడు. లక్ష్మీపార్వతితో మొదలు నా వరకు ఎలా ప్రచారం చేశారో చూశాం.

నా చెల్లిపై దుష్ప్రచారం చేసింది చంద్రబాబే

- చంద్రబాబు తప్పుడు ప్రచారంపై గతంలో నా చెల్లెలు షర్మిల ఏమన్నారో చూడండి. (వీడియోను ప్రదర్శిస్తూ..) ఆ వీడియోలో షర్మిల మాట్లాడుతూ.. 'ఎన్టీకే బిల్డింగ్ నుంచి దుష్ప్రచారం జరిగిందని ఐపీ అడ్రస్‌ను బట్టి పోలీసులు చెబుతున్నారు. ఈ వెబ్‌సైట్‌లన్నీ ప్రో టీడీపీ ప్రమోట్ చేసినవే. ప్రత్యర్థులను కించపరిచేవి. ఈ పోస్టింగ్‌లన్నీ బాలకృష్ణ బిల్డింగ్ నుంచి, ప్రో టీడీపీ సైట్‌ల నుంచి జరిగాయంటే బాలకృష్ణకు సంబంధం లేదని నేను ఎలా అనుకోవాలి? సంబంధం ఉంది కనుకే బాలకృష్ణ నా మీద నింద వేశారని, పుకార్లు పుట్టించారని, వాటిని ప్రచారం చేశారని నేను విశ్వసిస్తున్నా. బాలకృష్ణ ఇలా దిగజారుడు తనానికి ఎందుకు పాల్పడ్డారో ఆయనే చెప్పాలి.
- మా ప్రభుత్వ హయాంలో వర్రా రవీంద్రర్‌రెడ్డి పేరిట ఐ టీడీపీ సభ్యుడు ఉదయ్‌భూషణ్ ఒక ఫేక్ అకౌంట్ క్రియేట్ చేసి మా అమ్మను, మా చెల్లెలిని తిట్టించాడు. వర్రా రవీంద్రరెడ్డి పెట్టిన కేసు ఆధారంగా ఫిబ్రవరిలోనే ఉదయ్ భూషణ్‌ను ఆధారాలతో పోలీసులు అరెస్ట్ చేశారు. చంద్రబాబు ఎంత దారుణమైన నికృష్టుడంటే తన స్వార్థం కోసం ఎవరినైనా సరే వ్యక్తిత్వ హననం చేస్తాడు. వాళ్ల సానుభూతిపరులతో ఫేక్ ఐడీ క్రియేట్ చేయించి, వాళ్లతో మన వాళ్లను తిట్టిస్తాడు. మళ్లీ మనం తిట్టించామని బయట ప్రచారం చేస్తాడు. ఇటువంటి మనిషి ప్రపంచ చరిత్రలో ఎక్కడా ఉండడు. చాలా అరుదుగా పుడతారు ఇలాంటి రాక్షసులు. మన కర్మ ఏంటంటే ఈయన మన రాష్ట్రంలో పుట్టడం. చంద్రబాబు నైజం ఎలా ఉంటుందో ఇంతకంటే ఇంకేం చెప్పమంటారు?

మరిన్ని వార్తలు, వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

పోలవరంలో విధ్వంసం బాబు ఘనతే

- పోలవరంలో విధ్వంసానికి కారణం చంద్రబాబు విధానాలేనని తేల్చి చెబుతూ ఇటీవల అంతర్జాతీయ నిపుణుల కమిటీ కేంద్రానికి నివేదిక ఇచ్చింది. గోదావరి ప్రవాహాన్ని మళ్లించేలా అప్రోచ్ ఛానల్, స్పిల్ వే, స్పిల్ ఛానల్, ఎగువ, దిగువ కాఫర్ డ్యాంలు కట్టాక.. గోదావరి నదికి అడ్డంగా 2.5 కి.మీల పొడవునా ప్రధాన డ్యాం నిర్మించాలి. తొలుత పునాది డయాఫ్రం వాల్ వేసి, ఆ తర్వాత ప్రధాన డ్యాం పనులు చేపట్టాలి.
- కానీ.. కాంక్రీట్ పనుల్లో కమీషన్లు ఎక్కువగా రావని.. మట్టి పనుల్లో అయితే ఎక్కువ కమీషన్లు వస్తాయని స్పిల్ వే పునాది స్థాయిలో ఉండగానే చంద్రబాబు ప్రధాన డ్యాం పునాది డయాఫ్రం వాల్ వేశారు. ఆ తర్వాత ఎగువ, దిగువ కాఫర్ డ్యాంల పనులు చేపట్టారు. వరద ప్రవాహం స్పిల్ వే వైపు మళ్లించడం సాధ్యం కాకపోవడంతో కాఫర్ డ్యాంలకు ఇరు వైపులా 400 మీటర్లు, 300 మీటర్ల చొప్పున ఖాళీ ప్రదేశాలు వదిలేశారు. 2.5 కి.మీల వెడల్పున ప్రవహించాల్సిన గోదావరి వరద.. కుంచించుకుపోయి ప్రవహించడంతో ఎగువ, దిగువ కాఫర్ డ్యాంలు కోతకు గురయ్యాయి. ప్రధాన డ్యాం నిర్మాణ ప్రాంతం, డయాఫ్రం వాల్ కోతకు గురై దెబ్బతింది. చంద్రబాబు చేసిన చారిత్రక తప్పిదం వల్లే ఈ దుస్థితి ఏర్పడింది. లేదంటే ఈ పాటికి ఎప్పుడో పోలవరం ప్రాజెక్టు పూర్తయ్యేది.
- మేం అధికారంలోకి వచ్చాక గోదావరి వరదను మళ్లించేలా స్పిల్ వేను 48 గేట్లతో సహా పూర్తి చేశాం. ఎగువ, దిగువ కాఫర్ డ్యాంలకు మరమ్మతులు చేసి పూర్తి చేశాం. స్పిల్ వే మీదుగా గోదావరి ప్రవాహాన్ని మళ్లించాం. ప్రధాన డ్యాం నిర్మాణ ప్రాంతంలో కోతకు గురైన ప్రాంతానికి మరమ్మతులు చేసి, యథాస్థితికి తీసుకొచ్చాం. దెబ్బతిన్న డయాఫ్రం వాల్‌కు మరమ్మతులు చేయాలా? లేక కొత్తది కట్టాలా అన్నది తేల్చాలని కేంద్రాన్ని కోరాం. దాన్ని తేల్చే బాధ్యతను నిపుణుల కమిటీకి కేంద్రం అప్పగించింది.
- ఇప్పుడు ఆ కమిటీ వచ్చింది. వరద ప్రవాహాన్ని మళ్లించే పనులు పూర్తయిన నేపథ్యంలో ఎగువ, దిగువ కాఫర్ డ్యాంల మధ్య కొత్త డయా ఫ్రంవాల్ వేసి, ప్రధాన డ్యాంను పూర్తి చేయడానికి మార్గం సుగమం చేశాం. అయినా చంద్రబాబు గోబెల్స్ మాదిరిగా అబద్ధాల మీద అబద్ధాలు చెబుతూనే ఉన్నాడు. వాళ్లకున్న ఆర్గనైజ్ క్రైమ్ చేయతగ్గ ముఠా మా దగ్గర లేదు.

మెరిట్ ఉన్నోళ్లకే మేనేజ్‌మెంట్ సీటు



ఇంజనీరింగ్ ప్రవేశాల ప్రక్రియలో మార్పులు

బీ కేటగిరీ సీట్లు ఆన్‌లైన్ విధానంలో భర్తీ.. కసరత్తు షురూ

బేరసారాలకు చెక్ పెట్టేందుకు ఉన్నత విద్యామండలి యోచన

త్వరలో ప్రభుత్వానికి నివేదిక

సాక్షి, హైదరాబాద్: ఇంజనీరింగ్ సీట్ల బేరసారాలకు చెక్ పెట్టేందుకు ఉన్నత విద్యామండ లి కార్యాచరణ సిద్ధం చేస్తోంది. యాజమాన్య కోటా సీట్లను కూడా ఆన్‌లైన్ విధానంలోనే భర్తీ చేయాలని నిర్ణయించింది. ప్రస్తుతం కన్వీనర్ కోటా సీట్లను ఈ తరహాలో కేటాయిస్తున్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఇంజనీరింగ్ కౌన్సెలింగ్ ప్రక్రియను సమూలంగా మార్చాలని అధికారులు నిర్ణయించారు. దీనిపై ఇప్పటికే ఉన్నత స్థాయిలో చర్చలు జరిగాయి. కొన్ని కాలేజీల మేనేజ్‌మెంట్ల అభిప్రాయాలను అధికారులు సేకరిస్తున్నారు. కొంత మంది ఆన్‌లైన్ విధానాన్ని సమర్థిస్తున్నట్టు కౌన్సిల్ వర్గాలు తెలిపాయి. ఆన్‌లైన్ సీట్ల భర్తీ వ్యవహారంపై త్వరలో ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనున్నట్టు మండలి అధికారులు తెలి పారు. ప్రభుత్వం నుంచి గ్రీన్‌సిగ్నల్ వచ్చిన వెంట నే విధివిధానాలను రూపొందిస్తామన్నా రు. ప్రభుత్వం కూడా ఆన్‌లైన్ సీట్ల భర్తీపై పట్టుదలగా ఉందని మండలి ఉన్నతాధికారులు చెప్పారు.

ఏటా రూ. కోట్ల వ్యాపారం

రాష్ట్రంలో దాదాపు 1.16 లక్షల ఇంజనీరింగ్ సీట్లున్నాయి. ప్రస్తుతం 70 శాతం సీట్లను కన్వీనర్ కోటా కింద భర్తీ చేస్తున్నారు. దాదాపు 38 వేల సీట్లను యాజమాన్య కోటా కింద కాలేజీలే నింపుకుంటున్నాయి. నిబంధనల ప్రకారం 15% బీ కేటగిరీ కింద భర్తీ చేయాలి. ప్రభుత్వం నిర్ణయించిన మేరకే ఈ కేటగిరీకి ఫీజులు వసూలు చేయాలి. వీరికి ఎలాంటి ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తించదు. అయితే, జేఈఈ, ఈఏపీసెట్, ఇంటర్ మార్కుల మెరిట్‌ను పరిగణలోనికి తీసుకోవాలి. కాలేజీలు మాత్రం ఇవేవీ పట్టించుకోవడం లేదు. కౌన్సెలింగ్ తేదీలకు ముందే ఒక్కో సీటును రూ.7 నుంచి 18 లక్షల వరకూ అమ్ముకుంటున్నాయనే ఫిర్యాదులున్నాయి. ఏటా ఈ తరహా సీట్ల అమ్మకంతో రూ.వందల కోట్ల వ్యాపారం జరుగుతోందనే ఆరోపణలున్నాయి. ప్రతీ సంవత్సరం ఉన్నత విద్యామండలికి వందల కొద్దీ ఫిర్యాదులు వస్తున్నాయి. యాజమాన్య కోటా సీట్లను ఆన్‌లైన్ ద్వారా భర్తీ చేయాలని విద్యార్థి సంఘాలతోపాటు విద్యావేత్తలు డిమాండ్ చేస్తున్నారు. గత ఏడాదే దీనిపై ఆలోచన చేసినా, కాలేజీ యాజమాన్యాలు అడ్డుకున్నట్టు తెలిసింది.

ఎన్‌ఆర్‌ఐలకే సీ కేటగిరీ

యాజమాన్య కోటాలో 15% ప్రవాస భారతీయులకు కేటాయిస్తారు. ఈ కోటాలో సీటు పొందే వాళ్లు ఏడాదికి 5 వేల డాలర్లు చెల్లించాల్సి ఉంటుంది. ఎన్‌ఆర్‌ఐలు సిఫార్సు చేసిన వాళ్లకు సీట్లు ఇవ్వడం ఇప్పటి వరకూ ఉంది. ఇక నుంచి నేరుగా ఎన్‌ఆర్‌ఐ పిల్లలకు మాత్రమే ఈ కేటగిరీ కింద సీట్లు ఇవ్వాలనే నిబంధనను తేవాలని మండలి భావిస్తోంది. ఒకవేళ ఎన్‌ఆర్‌ఐలు లేక సీట్లు మిగిలితే... ఆ సీట్లను బీ కేటగిరీ కిందకు మార్చాలని భావిస్తున్నారు. ఏటా ఇంజనీరింగ్ సీట్ల కోసం అనేక రకాలుగా సిఫార్సులు వస్తున్నాయి. కొన్ని కాలేజీలు వీటిని తప్పించుకోవడానికి ఆన్‌లైన్ విధానం సరైందిగా భావిస్తున్నాయి. ఆన్‌లైన్ సీట్ల భర్తీని ఇప్పటికే ఆంధ్రప్రదేశ్‌లో గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అమలులోకి తెచ్చింది. దీనిపై అధికారులు అధ్యయనం చేస్తున్నారు.

కచ్చితంగా అమలు చేస్తాం..

ఇంజనీరింగ్ యాజమాన్య కోటా సీట్లను వచ్చే విద్యా సంవత్సరం నుంచిఅమలు చేస్తాం. సీట్ల అమ్మకానికి తెరవేయాలని ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉంది. మేనేజ్‌మెంట్ కోటా సీట్లయినా మెరిట్ ఉన్నవాళ్లకే కేటాయించేలా చేస్తాం.
– వి.బాలకిష్టారెడ్డి, ఉన్నత విద్యామండలి చైర్మన్

మాకు 'సాగర్' పగ్గాలివ్వాలి

- కృష్ణా బోర్డు 19వ సమావేశం ఎజెండాలో తెలంగాణ డిమాండ్
- చట్టం ప్రకారం సాగర్ భద్రత, నిర్వహణ, పర్యవేక్షణ తెలంగాణ పరిధిలోకే వస్తుంది
- ఇందులో ఏపీ జోక్యానికి, మా విధుల కబ్జాకు తావు లేదని స్పష్టీకరణ
- డిసెంబర్ 3న జలసౌధలో జరగనున్న కీలక సమావేశం



సాక్షి, హైదరాబాద్: నాగార్జునసాగర్ పగ్గాలను తమకే అప్పగించాలని తెలంగాణ చేస్తున్న డిమాండ్‌తోపాటు ఏపీ, తెలంగాణ మధ్య కృష్ణా జలాల పంపిణీపై చర్చించడానికి డిసెంబర్ 3న కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్‌ఎంబీ) సమావేశం జరగనుంది. హైదరాబాద్‌లోని జలసౌధలో జరగనున్న 19వ సమావేశం ఎజెండాలో మొత్తం 24 కీలక అంశాలను కృష్ణాబోర్డు చేర్చడంతో వీటిపై వాడీవేడీ చర్చ జరగనుంది. బోర్డు చైర్మన్, కన్వీనర్‌తోపాటు ఏపీ, తెలంగాణ అధికారులు హాజరు కానున్నారు.

తెలంగాణ డిమాండ్లు

'ఆనకట్టల భద్రత చట్టం 2021లోని సెక్షన్ 16(1ఏ) ప్రకారం నాగార్జునసాగర్ భద్రతకి సంబంధించిన నిఘా, 16(1బీ) ప్రకారంతనిఖీలు, 16(1సీ) ప్రకారం నిర్వహణ, పర్యవేక్షణ వంటి కార్యకలాపాలు తెలంగాణ పరిధిలోకే వస్తాయి. యావత్ జలాశయం కార్యకలాపాలన్నింటినీ తెలంగాణకే అప్పగించాలి. ఈ విషయంలో ఏపీ జోక్యానికి, తెలంగాణ విధుల ఆక్రమణకు తావులేదు. కృష్ణా బోర్డు సూచనల మేరకు రాష్ట్ర విభజన నాటి నుంచి సాగర్ డ్యామ్, కుడి, ఎడమ కాల్వల రెగ్యులేటర్ల నిర్వహణ, పర్యవేక్షణ తెలంగాణ చేతిలో ఉండగా, గతేడాది నవంబర్ 28న ఏపీ అధీనంలోకి తీసుకుంది. కుడికాల్వ రెగ్యులేటర్ నుంచి నీళ్లను విడుదల చేసింది. ఈ ఘటనకు పూర్వ స్థితిగతులను పునరుద్ధరించాలని కేంద్ర హోంశాఖ 2023 డిసెంబర్ 1న ఏపీని ఆదేశించింది'అనే అంశాలను తెలంగాణ సూచనల మేరకు ఎజెండాలో కృష్ణా బోర్డు పొందుపరిచింది.

నో అన్న 'అపెక్స్'.. మళ్లీ బోర్డుకు పంచాయతీ

కృష్ణా జలాల్లో ఉమ్మడి ఏపీకి ఉన్న 811 టీఎంసీల వాటా నుంచి ఏపీ, తెలంగాణకు పంపకాలు జరగలేదు. రాష్ట్ర విభజన అనంతరం 2015లో కేంద్ర జలశక్తి శాఖ నిర్వహించిన సమావేశంలో 2015–16 అవసరాల కోసం ఏపీకి 512 టీఎంసీలు, తెలంగాణకు 299 టీఎంసీలను తాత్కాలికంగా కేటాయించారు. 2016–17లో సైతం ఇదే కేటాయింపులను కొనసాగించాలని 2016లో జరిగిన కౌన్సిల్ సమావేశంలో నిర్ణయించారు. దీని ఆధారంగానే 2017–18లో ఏపీ, తెలంగాణ మధ్య 66:34 నిష్పత్తిలో నీటి పంపకాలు జరపాలని 2017లో కృష్ణా బోర్డు నిర్ణయించింది. 2021–22 వరకూ దీన్నే కొనసాగించారు. 2022–23లో దీని కొనసాగింపును తెలంగాణ వ్యతిరేకించింది. 50:50 నిష్పత్తిలో పంపిణీ జరపాలని తెలంగాణ కోరగా, 66:34 నిష్పత్తిలోనే కొనసాగించాలని ఏపీ పట్టుబట్టింది. తాత్కాలిక కోటాపై అపెక్స్ కౌన్సిల్ నిర్ణయాన్ని కోరుతూ వివాదాన్ని కేంద్ర జలశక్తి శాఖకు కృష్ణా బోర్డు రెఫర్ చేయగా, అపెక్స్ కౌన్సిల్ నీటి పంపకాల జోలికి వెళ్లదని జలశక్తి శాఖ చెప్పింది. దీంతో వివాదం మళ్లీ కృష్ణా బోర్డుకు చేరింది.

ఎజెండాలో కృష్ణా బోర్డు పొందుపరిచిన అంశాలివీ..

- కృష్ణా బోర్డు కార్యాలయం ఏపీకి తరలింపు.
- గెజిట్ నోటిఫికేషన్ ప్రకారం శ్రీశైలం, నాగార్జునసాగర్ నిర్వహణను కృష్ణా బోర్డుకు అప్పగించాలి.
- ఇరు రాష్ట్రాల్లోని అనధికార ప్రాజెక్టుల పనులను నిలుపుదల చేయాలి.
- రెండో విడతలో 9 టెలీమెట్రీ స్టేషన్ల ఏర్పాటుకు నిధుల కేటాయింపు.

తెలంగాణ ఇతర డిమాండ్లు

- తాము వాడుకోకుండా నాగార్జునసాగర్‌లో పొదుపు చేసిన తమ వాటా జలాలను తదుపరి నీటి సంవత్సరంలో వాడుకోవడానికి అనుమతించాలి.
- సాగర్ టెయిల్‌పాండ్ నుంచి విద్యుదుత్పత్తి ద్వారా ఏపీజెన్‌కో అనధికారికంగా 4 టీఎంసీలను విడుదల చేసింది. ఇప్పటికే కృష్ణా డెల్టాకు ఏపీ 117 టీఎంసీలను విడుదల చేసింది. ఇకపై టెయిల్‌పాండ్ విద్యుత్ కేంద్రం నుంచి వరదలున్నప్పుడే నీళ్ల విడుదల చేయాలి. సాగర్ టెయిల్‌పాండ్ డ్యామ్ గేట్ల నిర్వహణనూ తెలంగాణకే అప్పగించాలి.
- ఆర్డీఎస్ ఆనకట్ట ఆధునీకరణకు ఏపీ అడ్డుపడుతుండటంతో తమ వాటా జలాలను తీసుకోలేకపోతున్నాం. కృష్ణా ట్రిబ్యునల్–2 నీటి కేటాయింపులు జరిపే వరకు ఆర్డీఎస్ కుడికాల్వ పనులను కొనసాగించే అధికారం ఏపీకి లేదు.
- ఏపీ నీటి వినియోగాన్ని లెక్కించడానికి శ్రీశైలం, సాగర్, ప్రకాశం, సుంకేశుల బరాజ్‌ల వద్ద టెలిమెట్రీ స్టేషన్లను ఏర్పాటు చేయాలి.
- రాయలసీమ ఎత్తిపోతలతో సహా అనుమతుల్లేకుండా కృష్ణా బేసిన్‌లో ఏపీ చేపడుతున్న ప్రాజెక్టులు, ఎస్‌ఆర్‌ఎంసీ కాల్వ లైనింగ్ పనులను నిలుపుదల చేయాలి.
- శ్రీశైలం నుంచి పోతిరెడ్డిపాడు, ఎస్‌ఆర్‌బీసీ, జీఎన్‌ఎస్‌ఎస్, తెలుగు గంగ, హెచ్‌ఎన్‌ఎస్, నిప్పులవాగు ఎస్కేప్ చానల్ ఇతర మార్గాల ద్వారా బేసిన్ వెలుపలి ప్రాంతాలకు కృష్ణా జలాలను ఏపీ చేపట్టరాదు.
- శ్రీశైలం జలాశయం ప్లంజ్ పూల్‌కి ఏపీ అత్యవసర మరమ్మతుల నిర్వహించాలి.



భద్ర..'ఖాళీ' వరంగల్ భద్రకాళి చెరువు సుందరీకరణ నేపథ్యంలో ఈ నెల 8నుంచి నీటిని హసన్‌పర్తిలోని నాగారం చెరువులోకి తరలించారు. దీంతో ఎప్పుడూ నీటితో కళకళలాడే చెరువు మొత్తం బుధవారం ఖాళీ అయిపోయి.. ఒండ్రు మిగిలింది.
– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, హనుమకొండ

ప్రభుత్వ శాఖలకు గ్రూప్‌-4 అర్హుల తుది జాబితా

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ శాఖల్లో గ్రూప్–4 ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థుల తుది జాబితాను ఇటీవల టీజీపీఎస్సీ విడుదల చేసింది. 8 వేలకు పైబడి ఉద్యోగాల కు ఎంపికైన అభ్యర్థుల జాబితాను కమిషన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. తాజాగా ప్రభుత్వ శాఖల వారీ గా ఎంపికైన అభ్యర్థుల జాబితాను ఆయా శాఖలకు పంపింది. ఈనేపథ్యంలో సంబంధిత ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియను అధికారులు చేపట్టారు. పెద్ద సంఖ్యలో అభ్యర్థులు ఉండటంతో రోజుకు కొంత మంది చొప్పున అభ్యర్థులకు షెడ్యూల్ విడుదల చేసిన ప్రభుత్వ శాఖలు.. ఆమేరకు పరిశీలన ప్రక్రియను వేగవంతం చేశాయి. మరో 3 రోజుల్లో ధ్రువపత్రాల పరిశీలన పూర్తి కానుందని అధికారులు చెబుతున్నారు. ధ్రువపత్రాల పరిశీలనలో సందేహాలుంటే సంబంధిత జిల్లా కలెక్టర్లకు సమాచారం ఇస్తున్నారు. ప్రధానంగా కుల ధ్రువీకరణ పత్రాలపై సందేహాలు వస్తుండడంతో వాటి నిర్ధారణ కోసం జిల్లా కలెక్ట ర్లకు సమాచారం అందిస్తున్నారు. వాటిపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి నిర్ధారించాలని కోరుతున్నారు. అలాంటి వాటిని పెండింగ్‌లో పెడుతున్న అధికారులు.. మిగిలిన వాటి పరిశీలన పూర్తి చేస్తున్నారు. ధ్రువపత్రాల పరిశీలన పూర్తయిన తర్వాత అభ్యర్థులకు నియామక పత్రాలు ఇవ్వనున్నట్లు అధికారవర్గాలు చెబుతున్నాయి.

ఆ రిజర్వేషన్లు రాజ్యాంగ విరుద్ధం

- బీజేపీ ఓబీసీ మోర్చా
- మోర్చా ఆధ్వర్యంలో డెడికేటెడ్ కమిషన్‌కు వినతిపత్రం
- నేడు వరంగల్ కలెక్టరేట్‌లో కమిషన్ విచారణ



బూసానికి వినతిపత్రం ఇస్తున్న ఓబీసీ మోర్చా నేతలు

సాక్షి, హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికల్లో ముస్లింలకు 4% రిజర్వేషన్ల కేటాయింపు రాజ్యాంగ విరుద్ధమని, దీనిని బీజేపీ వ్యతిరేకిస్తోందని ఆ పార్టీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గంధమల్ల ఆనంద్‌గౌడ్ అన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. బుధవారం ఆయన ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో.. బీసీ రిజర్వేషన్ల నిర్ధారణ కోసం ఏర్పాటు చేసిన డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ బూసాని వెంకటేశ్వరరావు, కమిషన్ సభ్య కార్యదర్శి సైదులు, ఇతర అధికారులను కలసి ఈ మేరకు వినతి పత్రం సమర్పించారు. ప్రస్తుతం రాష్ట్రంలో సాగుతున్న సర్వేపై తమ అభిప్రాయాలు తెలియజేసినట్టు ఆనంద్‌గౌడ్ తెలిపారు. మైనార్టీలను కూడా కులాల వారిగా గణన చేసి ఆ వివరాలు ప్రకటించాలని కమిషన్‌ను కోరామన్నారు. కులగణనను పారదర్శకంగా నిర్వహించి, సర్వే వివరాలను ఆన్‌లైన్‌లో పెట్టాల్సిందిగా విజ్ఞప్తి చేశామన్నారు. గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం మాదిరిగా సర్వేను బుట్ట దాఖలు చేయొద్దని సూచించామన్నారు. ఈ బృందంలో ఓబీసీ మోర్చా నాయకులు ఆకారం రమేశ్, ప్యారసాని వెంకటేశ్, వేణు తదితరులు ఉన్నారు.

వేగంగా డెడికేటెడ్ కమిషన్ విచారణ

స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల నిర్ధారణ కోసం ఏర్పాటు చేసిన డెడికేటెడ్ కమిషన్ అధ్యయనం వేగం పుంజుకుంది. ఇప్పటికే ఐదు జిల్లాల్లో బహిరంగ విచారణ పూర్తి చేసిన బూసాని వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలోని డెడికేటెడ్ కమిషన్.. మాసబ్‌ట్యాంక్‌లోని దామోదరం సంజీవయ్య సంక్షేమ భవన్‌లో మూడు రోజుల పాటు కుల సంఘాలు, వ్యక్తులు, ప్రజా సంఘాలు, మేధావుల నుంచి వినతులు, సలహాలు, సూచనలను స్వీకరించింది. బుధవారం బహిరంగ విచారణ సందర్భంగా దాదాపు 20 కుల సంఘాలు వేర్వేరుగా విజ్ఞాపనలు సమర్పించాయి. ప్రధానంగా జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ వినతులు వచ్చాయి. అదేవిధంగా వర్గీకరణ ప్రక్రియలోనూ మార్పులు చేపట్టాలనే డిమాండ్లు వచ్చాయి. మరోవైపు గురువారం నుంచి కమిషన్ జిల్లాల పర్యటన చేపట్టనుంది. గురువారం ఉదయం వరంగల్ జిల్లా కలెక్టరేట్‌లో బహిరంగ విచారణ నిర్వహించనుంది. ఆ తర్వాత ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన మిగిలిన జిల్లాల్లో కూడా ఈ విచారణ కొనసాగించనున్నట్లు కమిషన్ వర్గాలు చెబుతున్నాయి. స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లకు సంబంధించిన అంశంపై ఏర్పాటు చేసిన డెడికేటెడ్ కమిషన్‌కు రాష్ట్ర ప్రభుత్వం నెలరోజుల గడువు విధించింది. ఈ క్రమంలో మూడు వారాల సమయం పూర్తి కాగా.. మరో వారం రోజుల సమయం మిగిలి ఉంది. నిర్దేశించిన గడువులోగా పని పూర్తి చేసేలా కమిషన్ కార్యాచరణ సిద్ధం చేసినప్పటికీ మరికొంత గడువు పొడిగింపు అంశాన్ని కూడా పరిశీలించాలని డెడికేటెడ్ కమిషన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరే అవకాశం ఉంది. మరోవైపు రాష్ట్రంలో జరుగుతున్న సమగ్ర కుటుంబ సర్వే ప్రక్రియ సమాచారం కోసం కూడా డెడికేటెడ్ కమిషన్ వేచి చూస్తోంది.

సవాల్‌గా మారిన రాయపర్తి చోరీ కేసు

- 4 బృందాలతో దర్యాప్తు ముమ్మరం
- దొంగలముఠాను గుర్తించేందుకు తీవ్ర యత్నం
- ఇది ప్రొఫెషనల్ గ్యాంగ్ పనే.. వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా

సాక్షి, వరంగల్: వరంగల్ జిల్లా రాయపర్తి మండల కేంద్రంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) బ్రాంచ్‌లో సోమవారం రాత్రి జరిగిన భారీ బంగారం చోరీ కేసు పోలీసులకు సవాల్‌గా మారింది. దాదాపు 19 కిలోల బంగారంతో ఉడాయించిన దొంగలను పట్టుకునేందుకు నాలుగు ప్రత్యేక బృందాలను నియమించి దర్యాప్తు చేస్తున్నా ఆశించిన పురోగతి కనిపించడం లేదు. బ్యాంక్‌లోని సీసీటీవీ ఫుటేజీ నిక్షిప్తమైన డీవీఆర్ బాక్స్‌ను దొంగలు ఎత్తుకెళ్లడం, రాయపర్తిలో ఉన్న 50కి పైగా సీసీటీవీ కెమెరాల్లో ఎక్కువభాగం పనిచేయకపోవడంతో దొంగల రాకపోకలను గుర్తించలేకపోయారు. వర్ధన్నపేట, తొర్రూరు వైపు హైవేపై ఉన్న సీసీటీవీ కెమెరాల ఫుటేజీని కూడా పోలీస్ బృందాలు క్షుణ్ణంగా శోధిస్తున్నాయి. ఎస్‌బీఐ కార్యాలయంలో క్లూస్ టీమ్ శాస్త్రీయ ఆధారాలను సేకరించింది. దొంగలు వదలి వెళ్లిన ఆక్సిజన్ సిలిండర్‌పై ఉన్న వేలి ముద్రలను, బురద అంటి ఉన్న పాదముద్రలను తీసుకున్నారు. ఘటనాస్థలాన్ని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా బుధవారం పరిశీలించారు. ప్రొఫెషనల్ గ్యాంగ్ ఈ చోరీకి పాల్పడిందని, నేరస్తులను త్వరలోనే పట్టుకుంటామని తెలిపారు.

ఆందోళనలో ఖాతాదారులు: చోరీ జరిగిన బ్యాంకులో 630 మంది బంగారు ఆభరణాలు తనఖా పెట్టి రుణాలు తీసుకున్నారు. అందులో దొంగలు 497 మందికి చెందిన 19 కిలోల బంగారం దోచుకెళ్లినట్లు గుర్తించారు. ఈ విషయం తెలుసుకున్న ఖాతాదారులు బ్యాంక్ వద్దకు చేరుకొని ఆందోళన వ్యక్తంచేశారు. తమ బంగారం తిరిగి ఇస్తామని బ్యాంక్ అధికారులు రాతపూర్వకంగా హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. అయితే ఖాతాదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఇటు బ్యాంక్, అటు పోలీసు అధికారులు నచ్చజెప్పి వారిని తిప్పి పంపారు.

ప్రైవేటు కాలేజీల సమస్యలపై సానుకూలంగా ఉన్నాం: భట్టి



సాక్షి, హైదరాబాద్: ప్రైవేట్ ఇంటర్, డిగ్రీ కాలేజీల సమస్యల పట్ల సానుకూలంగా ఉన్నామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని ఆందోళనకు దిగిన ప్రైవేటు కాలేజీల యాజమాన్య ప్రతినిధులతో భట్టి బుధవారం సమావేశమయ్యారు. సమస్యల పట్ల తమ ప్రభుత్వానికి అవగాహన ఉందన్నారు. అన్నివేళలా సానుకూలంగా స్పందిస్తామని తెలిపారు. కాగా, సచివాలయంలో ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడ్డితో ప్రైవేటు కళాశాలల యజమానుల సంఘం సభ్యులు భేటీ అయ్యారు. కళాశాలల సమస్యలు దశలవారీగా పరిష్కరిస్తామని ఆయన తెలిపారు.

రోడ్ టెర్రర్

- తెలంగాణలో పెరిగిన రోడ్డు ప్రమాదాలు
- నగటున రోజుకు 20 మంది మృత్యువాత
- ఈ ఏడాది సెప్టెంబర్ వరకు 18,991 ప్రమాదాల్లో 5,606 మంది దుర్మరణం
- గత ఏడాదితో పోలిస్తే..12 శాతం మేర పెరిగిన రోడ్డు ప్రమాదాల సంఖ్య

కేస్‌-1: ఈ ఏడాది ఫిబ్రవరిలో సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఔటర్‌రింగ్ రోడ్డుపై జరిగిన రోడ్డు ప్రమాదంలో కంటోన్మెంట్ ఎమ్మెల్యే జి.లాస్యనందిత దుర్మరణం పాలయ్యారు. ఆమె ప్రయాణిస్తున్న కారును గుర్తు తెలియని భారీ వాహనం వెనుక నుంచి ఢీకొట్టడంతో ఈ ఘటన చోటుచేసుకుంది.

కేస్‌-2: ఈ ఏడాది ఆగస్టు 17న హైదరాబాద్‌లోని హబ్సిగూడ చౌరస్తాలో ఆటోను వెనుక నుంచి ఓవర్‌లోడ్‌తో వస్తున్న ఓ లారీ ఢీకొట్టిన ఘటనలో పదోతరగతి విద్యార్థిని సాత్విక దుర్మరణం పాలైంది. పది నిమిషాల్లో పాఠశాలకు చేరాల్సిన ఆ విద్యార్థిని లారీ డ్రైవర్ నిర్లక్ష్యానికి బలైంది.

కేస్‌-3: ఈ ఏడాది అక్టోబర్ 11న శామీర్‌పేట్ పరిధిలో మజీద్‌పుర-తుర్కపల్లి వద్ద ఫార్మా ఉద్యోగులు వెళుతున్న వ్యాన్.. ముందు వెళుతున్న ట్రాక్టర్‌ను ఢీకొట్టడంతో ముందు సీటులో కూర్చున్న ఓ మహిళా ఉద్యోగి అక్కడికక్కడే మృతి చెందింది.

సాక్షి, హైదరాబాద్: రోడ్డు ప్రమాదాల బారినపడి రాష్ట్రంలో రోజుకు సగటున 20 మంది ప్రాణాలు కోల్పోతున్నారు. పోలీస్‌శాఖ అధికారిక గణాంకాల ప్రకారం..2024 సెప్టెంబర్ వరకు రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 18,991 రోడ్డు ప్రమాదాలు జరిగాయి. ఇందులో 5,606 మంది మృత్యువాతపడ్డారు. గతేడాదితో పోల్చి చూస్తే.. 2023 సెప్టెంబర్ వరకు 16,916 రోడ్డు ప్రమాదాలు జరగ్గా, 5,771 మంది మృతి చెందారు. పోలీస్, ఆర్టీఏతోపాటు ఇతర ప్రభుత్వ శాఖలు చర్యలు తీసుకుంటున్నా రోడ్డు ప్రమాదాల సంఖ్యను తగ్గించలేకపోతున్నాయి. అయితే గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది రోడ్డు ప్రమాదాల సంఖ్యలో 12 శాతం పెరుగుదల ఉన్నా..మృతుల సంఖ్యలో 3 శాతం తగ్గుదల నమోదు కావడం కొంత ఊరట కలిగిస్తోంది.

3 కమిషనరేట్ల పరిధిలోనే అత్యధిక ప్రమాదాలు

రాచకొండ, సైబరాబాద్, హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ల పరిధిలోనే ప్రమాదాలు ఎక్కువగా చోటు చేసుకుంటున్నాయి.అధిక వాహనాలతో పాటు జాతీయ రహదారులు ఉండటం వల్లే ప్రమాదాల సంఖ్య పెరుగుతున్నట్టు అధికారులు తెలిపారు.

- 2023లో సెప్టెంబర్ వరకు నమోదైన రోడ్డు ప్రమాదాల పరంగా చూస్తే..అత్యధికంగా రాచకొండ పోలీస్ కమిషనరేట్‌లో 2,732 రోడ్డు ప్రమాదాల్లో..574 మంది మృతి చెందారు. సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 2,493 ప్రమాదాల్లో 707 మంది, హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 2,059 ప్రమాదాల్లో 263 మంది మృతి చెందారు.
- 2024 సెప్టెంబర్ వరకు గణాంకాలను పరిశీలిస్తే..సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో రోడ్డు ప్రమాదాలు పెరిగాయి. మొత్తం 3,034 రోడ్డు ప్రమాదాల్లో 660 మంది మృతి చెందారు. హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 2,936 రోడ్డు ప్రమాదాల్లో 203 మంది, రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 2,598 రోడ్డు ప్రమాదాల్లో 517 మంది మృతిచెందారు.

తెలంగాణ పోలీస్‌శాఖ గణాంకాల ప్రకారం

అంశం	2023 సెప్టెంబర్ వరకు	2024 సెప్టెంబర్ వరకు
మొత్తం ప్రమాదాలు	16,916	18,991
మృతిచెందిన వారు	5,771	5,606
తీవ్రంగా గాయపడినవారు	2,499	1,094
స్వల్పంగా గాయపడినవారు	13,155	16,595

సేవాదళ్ బాధ్యత చాలా గొప్పది

- కరోనా సమయంలో అద్భుతంగా పనిచేసింది
- సేవాదళ్‌లో పనిచేసే వారికి పార్టీలో గౌరవం ఉంటుంది: రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షీ



మున్షీతో మాట్లాడుతున్న మహేశ్‌కుమార్ గౌడ్

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీలో సేవాదళ్ పాత్ర చాలా గొప్పదని రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ దీపాదాస్‌మున్షీ వ్యాఖ్యానించారు. అఖిల భారత కాంగ్రెస్ సేవాదళ్ ఏర్పాటై 100 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా టీపీసీసీ సేవాదళ్ ఆధ్వర్యంలో బుధవారం గాంధీభవన్‌లో ఉత్సవ సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మున్షీ మాట్లాడుతూ దేశాన్ని ఐక్యం చేసేందుకు రాహుల్‌గాంధీ నిర్వహించిన భారత్‌జోడో యాత్రలో సేవాదళ్ పాత్ర చాలా గొప్పదని, కరోనా సమయంలో ఎంతో బాధ్యతాయుతంగా సేవాదళ్ సేవలందించిందని చెప్పారు. సేవాదళ్ కార్యకర్తల పనితీరు ఆదర్శవంతంగా ఉంటుందని చెప్పారు. సేవాదళ్ కార్యకర్తలను గౌరవించి వారికి సోనియాగాంధీ ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం కల్పించారని, పార్టీలో ఎంతో కీలకమైన సేవాదళ్‌కు ఎప్పుడూ గౌరవం ఉంటుందని, ఆ గౌరవాన్ని నిలబెట్టుకునే రీతిలో సేవాదళ్ కార్యకర్తలు పనిచేయాలని సూచించారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో అనుబంధ సంఘాలకు అత్యంత ప్రాధాన్యం ఉంటుందని, సేవాదళ్ నేతలు, కార్యకర్తలకు కూడా తగిన ప్రాధాన్యం కల్పిస్తామని చెప్పారు. సేవాదళ్ జాతీయ అధ్యక్షుడు లాల్‌జీ దేశాయ్ మాట్లాడుతూ మోదీ ఓవైపు, అమిత్‌షా మరోవైపు దేశాన్ని లూటీ చేస్తున్నారని, దేశానికి శనిలా దాపురించిన వారిని గద్దెదించాలని కోరారు. టీపీసీసీ సేవాదళ్ చైర్మన్ మిద్దెల జితేందర్‌తోపాటు రాష్ట్ర కార్యవర్గం, అన్ని జిల్లాల సేవాదళ్ అధ్యక్షులు, నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

చుక్కా రామయ్యకు ప్రముఖుల శుభాకాంక్షలు



చుక్కా రామయ్యతో కేక్ కట్ చేయిస్తున్న సీఎస్ శాంతికుమారి

నల్లకుంట (హైదరాబాద్): మాజీ ఎమ్మెల్సీ, విద్యావేత్త, ఐఐటీ చుక్కా రామయ్య (98) జన్మదిన వేడుకలు బుధవారం నల్లకుంటలోని ఆయన నివాసంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జస్టిస్ సుదర్శన్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎ.శాంతి కుమారి, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్, మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్ రావు, జానారెడ్డి, సీనియర్ పాత్రికేయుడు రామచంద్రమూర్తి, ప్రొఫెసర్ హరగోపాల్, మల్లేపల్లి లక్ష్మయ్య, హైదరాబాద్ బుక్ ఫెయిర్ ప్రెసిడెంట్ యాకూబ్, కార్యదర్శి బాల్‌రెడ్డి, బీసీ కమిషన్ మాజీ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్ తదితరులు ఆయన నివాసానికి వెళ్లి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. మాజీ మంత్రి హరీశ్ రావు ఫోన్‌చేసి చుక్కా రామ య్యకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

మల్లారెడ్డి విద్యా సంస్థలకు డీమ్డ్ హోదా

సాక్షి, హైదరాబాద్: మల్లారెడ్డి విద్యా సంస్థలకు డీమ్డ్ హోదా లభించింది. కేంద్ర విద్యాశాఖ ఇటీవల ఈ విషయాన్ని వెల్లడించింది. ఫార్మాస్యూటికల్స్, ఇంజనీరింగ్ (మహిళ), మెడికల్, మెడికల్ (మహిళ), డెంటల్, డెంటల్ (మహిళ), నర్సింగ్ కాలేజీలను కలిపి మల్లా రెడ్డి విద్యాపీఠం కింద డీమ్డ్ వర్సిటీ హోదా ఇవ్వాలని యాజమాన్యం దరఖాస్తు చేసింది. దీనికి అఖిల భారత సాంకేతిక విద్యా మండలి అనుమతించడంతో కేంద్ర ప్రభుత్వం.. డీమ్డ్ వర్సిటీగా గుర్తిస్తూ గెజిట్ జారీ చేసింది. ఇదిలా ఉంటే, రాష్ట్ర ప్రభుత్వ అనుమతి లేకుండా డీమ్డ్ వర్సిటీలుగా హోదా ఇవ్వొద్దని, ఇచ్చి న వాటి విషయంలో పునరాలోచన చేయా లని రాష్ట్ర ప్రభుత్వం, కేంద్రానికి లేఖ రాసిన ట్టు ఓ ఉన్నతాధికారి తెలిపారు.

'వీఆర్వోలను రెవెన్యూ శాఖలోకి తీసుకోండి'



లచ్చిరెడ్డిని కలిసిన వీఆర్వోల సంఘం ప్రతినిధులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని గ్రామ రెవెన్యూ సహాయకులు (వీఆర్వో) ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని తెలంగాణ రీడెప్లాయ్డ్ వీఆర్వోల సంఘం కోరింది. ఈ మేరకు పలువురు సంఘం నేతలు తెలంగాణ రాష్ట్ర ఉద్యోగుల జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి, కోచైర్మన్ రామకృష్ణలను కలిసి బుధవారం వినతిపత్రం అందజేసింది. వీఆర్వోలను రెవెన్యూ శాఖలోకి తీసుకోవడంతో పాటు వేతనాలు, పదోన్నతులు, కారుణ్య నియామకాలు తదితర అంశాలపై రాష్ట్ర ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి పరిష్కారమయ్యేలా చొరవ తీసుకోవాలని కోరారు. తమ వినతి పట్ల లచ్చిరెడ్డి సానుకూలంగా స్పందించారని వీఆర్వోల సంఘం అధ్యక్షుడు వింజమూరి ఈశ్వర్ వెల్లడించారు. లచ్చిరెడ్డిని కలిసిన వారిలో సంఘం నేతలు ఎం.గోపి, బసవరాజు, అంజిలయ్య, రవి, బాలు, రాఘవేంద్ర,హన్మంతు, ఆనంద్ తదితరులున్నారు.

వ్యవసాయ వర్సిటీ వజ్రోత్సవాలకు రండి

యూజీసీ చైర్మన్‌కు వీసీ ఆహ్వానం



మామిడాల జగదీశ్వర్

సాక్షి, హైదరాబాద్: ఢిల్లీ పర్యటనలో ఉన్న ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆల్దాసు జానయ్య.. బుధవారం యూనివర్సిటీస్ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) చైర్మన్ డాక్టర్ మామిడాల జగదీశ్వర్‌ను కలిశారు. మర్యాదపూర్వకంగా జరిగిన వీరి భేటీలో జాతీయ విద్యా విధానం ప్రాధాన్యం, ఆవశ్యకతలపై చర్చించారు. వచ్చే నెల 20వ తేదీన జరగనున్న వ్యవసాయ విశ్వవిద్యాలయం వజ్రోత్సవాలకు హాజరు కావాలని ప్రొఫెసర్ జానయ్య ఆహ్వానించగా.. డాక్టర్ జగదీశ్వర్ సానుకూలంగా స్పందించారు. ఇద్దరి స్వస్థలం నల్లగొండ జిల్లా మామిడాల కావడంతో చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు.

గురుకుల ఆర్ట్, క్రాఫ్ట్ అభ్యర్థుల 1:2 జాబితా విడుదల

సాక్షి, హైదరాబాద్: గురుకుల విద్యాసంస్థల్లో ఆర్ట్, క్రాఫ్ట్ టీచర్ ఉద్యోగాలకు 1:2 నిష్పత్తిలో అర్హత సాధించిన అభ్యర్థుల ప్రాథమిక జాబితాను బుధవారం తెలంగాణ గురుకుల విద్యాసంస్థల నియామకాల బోర్డు చైర్మన్ బి.సైదులు విడుదల చేశారు. ఈ జాబితా బోర్డు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉందన్నారు. 27–29 వరకు అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన చేపట్టనున్నట్లు తెలిపారు.



మనమే 'ఆసియా' చాంపియన్స్

ఏ లక్ష్యంతోనైతే బరిలోకి దిగారో ఆ లక్ష్యాన్ని పూర్తి చేశారు భారత మహిళల జట్టు క్రీడాకారిణులు. సొంతగడ్డపై సాధికారిక ఆటతీరుతో అలరించి మూడోసారి ఆసియా చాంపియన్స్ ట్రోఫీ చాంపియన్స్‌గా నిలిచారు. బుధవారం ముగిసిన ఈ టోర్నీలో సలీమా టెటె నాయకత్వంలోని భారత జట్టు చాంపియన్‌గా నిలిచింది. పారిస్ ఒలింపిక్స్ రజత పతక విజేత చైనాతో నువ్వా నేనా అన్నట్లు సాగిన అంతిమ సమరంలో పూర్తి సంయమనంతో ఆడిన భారత్ ఏకైక గోల్‌తో పైచేయి సాధించింది.

టైటిల్ నిలబెట్టుకున్న భారత మహిళల జట్టు

- ఆసియా చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్లో 1–0తో చైనాపై విజయం
- జట్టులోని సభ్యులకు రూ. 10 లక్షల చొప్పున నజరానా ప్రకటించిన బిహార్ సీఎం నితీశ్ కుమార్

11 ఈ టోర్నీలో భారత క్రీడాకారిణి దీపిక ఏడు మ్యాచ్‌లు ఆడి 11 గోల్స్‌తో టాప్ స్కోరర్‌గా నిలిచింది.
86 ఈ టోర్నీలో నమోదైన మొత్తం గోల్స్.
9 ఈ టోర్నీలో భారత్ నుంచి ఏకంగా 9 మంది క్రీడాకారిణులు (దీపిక, సంగీత, ప్రీతి దూబే, నవ్‌నీత్ కౌర్, లాల్‌రెమ్‌సియామి, మనీషా చౌహాన్, బ్యూటీ డుంగ్‌డుంగ్, సలీమా టెటె, ఉదిత) గోల్స్ చేశారు.
29 ఈ టోర్నీలో భారత జట్టు చేసిన గోల్స్. ప్రత్యర్థి జట్లకు కేవలం 2 గోల్స్ సమర్పించుకుంది.

రాజ్‌గిర్ (బిహార్): లాస్ ఏంజెలిస్ ఒలింపిక్స్ బెర్త్ లక్ష్యంగా ... ఇప్పటి నుంచే సన్నాహాలు ప్రారంభించిన భారత మహిళల హాకీ జట్టు ఆ దిశగా విజయవంతంగా అడుగులు వేసింది. ఈ ఏడాది అంతర్జాతీయ స్థాయిలో గొప్ప ఫలితాలు అందుకోలేకపోయిన భారత జట్టు స్వదేశంలో జరిగిన ఆసియా చాంపియన్స్ ట్రోఫీలో మాత్రం అదరగొట్టే ప్రదర్శనతో మెరిపించింది. బుధవారం ముగిసిన ఈ టోర్నీలో భారత జట్టు విజేతగా నిలిచింది. పారిస్ ఒలింపిక్స్ రజత పతక విజేత, ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 5వ స్థానంలో ఉన్న చైనా జట్టుతో జరిగిన తుది పోరులో భారత జట్టు 1–0 గోల్ తేడాతో గెలిచింది. ఆట 31వ నిమిషంలో లభించిన పెనాల్టీ కార్నర్‌ను దీపిక గోల్‌గా మలిచింది. దాంతో భారత్ ఆధిక్యంలోకి వెళ్లింది. చివరిదాకా ఈ ఆధిక్యాన్ని కాపాడుకున్న క్రమంలో భారత జట్టు మూడోసారి ఆసియా చాంపియన్స్ ట్రోఫీ టైటిల్‌ను సొంతం చేసుకుంది. గతంలో భారత జట్టు 2016, 2023లలో ఈ టైటిల్‌ను దక్కించుకుంది. దక్షిణ కొరియా తర్వాత వరుసగా రెండుసార్లు ఆసియా చాంపియన్స్ ట్రోఫీ టైటిల్ నెగ్గిన రెండో జట్టుగా భారత్ గుర్తింపు పొందింది. జపాన్ జట్టుకు మూడో స్థానం లభించింది. కాంస్య పతక మ్యాచ్‌లో జపాన్ 4–1తో మలేసియాపై గెలిచింది.

లీగ్ దశలో ఆడిన ఐదు మ్యాచ్‌ల్లోనూ గెలిచి, సెమీఫైనల్లోనూ విజయం సాధించి టైటిల్ పోరుకు చేరుకున్న భారత జట్టు ఈ కీలక సమరంలోనూ సమష్టిగా రాణించింది. లీగ్ దశలో భారత్‌కు గట్టిపోటీనివ్వలేకపోయిన చైనా జట్టు తుది పోరులో మాత్రం మెరుగ్గా ఆడింది. అవకాశం దొరికినపుడల్లా రెండు జట్లు గోల్‌పోస్ట్ వైపునకు దూసుకెళ్లాయి. అయితే అప్రమత్తంగా ఉన్న డిఫెండర్లు వాటిని వమ్ము చేశారు. ఫలితంగా తొలి రెండు క్వార్టర్‌లు ముగిసేసరికి ఒక్క గోల్ కూడా నమోదు కాలేదు. మూడో క్వార్టర్‌లో భారత జట్టు తమ వ్యూహం మార్చింది. ఆ వెంటనే భారత్‌కు ఐదో పెనాల్టీ కార్నర్ లభించింది. ఈ అవకాశాన్ని భారత్ వృథా చేసుకోలేదు. దీపిక రివర్స్ షాట్‌తో బంతిని లక్ష్యానికి చేర్చడంతో భారత్ 1–0తో ముందంజ వేసింది. ఆట 42వ నిమిషంలో భారత ఆధిక్యం 2–0కు పెరిగేది. పెనాల్టీ స్ట్రోక్ రూపంలో లభించిన సువర్ణావకాశాన్ని దీపిక వృథా చేసింది. దీపిక షాట్‌ను చైనా గోల్‌కీపర్ నిలువరించింది. దాంతో భారత్‌కు నిరాశ కలిగింది. ఆధిక్యం ఒక్క గోల్ మాత్రమే ఉండటంతో భారత జట్టు అనుక్షణం జాగ్రత్తగా ఆడాల్సి వచ్చింది. స్కోరును సమం చేసేందుకు చైనా విశ్వప్రయత్నాలు చేసింది. కానీ భారత డిఫెన్స్ పటిష్టంగా ఉండటంతో చైనా ఆటలు సాగలేదు. చివరకు భారత జట్టు 1–0తో విజయాన్ని ఖరారు చేసుకుంది. విజేతగా నిలిచిన భారత జట్టుకు బిహార్ రాష్ట్ర ప్రభుత్వం నగదు పురస్కారాలు ప్రకటించింది. జట్టులోని ప్రతి సభ్యురాలికి రూ. 10 లక్షల చొప్పున నజరానా అందజేస్తామని బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ ప్రకటించారు. హెడ్ కోచ్ హరేంద్ర సింగ్‌కు రూ. 10 లక్షలు, ఇతర సహాయక సిబ్బందికి రూ. 5 లక్షల చొప్పున అందజేస్తామన్నారు.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

22 గ్రాండ్‌స్లామ్‌లు... 36 మాస్టర్ సిరీస్–1000 ట్రోఫీలు... 25 ఏటీపీ–500 టైటిల్స్... 10 ఏటీపీ–250 టైటిల్స్... 2 ఒలింపిక్ స్వర్ణాలు... 209 వారాల పాటు వరల్డ్ నంబర్‌వన్...1250 రాకెట్లు...300 కిలోమీటర్ల స్ట్రింగ్...16500 మీటర్ల ఓవర్‌గ్రిప్... ఇదీ కోర్టులో రాఫెల్ నాదల్ టెన్నిస్ ప్రయాణం! సుదీర్ఘంగా సాగిన ఈ అద్భుత ప్రస్థానం ముగిసింది. స్వదేశంలో, సొంత అభిమానుల సమక్షంలో 'స్పెయిన్ బుల్' నాదల్ కెరీర్ చివరి మ్యాచ్ ఆడేశాడు. ఆఖరి పోరులో పరాజయం పలకరించినా... ఈ మ్యాచ్ తుది ఫలితంకంటే అతని నిష్క్రమణే టెన్నిస్ ప్రపంచాన్ని భావోద్వేగంలో ముంచింది... కన్నీళ్లపర్యంతమవుతూ నాదల్ అభిమాన ఆటకు గుడ్‌బై చెప్పాడు.



- టెన్నిస్‌కు వీడ్కోలు పలికిన రాఫెల్ నాదల్
- ఓటమితో కెరీర్ ముగింపు
- డేవిస్‌కప్ టోర్నీ క్వార్టర్ ఫైనల్లో స్పెయిన్ పరాజయం

భావోద్వేగంతో 'బుల్' గుడ్‌బై

మలాగా (స్పెయిన్): ప్రపంచ టెన్నిస్‌ను శాసించిన దిగ్గజాలలో ఒకడైన రాఫెల్ నాదల్ రెండు దశాబ్దాలకు పైగా సాగిన కెరీర్‌కు వీడ్కోలు పలికాడు. గతంలోనే ప్రకటించినట్లుగా డేవిస్‌కప్ టోర్నీలో జాతీయ జట్టుకు చివరిసారి ప్రాతినిధ్యం వహించిన తర్వాత అతను రిటైరయ్యాడు. భారత కాలమానం ప్రకారం మంగళవారం అర్ధరాత్రి దాటాక ముగిసిన క్వార్టర్ ఫైనల్లో స్పెయిన్ 1–2తో నెదర్లాండ్స్ జట్టు చేతిలో ఓడిపోయింది. స్పెయిన్ తరఫున తొలి సింగిల్స్‌లో బరిలోకి దిగిన నాదల్‌పై 6–4, 6–4 స్కోరుతో బొటిక్ వాన్ డి జాండ్‌షుల్ప్ విజయం సాధించాడు. ఆ తర్వాత రెండో సింగిల్స్‌లో అల్‌కరాజ్ 7–6 (7/0), 6–3తో గ్రీక్‌స్పూర్‌ను ఓడించి 1–1తో సమం చేశాడు. నిర్ణాయక డబుల్స్ మ్యాచ్‌లో నెదర్లాండ్ జోడీ వాన్ డి జాండ్‌షుల్ప్–వెస్లీ కూల్‌హాఫ్ 7–6 (7/4), 7–6 (7/3) స్కోరుతో స్పెయిన్ ద్వయం అల్‌కరాజ్–మార్సెల్ గ్రానోలర్స్‌ను ఓడించింది. స్పెయిన్ నిష్క్రమణతో నాదల్‌కు ఇదే చివరి పోరుగా మారింది. నాదల్ మ్యాచ్‌ను తిలకించేందుకు కుటుంబసభ్యులందరూ వచ్చారు.

అంతా అతనే...

మ్యాచ్ ఆరంభానికి ముందు స్పెయిన్ జాతీయ గీతం ఆలపిస్తున్న సమయంలో 38 ఏళ్ల నాదల్ కన్నీళ్ల పర్యంతమయ్యాడు. సుమారు 10 వేల మంది ప్రేక్షకులతో స్టేడియం అంతా ఎరుపు వర్ణం పులుముకున్న తర్వాత అతను ఆటలోకి అడుగు పెట్టాడు. కోర్టులో ప్రతి షాట్‌కు అభిమానులు 'రా...ఫా...రా...ఫా....' అంటూ జేజేలు పలుకుతూ ప్రోత్సహిస్తుండగా అతను పోటీ పడ్డాడు. అయితే ఊహించినట్లుగానే గతంలోలా తన స్థాయికి తగ్గ ప్రదర్శన ఇవ్వలేకపోయిన అతను వరుస సెట్‌లలో ఓడిపోయాడు. నాదల్ కొట్టిన ఫోర్‌హ్యాండ్ నెట్‌ను తాకడంతో అతని ఓటమి ఖాయమైంది. స్పెయిన్ ఓటమి తర్వాత నాదల్ స్టేడియం అంతా కలియతిరిగాడు. ఆటగాళ్లు, కోచ్‌లను కౌగిలించుకొని భావోద్వేగభరితమైన అతను అభిమానుల చప్పట్ల హోరు మధ్య ప్రసంగం పూర్తి చేసుకొని వీడాడు.

వరుసగా 19 ఏళ్ల పాటు...

2024: 0	2017: 6	2010: 7
2023: 0	2016: 2	2009: 5
2022: 4	2015: 3	2008: 8
2021: 2	2014: 4	2007: 6
2020: 2	2013: 10	2006: 5
2019: 4	2012: 4	2005: 11
2018: 5	2011: 3	2004: 1
		మొత్తం 92

రాఫెల్ నాదల్ 2004లో తొలిసారి ఏటీపీ సింగిల్స్ టైటిల్ గెలిచాడు. పోలాండ్‌లోని సొపోట్ నగరంలో జరిగిన ఐడియా ప్రొకామ్ ఓపెన్ టోర్నీలో నాదల్ విజేతగా నిలిచాడు. ఆ ఏడాది నుంచి వరుసగా 19 ఏళ్లపాటు (2022 వరకు) నాదల్ కనీసం ఒక్క టైటిల్ అయినా సాధిస్తూ వచ్చాడు. గాయాల కారణంగా 2023లో, ఈ ఏడాది నాదల్ టైటిల్ గెలవలేకపోయాడు.

అంకెల్లో నాదల్ కెరీర్

1080 సింగిల్స్ విభాగంలో గెలిచిన మ్యాచ్‌లు
227 సింగిల్స్ విభాగంలో ఓడిన మ్యాచ్‌లు
910 ఏటీపీ ర్యాంకింగ్స్‌లో టాప్‌–10లో కొనసాగిన వారాలు
209 ప్రపంచ నంబర్‌వన్‌గా కొనసాగిన వారాలు
92 కెరీర్ మొత్తంలో నెగ్గిన సింగిల్స్ టైటిల్స్
63 క్లే కోర్టులపై గెలిచిన సింగిల్స్ టైటిల్స్
22 మొత్తం నెగ్గిన గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిల్స్ (ఫ్రెంచ్ ఓపెన్: 14, ఆస్ట్రేలియన్ ఓపెన్: 2 ; వింబుల్డన్: 2, యూఎస్ ఓపెన్: 4)
2 గెలిచిన ఒలింపిక్స్ స్వర్ణాలు (2008 బీజింగ్ ఒలింపిక్స్ సింగిల్స్ : 2016 రియో ఒలింపిక్స్‌లో డబుల్స్)
4 డేవిస్‌కప్ టీమ్ టైటిల్స్ (2004, 2009, 2011, 2019)
కెరీర్‌లో సంపాదించిన మొత్తం ప్రైజ్‌మనీ **13,49,46,100** డాలర్లు (రూ. 1138 కోట్లు)

"భావోద్వేగాలను నియంత్రించుకోవడం కష్టంగా ఉంది. అయితే ప్రశాంతమైన మనసుతో వీడ్కోలు పలుకుతున్నా. నా విజయాల సంఖ్య, టైటిల్స్, రికార్డుల గురించి అందరికీ తెలుసు. అయితే ఒక చిన్న ఊరు మలోర్కా నుంచి వచ్చిన ఒక మంచి వ్యక్తిగా, తన కలలు నేర్చుకునేందుకు ఎంతో కష్టపడిన ఒక చిన్న కుర్రాడిగా నేను గుర్తుండిపోవాలని కోరుకుంటాను. ఈ విషయంలో నేను చాలా అదృష్టవంతుడిని. నా కెరీర్‌లో ఎంతో మంది మిత్రులను సంపాదించుకోగలిగాను. డేవిస్ కప్‌లో తొలి మ్యాచ్‌ను ఓటమితో మొదలు పెట్టిన నేను ఇప్పుడూ ఓడి ఎక్కడ మొదలు పెట్టానో అక్కడికే వచ్చాను. నా చివరి మ్యాచ్ చాలా కఠినంగా అనిపించింది. నిజానికి ఎవరూ ఇలాంటి క్షణం రావాలని కోరుకోరు. నేను టెన్నిస్ ఆడే విషయంలో అలసిపోలేదు. కానీ నా శరీరం అలసిపోయింది. ఇక ఆడటం సాధ్యం కాదని చెప్పేసింది. కాబట్టి నేను వాస్తవాన్ని అంగీకరించాలి. నిజాయితీగా చెప్పాలంటే ఒక హాబీగా మొదలు పెట్టిన ఆటలో ఇంత గొప్ప కెరీర్ నిర్మించుకోగలగడాన్ని నేను గొప్పగా భావిస్తున్నా. పైగా నేను ఊహించిన దానికంటే ఎంతో ఎక్కువ కాలం ఆడగలిగాను."

- వీడ్కోలు ప్రసంగంలో రాఫెల్ నాదల్

మా నాన్న వల్లే నేనీ స్థాయిలో ఉన్నాను - నాగార్జున

● అక్కినేని నాగేశ్వరరావు, రాజ్ కపూర్, మహమ్మద్ రఫీ, తపన్ సిన్హాల శతాబ్ది వేడుకలు ● ఇఫీలో దక్షిణాది సందడి

"మా నాన్న నేర్పిన జీవిత పాఠాలు నన్ను ఎన్నో రకాలుగా ప్రభావితం చేశాయి. మా నాన్న బాటలో నడవడం వల్లే నేను ఈ స్థాయిలో ఉన్నాను" అని అక్కినేని నాగార్జున అన్నారు. ప్రతి ఏడాది కేంద్ర ప్రసార సమాచార శాఖ సహకారంతో జాతీయ చిత్ర పరిశ్రమాభివృద్ధి సమాఖ్య ఆధ్వర్యంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే భారతదేశపు అంతర్జాతీయ చిత్రోత్సవం (ఇఫీ) బుధవారం గోవాలో ప్రారంభమైంది. ఈ నెల 28 వరకూ ఈ చిత్రోత్సవం జరగనుంది. తొలి రోజు నటులు ఏఎన్నార్, రాజ్ కపూర్, గాయకుడు మహమ్మద్ రఫీ, దర్శకుడు తపన్ సిన్హాల శతాబ్ది వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా లెజెండరీ ఆల్బమ్‌ని విడుదల చేశారు. ఈ వేదికపై తండ్రి ఏఎన్నార్ గురించి మాట్లాడారు నాగార్జున. యాంకర్ కోరిన మీదట తాను నటించిన 'బంగార్రాజు' చిత్రంలోని 'వాసివాడి తస్సాదియ్యా..' డైలాగ్ చెప్పారు నాగార్జున. ఈ చిత్రోత్సంలో నాగార్జున, అమల దంపతులను, నటుడు శరత్ కుమార్, దర్శకుడు ఆర్కే సెల్వమణి, చిదానంద నాయక్, నిర్మాత–దర్శకుడు సుభాష్ ఘాయ్, నటీమణులు నిత్యా మీనన్, ప్రణీతలను సన్మానించారు.


● నాగార్జున, శేఖర్ కపూర్

"పేపర్ బాయ్‌గా నా ప్రస్థానం ప్రారంభించాను" అని శరత్‌కుమార్ పేర్కొన్నారు. "తెలుగు సినిమాల్లోని కొత్తదనం, పాజిటివిటీ అంతర్జాతీయ స్థాయి ప్రేక్షకులకు టాలీవుడ్‌ని చేరువ చేస్తున్నాయి" అన్నారు అమల.

ఇఫీ... ఇంకొన్ని విశేషాలు

- కార్యక్రమ ప్రారంభంలో భారత వందనం నృత్య కార్యక్రమం ఆహూతులను విశేషంగా అలరించింది.
- సినీ దిగ్గజాలు అక్కినేని నాగేశ్వరరావు, మహమ్మద్ రఫీ, తపన్ సిన్హా, రాజ్ కపూర్‌ల జీవితం గురించి బాలీవుడ్ నటుడు బొమన్ ఇరానీ అందించిన వీడియో సహిత కార్యక్రమం ఆకట్టుకుంది.
- పలుమార్లు 'ఆర్ ఆర్ ఆర్' చిత్రం ప్రస్తావన వచ్చింది.
- చిత్రోత్సవంలో భాగంగా విభిన్న కేటగిరీలో చిత్రాలను ఎంపిక చేసే జ్యూరీల్లో తెలుగు దర్శకుడు హరీశ్ శంకర్, హైదరాబాద్‌కు చెందిన యువ డిజైనర్ అర్చనా రావు ఉన్నారు.
- బాలీవుడ్ నటి మానుషీ చిల్లర్ 'ఆ కుర్చీని మడతపెట్టి..' పాటకు నృత్యంతో అలరించారు.
- ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఆధ్యాత్మిక గురు పండిట్ రవిశంకర్ జీవిత ఘట్టాల ఆధారంగా తీస్తున్న చిత్ర విశేషాలు ప్రదర్శించారు.
- ఆహూతుల్లో ఖుష్బూ, సుశాంత్ తదితరులు ఉన్నారు.

– గోవా నుంచి 'సాక్షి' ప్రతినిధి

సినిమా


● మీనాక్షీ చౌదరి, ఐశ్వర్యా రాజేశ్, వెంకటేశ్, అనిల్, 'దిల్' రాజు, శిరీష్

అప్పుడే ఇండస్ట్రీ బాగుంటుంది - వెంకటేశ్

"ఈ సంక్రాంతికి రిలీజ్ కానున్న మా 'సంక్రాంతికి వస్తున్నాం'తో పాటు రామ్‌చరణ్ 'గేమ్ చేంజర్', బాలకృష్ణ 'డాకు మహారాజ్' సినిమాలన్నీ అద్భుతంగా ఆడాలి. అన్ని సినిమాలు ఆడినప్పుడే ఇండస్ట్రీ బాగుంటుంది" అని హీరో వెంకటేశ్ అన్నారు. అనిల్ రావిపూడి దర్శకత్వంలో వెంకటేశ్ హీరోగా, ఐశ్వర్యా రాజేష్, మీనాక్షీ చౌదరి హీరోయిన్లుగా నటించిన చిత్రం 'సంక్రాంతికి వస్తున్నాం'. 'దిల్' రాజు సమర్పణలో శిరీష్ నిర్మించారు. ఈ చిత్రాన్ని సంక్రాంతి సందర్భంగా జనవరి 14న విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో వెంకటేశ్ మాట్లాడుతూ– "సంక్రాంతికి ఒక మంచి వినోదాత్మక చిత్రం ప్రేక్షకులకు ఇవ్వాలనే ఈ సినిమాని ఆ సమయానికి విడుదల చేస్తున్నాం. నా కెరీర్‌లో బెస్ట్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ చిత్రమిది" అని పేర్కొన్నారు. 'దిల్' రాజు మాట్లాడుతూ– "'సంక్రాంతికి వస్తున్నాం' రష్ చూసి, నాన్‌స్టాప్‌గా నవ్వుకున్నాను. నాకు 'ఎఫ్ 2' బెస్ట్ సినిమా అని చెబుతుంటాను. అనిల్ క్యాలెండర్‌లో 'సంక్రాంతికి వస్తున్నాం' బెస్ట్‌గా నిలుస్తుంది" అన్నారు. అనిల్ రావిపూడి మాట్లాడుతూ– "నా దర్శకత్వంలో వచ్చిన 'ఎఫ్ 2, సరిలేరు నీకెవ్వరు' సినిమాలు సంక్రాంతికి విడుదలై బ్లాక్ బస్టర్ అయ్యాయి. ఈ 'సంక్రాంతికి వస్తున్నాం' కూడా అందరికీ నచ్చుతుంది" అన్నారు.



ఆ టైమ్‌లో నేను భయపడ్డాను - శ్రద్ధా శ్రీనాథ్

"నాకు క్వాలిటీ వర్క్ చేయడం ఇష్టం. అందుకే స్క్రిప్ట్స్ సెలక్షన్‌లో కాస్త ఎక్కువ జాగ్రత్తగా ఉంటాను. తెలుగులో 'జెర్సీ' సినిమా తర్వాత నాకు మదర్ క్యారెక్టర్ ఆఫర్స్ చాలా వచ్చాయి. కానీ ఒకే తరహా పాత్రలు చేయడం ఇష్టం లేక ఒప్పుకోలేదు. ఇక కోవిడ్ సమయంలో కొంత మంది వర్క్ ఫ్రమ్ హోమ్ అంటూ పని చేసుకున్నారు. కానీ ఆర్టిస్టులకు ఇది కుదరదు. అందుకే నా కెరీర్ ఎలా ఉంటుందా? అని అందరిలానే నేనూ భయపడ్డాను" అని శ్రద్ధా శ్రీనాథ్ అన్నారు. విశ్వక్ సేన్ హీరోగా నటించిన చిత్రం 'మెకానిక్ రాకీ'. ఈ చిత్రంలో మీనాక్షీ చౌదరి, శ్రద్ధా శ్రీనాథ్ హీరోయిన్లుగా నటించారు. రామ్ తాళ్లూరి నిర్మించిన ఈ చిత్రం ఈ శుక్రవారం విడుదల కానుంది. ఈ సందర్భంగా బుధవారం విలేకరుల సమావేశంలో శ్రద్ధా శ్రీనాథ్ మాట్లాడుతూ– "ఈ చిత్రంలో మాయ అనే పాత్ర చేశాను. నాది మెకానిక్ రాకీ జీవితాన్ని మార్చే పాత్ర. ఈ సినిమా కథ విన్నప్పుడు ఎగ్జైటింగ్‌గా అనిపించడంతో ఒప్పుకున్నాను. 'ఫలక్‌నుమా దాస్' చిత్రంలో విశ్వక్ చెప్పిన స్టోరీ నాకు నచ్చలేదు. అందుకే ఆ సినిమా ఒప్పుకోలేదు. ఆ తర్వాత కూడా విశ్వక్ హీరోగా చేసిన రెండు చిత్రాల్లో నటించాల్సింది. కానీ కుదర్లేదు. ఫైనల్‌గా 'మెకానిక్ రాకీ' చేశాను. 'బాహుబలి', 'కల్కి 2898 ఏడీ'లాంటి సినిమాలూ చేయాలని ఉంది. ప్రస్తుతం 'డాకు మహారాజ్' చేస్తున్నాను. తమిళంలో విష్ణు విశాల్‌తో ఓ సినిమా, ఓ తమిళ వెబ్ సిరీస్ చేస్తున్నాను" అని అన్నారు.

కామన్‌మేన్ కష్టాలతో...


● బాల సుందరం, ఈశ్వర్ కార్తీక్, సత్యదేవ్, ఎస్ఎన్ రెడ్డి

"'జీబ్రా'లో బ్యాంకర్ రోల్ చేశాను. గ్యాంగ్‌స్టర్ వరల్డ్‌లో ఓ కామన్‌మేన్ పడే కష్టాలను ఈ సినిమాలో చాలా ఫన్‌గా చూపించడం జరిగింది. ఈ కథలో ఫన్, థ్రిల్ చక్కగా బ్లెండ్ అయ్యాయి" అని సత్యదేవ్ అన్నారు. సత్యదేవ్, డాలీ ధనంజయ హీరోలుగా నటించిన చిత్రం 'జీబ్రా'. ఈ చిత్రంలో ప్రియా భవానీ శంకర్, జెన్నిఫర్ పిషినాటో హీరోయిన్లుగా నటించారు. ఈశ్వర్ కార్తీక్ దర్శకత్వంలో ఎస్ఎన్ రెడ్డి, ఎస్. పద్మజ, బాల సుందరం, దినేష్ సుందరం నిర్మించిన ఈ చిత్రం తెలుగు, తమిళ, కన్నడ, హిందీ భాషల్లో రేపు (శుక్రవారం) విడుదల కానుంది. ఈ సందర్భంగా బుధవారం విలేకరుల సమావేశంలో ఈశ్వర్ కార్తీక్ మాట్లాడుతూ– "ఫైనాన్షియల్ క్రైమ్ చుట్టూ తిరిగే కథే ఈ సినిమా" అని తెలిపారు. "'జీబ్రా'లో సత్యదేవ్, డాలీ పోటీపడి నటించారు" అన్నారు ఎస్ఎన్ రెడ్డి. "కథ విన్నప్పుడే 'జీబ్రా' బ్లాక్‌బస్టర్ అనిపించింది" అన్నారు బాల సుందరం. ఎడిటర్ అనిల్ మాట్లాడారు.

ఈ సినిమా ఇద్దరికీ అగ్నిపరీక్షే - బోయపాటి శ్రీను


● అర్జున్, మానస, అశోక్, సుధీర్, ప్రశాంత్ వర్మ, బోయపాటి శ్రీను

"చిన్న సినిమా.. పెద్ద సినిమా అని ఉండదు. మంచి సినిమానా? కాదా? అనేది ఉంటుంది. 'దేవకి నందన వాసుదేవ' వంద శాతం మంచి సినిమా అనిపించింది. ఈ చిత్రం అశోక్‌కి, అర్జున్‌కి అగ్ని పరీక్షే. ఈ పరీక్షని ఎదుర్కొని వారు నిలబడతారని కోరుకుంటున్నాను" అని డైరెక్టర్ బోయపాటి శ్రీను అన్నారు. అశోక్ గల్లా, వారణాసి మానస జంటగా నటించిన చిత్రం 'దేవకి నందన వాసుదేవ'. అర్జున్ జంధ్యాల దర్శకుడు. నల్లపనేని యామిని సమర్పణలో సోమినేని బాలకృష్ణ నిర్మించిన ఈ సినిమా రేపు విడుదల కానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో బోయపాటి శ్రీను, హీరో సుధీర్ బాబు అతిథులుగా పాల్గొన్నారు. సుధీర్‌బాబు మాట్లాడుతూ– "ఈ సినిమా ట్రైలర్, విజువల్స్, సాంగ్స్ చూసినప్పుడు అశోక్‌కి సరైన సినిమా అనిపించింది. తను కమర్షియల్ హీరోగా సక్సెస్ అవుతాడు" అన్నారు. "నేను రాసిన కథల్లో ఇది మాస్ ఎంటర్‌టైనర్. ఈ పాత్రకి అశోక్ కరెక్టుగా సరిపోయాడు. మహేశ్‌బాబుగారి ఫ్యాన్స్, ఆడియన్స్ ఈ చిత్రాన్ని చూసి, సపోర్ట్ చేయాలని కోరుకుంటున్నా" అని చిత్ర కథారచయిత ప్రశాంత్ వర్మ అన్నారు. "ఈ సినిమా నిర్మాణంలో ఎన్నో ఎత్తు పల్లాలు చూశాను. నాలాంటి కొత్త నిర్మాతని బతికించాలి" అని బాలకృష్ణ కోరారు.

వస్సాహి... వస్సాహి...


● మాధవ్, సిమ్రాన్ శర్మ

హీరో రవితేజ తమ్ముడు రఘు తనయుడు మాధవ్ హీరోగా నటించిన చిత్రం 'మిస్టర్ ఇడియట్'. ఈ చిత్రంలో సిమ్రాన్ శర్మ హీరోయిన్‌గా నటించారు. గౌరీ రోణంకి దర్శకత్వంలో యలమంచి రాణి సమర్పణలో జేజేఆర్ రవిచంద్ నిర్మించిన ఈ చిత్రం త్వరలో విడుదల కానుంది. తాజాగా ఈ సినిమాలోని 'వస్సాహి... వస్సాహి' అంటూ సాగే పాట లిరికల్ వీడియోను నటుడు శివాజీ విడుదల చేశారు. "సౌందర్య సార, మకరంద దార, శృంగార పారవరా, సౌవర్ణ ప్రతిమ...' అంటూ మొదలై, 'వస్సాహి... వస్సాహి' అంటూ సాగే ఈ పాటకు శివశక్తి దత్తా సాహిత్యం అందించగా, శ్రీరామచంద్ర పాడారు. ఈ చిత్రానికి సంగీతం: అనూప్ రూబెన్స్.

గోవా ఫిల్మ్ ఫెస్టివల్‌లో...


● జో శర్మ

జో శర్మ, సంబీత్ ఆచార్య లీడ్ రోల్స్‌లో నటించిన చిత్రం 'ఎమ్ 4 ఎమ్' (మోటివ్ ఫర్ మర్డర్). మోహన్ వడ్లపట్ల దర్శకత్వం వహించారు. మోహన్ మీడియా క్రియేషన్స్, జో శర్మ మెక్‌విన్ గ్రూప్ (యూఎస్ఏ) బ్యానర్‌పై ఈ సినిమా రూపొందింది. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో రూపొందిన ఈ చిత్రం త్వరలో విడుదలకు సిద్ధమవుతోంది. ఈ చిత్రం హిందీ ట్రైలర్‌ని ఈ నెల 23న గోవా ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్‌లో విడుదల చేయనున్నారు.

నాకు తల చాలా ముఖ్యం - అమ్మ రాజశేఖర్


● అమ్మ రాజశేఖర్, రాగిన్ రాజ్

"మన శరీరానికి తల ఎంత ముఖ్యమో... నాకు ఈ 'తల' సినిమా కూడా అంతే ముఖ్యం. డ్యాన్స్ మాస్టర్‌గా నాకు తొలి అవకాశం ఇచ్చిన ఆర్బీ చౌదరిగారిని నేను దేవుడిలా భావిస్తాను. ఆయన నిర్మాణంలో మా అబ్బాయి అమ్మ రాగిన్ రాజ్‌ని హీరోగా పరిచయం చేస్తుండటం హ్యాపీగా ఉంది" అని డైరెక్టర్ అమ్మ రాజశేఖర్ తెలిపారు. అమ్మ రాగిన్ రాజ్ హీరోగా నటించిన చిత్రం 'తల'. అమ్మ రాజశేఖర్ దర్శకత్వం వహించారు. ఆర్బీ చౌదరి సమర్పణలో ఎన్వీ ప్రసాద్, వాకాడ అంజన్ కుమార్ నిర్మించిన ఈ చిత్రం త్వరలో విడుదల కానుంది. ఈ సినిమా టీజర్ విడుదల వేడుకలో అమ్మ రాగిన్ రాజ్ మాట్లాడుతూ– "నేను హీరోగా ఎలా ఉండాలని ప్రేక్షకులు కోరుకుంటారో అలానే ఉంటాను. ఆడియన్స్ తప్పకుండా ఆశ్చర్యపోయేలా ఈ సినిమా ఉంటుంది" అని తెలిపారు. ఎస్తేర్ మాట్లాడుతూ– "ఇప్పటి వరకు నేను చేసిన పాత్రలకు భిన్నంగా 'తల'లో నా పాత్ర ఉంటుంది" అని చెప్పారు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు (మంగళవారం ముగింపు)	
సెన్సెక్స్ ▲ 239	నిఫ్టీ ▲ 65
77,578	23,518

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	18,875	▽	112
డోజోన్స్	43,201	▽	68
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,085	▽	14
డాక్స్	19,005	▽	56
షాంఘై	3,368	△	22
నికాయ్	38,352	▽	62

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	84.00	85.02
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	105.81	108.63
€	యూరో	ఎస్‌బీఐ	88.27	90.87
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	54.18	55.55
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	53.59	55.77
S$	సింగపూర్ డాలర్	ఫారెక్స్	60.41	65.89
SAR	సౌదీ రియాల్	ఫారెక్స్	21.58	23.12
UAE D	యూఏఈ దిర్హామ్	ఫారెక్స్	22.10	23.88
¥	చైనా యువాన్	ఫారెక్స్	10.76	12.59

మెగా ఆటో షో!

అంతర్జాతీయ ఆటోమొబైల్ హబ్‌గా అవతరిస్తున్న భారత్... ప్రపంచంలోనే అతిపెద్ద ఆటో షోకు వేదిక కానుంది. వచ్చే ఏడాది భారత్ మొబిలిటీ షోలో భాగంగా జరగనున్న వాహన ప్రదర్శన కోసం దేశ, విదేశీ దిగ్గజాలన్నీ క్యూ కడుతున్నాయి. ఇటీవలి కాలంలో జరిగిన బిగ్-5 ప్రపంచ వాహన ప్రదర్శనలను తలదన్నేలా ఢిల్లీ ఆటో ఎక్స్‌పో కనువిందు చేయనుంది!

ఢిల్లీ వేదికగా వచ్చే ఏడాది జనవరి 17-22 వరకు...

- భారత్ మొబిలిటీ షోలో భాగంగా ఏర్పాటు
- 28 దేశ, విదేశీ వాహన సంస్థల క్యూ...
- ఇటీవలి 'బిగ్ 5' గ్లోబల్ ఆటో షోల కంటే భారీగా...
- మారుతీ సుజుకీ ఎలక్ట్రిక్ కారు అరంగేట్రం

28 భారత్ మొబిలిటీ-2025లో పాల్గొంటున్న మొత్తం వాహన దిగ్గజాలు

వాణిజ్య వాహన సంస్థలు **6**

కార్ల కంపెనీలు **16**

ద్విచక్ర వాహన సంస్థలు **6**

వీటిపై ఫోకస్

- మారుతీ సుజుకీ తొలి ఎలక్ట్రిక్ ఎస్‌యూవీ
- వియత్నాం కార్ల కంపెనీ విన్‌ఫాస్ట్ ఎలక్ట్రిక్ కార్లు
- వేవ్ మొబిలిటీ భారత్‌లో తొలి సోలార్ ఎలక్ట్రిక్ కారు

దేశంలో మరో వాహన జాతరకు కౌంట్‌డౌన్ మొదలైంది. ప్రపంచ ఆటోమొబైల్ దిగ్గజాలన్నీ కొంగొత్త మోడళ్లను ప్రదర్శించేందుకు పోటీ పడుతున్నాయి. దేశీ దిగ్గజాలు టాటా మోటార్స్... మారుతీ సుజుకీ నుంచి గ్లోబల్ కంపెనీలు టయోటా, చైనా బీవైడీ వరకు దాదాపు 28 కంపెనీలు తమ కొత్త వాహన ఆవిష్కరణలతో సందర్శకులను అలరించనున్నాయి. దేశంలో తొలిసారిగా ఆటో షోతో పాటు దీనికి అనుబంధంగా పలు ప్రదర్శనలను కలిపి భారత్ మొబిలిటీ షో-2025 పేరుతో నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా వచ్చే ఏడాది జనవరి 17-22 వరకు జరగనున్న ఆటో ఎక్స్‌పో ప్రపంచంలోనే అతిపెద్దదిగా నిలుస్తుందని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. ప్రతిష్టాత్మకంగా నిర్మించిన భారత్ మండపం ఈ కార్ల మేళాతో భారత్ సత్తాను చాటిచెప్పనుంది.. ముఖ్యంగా ఈసారి ఎలక్ట్రిక్ వాహనాలపైనే కంపెనీలన్నీ మరింత ఫోకస్ చేస్తుండటం విశేషం. 2023లో జరిగిన ఆటో షోతో పోలిస్తే రానున్న షో నాలుగు రెట్లు పెద్దది. అంతేకాదు 1986లో దేశంలో మొదలైన ఆటో ఎక్స్‌పో నుంచి చూస్తే.. 2025 షో కనీవినీ ఎరుగని స్థాయిలో చరిత్ర సృష్టించనుంది.

డెట్రాయిట్, జెనీవా దిగదుడుపే...!

ఈసారి ఆటో షో.. విదేశాల్లో పేరొందిన ప్రదర్శనలన్నింటినీ మించిపోయే రేంజ్‌లో ఉంటుందని చెబుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా జెనీవా, మ్యూనిక్, డెట్రాయిట్, పారిస్, టోక్యో ఆటో ఎక్స్‌పోలను 'బిగ్-5'గా వ్యవహరిస్తారు. ఇటీవలి కాలంలో ఇక్కడ పాల్గొంటున్న కంపెనీల సంఖ్య తగ్గుతూ వస్తోంది. అధిక వ్యయాలు, సందర్శకులు తగ్గడం దీనికి ప్రధాన కారణం. మ్యూనిక్ ఆటో షోలో 13 కార్ల కంపెనీలు పాల్గొనగా... ఈ ఏడాది ఆరంభంలో జరిగిన జెనీవా షోలో 20 వాహన సంస్థలు పాలు పంచుకున్నాయి. ఇక పారిస్‌లో 11, టోక్యోలో 22 కంపెనీలు కొత్త ఆవిష్కరణలు చేశాయి. గతేడాది జరిగిన డెట్రాయిట్ ఆటో షోలో 13 కంపెనీలు 35 వాహన బ్రాండ్‌లను ప్రదర్శించాయి. కాగా, రాబోయే మన ఆటో ఎక్స్‌పోలో 16 కార్ల కంపెనీలు, 6 వాణిజ్య వాహన తయారీదారులు, 6 ద్విచక్ర వాహన సంస్థలు.. వెరసి 28 సంస్థలు అదరగొట్టేందుకు సై అంటున్నాయి. గత ఎడిషన్ (2023)కు దూరంగా ఉన్న హీరో మోటో, బీఎండబ్ల్యూ, మెర్సిడెస్ బెంజ్, స్కోడా తదితర కంపెనీలు మళ్లీ తిరిగొస్తున్నాయి. మరోపక్క, ఈసారి అర డజను కొత్త కంపెనీలు రంగంలోకి దూకుతున్నాయి. ఇందులో వియత్నాం ఎలక్ట్రిక్ కార్ల కంపెనీ విన్‌ఫాస్ట్, టీఐ క్లీన్ మొబిలిటీ, పోర్ష్ తదితర కంపెనీలు ఉన్నాయి.

– సాక్షి, బిజినెస్ డెస్క్

ఈవీల హల్‌చల్..

గత షోలో కంపెనీల సంఖ్య తగ్గినప్పటికీ 75 వాహనాలను ఆవిష్కరించారు. ఈసారి కొత్త మోడళ్లతో పాటు ఆవిష్కరణలు గణనీయంగా పెరగనున్నాయి. ముఖ్యంగా మారుతీ సుజుకీ ఈవీ రంగంలో తన తొలి మోడల్‌ను ప్రపంచానికి చూపనుంది. టాటా మోటార్స్ సైతం కొత్త ఈవీలను ప్రదర్శించనుంది. వియత్నాం ఈవీ తయారీదారు విన్‌ఫాస్ట్ కార్లు కూడా షో కోసం ఫుల్ చార్జ్ అవుతున్నాయి.

మన మార్కెట్ రయ్ రయ్...

ఈ ఏడాది మన వాహన మార్కెట్ కాస్త మందకొడిగా ఉన్నప్పటికీ.. ప్రపంచ టాప్-10 ఆటోమొబైల్ మార్కెట్లలో అత్యంత వేగవంతమైన వృద్ధితో టాప్‌గేర్‌లో దూసుకుపోతోంది. ప్రధాన వాహన మార్కెట్లలో ఒక్క భారత్, చైనా, దక్షిణ కొరియా మాత్రమే 2019 ముందు నాటి కోవిడ్ ముందస్తు స్థాయి అమ్మకాలను చేరుకోగలిగాయి. అత్యంత కీలక ఆటోమొబైల్ మార్కెట్లయిన అమెరికా, జర్మనీ, జపాన్‌లో 2019 నాటి ఉత్పత్తి కోవిడ్ ముందు స్థాయిని అందుకోలేకపోవడం గమనార్హం. ముఖ్యంగా భారత ఆర్థిక వ్యవస్థ అత్యంత వేగంగా పురోగమిస్తున్న నేపథ్యంలో సమీప భవిష్యత్తులోనే జీడీపీ 5 ట్రిలియన్ డాలర్లను అధిగమించే అవకాశం ఉంది. ఇది వాహన కంపెనీలకు అపారమైన అవకాశాలను సృష్టించనుంది. అంతేకాదు, దేశ జనాభాలో 65 శాతం మంది 35 ఏళ్ల లోపు వారే కావడం, తలసరి ఆదాయం (ప్రస్తుతం దాదాపు 2000 డాలర్లు. 2030 కల్లా 5,000 డాలర్లను చేరుతుందని అంచనా) పెరుగుతుండటం కూడా సానుకూలాంశం!



యాపిల్ ఇండియా లాభం జూమ్

- 2023-24లో రూ. 2,746 కోట్లు

న్యూఢిల్లీ: ఐఫోన్ల దిగ్గజం యాపిల్ ఇండియా గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో పటిష్ట ఫలితాలు సాధించింది. నికర లాభం 23 శాతం ఎగసి రూ. 2,746 కోట్లకు చేరింది. అంతక్రితం ఏడాది(2022-23) రూ. 2,230 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం మరింత అధికంగా 36 శాతం జంప్‌చేసి రూ. 67,122 కోట్లయ్యింది. 2022-23లో కేవలం రూ. 49,322 కోట్ల టర్నోవర్ అందుకుంది. ఫైనాన్షియల్ డేటా సర్వీసుల సంస్థ టోఫ్లర్ వివరాల ప్రకారం మొత్తం వ్యయాలు రూ. 63,397 కోట్లను తాకాయి. కంపెనీ యాపిల్ బ్రాండ్ ప్రొడక్టులు, సర్వీసులను అందిస్తోంది. కౌంటర్‌పాయింట్ రీసెర్చ్ గణాంకాల ప్రకారం జూలై-సెప్టెంబర్ త్రైమాసికంలో 21.6 శాతం మార్కెట్ విలువరీత్యా శామ్‌సంగ్ తదుపరి యాపిల్ రెండో ర్యాంకులో నిలిచింది. యాపిల్ ఇండియా ఉద్యోగ వ్యయాలు వార్షికంగా 18 శాతం పెరిగి రూ. 2,600 కోట్లకు చేరాయి. కార్పొరేట్ సామాజిక సేవ(సీఎస్‌ఆర్)లో భాగంగా రూ. 42 కోట్లుపైగా వెచ్చించింది.





దక్షిణాది రాష్ట్రాల్లోకి స్ట్రీక్స్ షాంపూ హెయిర్ కలర్

హైదరాబాద్: హైజనిక్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ తన కార్యకలాపాలను దక్షిణ రాష్ట్రాల్లో విస్తరించేందుకు సిద్ధమైంది. ఇందులో భాగంగా తన పాపులర్ బ్రాండ్ 'స్ట్రీక్స్ షాంపూ హెయిర్ కలర్'ను కర్ణాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌ల్లో విడుదల చేసింది. పది రూపాయల ధరతో ప్యాకెట్ల రూపంలో విక్రయాల ద్వారా దక్షిణాదిలో తమ మార్కెట్ వాటాను పెంచుకుంటామని కంపెనీ సీఈఓ ధీరజ్ తెలిపారు. ప్రస్తుత వేగవంతమైన జీవన శైలిలో పాడిబారిన, తెల్లజుట్టును అయిదు నిమిషాల్లో వందశాతం గ్రే కలర్‌గా మారుస్తుందన్నారు.

జేఎస్‌డబ్ల్యూ సిమెంట్ ఐపీవోకు రెడీ

- 2025 జనవరిలో షురూ
- 4,000 కోట్ల సమీకరణ!



ముంబై: ప్రైవేట్ రంగ కంపెనీ జేఎస్‌డబ్ల్యూ సిమెంట్ 2025 జనవరిలో పబ్లిక్ ఇష్యూకి రానుంది. తద్వారా రూ. 4,000 కోట్లు సమీకరించే యోచనలో ఉన్నట్లు జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ చైర్మన్ సజ్జన్ జిందాల్ ఒక ఇంటర్వ్యూలో వెల్లడించారు. అయితే క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ ఈ ఏడాది సెప్టెంబర్‌లో జేఎస్‌డబ్ల్యూ సిమెంట్ ఐపీవోను నిలిపి ఉంచింది. నిబంధనలను ఉల్లంఘిస్తూ హెక్సా సెక్యూరిటీస్ అండ్ ఫైనాన్స్ కో పెట్టుబడులను అంతర్గత బదిలీ చేసినట్లు వెలువడిన ఆరోపణలపై సెబీ పరిశీలన చేపట్టినట్లు ఇప్పటికే సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. హెక్సా సెక్యూరిటీస్‌లో సజ్జన్ జిందాల్‌సహా పలువురు జిందాల్ కుటుంబ సభ్యులు డైరెక్టర్లుగా వ్యవహరిస్తున్నారు. కాగా.. ఐపీవోలో భాగంగా కంపెనీ రూ. 2,000 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో రూ. 2,000 కోట్ల విలువైన షేర్లను ప్రస్తుత వాటాదారులు విక్రయానికి ఉంచనున్నారు. వీటిలో ఏపీ ఏషియా అపార్చునిటిస్టిక్ హోల్డింగ్స్ పీటీఈ, సినర్జీ మెటల్స్ ఇన్వెస్ట్‌మెంట్స్ హోల్డింగ్స్ విడిగా రూ. 937.5 కోట్లు చొప్పున వాటాలను ఆఫర్ చేయనున్నాయి.

నిధుల వినియోగమిలా: ఈక్విటీ జారీ నిధుల్లో రూ. 800 కోట్లు రాజస్తాన్‌లోని నాగౌర్‌లో ఏర్పాటు చేస్తున్న సమీకృత సిమెంట్ యూనిట్‌పై జేఎస్‌డబ్ల్యూ సిమెంట్ వెచ్చించనుంది. మరో రూ. 720 కోట్లు రుణ చెల్లింపులకు కేటాయించనుంది. మిగిలిన నిధులను సాధారణ కార్పొరేట్ అవసరాలకు వినియోగించనుంది. కంపెనీ ప్రస్తుతం 19 ఎంటీపీఏ సామర్థ్యాన్ని కలిగి ఉంది. 60 ఎంటీపీఏకు పెంచుకునే లక్ష్యంతో ఉంది. ప్రస్తుతం కర్ణాటకలోని విజయనగర్, ఆంధ్రప్రదేశ్‌లోని నంద్యాల, పశ్చిమ బెంగాల్‌లోని సల్బోని, ఒడిశాలోని జైపూర్, మహారాష్ట్రలోని డోల్వీలలో సిమెంట్ ప్లాంట్లను నిర్వహిస్తోంది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
పెనాల్టీపై అప్పీలుకు మెటా నిర్ణయం
పేపర్ పరిశ్రమకు దిగుమతుల దెబ్బ

భవిత

స్పోర్ట్స్ మేనేజ్‌మెంట్.. కెరీర్ షైనింగ్!

- అవకాశాలకు కేరాఫ్‌గా స్పోర్ట్స్ మేనేజ్‌మెంట్
- బ్యాచిలర్, పీజీ స్థాయిలో పలు కోర్సులు
- కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ప్రత్యేక యూనివర్సిటీ
- కోర్సులు పూర్తి చేసుకుంటే ఉజ్వల అవకాశాలకు మార్గం

క్రీడా రంగంలో కెరీర్ కోరుకునే వారికి వినూత్న వేదికగా నిలుస్తోంది.. స్పోర్ట్స్ మేనేజ్‌మెంట్!! గత కొంతకాలంగా దేశ క్రీడా రంగం దూసుకుపోతోంది. ఈ నేపథ్యంలో.. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో జరుగుతున్న క్రీడల పోటీలు.. వాటి నిర్వహణకు నిపుణులైన మానవ వనరుల అవసరం పెరుగుతోంది! దీంతో.. స్పోర్ట్స్ మేనేజ్‌మెంట్ యువతకు ఉపాధి వేదికగా మారుతోంది. స్పోర్ట్స్ మేనేజ్‌మెంట్ కోర్సులను పూర్తి చేసుకుంటే ఉజ్వల అవకాశాలు అందుకునే అవకాశముంది. ఈ నేపథ్యంలో.. స్పోర్ట్స్ మేనేజ్‌మెంట్ ప్రత్యేకత, అకడెమిక్ కోర్సులు, కెరీర్ స్కోప్‌పై ప్రత్యేక కథనం..



కెరీర్ గైడెన్స్

ఒలింపిక్స్, ఫిఫా వరల్డ్ కప్, ఐపీఎల్, వివిధ క్రికెట్, చెస్ వంటి టోర్నీలను మైదానంలో వీక్షించే వారి సంఖ్య లక్షల్లో ఉంటోంది. జాతీయంగా, అంతర్జాతీయంగా నిరంతరం ఏదో ఒక స్పోర్ట్స్ ఈవెంట్ జరుగుతున్న సంగతి తెలిసిందే. వీటిని నిర్వహించడం కత్తిమీద సామే! ఇందుకోసం ప్రత్యేక నైపుణ్యాలు కావాలి. నిర్దిష్టంగా ఒక స్పోర్ట్స్ ఈవెంట్‌కు సంబంధించి మార్కెటింగ్ నుంచి గ్రాండ్ ఫైనల్ వరకూ.. ప్రతి దశలో ఎలాంటి పొరపాట్లు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. క్రీడాకారులు మొదలు మైదానంలో ఆటను వీక్షించే లక్షల మంది అభిమానుల దాకా.. ఎవరికీ ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూసుకోవాల్సి ఉంటుంది. ఇవన్నీ నిర్వహించాలంటే ప్రత్యేక నిర్వహణ నైపుణ్యాలు ఉండాలి. అందుకే స్పోర్ట్స్ మేనేజ్‌మెంట్ నిపుణుల కోసం పలు క్రీడల నియంత్రణ సంస్థలు(బీసీసీఐ, ఐసీసీ, బీఏఐ, ఫుట్‌బాల్ అసోసియేషన్ తదితర) అన్వేషిస్తున్నాయి.

కోర్సులు ఇవే

స్పోర్ట్స్ మేనేజ్‌మెంట్‌లో కెరీర్ కోరుకునే వారికి అకడమిక్‌గా బ్యాచిలర్ డిగ్రీ స్థాయిలో పలు కోర్సులు అందుబాటులోకి వచ్చాయి. బీబీఏలో స్పోర్ట్స్ మేనేజ్‌మెంట్‌ను మేజర్ కోర్సుగా పలు యూనివర్సిటీలు ప్రవేశాలు కల్పిస్తున్నాయి. అదే విధంగా పోస్ట్ గ్రాడ్యుయేషన్ స్థాయిలో ఎంబీఏ-స్పోర్ట్స్ మేనేజ్‌మెంట్, మాస్టర్ ఆఫ్ స్పోర్ట్స్ మేనేజ్‌మెంట్, పీజీ డిప్లొమా ఇన్ స్పోర్ట్స్ మేనేజ్‌మెంట్ వంటి పలు ప్రోగ్రామ్‌లను ఎన్నో యూనివర్సిటీలు, ఇన్‌స్టిట్యూట్‌లు అందిస్తున్నాయి. ఈ కోర్సుల్లో స్పోర్ట్స్ విభాగానికి సంబంధించి మార్కెటింగ్ మేనేజ్‌మెంట్, స్పోర్ట్స్ ప్లానింగ్, స్పోర్ట్స్ ఫండింగ్, స్పోర్ట్స్ లా, ఎథిక్స్, రిస్క్ మేనేజ్‌మెంట్ వంటి అంశాల్లో శిక్షణ ఇస్తారు.

నేషనల్ స్పోర్ట్స్ యూనివర్సిటీ

క్రీడాకారులను ప్రోత్సహించేందుకు, వారికి అవసరమైన శిక్షణనిచ్చేందుకు తాజాగా కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో మణిపూర్‌లో నేషనల్ స్పోర్ట్స్ యూనివర్సిటీని నెలకొల్పారు. ప్రస్తుతం పూర్తిగా స్పోర్ట్స్ యాక్టివిటీస్‌లో శిక్షణ దిశగానే బ్యాచిలర్, పీజీ కోర్సులతో ఈ యూనివర్సిటీని ప్రారంభించారు. వీటిలో అందిస్తున్న పీజీ కోర్సుల్లో స్పోర్ట్స్ మేనేజ్‌మెంట్ సబ్జెక్ట్‌ను కూడా బోధిస్తున్నారు.

ఐఐఎం రోహ్‌తక్‌లోనూ

మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్‌ల పరంగా అంతర్జాతీయంగా పేరున్న ఐఐఎం రోహ్‌తక్ రెండేళ్ల వ్యవధిలో ఎగ్జిక్యూటివ్ పీజీ డిప్లొమా ఇన్ స్పోర్ట్స్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్‌ను అందిస్తోంది. ఈ దిశగా మరి కొన్ని ఐఐఎం క్యాంపస్‌లు అడుగులు వేస్తున్నాయి.

ఉపాధి వేదికలు

స్పోర్ట్స్ మేనేజ్‌మెంట్ ప్రొఫెషనల్స్‌కు ప్రస్తుతం స్పోర్ట్స్ అసోసియేషన్స్, స్పోర్ట్స్ క్లబ్స్, ట్రైనింగ్ అకాడమీలు ముఖ్యమైన ఉపాధి వేదికలుగా నిలుస్తున్నాయి. అదే విధంగా సొంత ఎంటర్ ప్రెన్యూర్ వెంచర్‌ను కూడా ప్రారంభించొచ్చు. ఇందుకోసం పబ్లిక్ రిలేషన్ స్కిల్స్ ఉపయోగపడతాయి.

జాబ్ ప్రొఫైల్స్

స్పోర్ట్స్ మేనేజ్‌మెంట్‌లో పీజీ పూర్తి చేసుకున్న వారికి స్పోర్ట్స్ మార్కెటింగ్, స్పోర్ట్స్ ఈవెంట్ మేనేజ్‌మెంట్, టీమ్ మేనేజ్‌మెంట్, ప్లేయర్స్ మేనేజ్‌మెంట్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మేనేజ్‌మెంట్, బిజినెస్ డెవలప్‌మెంట్, రిలేషన్‌షిప్ మేనేజ్‌మెంట్, ట్రైనింగ్, స్పోర్ట్స్ మీడియా మేనేజ్‌మెంట్ వంటి ఉద్యోగాలు లభిస్తున్నాయి. స్పోర్ట్స్ మేనేజ్‌మెంట్ కోర్సుల ఉత్తీర్ణులు.. క్రీడాకారులకు పర్సనల్ మేనేజర్స్‌గా వ్యవహరించడంతోపాటు సంస్థల స్థాయిలో పోటీల నిర్వహణ వంటి బాధ్యతలు నిర్వర్తించాల్సి ఉంటుంది. ఆర్థికపరమైన అంశాలు, మార్కెటింగ్, బ్రాండ్ మేనేజ్‌మెంట్.. ఇలా ఎన్నో స్పెషలైజ్డ్ విధులు నిర్వహించాల్సి ఉంటుంది.

జాబ్ ప్రొఫైల్స్-విధులు

ప్లేయర్స్ మేనేజ్‌మెంట్ లేదా స్పోర్ట్స్ ఏజెంట్

ఒక క్రీడాకారుడికి సంబంధించి వ్యక్తిగత బ్రాండింగ్ వ్యవహారాలు చూడాల్సి ఉంటుంది. అంటే ఈ క్రీడాకారుడికి సంబంధించిన బిజినెస్ కాంట్రాక్ట్స్, ఫైనాన్స్, ఎండార్స్‌మెంట్ తదితర విధులు వంటివి. వీరికి ప్రారంభంలో క్రీడాకారుడికి ఉన్న డిమాండ్ ఆధారంగా రూ.25 వేల నుంచి రూ.70 వేల వరకు వేతనం లభిస్తుంది.

స్పోర్ట్స్ మార్కెటింగ్ మేనేజర్

ఒక స్పోర్ట్స్ ఈవెంట్ విజయవంతం కావాలంటే.. మార్కెటింగ్ చాలా ముఖ్యం. దీంతోపాటు స్పాన్సర్స్‌ను గుర్తించడం, సదరు ఆటల పోటీలకు ప్రచారం కల్పించడం వంటి విధులు మార్కెటింగ్ మేనేజర్స్ నిర్వహిస్తారు. వీరికి కూడా ప్రారంభంలో రూ.50 వేల వరకూ వేతనం అందుతోంది.

ఈవెంట్ మేనేజర్

ఒక పోటీ నిర్వహించేందుకు ఎంతో ముందస్తు కసరత్తు అవసరం ఉంటుంది. ఈ విషయంలో ఈవెంట్ మేనేజర్లు కీలక బాధ్యతలు నిర్వర్తించాల్సి వస్తోంది. ఈవెంట్ వేదికను గుర్తించడం నుంచి టీమ్స్‌కు, ఆడియన్స్‌కు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాల్సి ఉంటుంది. ఆదేవిధంగా లాజిస్టిక్స్, టెక్నికల్ అంశాల్లో అనుసరించాల్సిన వ్యూహాలను రూపొందిస్తారు. వీరికి ప్రారంభంలో రూ.30 వేల వరకు జీతం లభిస్తుంది.

టీమ్ మేనేజ్‌మెంట్

స్పోర్ట్స్ కాంపిటీషన్ అంటే పలు టీమ్‌లు పాల్గొనడం సహజం. ఆయా బృందాల అవసరాలను గుర్తించి.. వాటిని అందేలా చూడటం, టీమ్‌లోని సభ్యులకు అవసరమైన సదుపాయాలు కల్పించడం వంటి విధులు నిర్వహిస్తారు.

మీడియా మేనేజ్‌మెంట్

ఏ ఈవెంట్ సక్సెస్ కావాలన్నా.. ప్రసార మాధ్యమాల మద్దతు అత్యంత కీలకం. మీడియా మేనేజ్‌మెంట్ ప్రొఫెషనల్స్.. ఒక స్పోర్ట్స్ ఈవెంట్‌కు సంబంధించి తగిన ప్రచారం కల్పించే విధంగా, సదరు ఈవెంట్‌కు సంబంధించి అప్‌డేట్స్ ప్రసారం చేసే విధంగా మీడియాతో సంప్రదించడం వంటివి చేయాల్సి ఉంటుంది.

ఆసక్తి తప్పనిసరి

స్పోర్ట్స్ మేనేజ్‌మెంట్ ప్రొఫెషనల్స్‌కు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని యువత ఈ కోర్సులవైపు దృష్టి పెట్టడం సహజం. కాని ఈ రంగంలో రాణించాలంటే.. వ్యక్తిగతంగా ఆసక్తి చాలా ముఖ్యమని నిపుణులు పేర్కొంటున్నారు. ఆసక్తి లేకుండా ఈ కెరీర్‌లో ముందుకు సాగడంలో ఇబ్బందులు ఎదురవుతాయని చెబుతున్నారు. ఈ రంగంలో కెరీర్‌కు సంబంధించి అనుకూలతలు, ప్రతికూలతలు కూడా ఉన్నాయి. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకుని ఈ కోర్సుల్లో అడుగు పెట్టడం అభిలషణీయం.

విద్య, ఉద్యోగ సమాచారం

సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో 253 స్పెషలిస్ట్ ఆఫీసర్ పోస్టులు

ముంబైలోని సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో రెగ్యులర్ ప్రాతిపదికన స్పెషలిస్ట్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 253.
- **కేటగిరీ వారీగా ఖాళీలు:** చీఫ్ మేనేజర్స్ ఇన్ సీనియర్ మేనేజ్‌మెంట్ గ్రేడ్ స్కేల్ 4-10, చీఫ్ మేనేజర్స్ ఇన్ మిడిల్ మేనేజ్‌మెంట్ గ్రేడ్ స్కేల్ 3-56, చీఫ్ మేనేజర్స్ ఇన్ మిడిల్ మేనేజ్‌మెంట్ గ్రేడ్ స్కేల్2-162, చీఫ్ మేనేజర్స్ ఇన్ జూనియర్ మేనేజ్‌మెంట్ గ్రేడ్ స్కేల్1-25.
- **జాబ్ రోల్:** జావా డెవలపర్, మొబైల్ డెవలపర్, కోబాల్ డెవలపర్, డాట్ నెట్ డెవలపర్, డేటాబేస్ అడ్మినిస్ట్రేటర్, డేటా ఇంజనీర్/అనలిస్ట్, డేటా సైంటిస్ట్, సైబర్ సెక్యూరిటీ అనలిస్ట్, ఐటీ ఆఫీసర్స్, వెబ్ సర్వర్, అడ్మినిస్ట్రేటర్, కంటెంట్ మేనేజర్ తదితరాలు.
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బ్యాచిలర్స్/మాస్టర్స్ డిగ్రీ, బీఈ, బీటెక్, ఎంసీఏ, డిప్లొమా ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- **వయసు:** స్కేల్-4 పోస్టులకు 34 నుంచి 40 ఏళ్లు, స్కేల్-3 పోస్టులకు 30 నుంచి 38 ఏళ్లు, స్కేల్-2 పోస్టులకు 27 నుంచి 33 ఏళ్లు, స్కేల్-1 పోస్టులకు 23 నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి.
- **పే స్కేల్:** స్కేల్-4 పోస్టులకు రూ.1,02,300 నుంచి రూ.1,20,940, స్కేల్-3 పోస్టులకు రూ.85,920 నుంచి రూ.1,05,280, స్కేల్-2 పోస్టులకు రూ.64,820 నుంచి రూ.93,960, స్కేల్-1 పోస్టులకు రూ.48,480 నుంచి రూ.85,920 ఉంటుంది.
- **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ ప్లాట్‌ఫాం టెస్ట్/సినారియో బేస్డ్ టెస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **పనిచేయాల్సిన ప్రాంతం:** ముంబై/నవీ ముంబై/హైదరాబాద్.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో
- **దరఖాస్తులకు చివరితేది:** 03.12.2024.
- **ఆన్‌లైన్ పరీక్ష తేది:** 14.12.2024.
- **ఇంటర్వ్యూ తేదీలు:** 2025 జనవరి రెండో వారం.
- **వెబ్‌సైట్:** www.centralbankofindia.co.in/en

డబ్ల్యూఐఐ, డెహ్రాడూన్‌లో 16 పోస్టులు

డెహ్రాడూన్‌లోని వైల్డ్ లైఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా(డబ్ల్యూఐఐ).. వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 16.
- **పోస్టుల వివరాలు:** టెక్నికల్ అసిస్టెంట్ (ఐటీ-ఆర్ఎస్/జీఐఎస్/ఇంజనీరింగ్ /ఆడియో విజువల్)-03, టెక్నీషియన్(ఫీల్డ్)-01, జూనియర్ స్టెనోగ్రాఫర్-02, అసిస్టెంట్ గ్రేడ్3-01, డ్రైవర్(ఆర్డినరీ గ్రేడ్)-01, కుక్-03, ల్యాబ్ అటెండెంట్-05.
- **అర్హత:** పోస్టును అనుసరించి దరఖాస్తు గడువు తేదీ నాటికి 18 నుంచి 28 ఏళ్ల మధ్య ఉండాలి.
- **వేతనం:** నెలకు టెక్నికల్ అసిస్టెంట్ పోస్టులకు రూ.34,000 నుంచి రూ.2,08,700, జూనియర్ స్టెనోగ్రాఫర్‌కు రూ.25,000 నుంచి రూ.81,000, టెక్నీషియన్, అసిస్టెంట్ గ్రేడ్-3, డ్రైవర్, కుక్ పోస్టుకు రూ.19,900 నుంచి రూ.63,200, ల్యాబ్ అటెండెంట్‌కు రూ.1,18,000 నుంచి రూ.56,900.
- **ఎంపిక విధానం:** అభ్యర్థుల షార్ట్‌లిస్టింగ్, రాతపరీక్ష ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును వైల్డ్‌లైఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా, చాంద్రబాని, డెహ్రాడూన్ చిరునామకు రిజిస్టర్/స్పీడ్ పోస్టు ద్వారా పంపించాలి.
- **దరఖాస్తులకు చివరితేది:** 06.01.2025.
- **వెబ్‌సైట్:** https://wii.gov.in/

సీఐపీఈటీ, చెన్నైలో టీచింగ్ పోస్టులు

చెన్నైలోని సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రో కెమికల్స్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ (సీఐపీఈటీ).. ఒప్పంద ప్రాతిపదికన టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 07
- **పోస్టుల వివరాలు:** అసోసియేట్ ప్రొఫెసర్-01, అసిస్టెంట్ ప్రొఫెసర్-03, అసిస్టెంట్ ప్లేస్‌మెంట్ కన్సల్టెంట్-01, లెక్చరర్-02.
- **విభాగాలు:** మ్యాథమేటిక్స్, ప్లాస్టిక్స్ టెక్నాలజీ, పాలీమర్ సైన్స్, మ్యాథమేటిక్స్, ప్లాస్టిక్ టెక్నాలజీ, కెమిస్ట్రీ.
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో పీహెచ్‌డీ ఉత్తీర్ణులై ఉండాలి.
- **వేతనం:** అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టుకు రూ.46,400, అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు రూ.35,000 నుంచి రూ.40,000, అసిస్టెంట్ ప్లేస్‌మెంట్ కన్సల్టెంట్‌కు రూ.35,000, లెక్చరర్‌కు రూ.30,000 నుంచి రూ.35,000.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ది ప్రిన్సిపల్ డైరెక్టర్-హెడ్, సీఐపీఈటీ: ఐపీటీ చెన్నై, టీవీకె ఇండస్ట్రియల్ ఎస్టేట్, గుయిండి, చెన్నై-600032 చిరునామకు పంపించాలి.
- **దరఖాస్తులకు చివరితేది:** 04.12.2024.
- **వెబ్‌సైట్:** https://www.cipet.gov.in/

ఒరిగిన భవనం నేలమట్టం



- ముందుగా చుట్టు పక్కల ఉన్న 20 భవనాలను ఖాళీ చేయించిన అధికారులు
- సిద్ధిఖీనగర్‌లో పుటింగ్ గుంత తవ్వుతుండగా జేసీబీ తగిలి ధ్వంసమైన పిల్లర్
- ప్రమాదం పొంచి ఉండటంతో తప్పనిసరి అయి భవనం కూల్చివేత
- ఉన్న ఒక్క ఆధారం కోల్పోయా : భవన యజమాని స్వప్న

గచ్చిబౌలి: ఒరిగిన భవనంతో పెను ప్రమాదం పొంచి ఉందని భావించిన జీహెచ్ఎంసీ అధికారులు ఆ భవనాన్ని నేలమట్టం చేశారు. వివరాల్లోకి వెళితే... నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండల పరిధిలోని యాదగిరిపల్లికి చెందిన లక్ష్మణ్ నగరంలో కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. సిద్ధిఖీనగర్‌లో 50 గజాల స్థలాన్ని కొని రెండేళ్ల క్రితం జీ ప్లస్ ఫోర్ భవనం నిర్మించాడు. మణికొండలో నివాసం ఉండే లక్ష్మణ్ ఆ భవనాన్ని అద్దెకు ఇచ్చారు. వెనుక వైపు ఉన్న 200 చదరపు గజాల ప్లాట్‌ను యాసిన్‌ఖాన్ కొనుగోలు చేశాడు. జీ ప్లస్ టు భవన నిర్మాణానికి జీహెచ్ఎంసీ నుంచి అనుమతి తీసుకున్నాడు. కొండ శ్రీనివాస్‌కు భవన నిర్మాణం కోసం కాంట్రాక్ట్ ఇచ్చాడు. వారం రోజులుగా పుటింగ్స్ కోసం ప్లాట్‌లో గుంతలు తవ్వుతున్నారు. రెండు రోజుల క్రితం జేసీబీతో పుటింగ్ కోసం సెట్‌బ్యాక్ వదలకుండా 10 అడుగుల లోతులో గుంత తవ్వాడు. జేసీబీ బకెట్ పిల్లర్‌కు తాకడంతో పిల్లర్ ధ్వంసమైంది. లోతైన గుంత తవ్వడంతో పుటింగ్స్ కింద ఉన్న మట్టి జారిపోయింది. దీంతో మంగళవారం సాయంత్రం భవనం ఒక్కసారిగా పక్కకు ఒరిగింది.

నోటీసులు జారీ చేసి... కూల్చివేత మొదలుపెట్టి

జీహెచ్ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు ముందుగా ఒరిగిన భవన యజమాని స్వప్నకు నోటీసులు జారీ చేశారు. ప్లాట్ నంబర్ 1605, 1638లో మట్టి పనులు చేస్తుండగా పిల్లరు దెబ్బతిందని, దీంతో భవనం కూలిపోయే ప్రమాదం ఉండటంతో కూల్చి వేయాలని ఆ నోటీసులో పేర్కొన్నారు. భవనాన్ని తొలగిస్తున్నామని స్వప్న దగ్గర సంతకాలు తీసుకున్నారు. పంచనామా చేసిన అనంతరం భవనాన్ని కూల్చివేయడం ప్రారంభించారు. ఒరిగిన భవన కూల్చివేత ప్రారంభించడానికి ముందు ఆ భవనం చుట్టూ ఉన్న 20 భవనాలను ఖాళీ చేయించారు. అన్ని రోడ్లు ఇరుకుగా ఉండటంతో ఒకవైపు నుంచే జాగ్రత్తగా కూల్చివేతలు జరపాలని ఇంజనీరింగ్ అధికారులు సూచించారు. బుధవారం ఉదయం 11.20 గంటలకు వెస్ట్‌జోనల్ కమిషనర్ ఆర్.ఉపేందర్‌రెడ్డి పర్యవేక్షణలో భవన కూల్చివేత పనులు ప్రారంభించారు. చుట్టూ ఉన్న నివాసాలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఐరిచ్ జంపో క్రషర్‌తో పనులు మొదలుపెట్టారు. నాలుగో అంతస్తు, పెంట్ హౌస్‌ను కొంత మేరకు కూల్చి వేయగానే మిషన్‌లో సాంకేతిక సమస్య తలెత్తింది. దీంతో ఆ పనులు నిలిపివేశారు. పనులు జరిగే సమయంలో విద్యుత్ సరఫరా నిలిపివేశారు. తిరిగి మధ్యాహ్నం 3.30 గంటలకు కూల్చివేత కొనసాగించి సాయంత్రం 6 గంటల వరకు పనిచేశారు. కొద్దిసేపు విరామం ఇచ్చిన తర్వాత చీకటి పడటంతో హైమాస్ట్ లైట్ల సాయంతో మళ్లీ పనులు మొదలుపెట్టి రాత్రి 9: 30 గంటలకు భవనాన్ని పూర్తిగా నేలమట్టం చేశారు.

స్థలయజమాని, కాంట్రాక్టర్‌పై కేసు

సిద్ధిఖీనగర్‌లో భవనం ఒరిగిపోవడానికి కారణమైన స్థల యజమాని యాసీన్‌ఖాన్ కాంట్రాక్టర్ కొండ శ్రీనివాస్‌పై మాదాపూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. పిల్లర్ల కోసం తవ్విన గుంతల కారణంగా భవనం ఒరిగిందని శేరిలింగంపల్లి సర్కిల్ టౌన్ ప్లానింగ్ ఏసీపీ వెంకటరమణ ఫిర్యాదు చేశారు. ర్యాష్ అండ్ నెగ్లిజెన్స్, ప్రాపర్టీ డ్యామేజ్ సెక్షన్ల కింద కేసు నమోదు చేశామని మాదాపూర్ ఇన్‌స్పెక్టర్ తెలిపారు. కూల్చివేతను భారీ మిషన్‌తో చేపట్టడంతో ఖర్చు భారీగానే ఉంటుందని తెలుస్తోంది. ప్రమాదకర పరిస్థితిలో ఉన్న భవనాలను కూల్చివేస్తే సంబంధిత యజమానుల వద్దే ఖర్చులు వసూలు చేస్తారు. భవన యజమాని భారీ ఖర్చు భరించే స్థితిలో లేనట్టుగా తెలుస్తోంది.




పత్తి కూలీలు కాదు.. పరదేశీలు

జన్నారం: పత్తి ఏరుతున్న వీరు కూలీలు అనుకుంటే పొరపడినట్లే. వీరు మొక్క నుంచి పత్తిని ఎలా తీయాలో మన రైతులకు చూపిస్తున్న పరదేశీయులు. చేత్నా ఆర్గానిక్ అగ్రికల్చర్ ప్రొడ్యూసర్ సంస్థ ప్రోత్సాహంతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని నార్నూర్, కెరమెరి, ఆసిఫాబాద్, సిర్పూర్-యూ, జైనూర్, ఉట్నూర్ మండలాల్లోని 170 గ్రామాల్లో 5,500 మంది రైతులు ఆర్గానిక్ (సేంద్రియ ఎరువులు) పత్తి పంట పండిస్తున్నారు. పత్తి ఏరే సమయంలో ఆ సంస్థ ప్రతినిధులు ఇక్కడికి వచ్చి పత్తి ఎలా తీయాలో రైతులకు నేర్పిస్తారు. ఈ ఏడాది 7,900 ఎకరాల్లో పత్తి సాగు చేసి 55,300 క్వింటాళ్ల దిగుబడి సాధించారు. పత్తికి మార్కెట్‌లో ప్రస్తుత ధర క్వింటాల్‌కు రూ.7,500 ఉండగా.. అదనంగా రూ.500 చెల్లించి జర్మనీలోని డిబెల్ల టెక్స్‌టైల్స్ కంపెనీ కొనుగోలు చేస్తోంది. జన్నారంలో జిన్నింగ్ చేయించి చెన్నై మీదుగా జర్మనీకి తరలిస్తారు. ఈ పత్తితో టవల్స్, బెడ్‌షీట్లు తయారు చేసి విక్రయిస్తారు. జర్మనీ ప్రజలు ఆర్గానిక్ పత్తితో తయారు చేసిన వాటిని ఇష్టపడుతారు.

టుడేస్ గ్రాఫిక్

నేడు వరల్డ్ టెలివిజన్ డే. ఈ నేపథ్యంలో 'స్టాటిస్టా కన్స్యూమర్ ఇన్‌సైట్స్' ఓ సర్వేను విడుదల చేసింది. వివిధ దేశాల్లో అక్టోబర్ 2023 నుంచి సెప్టెంబర్ 2024 వరకూ నిర్వహించిన ఈ సర్వేలో అత్యధిక శాతం ప్రజలు ఏ తరహా కంటెంట్(మూవీ లేదా టీవీ సీరియల్, సిరీస్)ను చూడటానికి ఇష్టపడుతున్నారన్న వివరాలను అడిగారు. దాని ప్రకారం భారత్‌లో జనం ఎక్కువగా కామెడీని ఇష్టపడుతున్నారని తేలింది. కామెడీ తర్వాత స్పోర్ట్స్, మ్యూజిక్ వీడియోలు లేదా షోలు, థ్రిల్లర్ మిస్టరీలు, హారర్ సీరియళ్లు చూస్తున్నారు. వివిధ అంశాల్లో ప్రజలపై పెరుగుతున్న టెలివిజన్ ప్రభావాన్ని గుర్తిస్తూ ఐక్యరాజ్యసమితి 1996 నవంబర్ 21న వరల్డ్ టెలివిజన్ డేను ప్రకటించింది.



లక్నవరం సస్పెన్షన్ బ్రిడ్జిపై మంత్రులు జూపల్లి, సీతక్క, పటేల్ రమేశ్‌రెడ్డి, బలరాంనాయక్ తదితరులు



ప్రకృతిని ఆస్వాదించి ఆయుష్షును పెంచుకోండి

లక్నవరంలో మూడో ఐలాండ్‌ను ప్రారంభించిన మంత్రులు జూపల్లి, సీతక్క

గోవిందరావుపేట: సంపాదన ముఖ్యం కాదు.. ప్రకృతి అందాలను ఆస్వాదించి ఆయుష్షను పెంచుకోవాలని మంత్రులు జూపల్లి కృష్ణారావు, ధనసరి సీతక్క అన్నారు. ములుగు జిల్లా గోవిందరావుపేట మండలంలోని లక్నవరం జలాశయంలో అభివృద్ధి చేసిన మూడో ఐలాండ్‌ను (ది కొవ్) బుధవారం వారు ప్రారంభించి మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆలోచనలకు అనుకూలంగా రాష్ట్ర పర్యాటక అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. పర్యాటక ప్రాంతాలను సుందరీకరించడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఐలాండ్ అనుభూతి పొందేందుకు అండమాన్, మాల్దీవులు లాంటి ప్రదేశాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా తెలంగాణలోనూ ఇలాంటి అందమైన టూరిజం స్పాట్‌లను పర్యాటకులకు అందుబాటులోకి తెచ్చామని చెప్పారు. పర్యాటకులు ఇతర రాష్ట్రాలకు వెళ్లి డబ్బులు వృథా చేసుకోకుండా, రాష్ట్రంలోని సుందర ప్రదేశాలను సందర్శించి ఉల్లాసం పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి, ఎంపీ బలరాంనాయక్, పర్యాటక అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రకాశ్‌రెడ్డి, కలెక్టర్ దివాకర టీఎస్, ఎస్పీ డాక్టర్ శబరీష్ పాల్గొన్నారు.

అద్దె బస్సులతో ఆర్టీసీ ఆగమాగం!



ఏడాదిలో చెరి సగం కానున్న సంఖ్య • మూడేళ్లలో రెట్టింపు అయ్యే పరిస్థితి

డ్రైవర్ పోస్టులను కోల్పోనున్న ఆర్టీసీ • తీవ్రంగా వ్యతిరేకిస్తున్న కార్మిక సంఘాలు

సాక్షి, హైదరాబాద్

అద్దె బస్సులు ఆర్టీసీని కబళించేందుకు సిద్ధమవుతున్నాయి. ప్రస్తుతానికి రూపొందించిన ప్రణాళిక ప్రకారం అద్దె బస్సులు సమకూరితే, ఆర్టీసీ సొంత బస్సుల కోసం వెతుక్కోవాల్సిన పరిస్థితి ఏర్పడనుంది. క్రమంగా ఇది సంస్థ మనుగడనే ప్రశ్నార్థకం చేయనుందనే ఆందోళన వ్యక్తమవుతోంది. అద్దె బస్సుల సంఖ్యను పెంచటంపై చాలాకాలంగా వ్యతిరేకత వ్యక్తమవుతున్నా ప్రభుత్వం పట్టించుకోవటం లేదు. సంక్షేమ పథకాలను దృష్టిలో ఉంచుకుని నిధుల వినియోగంపై ప్రభుత్వం అనధికారికంగా పరిమితులు విధిస్తుండటంతో, సొంతంగా కొత్త బస్సులు కొనటం ఆర్టీసీకి కష్టంగా మారింది. దీంతో అద్దె బస్సులకు గేట్లు బార్లా తెరిచేస్తోంది. అద్దె బస్సులకు డ్రైవర్లను వాటి నిర్వాహకులే నియమిస్తారు. డ్రైవర్ల జీతాల పద్దు తగ్గుతుండటంతో ఆర్టీసీ దీనివైపు మొగ్గు చూపుతోంది.

30 శాతానికి చేరిన అద్దె బస్సులు

ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన 2014లో ఆర్టీసీలో అద్దె బస్సుల వాటా 17 శాతం మాత్రమే. అద్దె బస్సుల సంఖ్యపై పరిమితి ఉన్నందున, అంతకు మించి వాటిని సమకూర్చుకునేందుకు వీలుండేది కాదు. కానీ ప్రభుత్వం ఆర్టీసీకి ఇవ్వాల్సిన నిధులు బకాయి పడటం, గ్రాంట్లు ఇవ్వకపోవటంతో తప్పనిసరి పరిస్థితుల్లో వాటి సంఖ్య పెంచుతూ వస్తున్నారు. ప్రస్తుతం ఆర్టీసీలో మొత్తం 9,800 బస్సులు తిరుగుతున్నాయి. వీటిల్లో ప్రైవేటు వ్యక్తులు ఆర్టీసీకి అద్దెకిచ్చిన బస్సులు 2,800 ఉన్నాయి. గతంలో కేంద్ర ప్రభుత్వం 'ఫేమ్'పథకం కింద సమకూరి హైదరాబాద్ విమానాశ్రయానికి తిప్పుతున్న 40 ఎలక్ట్రిక్ బస్సులు కూడా ఉన్నాయి. ఇవి కూడా ఒలెక్ట్రా అన్న సంస్థ అద్దెకిచ్చినవే. అదే సంస్థ ఇటీవల మరో 100 బస్సులు సమకూర్చింది. ఇటీవల ఢిల్లీకి చెందిన జేబీఎం సంస్థ మరో 90 ఎలక్ట్రిక్ బస్సులు సమకూర్చింది. అలాగే మరో 40 బస్సులు కూడా కొత్తగా వచ్చాయి. వీటిని ప్రారంభించాల్సి ఉంది. ఇలా ప్రస్తుతం మొత్తం బస్సుల్లో అద్దె బస్సుల వాటా దాదాపు 30 శాతానికి చేరింది. ఇక ఏడాది, ఏడాదిన్నరలోగా ఆర్టీసీ, అద్దె బస్సుల సంఖ్య చెరి సగం అయ్యే అవకాశం ఉందని చెబుతున్నారు.

సంస్థ మనుగడకే ప్రమాదం: సంఘాల నేతలు

'ఆర్టీసీలో అద్దె బస్సుల సంఖ్య విచ్చలవిడిగా పెరగటం సంస్థకు మంచిది కాదు. భవిష్యత్తులో సంస్థ ప్రైవేటు సంస్థల చేతుల్లోకి వెళ్తుంది. ఇది ప్రైవేటీకరణను ప్రేరేపిస్తుంది. గతంలోలాగా అద్దె బస్సుల సంఖ్యపై సీలింగ్ విధించి కావాల్సిన్ని బస్సులను ప్రభుత్వమే కొనాలి..'అని ఆర్టీసీ కార్మిక సంఘాల నేతలు నరేందర్, నాగేశ్వరరావు డిమాండ్ చేశారు.

ముంచెత్తనున్న అద్దె బస్సులు

హైదరాబాద్‌లో తిరిగేందుకు మొత్తం 500 ఎలక్ట్రిక్ బస్సులు రావాల్సి ఉంది. వాటిల్లో కొన్ని వచ్చాయి. ఏడాది కాలంలో మరో 400 సమకూరుతాయి. జేబీఎం సంస్థ కూడా 500 ఎలక్ట్రిక్ బస్సులు సమకూర్చాల్సి ఉంది. ఇప్పటికి కొన్ని బస్సులే రాగా మరో 400 బస్సులను సమకూర్చాల్సి ఉంది. దశలవారీగా అవి కూడా వస్తాయి. ఇక హైదరాబాద్‌లో కాలుష్యాన్ని నివారించేందుకు మొత్తం బ్యాటరీ బస్సులనే తిప్పాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన 'పీఎం ఈ–డ్రైవ్'పథకం కింద 2,800 బస్సులు మంజూరు చేయాలంటూ ఆర్టీసీ దరఖాస్తు చేసింది. దేశవ్యాప్తంగా ఆ పథకం కింద ఎలక్ట్రిక్ బస్సులు తిప్పేందుకు కేంద్రం 9 నగరాలను ఎంపిక చేసింది. అందులో హైదరాబాద్ కూడా ఒకటి. అంటే ఆర్టీసీ దరఖాస్తు మేరకు ఎలక్ట్రిక్ బస్సులు మంజూరు కానున్నాయి. తాజాగా మహిళా సంఘాలు 1,000 బస్సులను ఆర్టీసీలో అద్దె ప్రాతిపదికన నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇవన్నీ పరిగణనలోకి తీసుకుంటే మూడేళ్లలో అద్దె బస్సుల సంఖ్య 8 వేలకు చేరే అవకాశం ఉంది. అప్పుడు ఆర్టీసీ సొంత బస్సులు 6 వేల లోపే ఉంటాయి. అయితే అప్పటికి చాలా బస్సులు పాతబడి తుక్కుగా మారిపోతాయి. వాటి స్థానంలో కొత్తగా సొంత బస్సులు రాకపోతే ఆర్టీసీ సొంత బస్సుల సంఖ్య 4 వేలకు తగ్గుతుంది. అద్దె బస్సులు భారీగా వస్తున్నందున సొంత బస్సులు కొనేందుకు ప్రభుత్వం ఆసక్తి చూపే పరిస్థితి ఉండదని అంటున్నారు.

డ్రైవర్ల నియామకం అంతేనా?

ఆర్టీసీలో ప్రస్తుతం డ్రైవర్లకు కొరత ఉంది. దీంతో ఇటీవలే దాదాపు 2 వేల పోస్టుల భర్తీకి ఆర్టీసీ ప్రతిపాదించింది. దానికి ప్రభుత్వం కూడా సమ్మతించి రిక్రూట్‌మెంట్ బోర్డుకు ఆదేశాలిచ్చింది. పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు ద్వారా ఎంపిక చేయాల్సి ఉంది. కానీ వాటి ఊసే లేకుండాపోయింది. భవిష్యత్తులో అద్దె బస్సుల సంఖ్య పెరుగుతున్నందున సొంత డ్రైవర్ల అవసరం అంతగా ఉండదన్న ఉద్దేశంతోనే ఎంపిక ప్రక్రియను వాయిదా వేస్తున్నారని కార్మిక సంఘాలు ఆరోపిస్తున్నాయి.

పీఎం కిసాన్, పీఎం ఆవాస్ యోజన పేరిట మోసం

సాక్షి, హైదరాబాద్: పీఎం కిసాన్, పీఎం ఆవాస్ యోజన పేరిట సైబర్ నేరగాళ్లు నకిలీ ఎస్ఎంఎస్‌లను పంపుతూ మోసాలకు పాల్పడుతున్నట్టు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖాగోయల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకాల్లో చేరాలంటూ సైబర్ నేరగాళ్లు ఎస్ఎంఎస్‌లలో ఏపీకే (ఆండ్రాయిడ్ ప్యాకేజ్ కిట్)లను జత చేసి పంపుతున్నారని చెప్పారు. అలాంటి లింక్‌లపై క్లిక్ చేసి యాప్‌లను ఇన్‌స్టాల్ చేయొద్దని శిఖాగోయల్ సూచించారు. తెలియని వ్యక్తుల నుంచి ఏపీకేలను డౌన్‌లోడ్ చేయొద్దని, గూగుల్‌ప్లే లేదా నమ్మదగిన వెబ్‌సైట్‌లు మాత్రమే ఉపయోగించాలని అప్రమత్తం చేశారు. ఏదైనా అనుమానం ఉంటే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు లేదా 'సైబర్‌క్రైమ్.జీఓవీ.ఇన్'వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని శిఖాగోయల్ పేర్కొన్నారు.

వచ్చే ఏడాది ఏడుగురు ఐపీఎస్‌ల ఉద్యోగ విరమణ

సాక్షి, హైదరాబాద్: వచ్చే ఏడాది ఏడుగురు సీనియర్ ఐపీఎస్ అధికారులు ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఉత్తర్వులు జారీ చేశారు. 2025లో ఉద్యోగ విరమణ చేయనున్న వారిలో హోంశాఖ ముఖ్యకార్యదర్శి రవిగుప్తా, డీజీపీ జితేందర్ ఉన్నారు. సీనియర్ ఐపీఎస్‌లు వీబీ కమలాసన్‌రెడ్డి 2025లో ఏప్రిల్ 30న, డి.ఉదయ్‌కుమార్‌రెడ్డి మే 31న, వి.సత్యనారాయణ జూన్ 30న, కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి ఆగస్టు 31న, డాక్టర్ జితేందర్ సెప్టెంబర్ 30న, పి.విశ్వప్రసాద్ నవంబర్ 30న, రవిగుప్తా డిసెంబర్ 31న ఉద్యోగ విరమణ చేస్తారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.


గద్వాల కోట


లింగమ్మ బావి

రాజసం... గద్వాల సంస్థానం

నేటికీ చెక్కు చెదరని కట్టడాలు • కవులకు పేరుగాంచిన సంస్థానం

గద్వాల: కవులు.. కట్టడాలకు పేరుగాంచిన గద్వాల సంస్థానం వైభవం నేటికీ చెక్కుచెదరలేదు. రాజసానికి నిలువెత్తు నిదర్శనమైన గద్వాల సంస్థానం ఏర్పాటు ఆద్యంతం అత్యంత ఆసక్తికరం. నిజాం సంస్థానంతోపాటు 1948లో భారత యూనియన్‌లో విలీనమైన గద్వాల సంస్థానంపై సవివర కథనమిది.

నల సోమనాద్రి ఆధ్వర్యంలో ఆవిర్భావం

నల సోమనాద్రి (పెద సోమభూపాలుడు) క్రీస్తుశకం 1663లో గద్వాల మండలం పూడూరు కేంద్రంగా గద్వాల సంస్థానాన్ని ఏర్పాటు చేశారు. నాటినుంచి 1948 వరకు ఆయన వారసులు పాలన కొనసాగించారు. నలసోమనాద్రి 1663–1712 వరకు, తర్వాత కల్లా వెంకటన్న క్రీ.శ. 1712– 1716 వరకు, రమణయ్య క్రీ.శ. 1716– 1723 వరకు, తిమ్మక్క క్రీ.శ. 1723– 1725 వరకు, లింగమ్మ క్రీ.శ. 1725– 1740 వరకు, తిరుమలరావు క్రీ.శ. 1740– 1742 వరకు, మంగమ్మ క్రీ.శ. 1742– 1745 వరకు, చొక్కమ్మ క్రీ.శ. 1745– 1747 వరకు, రామరాయలు క్రీ.శ. 1747– 1761 వరకు, చినసోమభూపాలుడు– 2 క్రీ.శ. 1761– 1794 వరకు, రామభూపాలుడు–1 క్రీ.శ. 1794–1807 వరకు, సీతారామభూపాలుడు–1 క్రీ.శ. 1807–1810 వరకు, వెంకటలక్ష్మమ్మ క్రీ.శ. 1840– 1840 (4 నెలలు), సోమభూపాలుడు– 3 క్రీ.శ. 1840– 1844, వెంకటలక్ష్మమ్మ (మరల) క్రీ.శ. 1844–1845, రామభూపాలుడు–2 క్రీ.శ. 1845– 1901 వరకు, సీతారామభూపాలుడు– 2 క్రీ.శ. 1901–1924 వరకు, ఆ తర్వాత చివరి తరం మహారాణి ఆదిలక్ష్మీదేవమ్మ క్రీ.శ. 1924–1948 వరకు పాలన కొనసాగించారు.

విద్వత్కవులకు పేరు..

గద్వాల సంస్థానం కవులకు పేరుగాంచింది. నలసోమనాద్రి, చినసోమభూపాలుడు, రామభూపాలుడు–2, సీతారామభూపాలుడు–2, మహారాణి ఆదిలక్ష్మీదేవమ్మ తదితరులు కవులకు పెద్దపీట వేసినట్లు చరిత్రకారులు చెబుతారు. వీరి పాలనలోనే గద్వాల సంస్థానం విద్వత్కవుల ప్రాంతంగా వర్ధిల్లింది. వీరి పాలనలో సంస్థాన కవులు, సంస్థాన ప్రాంత నివాస కవులు, సంస్థానేతర ఆశ్రిత కవులకు ఆశ్రయమిచ్చి గద్వాల సంస్థాన ప్రాశస్త్యాన్ని నలుమూలలా చాటినట్లు చెబుతారు. ఈ కవులు రచించిన పద్యాలలో చాటు పద్యాలు ప్రత్యేకంగా గుర్తింపు సాధించాయి.

చెక్కుచెదరని నాటి కట్టడాలు

నలసోమనాద్రి కాలం పాలన మొదలుకొని చివరితరం మహారాణి ఆదిలక్ష్మీదేవమ్మ కాలం వరకు నిర్మించిన వివిధ కట్టడాలు, భవనాలు, బావులు నేటికీ సందర్శకులకు కనువిందు చేస్తున్నాయి. నాటి భవనాలు రాజుల అభిరుచికి, నాటి వైభవాన్ని గుర్తు చేస్తూ.. చెక్కు చెదరకపోవడం విశేషం.

గద్వాల కోటలో డిగ్రీ కళాశాల, ఆలయం..

రాజులు పాలన సాగించిన ప్రధాన గద్వాల కోటలో ప్రస్తుతం ప్రభుత్వ డిగ్రీ కళాశాల, చెన్నకేశవస్వామి ఆలయాలున్నాయి. కోట లోపలి భాగం చాలా వరకు శిథిలావస్థకు చేరి కూలిపోగా.. ముఖద్వారం, కోట చుట్టూ భాగాలు నేటికీ పర్యాటకులకు కనువిందు చేస్తాయి.

చెక్కుచెదరని ఫిరంగి

రాజులు యుద్ధ సమయంలో వినియోగించే ఫిరంగి ఇప్పటికీ చెక్కుచెదరలేదు. దీనిని ప్రస్తుతం గద్వాల మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేశారు. మున్సిపల్ కార్యాలయంలో లింగమ్మ (1725– 1740), (1745–1747) బావులు గత పాలన చిహ్నాలుగా ప్రతిబింబిస్తాయి. వీటిని ప్రస్తుత పాలకులు ఆధునీకరించి ప్రజలకు అందుబాటులో తీసుకొచ్చారు. ఏటా జరిగే గద్వాల జాతర సందర్భంగా తెప్పోత్సవాలు ఈ బావుల్లోనే నిర్వహిస్తారు.

మహారాజా మార్కెట్..

సంస్థానంలోని ప్రజలకు అవసరమైన నిత్యావసర సరుకులు మొదలుకొని.. మిగతా అన్ని రకాల వస్తువులు మహారాజా మార్కెట్‌లోనే లభించేవి. రైతులు పండించే పంట ఉత్పత్తులు కూడా ఇక్కడ విక్రయించేవారని చరిత్రకారులు చెబుతారు. మహారాజా మార్కెట్ చిహ్నం చాలా భాగం ధ్వంసమైనప్పటికీ.. దాని ఆనవాళ్లు ఇప్పటికీ కనిపిస్తాయి.


కృష్ణారెడ్డి బంగ్లా

కృష్ణారెడ్డి బంగ్లా ప్రత్యేకం

నలసోమనాద్రి నిర్మించిన (ప్రస్తుత ప్రభుత్వ డిగ్రీ కాలేజీ) కోటలోనే రాజవంశీయులు కలిసి జీవించేవారు. అయితే 1924లో సీతారామభూపాలుడు–2 మృతి చెందడంతో.. ఆయన భార్య మహారాణి ఆదిలక్ష్మీదేవమ్మ పాలన పగ్గాలు చేపట్టారు. సీతారామభూపాలుని సోదరుడు వెంకటకృష్ణారెడ్డికి అప్పటి పాలకులతో మనస్పర్థలు ఏర్పడి.. మాట పట్టింపుతో గద్వాల కోటను దాటి కృష్ణారెడ్డి బంగ్లాను నిర్మించుకున్నారు. ఈయన రాజవంశీయుల చివరితరం పాలనలో రెవెన్యూ, భూ పరిపాలన బాధ్యతలు నిర్వర్తించారు. ఈ భవనంలోనే చిరంజీవి హీరోగా నటించిన 'కొండవీటిరాజా'సినిమా షూటింగ్ చేశారు. జూరాల ప్రాజెక్టు నిర్మాణ సమయంలో ఎస్ఈ కార్యాలయం, భూసేకరణ కార్యాలయం ఇక్కడే కొనసాగాయి. గద్వాల బ్లాక్ సమితి కార్యాలయం, అనంతరం ఏర్పడిన మండల రెవెన్యూ కార్యాలయం కూడా చాలా కాలం పాటు ఇక్కడే కొనసాగింది. రాజావారి బంధువులు నేటికీ ఈ భవనంలోనే జీవనం కొనసాగిస్తుండగా.. మరి కొంత భాగంలో ఎంబీ హైస్కూల్, ప్రైవేట్ ఐటీఐ కళాశాలలున్నాయి. ఎండాకాలం, చలికాలం, వానాకాలంలో కూడా ఒకేరకమైన వాతావరణం ఉండేలా ఈ భవనాన్ని నిర్మించడం విశేషం.

చేసిందేమీలేకే సీఎం తిట్ల పురాణం

బీఆర్ఎస్ ఎమ్మెల్సీ పోచంపల్లి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి 11 నెలలు కావస్తున్నా.. ప్రజల కోసం చేసిందేమీ లేనందునే సీఎం రేవంత్ రెడ్డి తిట్ల పురాణం మొదలు పెట్టారని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. వరంగల్‌లో రేవంత్ వాడిన భాషను.. అన్ని వర్గాల ప్రజలు అసహ్యించుకుంటున్నారని చెప్పారు. ఆయన బుధవారం మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి, వికలాంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ వాసుదేవరెడ్డితో కలిసి బుధవారం తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. వరంగల్ కాళోజీ కళాక్షేత్రానికి కేసీఆర్ ప్రభుత్వం నాలుగున్నర ఎకరాలు, రూ.35 కోట్లు కేటాయించారని గుర్తు చేశారు. కాంట్రాక్టర్ అలసత్వం వల్లే పనులు ఆలస్యమైనా.. కేసీఆర్ హయాంలోనే కళాక్షేత్రం పూర్తయిందని స్పష్టం చేశారు. కేవలం రంగులు వేసి కాళోజీ కళాక్షేత్రం ఘనతను రేవంత్ తన ఖాతాలో వేసుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాలకేయుడిలా మారిన రేవంత్ రాజకీయ జీవితం.. బాహుబలి వంటి కేసీఆర్ చేతిలో పరిసమాప్తమవుతుందని పోచంపల్లి వ్యాఖ్యానించారు. రేవంత్ సభకు సొంత పార్టీ మంత్రులు, ఎమ్మెల్యేలు దూరంగా ఉన్నారని మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి గుర్తు చేశారు. సచివాలయం గేటును మారుస్తున్న రేవంత్.. తానే నిర్మించినట్లు శిలాఫలకం కూడా వేస్తారని ఎద్దేవా చేశారు.

అపజయోత్సవాలు జరపండి

బీజేపీ ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్ రెడ్డి

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ అపజయోత్సవాలు చేసుకోవలసిందిపోయి.. విజయోత్సవాలు చేసుకుంటున్నారని బీజేపీ ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి ఎద్దేవా చేశారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు రైతు డిక్లరేషన్ పేరిట కాంగ్రెస్ ప్రకటన చేసిన వరంగల్ ఆర్ట్స్ కాలేజీ మైదానంలోనే.. హామీలు నెరవేర్చకుండా మళ్లీ అబద్ధాలు ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. అందుకే, కాంగ్రెస్ అపజయోత్సవాలు చేసుకోవాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ ముందుగా.. 6 గ్యారంటీల అమలు గురించి ప్రజలకు స్పష్టతనివ్వాలని డిమాండ్ చేశారు. రేవంత్.. సోనియా గాంధీ కాళ్లు కడిగినా.. పాలాభిషేకాలు పెట్టుకున్నా తమకు అభ్యంతరం లేదన్నారు. అది కాంగ్రెస్ సంస్కృతి తప్ప బీజేపీ సంస్కృతి కాదని స్పష్టం చేశారు. తెలంగాణ బిడ్డలను పొట్టనబెట్టుకున్న కాంగ్రెస్ పార్టీ.. సోనియమ్మకు గులాంగా పనిచేయాలనుకోవడం సిగ్గుచేటని వ్యాఖ్యానించారు. బీజేపీ అధికార ప్రతినిధి రాణి రుద్రమ మాట్లాడుతూ భద్రకాళి అమ్మవారు, సమ్మక్క–సారలమ్మ సాక్షిగా సభ పెట్టి.. మహిళలకు ఇచ్చిన హామీలను ఎగ్గొట్టారని మండిపడ్డారు. హోంమంత్రి లేని రాష్ట్రంలో తెలంగాణలో మహిళలకు రక్షణ ఎలా ఉంటుందని ప్రశ్నించారు. అలాంటి పరిస్థితుల్లో.. మహిళా విజయోత్సవాలు చేసుకునే అర్హత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఎక్కడిదన్నారు. ఇప్పటికైనా రేవంత్ రెడ్డి బీజేపీని విమర్శించడం మానుకోవాలన్నారు. మహిళలను ముంచుతూ, మోసం చేయడం మాని పరిపాలనపై దృష్టి పెట్టాలని హితవు పలికారు. రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ తీరు మార్చుకోకుంటే వారి సభకు వచ్చిన మహిళలే.. రేపు చీపురు పట్టుకుని వెంటపడతారని హెచ్చరించారు.

మత్స్యకారుల సమస్యలను పరిష్కరించాలని లక్ష సంతకాల సేకరణ

మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ వెల్లడి

సాక్షి, హైదరాబాద్: మత్స్యకారుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం నుంచి లక్ష సంతకాల సేకరణోద్యమం చేయనున్నట్లు మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ తెలిపింది. కోట్లాది మంది మత్స్యకారులు సరైన ఆర్థిక అభివృద్ధి లేకపోవడంతో పేదరికంతో అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గొరెంకల నరసింహ, బాలకృష్ణ, హైదరాబాద్ మత్స్య సహకార సంఘాల చైర్మన్ కొప్పు పద్మ ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం మాసబ్ ట్యాంక్ మత్స్య శాఖ రాష్ట్ర కార్యాలయంలో వారు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా మత్స్య పరిశ్రమ అభివృద్ధి, మత్స్యకారుల సంక్షేమానికి తగిన నిధులు కేటాయించాలని కోరారు. మత్స్యకారుల వృత్తి రక్షణకు చట్టాలు చేయాలని డిమాండ్ చేశారు. మత్స్యకారుల జీవిత భద్రతకు రూ.10 లక్షలు గ్రూప్ ఇన్సూరెన్స్ సహజంగా మరణించిన మత్స్యకారులకు రూ.5 లక్షలు అందేలా చర్యలు చేపట్టాలని విన్నవించారు. మత్స్య సొసైటీలకు ఇచ్చే రుణాలను పునరుద్ధరించి మత్స్య సహకార సంఘాలను బలోపేతం చేయాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తిచేశారు.

మందస్తు జాగ్రత్త!

- వేసవి వస్తోంది.. బీర్ల ఉత్పత్తి పెంచండి
- బెవరేజెస్ కంపెనీలకు ఎక్సైజ్‌శాఖ నుంచి ఆదేశాలు
- నెలరోజులుగా ఉత్పత్తిని పెంచిన కంపెనీలు



సాక్షిప్రతినిధి, సంగారెడ్డి : ఏటా వేసవిలో బీర్ల కొరత ఏర్పడుతుంది. ఎండల తీవ్రతను తట్టుకునేందుకు మద్యం ప్రియులు బీర్ల వైపు మొగ్గు చూపుతారు. సాధారణ రోజుల్లో కంటే ఎండాకాలంలో బీర్ల అమ్మకాలు రెట్టింపు స్థాయిలో ఉంటాయి. ఏటా ఫిబ్రవరి వచ్చిందంటే చాలు క్రమంగా బీర్లకు డిమాండ్ పెరుగుతుంది. ఏప్రిల్, మే మాసాల్లో బీర్ల కొరత ఏర్పడుతుంది. ప్రధానంగా బ్రాండెడ్ బీర్లు దొరక్క బీరు ప్రియులు అల్లాడుతుంటారు. రానున్న వేసవిలో ఈ సమస్య తలెత్తకుండా ఎక్సైజ్‌శాఖ ము(మ)ందస్తు జాగ్రత్త తీసుకుంటోంది. బీర్ల ఉత్పత్తిని పెంచాలని బెవరేజెస్ కంపెనీలపై ఇప్పటి నుంచే ఒత్తిడి పెంచుతోంది. రాష్ట్రానికి బీర్లు సరఫరా చేస్తున్న యూనిట్లలో ఉత్పత్తి పెంచాలని ఎక్సైజ్‌శాఖ బెవరేజెస్ విభాగం అధికారులు ఆయా బీర్ల కంపెనీలను ఆదేశించారు.

డిమాండ్‌కు సరిపడా ఉత్పత్తి..

సంగారెడ్డి సమీపంలో ఉన్న ఓ బెవరేజెస్ కంపెనీలో నెలకు సుమారు మూడు లక్షల కేసుల నుంచి నాలుగు లక్షల కేస్‌ల బీర్లు ఉత్పత్తి ఉంటుంది. ఎక్సైజ్ అధికారుల ఒత్తిడి మేరకు ఈ కంపెనీ తన ఉత్పత్తిని ఏకంగా ఐదు లక్షల కేస్‌లకు పెంచింది. ఒక్కో కేస్‌లో 12 సీసాలు (650 ఎంఎల్) ఉంటాయి. మరో మల్టీనేషనల్ బెవరేజెస్ కంపెనీ నెలకు సుమారు 25 లక్షల కేస్‌ల బీరు ఉత్పత్తి చేస్తుంది. రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకొని ఈ ఉత్పత్తిని సుమారు 30 లక్షల కేస్‌ల వరకు పెంచినట్టు ఎక్సైజ్‌వర్గాలు చెబుతున్నాయి. లిక్కర్ మాదిరిగా కాకుండా, బీర్లకు ఎక్స్‌పైరీ డేట్ ఉంటుంది. ఉత్పత్తి జరిగిన తేదీ నుంచి ఆరు నెలల లోపే వినియోగం జరగాలి. దీంతో ఇప్పటి నుంచి ఉత్పత్తిని పెంచుకుంటూ వెళితేనే వేసవి డిమాండ్‌కు సరిపడా స్టాక్ అందుబాటులో ఉంచొచ్చని ఎక్సైజ్‌శాఖ భావిస్తోంది.

డిమాండ్‌కు తగినట్టుగా

'బీర్ల డిమాండ్‌ను ముందుగా అంచనా వేసి బెవరేజెస్ కంపెనీలు ఉత్పత్తిని పెంచుకుంటాయి. సాధారణంగా బ్రాండెడ్ బీర్లకు వేసవిలో డిమాండ్ అధికంగా ఉంటుంది. ఈ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకొని ఉత్పత్తిని పెంచుకుంటాయి' అని ఎక్సైజ్‌శాఖ బ్రూవరీస్ విభాగం అధికారి తెలిపారు.

సంగారెడ్డి నుంచే రాష్ట్రమంతటికీ సరఫరా..

సంగారెడ్డి జిల్లాలో ఆరు కంపెనీలకు చెందిన బీర్ల తయారీ యూనిట్లు ఉన్నాయి. యూబీ కంపెనీకి చెందినవి రెండు, కల్స్‌బర్గ్, క్రౌన్, లీలాసన్స్, ఏబీ ఇన్‌బీవ్ అనయూసర్–బుష్, వంటి బ్రీవరేజెస్ కంపెనీలు ఇక్కడ బీర్ల ఉత్పత్తి చేస్తాయి. రాష్ట్రమంతటికీ బీర్ల సరఫరా సంగారెడ్డి జిల్లా నుంచే జరుగుతుంది. ఎక్సైజ్‌శాఖ గణాంకాల ప్రకారం జిల్లాలో ఉన్న బెవరేజెస్ కంపెనీల యూనిట్ల ఉత్పత్తి సామర్థ్యం ఏడాదికి 6,800 లక్షల లీటర్లు. అయితే ఈ బీర్ల తయారీకి అవసరమైన నీటి కోసం ఆయా కంపెనీలు ఏకంగా పైప్‌లైన్‌లనే వేసుకున్నాయి. కొన్ని కంపెనీలు మంజీర నదీ జలాలనే వినియోగిస్తున్నాయి.

రూ. 5 వేల కోట్లు మంజూరు చేయండి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తక్షణమే రూ.5 వేల కోట్లు మంజూరు చేయాలని టీపీసీసీ అధికార ప్రతినిధి గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి కోరారు. ఈ మేరకు బుధవారం ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కలకు ఆయన లేఖ రాశారు. ఈ ఏడాది మార్చి నుంచి ఉద్యోగ విరమణ చేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులకు.. గ్రాట్యుటీ, పీఎఫ్, జీఎల్ఐ, కమ్యుటేషన్ కింద చెల్లించాల్సి ఉందని వివరించారు. ఉద్యోగులకు పీఎఫ్, టీఎస్‌జీఎల్ఐ, సరెండర్ లీవ్స్ బిల్లులు మంజూరు కావడం లేదని తెలిపారు. రాష్ట్రంలోని గిరిజన గురుకులాల్లో పనిచేసే కాంట్రాక్టు ఉపాధ్యాయులకు గత 2, 3 నెలలుగా వేతనాలు రావడం లేదని పేర్కొన్నారు. దశాబ్ద కాలంగా రాష్ట్రంలో ఈహెచ్ఎస్ ఎక్కడా సక్రమంగా అమలు కావడం లేదన్నారు.


బుధవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న సినీనటి ప్రభ


రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన రాజ్యసభ సభ్యులు, ప్రముఖ కథా రచయిత విజయేంద్ర ప్రసాద్. సమకాలిన రాజకీయాలపై చర్చించుకున్న ఇరువురు నేతలు. మామునూర్ ఎయిర్ పోర్ట్ మంజూరీపై మంత్రిని అభినందించిన విజయేంద్రప్రసాద్

చలి పులి పంజా విసిరితే...

రాష్ట్ర వ్యాప్తంగా చలిపులి పంజా విసురుతోంది. దట్టంగా కురుస్తున్న పొగమంచుకు చలిగాలులు తోడుకావడంతో ఉదయం ఎనిమిది గంటలైనా ప్రజలు ఇళ్ల నుంచి బయటికి రాలేని పరిస్థితులు ఏర్పడుతున్నాయి. రానున్న రోజుల్లో చలి తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. వృద్ధులు, చిన్నారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.


అనంతపురం శివారులో చలి తీవ్రతకు ఒకదానికొకటి హత్తుకుపోయి పడుకున్న గొర్రెలు


అల్లూరి జిల్లా లంబసింగిలో చలికి తాళలేక మంట కాగుతున్న గిరిజనులు

సిలికాన్ సిటీలో సిగ్నల్ దాటాలంటే చుక్కలే



- బీబీఎంపీ పరిధిలో రహదారుల పొడవు **12,878** కి.మీ
- ఇందులో ఆర్టిరియల్, సబ్ ఆర్టిరియల్ (అధిక సామర్థ్యంగల) రోడ్లు **1344.84** కి.మీ
- నగరంలో రిజిస్టర్ అయిన వాహనాల సంఖ్య **1.40** కోట్లు
- టామ్‌టామ్ ట్రాఫిక్ ఇండెక్స్ ప్రకారం దేశంలో అత్యధిక ట్రాఫిక్ ఉండే నగరాల్లో బెంగళూరు స్థానం **1**
- ప్రపంచంలో అత్యధిక ట్రాఫిక్ ఉండే నగరాల్లో బెంగళూరు స్థానం **6**
- నగరంలో సగటున 10 కి.మీ ప్రయాణించేందుకు పట్టే సమయం **28** నిమిషాలు

- బెంగళూరు నగరంలో రోజురోజుకూ పెరిగిపోతున్న ట్రాఫిక్
- దేశంలోనే అత్యధిక ట్రాఫిక్ ఉన్న నగరంగా గుర్తింపు
- బెంగళూరులో ప్రస్తుతం జనాభా కంటే వాహనాలే అధికం
- పరిష్కార మార్గాలు అన్వేషిస్తున్న బీబీఎంపీ..

సాక్షి బెంగళూరు: ఐటీ ఇండస్ట్రీలో దేశంలోనే అగ్రస్థానంలో నిలుస్తూ సిలికాన్ వ్యాలీ ఆఫ్ ఇండియాగా గుర్తింపు పొందిన బెంగళూరు నగరం ప్రస్తుతం ట్రాఫిక్ పద్మవ్యూహంలో చిక్కుకుని విలవిల్లాడుతోంది. నగర వాసులకు ట్రాఫిక్ అనేది నేడు అతిపెద్ద సమస్యల్లో ఒకటిగా మారింది. రద్దీ సమయాల్లో ఒక్కో ట్రాఫిక్ సిగ్నల్ దాటాలంటే రెండు మూడు సార్లు ఆగి వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. ప్రశాంత వాతావరణం, నిండైన పచ్చదనంతో ఒకప్పుడు ఉద్యాననగరంగా గుర్తింపు పొందిన బెంగళూరులో ప్రస్తుతం జనాభా సంఖ్య కంటే వాహనాల సంఖ్య ఎక్కువగా ఉంది. ఏటా వాహనాల సంఖ్య భారీగా పెరుగుతూ రావడంతో ప్రస్తుతం నగరంలో రోడ్ల సమర్థ్యానికి మించి వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. ప్రస్తుతం నగరంలో 1.40 కోట్లకు పైగా వాహనాలు ఉన్నాయి. దీంతో రోడ్ల విస్తరణకు బీబీఎంపీ (బృహత్ బెంగళూరు మహానగర పాలికె) అడుగులు వేస్తోంది.

శరవేగంగా విస్తరిస్తున్న మహానగరం కావడం, కాంక్రీటీకరణ, అభివృద్ధి, మౌలిక వసతుల విస్తరణ తదితర కారణాల వల్ల బెంగళూరు గడిచిన దశాబ్ద కాలంలో ఎంతో మారిపోయింది. విస్తరిస్తున్న నగరానికి అనుగుణంగా

దశాబ్ద కాలంలో మారిన నగరం..

మెట్రో, ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు నిర్మించినప్పటికీ ట్రాఫిక్ రద్దీకి పరిష్కారం దొరకడంలేదు. రోడ్ల విస్తరణ అభివృద్ధికి కావాల్సిన స్థలాన్ని స్వాధీనం చేసుకునేందుకు అవసరమైన ఆర్థిక వనరులు బీబీఎంపీ వద్ద లేకపోవడంతో పనులు నత్తనడకన సాగుతున్నాయి.

బెంగళూరు ట్రాఫిక్ రద్దీపై ఒక మహిళ ఇటీవల **ఎక్స్‌లో చేసిన చిన్న** పోస్టు ప్రస్తుతం అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. రష్యాలో ఒక మూల నుంచి ఇంకో మూలకు కారులో ప్రయాణించాలంటే 149 గంటలు పడుతుందని, అంత సేపు ప్రయాణించినా ఇంకా రష్యాలోనే ఉంటారని, బెంగళూరు పరిస్థితి కూడా సరిగ్గా ఇలాగే ఉందంటూ ఇక్కడి ట్రాఫిక్‌ని ఎద్దేవా చేస్తూ అనఘ అనే మహిళ ఎక్స్‌లో పోస్టు చేసింది. ఈ ట్వీట్‌పై మిశ్రమ స్పందనలు వస్తున్నాయి. ప్రస్తుతం ఈ ట్వీట్‌కు పది లక్షలకు పైగా వ్యూస్ వచ్చాయి. ఆమె చేసిన ఈ ట్వీట్ ప్రస్తుతం ఇంటర్నెట్‌లో భారీ చర్చకు తెరతీసింది. అయితే బెంగళూరు ట్రాఫిక్ రద్దీకి ఆమె ట్వీట్ ఒక చిన్న ఉదాహరణ మాత్రమేనని, నగరవాసులను ఎవ్వరిని కదిలించినా ఇలాంటి ట్రాఫిక్ వ్యథలు వందల కొద్దీ చెబుతారని నెటిజన్లు అంటున్నారు.

మానవత్వమా నీ జాడెక్కడ?

- గుండెపోటుతో బెంగాల్ వాసి మృతి
- ఆస్పత్రి వద్ద మృతదేహంతో కుటుంబసభ్యుల రోదన



విడవలూరు: పొట్టకూటి కోసం రాష్ట్రం దాటి వచ్చిన ఓ వ్యక్తి మృతిచెందాడు. కుటుంబసభ్యుల చేతిలో చిల్లిగవ్వ లేని పరిస్థితి. ఏం చేయలేక మృతదేహాన్ని ఆస్పత్రి బయట పెట్టి కన్నీరుమున్నీరుగా రోదించారు. మానవత్వానికి మాయని మచ్చగా నిలిచిన ఈ ఘటన బుధవారం శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా విడవలూరులో జరిగింది. పశ్చిమ బెంగాల్‌కు చెందిన కొందరు పొలం పనుల కోసం విడవలూరు గ్రామానికి వచ్చారు. బుధవారం అందరూ పనికెళ్లారు. పని చేస్తున్న సమయంలో ఉమిత్ (30) అనే వ్యక్తి ఒక్కసారిగా కిందపడిపోయాడు. అతడిని స్థానికంగా విడవలూరు పీహెచ్‌సీకి ట్రాక్టర్‌లో తరలించారు. డాక్టర్లు పరీక్షించి అప్పటికే గుండెపోటుతో ఉమిత్ మృతిచెందాడని నిర్ధారించారు. పనికి తీసుకెళ్లిన మేస్త్రీ ఉమిత్ గురించి పట్టించుకోలేదు. వారి వద్దకు రాలేదు. కుటుంబ సభ్యులకు భాష తెలియకపోవడం, చేతిలో డబ్బుల్లేకపోవడంతో ఏం చేయాలో తెలియక మృతదేహాన్ని పీహెచ్‌సీ ఆవరణలో ఉంచి గంటల తరబడి కన్నీరుమున్నీరుగా రోదించారు. ఎవరూ సాయం చేయకపోవడంతో బెంగాల్ రాష్ట్రానికి చెందిన కొందరు చేతులతో మృతదేహాన్ని మోసుకెళ్లారు. పీహెచ్‌సీకి సమీపంలో పూడ్చిపెట్టారు.

వేరే పార్టీ నుంచి వచ్చిన వారికే విలువ ఇస్తారా?

ఎమ్మెల్యేపై పార్టీ అధిష్టానానికి తెలుగు తమ్ముళ్ల ఫిర్యాదు

గంగాధర నెల్లూరు: చిత్తూరు జిల్లా గంగాధర నెల్లూరులో బుధవారం తెలుగుదేశం పార్టీ నాయకులు స్థానిక ఎమ్మెల్యే తీరుపై మండిపడ్డారు. తమకు విలువ ఇవ్వడం లేదని పార్టీ అధిష్టానానికి ఫిర్యాదుచేశారు. టీడీపీ సభ్యత్వ నమోదుపై బుధవారం గంగాధరనెల్లూరు ఆ పార్టీ నాయకుల సమావేశం జరిగినది. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీకి చెందిన నాయకులు ఎమ్మెల్యే తీరుపై మండిపడ్డారు. ఎమ్మెల్యే మొదటి నుంచి ఏకపక్షంగానే వ్యవహరిస్తున్నారని, పార్టీకి మొదటి నుంచి పనిచేసిన కార్యకర్తలను, నాయకులను పక్కనపెట్టి, ఇతర పార్టీల నుంచి టీడీపీ లోకి వచ్చిన వారికే పెద్దపీట వేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ కార్యక్రమాల సమావేశాల్లో వారిని అందలం ఎక్కిస్తున్నారని, అదేవిధంగా ఆర్థికంగా వారిని బలపరచడం పట్ల మండిపడ్డారు. నాయకులు, కార్యకర్తలు తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు తమ మొర వినిపించారు. దీంతో సభ్యులందరూ ఒక తీర్మానం చేసి, సమావేశానికి వచ్చిన సభ్యులందరి దగ్గర సంతకాలు సేకరించి పార్టీ అధిష్టానానికి ఎమ్మెల్యేపై ఫిర్యాదుచేశారు.


సమావేశంలో ఎమ్మెల్యే తీరుపై టీడీపీ మండలం అధ్యక్షుడికి తమ గోడును విన్నవిస్తున్న నేతలు

సీలేరులో సీ ప్లేన్ సర్వీసుపై సర్వే

సీలేరు: రాష్ట్రంలో పర్యాటక అభివృద్ధిలో భాగంగా సీలేరులో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టనుంది. ఇందులో భాగంగా శ్రీశైలం తరహాలో సీ–ప్లేన్(నీటిపై తేలియాడే విమానం) ప్రయాణాన్ని సీలేరులో అందుబాటులో తీసుకువచ్చేందుకు సర్వే మొదలయ్యింది. ఇందుకు అల్లూరి జిల్లాలోని సీలేరు(గుంటవాడ రిజర్వాయర్) అనుకూలమా? కాదా? అన్న అంశంపై జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం జి.కె.వీధి తహసీల్దార్ టి.రామకృష్ణ, ఇరిగేషన్ బృందంతో మారెమ్మతల్లి ఆలయ స్నానాల ఘాట్ వద్ద పరిశీలించారు. తహసీల్దార్ మాట్లాడుతూ 2017 లోనే ఈ రిజర్వాయర్‌లో సీ–ప్లేన్ టేకాఫ్, ల్యాండింగ్ అనుకూలతను అధికారులు గుర్తించారన్నారు. టేకాఫ్, ల్యాండింగ్‌కు 300 మీటర్ల మట్టిరోడ్డు, ఫ్లోటింగ్ జెట్టీ సరిపోతుందన్నారు. సీ–ప్లేన్ ప్రయాణానికి సీలేరు అనుకూలమని జిల్లా కలెక్టరుకు నివేదిక ఇస్తున్నట్లు తెలిపారు. జోలాపుట్‌లో కూడా ఈ తరహా ప్రయాణానికి సిబ్బందితో సర్వే నిర్వహిస్తున్నామన్నారు. సీలేరులో సీ–ప్లేన్ సర్వీసులు ప్రారంభమైతే సీలేరు నుంచి వైజాగ్ మధ్య ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు.


సీలేరు రిజర్వాయర్ వద్ద పరిశీలిస్తున్న తహసీల్దార్ రామకృష్ణ


ఈ ఏడాది అనేక మైలురాళ్లు అధిగమించాం

విశాఖపట్నం పోర్టు చైర్మన్ డా.అంగముత్తు

సాక్షి, విశాఖపట్నం : 2024–25 ఆర్థిక సంవత్సరంలో విశాఖపట్నం పోర్టు అథారిటీ (వీపీఏ) అనేక కీలక, ప్రత్యేక నౌకలను సమర్థవంతంగా నిర్వహించి అనేక మైలురాళ్లను అధిగమించామని చైర్మన్ డా.అంగముత్తు ఓ ప్రకటనలో వెల్లడించారు. యుద్ధ విమానవాహక నౌక ఐఎన్ఎస్ విక్రాంత్ ఫిబ్రవరి 21న కంటైనర్ టెర్మినల్‌లో బెర్తింగ్ చేసి.. భారీ నౌకలను సైతం అద్భుతంగా నిర్వహించామని పేర్కొన్నారు. ఏప్రిల్ 29న ఎంవీ స్టార్ యాస్పిరేషన్ అనే 38 మీటర్ల బీక్ నౌకని ఇన్నర్ హార్బర్‌లో బెర్తింగ్ చేసి పోర్టు చరిత్రలోనే మొట్టమొదటి సారిగా రాత్రి పూట బెర్తింగ్ చేశామన్నారు. భారత నౌకాదళం కోసం హిందూస్థాన్ షిప్ యార్డ్ నిర్మించిన అతిపెద్ద ఫ్లోటింగ్ డాక్‌ని మొదటిసారిగా షిప్‌యార్డ్ బిల్డింగ్ డాక్ నుంచి షిప్‌యార్డు వెట్ బేసిన్‌కు విజయవంతంగా తరలించడం ద్వారా ఒక కీలక ఘట్టాన్ని సాధించామని పేర్కొన్నారు. అదేవిధంగా రాత్రి వేళ పూర్తిగా లోడెడ్ కేప్ నౌకలను వీజీసీబీ వద్ద తొలిసారిగా నిర్వహించామన్నారు. పోర్టు ఆధునికీకరణ పనులను కూడా విజయవంతంగా చేపడుతున్నామని తెలిపారు. ఈక్యూ–6, డబ్ల్యూక్యూ–4,5 బెర్త్ డ్రాఫ్ట్‌ని 11 మీటర్ల నుంచి 11.5 మీటర్లకు, వీసీటీపీఎల్ బెర్త్‌ని 15 నుంచి 16 మీటర్లకు పెంచినట్లు వివరించారు. పైలట్ల కొరత ఉన్నప్పటికీ విశాఖపట్నం పోర్ట్ మెరైన్ డిపార్ట్‌మెంట్ ఇబ్బందులను అధిగమించి అనేక నౌకలను విజయవంతంగా నిర్వహించి కీలక విజయాలను సాధించామని స్పష్టం చేశారు.

ఆధ్యాత్మిక సమాచారం

శ్రీవారి దర్శనానికి 8 గంటలు



తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో ఒక కంపార్ట్‌మెంట్ నిండింది. మంగళవారం అర్ధరాత్రి వరకు 62,248 మంది స్వామివారిని దర్శించుకోగా 18,552 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ. 3.71 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోను, దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 8 గంటల్లో, ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

నేత్రపర్వం.. కల్యాణోత్సవం



కాణిపాకం: కార్తీక బహుళ పంచమిని పురస్కరించుకుని చిత్తూరు జిల్లా కాణిపాకంలోని సిద్ధి బుద్ధి సమేత శ్రీ వరసిద్ధి వినాయకస్వామి కల్యాణోత్సవం, ప్రాకారోత్సవాన్ని బుధవారం నేత్రపర్వంగా నిర్వహించారు. ప్రధాన ఆలయ కల్యాణవేదికలో పుష్ప పందిరి వేసి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం పండితులు శాస్త్రోక్తంగా కల్యాణోత్సవం నిర్వహించారు. అనంతరం భక్తులు కానుకలు సమర్పించారు. ఉత్సవం తర్వాత పల్లకిలో స్వామి వారిని ఊరేగించారు.

శాస్త్రోక్తం..ఆకాశదీపం



శ్రీకాళహస్తి: జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీ కాళహస్తీశ్వరాలయంలో బుధవారం ఆకాదీపాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్తీక మాసం పురస్కరించుకుని ఇక్కడ రోజూ ఆకాశదీపాన్ని సాంప్రదాయబద్ధంగా వెలిగిస్తుంటారు. ఆలయంలోని ఉయ్యాల మండపం వద్ద ఏర్పాటు చేసిన కార్తీక దీపానికి పూజలుచేశారు. అనంతరం స్థూపానికి జ్యోతిని అమర్చి ఆకాశదీపంగా ఎగురవేశారు. భక్తులు పెద్దసంఖ్యలో దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, వేదపండితులు పాల్గొన్నారు.

పాదగయ క్షేత్రంలో విశేష పూజలు



పిఠాపురం: పవిత్ర కార్తిక మాసాన్ని పురస్కరించుకుని స్థానిక పాదగయ క్షేత్రంలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. కాకినాడ జిల్లాతో పాటు ఇతర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి వస్తున్నారు. కార్తిక మాసోత్సవాల్లో భాగంగా పాదగయ పుణ్యక్షేత్రంలో కుక్కుటేశ్వరస్వామి వారికి బుధవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఉదయం పండితులు స్వామి వారికి లక్షపత్రి పూజలు, అభిషేకాలు, మంత్ర పుష్పాలు, బిల్వార్చన, అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారికి ప్రత్యేక అలంకరణ చేయగా అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

గోకర్ణేశ్వర స్వామికి రుద్రాభిషేకం



ఉండ్రాజవరం: తూర్పు గోదావరి జిల్లా ఉండ్రాజవరంలోని బాలాత్రిపుర సుందరీ సమేత గోకర్ణేశ్వర స్వామి వారికి బుధవారం ప్రత్యేక పూజలతో పాటు ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. కార్తిక మాసంలోని ఆరుద్ర నక్షత్రం సందర్భంగా స్వామి వారికి తెల్లవారు జాము నుంచి 11 రకాల ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించారు. అలాగే కె.సావరం గ్రామంలోని దుర్గామల్లేశ్వరస్వామి వారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, లక్ష పత్రి పూజ నిర్వహించారు. వెలగదుర్రు గ్రామంలో కొలువైన విశ్వేశ్వర, మల్లేశ్వరస్వామి వార్ల ఆలయ ప్రాంగణంలో జ్యోతిర్లింగార్చన చేశారు.

శాసనమండలి మీడియా పాయింట్..

వలంటీర్లను మోసం చేశారు



ఈరోజు శాసనమండలిలో వలంటీర్ల గురించి ప్రభుత్వాన్ని ప్రశ్నించాం. అసలు వలంటీర్ల వ్యవస్థ ఉందా అన్నట్టు మాట్లాడారు. అలాంటప్పుడు ఎన్నికల హామీల్లో భాగంగా వలంటీర్ల జీతం రూ.10,000 కు పెంచుతామని చంద్రబాబు ఎందుకు చెప్పారు. జూన్ 1 వరకు వలంటీర్లకు వేతనాలు చెల్లించారు.. ఎలక్షన్ కమిషన్ కూడా వలంటీర్లకు జీతం ఇచ్చింది. ప్రభుత్వ నిర్ణయంతో 2.60 లక్షల మంది వలంటీర్ల జీవితాలు రోడ్డున పడ్డాయి. విజయవాడ వరదల సమయంలో వలంటీర్ల సేవలను ప్రభుత్వం ఏ విధంగా ఉపయోగించుకుందో తెలియదా?. వరద నష్టం అంచనా విధుల్లో వార్డు వలంటీర్లను ఉపయోగించుకోలేదా?

– వరుదు కల్యాణి, ఎమ్మెల్సీ

వలంటీర్లను కొనసాగించాలి



కరోనా సమయంలో వలంటీర్లు అద్భుతంగా పని చేసారు.ఎంతోమంది ప్రాణాలు కాపాడారు. ప్రభుత్వం వలంటీర్ వ్యవస్థను కొనసాగించాలి. వలంటీర్ల జీతం రూ. 10 వేలకు పెంచుతామన్న ఎన్నికల హామీని అమలుచేయాలి. అన్ని డిపార్ట్‌మెంట్‌లలో పనిచేస్తున్న అర్హులైన కాంట్రాక్ట్ ఉద్యోగుల్ని రెగ్యులరైజ్ చేయాలి.

– టి. కల్పలత రెడ్డి, ఎమ్మెల్సీ.

లోకాయుక్త, ట్రిబ్యునల్స్‌ను తరలించొద్దు



గత ప్రభుత్వం కర్నూలులో ఏర్పాటుచేసిన లోకాయుక్త, ట్రిబ్యూనల్స్‌ను వేరే ప్రాంతానికి తరలించాలని ఈ ప్రభుత్వం చూస్తోంది. ఆ సంస్థలను కర్నూలులోనే ఉంచి అభివృద్ధి చేయాలి. న్యాయ కళాశాలను కర్నూలు లో ప్రారంభించాలని ప్రభుత్వాన్ని కోరాం. మెగా డీఎస్సీ అన్నారు. ఇంతవరకు నోటిఫికేషన్ ఇవ్వలేదు. ప్రభుత్వం ఏర్పాటుచేసి ఆరు నెలలు అయింది. ఇదే ఆరు నెలల్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా 1.30 లక్షల ఉద్యోగాలు ఇచ్చింది. 2.66 లక్షల వలంటీర్లను నియమించింది. ఆర్టీసీ విలీనం ద్వారా 55 వేల మందిని ప్రభుత్వంలో విలీనం చేసింది. చంద్రబాబు ప్రభుత్వం ఆరు నెలల్లో ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదు. పైగా 2.66 లక్షల వాలంటీర్ ఉద్యోగాలు తీసేశారు. 15 వేల మంది ఏపీ బెవరేజెస్ కార్పొరేషన్‌లో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను తీసేశారు.

– ఎం.వీ రామచంద్రారెడ్డి, ఎమ్మెల్సీ

మాయమాటలు చెప్పిన చంద్రబాబు



ఎన్నికల ముందు వలంటీర్లకు సీఎం చంద్రబాబు మాయమాటలు చెప్పారు. వలంటీర్లకు రూ.10,000 ఇస్తామని చెప్పారు..ఎన్నికలు అయిపోయిన తర్వాత మొండి చేయి చూపించారు. ఇచ్చిన హామీ ప్రకారం ప్రతి ఒక్క వలంటీర్ కి న్యాయం చేయాలనేది మా కోరిక. కరోనా సమయంలో వలంటీర్లు ప్రజలు ప్రాణాలను కాపాడారు. ఆరోగ్యమనే అంశం మీద వాయిదా తీర్మానం ఇస్తే స్పీకర్ తిరస్కరించారు. ప్రతి హాస్పటల్ కి రూ.50,000 నుండి రూ.6 కోట్లు వరకు ఆరోగ్యశ్రీ బకాయిలు ఉన్నాయి. గతంలో ఆరోగ్యశ్రీ కింద 1000 జబ్బులే ఉండేవి, ప్రస్తుతం 3500 ఉన్నాయి. పేదవాడికి ఆరోగ్యశ్రీ చాలా ఉపయోగపడింది. కొత్తగా 17 మెడికల్ కాలేజీలు తీసుకురాగా వాటిలో 5 కాలేజీలకు సంబంధించి 450 సీట్లు అడ్మిషన్లు కూడా జరిగాయి.

– సిపాయి సుబ్రహ్మణ్యం, ఎమ్మెల్సీ.

డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలి



మెగా డీఎస్సీ నిర్వహణపై సభలో వాయిదా తీర్మానం ఇచ్చాం. 16,347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి సంబంధించి సీఎం చంద్రబాబు తన తొలి సంతకం కూడా చేశారు. నవంబర్ 6న డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేస్తాం అన్నారు. ఎస్సీ వర్గీకరణ జరిగిన తర్వాత డీఎస్సీ నోటిఫికేషన్ ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఇది ఒక రాజకీయ నిర్ణయం. ఇప్పటికే టెట్ నిర్వహించారు ఫలితాలు కూడా వచ్చాయి. నాలుగు లక్షల మంది అభ్యర్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని అధికారులు నోట్ మ్యాప్ విడుదల చేయాలి. సిలబస్ ను ప్రకటించాలి. వయోపరిమితిని కూడా 44 ఏళ్ల నుంచి పెంచాలి. శ్రీకాకుళం, ప్రకాశం, నెల్లూరు, అనంతపురం జిల్లాల్లో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయ పోస్టులను పెంచాలి. మంత్రి లోకేష్ దృష్టికి కూడా ఈ విషయాన్ని తీసుకువెళ్లాం.

– కె.ఎస్.లక్ష్మణరావు , ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (పీడీఎఫ్) ఎమ్మెల్సీ

డీఎస్సీ 2024 కి నోట్ మాప్ ప్రకటించాలి



డీఎస్సీ 2024 కి సంబంధించి నోట్ మాప్ ప్రకటించాలని, సిలబస్ ప్రకటించాలని, వయోపరిమితిని పెంచాలని, ఎస్జీటీ పోస్టుల సంఖ్యను పెంచాలని వాయిదా తీర్మానం ఇచ్చి చదవడం జరిగింది. నాడు – నేడు రెండో దశ పనులకు సంబంధించి నిధులు వెంటనే కేటాయించి విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరాం. 2018 డీఎస్సీ కి సంబంధించి అర్హులైన వారికి న్యాయం చేయాలని కోరాం. ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం తిరిగి అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరాం. ఆప్కోస్ ద్వారా భర్తీ అయిన వైద్య సిబ్బందికి 15 నెలలుగా బకాయి పడ్డ జీతాలను వెంటనే చెల్లించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాం. మంత్రుల దృష్టికి ఈ విషయాలను తీసుకెళ్లగా త్వరలోనే పరిష్కరిస్తామని చెప్పారు. ఎంతమంది పిల్లలు ఉన్నా ఎన్నికల్లో పోటీకి అర్హులేనని ఒక బిల్లు తెచ్చారు. ఆ బిల్లుకు, అభ్యర్థుల వయోపరిమితి పెంచడానికి గల సంబంధం ఏంటో ప్రభుత్వం సమాధానం చెప్పాలి.

– ఐ. వెంకటేశ్వరరావు, ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (పీడీఎఫ్) ఎమ్మెల్సీ.

అద్దె భవనాల్లో వసతి గృహలా?



సాంఘిక సంక్షేమ వసతి గృహాల నిర్వహణ లోపభూయిష్టంగా ఉంది. హైకోర్టు న్యాయమూర్తులు కూడా ఈ విషయాన్ని గమనించారు. గత జగన్ ప్రభుత్వ హయాంలో 5 సంవత్సరాలు ఈ వసతి గృహాలు సజావుగా జరిగాయి. ప్రస్తుతం హాస్టళ్ళలో విద్యార్థులకు కనీస వసతులు లేక ముఖ్యంగా దుప్పట్లు, మంచాలు తదితర కనీస సౌకర్యాలు లేక విద్యార్థులు అసౌకర్యానికి గురవుతున్నారు. చాలా వసతి గృహాల్లో కాంట్రాక్ట్ వర్కర్లు లేరు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఉంటేనే పిల్లలకు న్యాయం జరుగుతుంది. తల్లిదండ్రులను వదిలి విద్య కోసం సుదూర ప్రాంతాల నుండి వచ్చిన విద్యార్థులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్రంలో చాలా చోట్ల వసతి గృహాలు అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా బాలికలు ఉన్న చోట్ల మహిళా సిబ్బందిని నియమించాలి. క్వార్టర్లు, మంచినీట సౌకర్యం, పరిశుభ్రమైన బాత్ రూములు వంటి వసతులు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

– వంకా రవీంద్రనాథ్, ఎమ్మెల్సీ.

సముద్ర భద్రత కోసం 'సీవిజిల్' ప్రారంభం

విన్యాసాల్లో 500కి పైగా యుద్ధనౌకలు, విమానాలు, హెలికాప్టర్లు, బోట్లు


వివిధ తీరాల్లో సీ విజిల్ విన్యాసాలు

సాక్షి, విశాఖపట్నం: ప్రపంచానికి తమ రక్షణ శక్తిని చాటిచెప్పేలా సమర సన్నద్ధ ప్రదర్శన సీవిజిల్–2024 దేశ వ్యాప్తంగా ప్రారంభమైంది. భారత నౌకాదళం, తీరగస్తీ దళం, మెరైన్ పోలీస్ వ్యవస్థలు ఉగ్రవాదులకు సవాల్ విసురుతూ.. తీర ప్రాంతంపై భారత రక్షణ దళ పట్టుని ప్రదర్శించేందుకు 2018 నుంచి ఏటా రెండు రోజుల పాటు 'సీ విజిల్' పేరుతో విన్యాసాలు నిర్వహిస్తున్నారు. రెండు రోజుల పాటు భారత నౌకాదళం నేతృత్వంలో సీవిజిల్–2024 పేరుతో యుద్ధ విన్యాసాలు నిర్వహిస్తున్నారు. తొలిరోజున సముద్ర తీర రేఖ కలిగి ఉన్న ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, పశ్చిమబెంగాల్, ఒడిశా, పుదుచ్చేరి సహా 13 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 7,516.6 కిలోమీటర్ల పొడవునా సమర సన్నద్ధ ప్రదర్శన నిర్వహించారు. రక్షణ మంత్రిత్వ శాఖతో పాటు హోం, షిప్పింగ్, పెట్రోలియం, సహజ వాయువులు, కస్టమ్స్, మత్స్యశాఖ, పశు సంవర్థక శాఖతో పాటు రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర, రాష్ట్ర ఏజెన్సీలు ఈ విన్యాసాల్లో భాగస్వామ్యమయ్యాయి. అంతర్రాష్ట్ర ఏజెన్సీల సమన్వయం, సమాచార భాగస్వామ్యం, సాంకేతిక పర్యవేక్షణలో మాక్ డ్రిల్ నిర్వహించి ఔరా అనిపించేలా తీర రక్షణ శక్తిని ప్రపంచానికి చెప్పారు. నేవీ, కోస్ట్‌గార్డ్‌కు చెందిన 50 నౌకలతోపాటు 100 పెట్రోలింగ్ బోట్లు ఈ విన్యాసాల్లో పాల్గొన్నాయి. వీటితో పాటుగా యుద్ధ విమానాలు, హెలికాప్టర్లు, సబ్ మెరైన్‌లు.. ఇలా మొత్తం 500 వరకూ ఈ విన్యాసాల్లో పాలుపంచుకున్నాయి. విశాఖ సహా ప్రతి తీరానికి ఐదు మైళ్ల దూరం వరకూ నిఘా వ్యవస్థను పటిష్టం చేసి మాక్ డ్రిల్‌ని తొలి రోజున నిర్వహించారు.

● పరిహారం

ఇంట్లో తరచు చికాకులా..?

కొందరికి ఆదాయం, సామాజిక హోదా బాగానే ఉంటాయి. బయట గౌరవ మర్యాదలకేం కొదవుండదు కానీ ఇంట్లో మాత్రం నిత్యం ఏవేవో చికాకులు తలెత్తుతూ ఉంటాయి. ఇంట్లో ఎవరికీ మనశ్శాంతి ఉండదు. తరచు అనారోగ్యాలు, ఒకరిపై మరొకరికి అనవసర కోపతాపాలు వంటివి నిత్యం కొనసాగుతూ ఉంటాయి. ప్రతికూల గ్రహస్థితులు, ప్రతికూల గ్రహాల దశలు జరిగే సమయంలో ఇలాంటి ఇబ్బందులు పట్టి పీడిస్తాయి. అలాంటి వాటి నుంచి ఉపశమనం పొందాలంటే...

- చీమల పుట్టల వద్ద పంచదార వేయండి. వీలు కుదిరినప్పుడల్లా ఆడపిల్లలకు మిఠాయిలు తినిపించండి. ఈ పనులకు వారం వర్జ్యాలు చూసుకోవాల్సిన అవసరం లేదు.
- కుంకుమ, కర్పూరం పొట్లంగా కట్టి, నిద్రించేటప్పుడు తలదిండు కింద పెట్టుకోవడం వల్ల కొంతవరకు చికాకులు తొలగుతాయి.
- శివాలయంలో నమక చమకాలతో శివలింగానికి అభిషేకం చేయండి. ఇలా కనీసం ఇరవై ఒక్క సోమవారాలు చేస్తే ఫలితం ఉంటుంది.



- ఆంజనేయ ఆలయంలో మంగళవారం సిందూరాన్ని, ఎరుపురంగు వస్త్రాన్ని దానం చేయండి. పేదలకు అరటిపండ్లు పంచండి.
- నూనె పదార్థాలను తినడం మానాలి. ఇంటి ప్రవేశద్వారానికి పసుపు కర్టెన్లు వాడండి.
- ప్రతి శనివారం చందనం కలిపిన నలుగు పిండితో స్నానం చేయండి. తర్వాత ఆంజనేయ ఆలయానికి వెళ్లి హనుమాన్ చాలీసా పారాయణం చేయండి. ఆలయం వద్ద పేదలకు నువ్వుండలను పంచిపెట్టండి.

- సాంఖ్యాయన

నిమిషం విషయం

అహం వైశ్వానరో భూత్వా
ప్రాణినాం దేహమాశ్రితః
ప్రాణాపాన సమాయుక్తః
పచామ్యన్నం చతుర్విధం

ఇది చాలా ప్రసిద్ధమైన శ్లోకం. భారతదేశంలో చాలామంది, అనేక ఆశ్రమవాసులు అన్నదోష నివారణకై భోజనకాలాలలో ఈ శ్లోకాన్ని పఠించి భుజించటం ఆచారంగా వస్తోంది.

భావం: నేను వైశ్వానరుణ్ణి (జఠరాగ్ని) అయి ప్రాణుల శరీరాలను ఆశ్రయించి ఉంటాను. ప్రాణ అపానాలతో కూడి నాలుగు రకాల అన్నాన్ని ఆరగిస్తాను.

పరమాత్మ సర్వవ్యాపి. అంతటా ఉన్నాడు. వెలుపల అంతటా ఎలా వ్యాపించి ఉన్నాడో అలాగే ప్రాణుల లోపల కూడా అలాగే వ్యాపించి ఉన్నాడు.

పరమాత్ముడు వైశ్వానర రూపంలో.. జఠరాగ్నిరూపంలో.. ఉన్నాడు. ప్రాణం ఉన్నంతకాలం శరీరం వెచ్చగా ఉండాలి. ఆ వెచ్చదనాన్ని ఇచ్చేది భగవంతుడే. అందుకే మండు వేసవిలోను, చల్లని శీతాకాలంలోను ఒకేవిధంగా 98.4 డిగ్రీల వేడి ఉంటుంది. ఆ అగ్నియే జఠరాగ్ని- వైశ్వానరాగ్ని. అదే పరమాత్మ.

మనం తినే నాలుగు రకాల అన్నాన్ని పచనం చేస్తున్నాడు పరమాత్మ జఠరాగ్ని రూపంలో ఉండి. మనం హాయిగా తిని పడుకుంటే ఆయన మాత్రం నిద్రపోకుండా తిన్నదాన్ని పక్వం చేస్తున్నాడు. మనం నిద్రించినా ఆయన నిద్రపోడు. మనం నిద్రలేచి మళ్ళీ తినాలనుకుంటే తింటాం. అలా తినాలంటే అంతకుముందు తిన్నది జీర్ణం కావాలి. ఆ పనిని ఆయన చేసి మనకు సహాయపడుతున్నాడు.




శివపరివారం కొలువుదీరిన మహాపుణ్య క్షేత్రం ఉజ్జయిని

పరమేశ్వరుడు కొలువై ఉన్న ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రాల్లో ఒకటి ఉజ్జయిని. ఇక్కడ ఉన్నది మహాకాళేశ్వరుడు. మహాకాలుడు అంటే చాలా నల్లనివాడు అని ఒక అర్థం. అలాగే మృత్యువుకే మృత్యువు, కాలానికే కాలం.. అంటే కాలాన్నే శాసించే వాడు అనే అర్థం కూడా చెప్పుకోవచ్చు. ఉజ్జయిని మహాకాళేశ్వరుడి విశిష్టత ఏమిటంటే.. తెల్లవారుఝామున జరిగే అభిషేకం. అది భస్మాభిషేకం. ఆ భస్మం చితాభస్మం. అంటే మహాకాలేశ్వరుడి రూపంలో ఉన్న శివుడికి అప్పుడే కాలిన శవభస్మంతో చేసే అభిషేకం అత్యంత ప్రీతిపాత్రం. దీనికే భస్మహారతి అని పేరు. తెల్లవారుఝామున 3.30 గంటలకు మాత్రమే జరిగే ఈ భస్మహారతిలో పాల్గొనేందుకు పురుషులు మాత్రమే అర్హులు. అదీ ప్రత్యేక వస్త్రధారణతో మాత్రమే. సాధారణంగా జాతకంలో అపమృత్యు దోషాలు ఉన్నవారు, దీర్ఘరోగాలతో బాధపడేవారు, అంతుచిక్కని సమస్యలతో మానసిక వేదన పడుతున్నవారు ఈ భస్మహారతిలో పాల్గొని, ఉపశమనం పొందుతుంటారు.

నేటి మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ఉజ్జయినిని పూర్వం అవంతీ నగరమనేవారు. సప్తమహానగరాలలో అవంతీనగరం కూడా ఒకటి. ఈ ఉజ్జయిని నగరం మహాకాళేశ్వర జ్యోతిర్లింగం మూలంగా ఎంత ప్రసిద్ధి పొందిందో, మహాకాళికాదేవి వల్ల కూడా అంత ప్రసిద్ధి పొందింది కాబట్టి ఉజ్జయినీ నగరానికి వెళితే ఇటు ద్వాదశ జ్యోతిర్లింగాలలో ఒకటైన మహాకాళేశ్వరుని, అటు అష్టాదశ శక్తిపీఠాలలో ఒకటైన మహాకాళిని కూడా సందర్శించి నేత్రపర్వాన్ని పొందవచ్చు.

స్థలపురాణం

ఉజ్జయినీ నగరంలో వేదప్రియుడు అనే శివభక్తుడైన బ్రాహ్మణుడు ఉండేవాడు. ఆయన నలుగురు కొడుకులూ తండ్రికి తగ్గ పుత్రులు. ఆ నగరానికి సమీపంలోని పర్వతం మీద దూషణుడనే రాక్షసుడుండేవాడు. వాడు ఋషి పుంగవుల జపతపాలకు, వైదిక ధర్మానుష్ఠానానికి ఆటంకం కలిగిస్తూ ఉండేవాడు. దూషణుడు ఉజ్జయినీ పురప్రజలను కూడా అలాగే భయభ్రాంతులకు గురిచేయసాగాడు. అయితే వేదప్రియుడు మాత్రం ఇవేమీ పట్టకుండా ఒక పార్థివ లింగాన్ని తయారు చేసుకుని, శివదీక్షలో తదేక ధ్యానంలో గడపసాగాడు. దూషణుడు ఒకనాడు వేదప్రియుణ్ణి సంహరించేందుకు ప్రయత్నించగా ఆ లింగం నుంచి మహాశివుడు మహాకాళేశ్వరుడిగా ప్రత్యక్షమై ఆ రాక్షసుడిని భస్మం చేశాడు. వేదప్రియుడి భక్తితత్పరతలకు సంతోషించిన మహేశ్వరుడు ఏం వరం కావాలో కోరుకోమన్నాడు. అసహాయులైన, దీనులైన తన వంటి భక్తులను అకాల మృత్యుభయం నుంచి కాపాడేందుకు ఇక్కడే ఉండవలసిందిగా నీలకంఠుడిని వేడుకున్నాడు వేదప్రియుడు. ఆ కోరికను మన్నించిన స్వామి ఆనాటి నుంచి మహాకాళేశ్వరుడనే పేరుతో జ్యోతిర్లింగస్వరూపుడిగా ఉజ్జయినీ క్షేత్రంలో కొలువుదీరాడు.



మరో గాథ

ఉజ్జయినీ రాజ్యాధిపతి చంద్రసేనుడు ఒక రోజు శివపూజ చేస్తుండగా శ్రీకరుడనే గోపాలుడు అక్కడికి వచ్చాడు. చంద్రసేనుడి శివార్చనా విధానాన్ని గమనించి తానూ అలాగే స్వామికి పూజ చేయాలని భావించిన శ్రీకరుడు, దారిలో ఒక రాతిముక్కను తీసుకుని దాన్నే శివలింగంగా భావించి ఇంటికి తీసుకెళ్లి పూజించసాగాడు. ఆ బాలుడు పూజలో నిమగ్నమై ఒక్కోసారి బాహ్యస్మృతిని కూడా కోల్పోయేవాడు. తల్లి ఎంత పిలిచినా పలికేవాడు కాదు. ఒకరోజు పూజలో లీనమై బాహ్యస్మృతి మరిచిన శ్రీకరుని దగ్గర నుంచి అతను శివలింగంగా భావిస్తున్న రాతిముక్కను అతని తల్లి తీసిపారేసింది. స్మృతిలోకి వచ్చిన బాలుడు తల్లి చేసిన పనికి చింతిస్తూ శివుణ్ణి వేడుకుంటూ ధ్యానం చేశాడు. అప్పుడు శివుడు అతన్ని కరుణించి జ్యోతిర్లింగంగా ఆవిర్భవించాడు.

ఉజ్జయినీ మహాకాళి

ఉజ్జయిని నగరంలో మహాకాళికాదేవి ఆలయం ఉంది. ఇది అష్టాదశ శక్తిపీఠాలలో ఒకటి. అంధకాసురుడనే రాక్షసుని మహాకాళికాదేవి అవతారంలో సంహరించిన అమ్మవారు ఇక్కడ క్షిప్రానది ఒడ్డున కొలువు తీరి, దుష్టశిక్షణ, శిష్టరక్షణ చేస్తూ, భక్తులను అనుగ్రహిస్తున్నారు. ఒక్క రక్తపుచుక్క నేలమీద పడితే దానినుంచి మరో అంధకాసురుడు ఉద్భవించే వరం గల అంధకాసురుడిని, వాడి అనుచర గణాన్నీ శివుడి ఆజ్ఞమేరకు కాళికాదేవి నాలుకను చాపి, వాడి రక్తం నేల మీద చిందకుండా మొత్తం తాగేసినందువల్ల ఈ అమ్మవారికే రక్తదంతిక అని, హరసిద్ధి మాత అని, చండికాదేవి అనీ కూడా పేర్లున్నాయి. విక్రమార్క చక్రవర్తి ఈ అమ్మవారిని అర్చించి, పదకొండుమార్లు తన శిరస్సును అర్పించగా, అన్నిమార్లూ అమ్మవారు అతణ్ణి బతికించింది. వెయ్యేళ్లపాటు నగరాన్ని పాలించే విధంగా ఆశీర్వదించింది. వెర్రివాడైన కాళిదాసును కూడా తన కరుణాకటాక్షాలతో మహాకవిగా మార్చింది.

ఉజ్జయినీ మహాకాళికాదేవి ఆలయ ప్రాంగణంలో చింతామణ్ గణేశ్ ఆలయం, బడే గణేశ్‌జీకా మందిర్, పీర్‌మత్స్యేంద్రనాథాలయం, గోపాలమందిరం, మంగళనాథాలయం వంటి ఉపాలయాలతోబాటు భర్తృహరి గుహలు, విక్రమ కీర్తి మందిరం వంటి సందర్శనీయ ప్రదేశాలున్నాయి.

భస్మాభిషేకం

ఉజ్జయినీ మహాకాళేశ్వరుడికి సాధారణ అభిషేకానంతరం చితాభస్మంతో అభిషేకం చేయడం ఇక్కడి విశిష్టత. చితాభస్మం సాధారణంగా అమంగళకరమైనా, స్వామిని తాకడం వల్ల అతి మంగళప్రదమైనదిగా మారుతోంది. భస్మ హారతితోబాటు మరోవిధమైన అర్చన కూడా కాలేశ్వరుడికి జరుగుతుంది. ఇది భస్మాభిషేకం. ఆవుపేడను కాల్చి బూడిద చేసి, మూటగట్టి, దానిని శివలింగం పై భాగాన వేలాడదీసి, అటువంటి మరో మూటతో మెల్లగా కొడుతుంటారు. అప్పుడు భస్మం మహాకాలుడి మీదనేగాక, మొత్తం ఆలయమంతా పరుచుకుంటుంది. సరిగ్గా అదే సమయంలో నాగసాధువులు రుద్రనమకం చెబుతూ ఢమరుకం, మృదంగం, భేరీలు మోగిస్తూ, శంఖనాదాలు చేస్తారు. ఆ సమయంలో ఆలయంలో ఉన్నవారికి సాక్షాత్తూ కైలాసంలోనే ఉన్నామేమో అనుకునేంతటి అలౌకికానుభూతి కలుగుతుంది.

ఇతర విశేషాలు

మహాకాళేశ్వరాలయం నేటి మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయినిలో క్షిప్రా(శిప్రా)నది ఒడ్డున ఉంది. ఈ నగరంలో ఏడు సాగర తీర్థాలు, 28 సాధారణ తీర్థాలు, 84 సిద్ధలింగాలు, 30 శివలింగాలు, అష్టభైరవులు, ఏకాదశ రుద్రులు, వందలాది దేవతా మందిరాలు, జలకుండాలు ఉన్నాయి. ఉజ్జయినిలో శివలింగాలు మూడు అంతస్థులుగా ఉంటాయి. అన్నింటికన్నా కింద ఉండేది మహాకాలేశ్వర లింగం. ఇది దక్షిణాభిముఖంగా ఉంటుంది. మహాకాలేశ్వరుడి విగ్రహం పైన ఓంకారేశ్వర లింగం ఉంటుంది. ఆ పైన ఉండేది నాగచంద్రేశ్వర లింగం. ఆలయంలో గణపతి, పార్వతి, కార్తికేయుల చిత్రాలు పశ్చిమ, ఉత్తర, తూర్పుగోడలపై ఉంటాయి. దక్షిణభాగంలో మహాదేవుని వాహనమైన నంది విగ్రహం ఉంటుంది. మహాకాలేశ్వరలింగం స్వయంభూ లింగం. ఇది అత్యంత ప్రాచీనమైనది. సృష్టి ప్రారంభంలో బ్రహ్మ శివుడిని ఇక్కడ మహాకాలునిగా కొలువు తీరి ఉండమని ప్రార్థించాడట. బ్రహ్మ అభీష్టం మేరకు శివుడు ఇక్కడ కొలువై ఈ మందిరానికి ప్రత్యేక శోభను ఇస్తున్నాడని పురాణగాథలు ఉన్నాయి. వేల సంవత్సరాలుగా ఉన్న ఉజ్జయిని మహాకాలుడి అంతరాలయంలో రెండు జ్యోతులు వెలుగుతుంటాయి. ఆ రెండు జ్యోతులను అఖండదీపాలని పిలుస్తారు.

కాలభైరవాలయం

ఉజ్జయిని వెళ్లినవారు ముందుగా క్షేత్రపాలకుడైన కాలభైరవుని సందర్శించుకుని, అటు పిమ్మట మహాకాళికా లేదా మహాకాళేశ్వరుని దర్శనం చేసుకోవడం ఆచారం. కాగా కాలభైరవుడి విగ్రహానికి మద్యంతో అభిషేకం చేయడం, మామూలుగా గుడికి కొబ్బరికాయ తీసుకు వెళ్లినట్లుగా కాలభైరవుడి ఆలయానికి వెళ్లే భక్తులు మద్యం, కల్లు సీసాలను తీసుకువెళ్లి సమర్పించడం ఆచారం. కాలభైరవార్చన విశిష్ట ఫలప్రదమైనదిగా పేరు పొందింది.

ఎలా వెళ్లాలంటే..?

హైదరాబాద్‌నుంచి ఉజ్జయినికి నేరుగా రైళ్లున్నాయి. లేదంటే పూణే వెళ్తే అక్కడినుంచి కూడా ఉజ్జయినికి రైళ్లుంటాయి. హైదరాబాద్‌నుంచి జైపూర్‌ఎక్స్‌ప్రెస్ ట్రెయిన్ ఎక్కితే సుమారు 19 గంటల్లో ఉజ్జయినిలో దిగవచ్చు. చవకగా, తొందరగా వెళ్లగలిగే మార్గాలలో అది ఒకటి. ఇంకా యశ్వంతపూర్ ఎక్స్‌ప్రెస్‌లో కూడా వెళ్లవచ్చు. విమానంలో అయితే హైదరాబాద్‌నుంచి పూణే లేదా ఇండోర్ వెళ్తే అక్కడినుంచి ఉజ్జయినికి రైలు లేదా బస్సులో వెళ్లవచ్చు.

- డి. పూర్ణిమాభాస్కర్

● కథానీతి

ధర్మ మర్మం

కురుక్షేత్ర యుద్ధం జరుగుతోంది. ఒకనాడు కర్ణుడితో యుద్ధం చేస్తూ ధర్మరాజు అతడి శరాఘాతాలకు గురై గాయాల పాలయ్యాడు. కర్ణుడి సూటిపోటి మాటలతోనైతే మృత్యు సమాన స్థితినే పొందాడు. అవమాన భారం తట్టుకోలేక దూరంగా పారిపోయి వెళ్ళి దాక్కున్నాడు. మరోపక్క అశ్వత్థామను తీవ్ర గాయాల పాలు చేసి అర్జునుడు విజయగర్వంతో ధర్మరాజు కోసం చూశాడు. ఎక్కడా కనిపించకపోయేసరికి కృష్ణుడితో కలిసి ధర్మరాజు కోసం వెతుకుతూ వెళ్ళాడు. ఒకచోట ధర్మరాజును కలుసుకున్నాడు. తనను సమీపించిన కృష్ణార్జునుల ముఖంలో సంతోషం చూసి కర్ణుణ్ని వధించి ఉంటారని అనుకున్నాడు ధర్మరాజు. అతణ్ని ఎలా వధించారో చెప్పమన్నాడు. కర్ణుణ్ని ఇంకా చంపలేదని అర్జునుడు సమాధానమిచ్చాడు.

అవమానభారంతో కోపంగా ఉన్న ధర్మజుడు అర్జునుణ్ని అనేక విధాలుగా నిందించాడు. ఎంతో గొప్పదైన గాండీవం ఉండి కూడా ఉపయోగించుకోలేకపోతున్నావు కాబట్టి దాన్ని ఎవరికైనా ఇచ్చేయమన్నాడు. ఆ మాట వినడంతోనే అర్జునుడు ధర్మరాజును చంపడానికి కత్తి ఎత్తాడు. పక్కనే ఉన్న కృష్ణుడు అర్జునుణ్ని ఆపి అతడి కోపానికి కారణాన్ని ప్రశ్నించాడు. తన ఎదురుగా ఎవరైనా గాండీవాన్ని అవమానించి దాన్ని విడిచి పెట్టమని



అంటే వాళ్లను ఆ క్షణంలోనే చంపుతానని ప్రతిజ్ఞ చేసినట్లు అర్జునుడు చెప్పాడు. అదొక విషమ సందర్భం. ఆ సమయం లో వారిద్దరినీ రక్షించుకోవాల్సిన బాధ్యత కృష్ణుడిపై పడింది. అప్పుడు కృష్ణుడు ముందు ధర్మరాజును రక్షించాలనే ఉద్దేశంతో అర్జునుడికి ధర్మం స్వరూప స్వభావాలను తెలియజేశాడు. జీవహింస మహాపాపమంటుంది ధర్మం. కానీ బలాకుడు అనే బోయవాడు భార్యాపుత్రులు, వృద్ధులైన తల్లిదండ్రుల ఆకలి తీర్చడం కోసం క్రూర జంతువును చంపి స్వర్గానికి వెళ్ళిన వృత్తాంతాన్ని వివరించాడు. అలాగే సత్యాన్ని మాత్రమే మాట్లాడమంటుంది వేదం. ఒక్కోసారి అది తప్పంటుంది ధర్మసూక్ష్మం. ఒకరోజు కొందరు వ్యక్తులు తమను దొంగలు వెంటపడుతుంటే ప్రాణభయం తో పారిపోయి కౌశికుడనే తపస్వి ముందు నుంచే అరణ్యంలోకి వెళ్ళారు. కొంతసేపటికి దొంగలు అటుగా వచ్చి వారి గురించి కౌశికుణ్ని ప్రశ్నించగా వారు ఎటు పారిపోయిందీ వివరించాడు. దొంగలు వెళ్ళి వారిని సంహరించి ధనాన్ని దోచుకుపోయారు. వారి మరణానికి పరోక్ష కారణమైన కౌశికుడు తాను చేసిన పనిమూలంగా పాపభారాన్ని మోయాల్సి వచ్చింది. కృష్ణుడి మాటలు విని అర్జునుడు ధర్మస్వరూపాన్ని సరిగ్గా అర్థం చేసుకోలేక అన్నను చంపబోయానని చింతించాడు. ప్రతిజ్ఞాభంగం కలగకుండా ధర్మరాజును, తనను కాపాడమని వేడుకొన్నాడు. అప్పుడు అర్జునుడికి కృష్ణుడు పెద్దలను, గురువులను ఏకవచనంతో సంబోధిస్తే వారిని చంపినట్లే కాగలదన్నాడు. వెంటనే అర్జునుడు అలాగే చేశాడు. ధర్మరాజు ను అవమానించిన బాధతో కొంతసేపటికి అర్జునుడు నేనింకా బతికుండటం వృథా అంటూ మరణానికి సిద్ధమయ్యాడు. వెంటనే శ్రీ కృష్ణుడు అతణ్ని ఆపి ఆత్మస్తుతి చేసుకోవడం ఆత్మహత్యా సదృశమని చెప్పాడు. వెంటనే ధర్మరాజు ఎదుట అర్జునుడు తనను తాను అనేక రకాలుగా ప్రశంసించుకొని తాను చేసిన పాపం బారినుంచి విముక్తుడయ్యాడు. ఈ విధంగా ధర్మం అనేక ధర్మసూక్ష్మాలతో మిళితమై ఉంటుంది.

● హదీసు పరిమళం

విపత్కర పరిస్థితులలో వేడుకోవాలి



మహనీయ ముహమ్మద్ (సఅసం) ప్రవచనం: పీడలు, విపత్కర పరిస్థితుల బాధ నుంచి, దౌర్భాగ్యకర స్థితి దాపురించడం నుంచి, దురదృష్టకర జాతకం నుంచి, శత్రువులు పరిహాసం చేయటం నుంచి అల్లాహ్ శరణు వేడుకోండి.

వివరణ: ఈ హదీసులో స్థూలంగా నాలుగు విషయాల నుండి రక్షణ కోరమని చెప్పినట్లుగా ఉంది. కానీ వాస్తవానికి ఈ నాలుగు విషయాలలోనే ఇహ పరాలకు సంబంధించిన అన్ని చెడుగులు కఠిన పరీక్షలు, కష్టాలు కడగండ్లు వచ్చేశాయి. వాటిలో మొదటిది (జహాదిల్ బలా) అంటే ఏదైనా ఆపద లేక పీడన వల్ల కలిగే యాతన. మనిషిని శారీరకంగా బాధించి మానసిక క్షోభకు గురి చేసే ప్రతిదీ అతని పాలిట పీడే. ఈ విపత్కర స్థితి ప్రాపంచికమైనదీ కావచ్చు. ఈ ఒక్క పదంలోనే అన్నిరకాల ఆపదలు, విపత్తులు, పీడలు, పరీక్షలు చేరి ఉన్నాయి.

రెండవ మూడవ అంశాలు: నిజానికి ఏ దాసునికైతే దౌర్భాగ్యకర స్థితి నుంచి, దురదృష్టం నుంచి దేవుని తరపున రక్షణ లభించిందో అతనికి సర్వస్వం ప్రాప్తించినట్లే.

నాలుగవ అంశం: షమాతతుల్ ఆదాయి అంటే మనకు కలిగిన ఏదేని కష్టంపై ఎదురైన గడ్డు పరిస్థితిపై మన శత్రువు నవ్వటం, దెప్పి పొడవడం, ఎగతాళి చేయడం, సంకట స్థితిలో శత్రువు చేసే పరిహాసం తీవ్ర వ్యాకులతకు గురిచేస్తుంది. అందుకే ప్రత్యేకంగా దీని నుంచి కూడా దేవుని శరణు వేడమని ఉపదేశం.

ప్రవక్త (స) వారి ఈ ఉపదేశాన్ని పాటిస్తూ, ఈ నాలుగింటి నుండి శరణు వేడే సరైన తీరు ఇది:

(2) ఓ అల్లాహ్ గండం వల్ల కలిగే బాధనుండి, దౌర్భాగ్యకర స్థితి నెలకొనడం నుండి, శత్రువులు నవ్విపోవడం దురదృష్టకర జాతకం జాతకం నుండి నేను నీ శరణు వేడుతున్నాను.

(3) ఓ అల్లాహ్! విచారం, దుఃఖం నుండి, అధైర్యం నుండి, సోమరితనం నుండి, పిరికితనం నుండి, పిసినారితనం నుండి, జనుల ఒత్తిడి నుండి నేను నీ శరణు వేడుతున్నాను.

ఈ (దువా) వేడుకోలులో 8 విషయాల రక్షణ కోరబడింది. ఈ ఎనిమిది విషయాలలో నాలుగు మరీ ముఖ్యమైనవి అవి: విచారం, దుఃఖం, రుణభారం, ప్రజల శత్రువుల ప్రాబల్యం, ఒత్తిడి ఈ నాలుగు విషయాలకు లోనైన మనిషి సున్నిత మనస్కుడై ఉంటే అతని బతుకు దుర్భరమైపోతుంది. తత్కారణంగా అతనిలోని తెలివితేటలు, శక్తియుక్తులు చచ్చుబడి పోతాయి. ఫలితంగా ఇహపరాలలోని ఎన్నో విజయ శిఖరాలను అందుకోలేక పోతాడు. అధైర్యం, సోమరితనం, పిసినారితనం, పిరికితనం... ఈ నాలుగు బలహీనతలకు లోనైనా మనిషిలో సంకల్పబలం ధైర్యం తెగువ క్షీణిస్తాయి. అందుకే మహనీయ ముహమ్మద్ (సల్లం) ఈ అంశాలన్నిటి నుంచి అల్లాహ్ శరణు వేడుకోవడమే కాకుండా ఈ విధంగా ప్రార్థిస్తూ ఉండమని తన అనుయాయులకు కూడా నొక్కి చెప్పారు.

- మొహమ్మద్ అబ్దుల్ రషీద్

● సువార్త

కన్ను తేటగా ఉంటే... దేహమంతయు వెలుగు



అనేకమంది యువతీ యువకుల కన్నులు పాపంతో నిండి వున్నాయి. ఈ విషయంలో యేసుప్రభువు తన కొండ మీద ప్రసంగంలో ఒక స్త్రీని మోహపు చూపు చూసే ప్రతివాడు అప్పుడే తన హృదయంలో ఆమెతో వ్యభిచారం చేసినవాడవుతాడని, సాధారణంగా కామం కంటిచూపుతోనే మొదలవుతుందన్నారు. శోధన అంతర్గతంగా బయలుదేరుతుంది. తర్వాత కార్యరూపం దాలుస్తుంది. కనుక కంటిని ఎంతో పవిత్రంగా కాపాడుకోవాలి. దేహానికి, ఆత్మకు దీపం కన్నే కనుక నీ కన్ను తేటగా ఉంటే దేహమంతయూ వెలుగు మయమై వుండును. నీ కన్ను చెడితే నీ దేహమంతా చీకటిమయమవునని వాక్యం బోధిస్తున్నది (లూకా 11:33-34).

ఒకరోజు యేసుప్రభువువారు గలిలయకు వెళ్ళగోరి ఫిలిప్పును కనుగొని- నన్నువెంబడించుమని అతనికి చెప్పాడు. ఫిలిప్పు నతనయేలును కనుగొని-ధర్మశాస్త్రంలో మోషేయు ప్రవక్తలు ఎవరిని గూర్చి రాశారో ఆయనను కనుగొంటిమి. ఆయన యోసేపు కుమారుడైన నజరేయుడగు యేసు అని అతనితో చెప్పాడు. అందుకు నతానియేలు-నజరేతులో నుండి మంచిదేదైనను రాగలదా అని అతనిని అడగ్గా -వచ్చి చూడమని ఫిలిప్పు అతనితో చెప్పాడు. యేసు నతానియేలు తన వద్దకు రావడం చూసి యితడు నిజంగా ఇశ్రాయేలీయుడు, ఇతని యందు ఏ కపటము లేదు. నన్ను నీవు ఎలాగైనా ఎరుగుదువని నతానియేలు యేసును అడగ్గా యేసు ఫిలిప్పు నిన్ను పిలవక మునుపే, నీవు అంజూరపు చెట్టుకింద ఉన్నప్పుడే నిన్ను చూశానని అతనితో చెప్పాడు. నతానియేలు -బోధకుడా! నీవు దేవుని కుమారుడవు. ఇశ్రాయేలు రాజువు అని ఆయనకు ఉత్తరమిచ్చెను. అందుకు యేసుక్రీస్తు అంజూరపు చెట్టుకింద కూర్చున్నావని చెప్పినందుకు నమ్ముతున్నావా? వీటికంటే గొప్ప కార్యక్రమాలు చూస్తావని అతనితో చెప్పాడు. ఆయన (యేసు ప్రభువువారు) - మీరు ఆకాశం తెరువబడుటయు దేవుని దూతలు మనుష్య కుమారునిపైగా ఎక్కుటయు, దిగుటయు చూస్తారని మీతో నిశ్చయంగా చెబుతున్నానని అన్నాడు (యోహాను 1:43-51). కనుక మనకు ఇంత సాక్షి సమూహం మేఘం వలె ఆవరించి వున్నందున మనం కూడా ప్రతి భారాన్ని సులువుగా చిక్కుల్లో పెట్టు పాపాన్ని విడిచిపెట్టాలి. విశ్వాసానికి కర్తయైన యేసుప్రభువు వైపు చూసి పందెంలో ఓపికతో పరుగెత్తవలెను. మీరు పాపంతో పోరాడటానికి రక్తం కారునంతగా ఎదిరింపలేరు. ఇంకో సంగతి నా కుమారులారా! ప్రభువు వేయు శిక్షను తృణీకరించవద్దు. ప్రభువు తాను ప్రేమించిన వారిని శిక్షించును.. అని కుమారులతో మాట్లాడినట్లు ప్రభువు మనతో మాట్లాడుతున్నాడు.

మనం శరీర సంబంధీకులైన తలిదండ్రులతో భయభక్తులతో ఉన్నాం కానీ, ఆత్మలకు తండ్రియైన దేవునికి మరింత ఎక్కువగా లోబడి బతుకవలెనని, అట్టి భయభక్తులు దేవునియందు కలిగి ఉండి, మంచిగా జీవించాలని వాక్యం సెలవిస్తుంది (హెబ్రీ 12:1 -10). కనుక ఆ విధంగా ప్రవర్తనను జాగ్రత్తగా ఉంచుకొందురు గాక.

- కోట బిపిన్ చంద్రపాల్

సంప్రదించండి

వాట్సాప్‌లో శబరిమల సమాచారం



ఇకపై శబరిమల వెళ్లే యాత్రికులు ఆలయ సమాచారం తెలుసుకోవడం కోసం ప్రయాస పడనక్కరలేదు. స్మార్ట్ ఫోన్ ఓపెన్ చేసి వాట్సాప్‌లో 6238998000 నంబర్‌కు హాయ్ అని మెసేజ్ చేస్తే చాలు... క్షణాల్లో శబరిమల ఆలయ సమాచారం అందుతుంది. 'స్వామి చాట్‌బాట్' పేరిట అందించే ఈ సేవలను ముత్తూట్ గ్రూప్ సహకారంతో ఇంగ్లిష్, హిందీ, మలయాళ, తెలుగు, తమిళ, కన్నడ భాషలలో అందించనున్నట్లు పథానంతిట్ట జిల్లా అధికార యంత్రాంగం తెలియజేసింది. ఆలయ వేళలు, ప్రసాద లభ్యత, పూజ వేళలు, శబరిమల చుట్టుపక్కల ఉండే ఇతర ఆలయాల వివరాలు, దగ్గరలో ఉండే రైళ్లు, బస్సులు, ఎయిర్ పోర్ట్ సేవలకు సంబంధించిన సమాచారాన్ని ఈ చాట్‌బోట్ ద్వారా తెలుసుకోవచ్చునని దేవస్థానం అధికారులు తెలియజేశారు.

బిజినెస్ రీల్

అర్వా ఎలక్ట్రికల్స్‌తో ప్యూర్ ఈవీ జట్టు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: మధ్యప్రాచ్యం ఆఫ్రికా దేశాలకు ఎలక్ట్రిక్ మోటర్‌సైకిళ్లను ఎగుమతి చేసే దిశగా అర్వా ఎలక్ట్రిక్ వెహికల్స్ మాన్యుఫ్యాక్చరింగ్ సంస్థతో చేతులు కలిపినట్లు విద్యుత్ ద్విచక్ర వాహనాల తయారీ సంస్థ ప్యూర్ ఈవీ వెల్లడించింది. దీని ప్రకారం వచ్చే రెండేళ్లలో తమ ఎకోడ్రిఫ్ట్, ఇట్రిస్ట్ ఎక్స్ మోడల్స్‌కి సంబంధించి 50 వేల యూనిట్లను ఎగుమతి చేయనున్నట్లు వివరించింది. ఆ తర్వాత ఈ సంఖ్య ఏటా 60,000కు చేరగలదని పేర్కొంది. దీనితో మధ్యప్రాచ్యం, ఆఫ్రికా మార్కెట్లలోకి తమ కార్యకలాపాలను పటిష్ఠం చేసుకోగలమని సంస్థ తెలిపింది.

రహేజా డెవలపర్స్‌పై దివాలా చర్యలు



న్యూఢిల్లీ: రియల్టీ సంస్థ రహేజా డెవలపర్స్‌పై దివాలా చట్టం కింద చర్యలు చేపట్టాలంటూ నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) ఆదేశించింది. తాత్కాలిక పరిష్కార నిపుణుడిగా మణీంద్ర తివారీని నియమించింది. గుర్గావ్‌కి చెందిన శిలాస్ ప్రాజెక్టులో ఫ్లాట్లు తీసుకున్న 40 మంది కొనుగోలుదారులు ఈ పిటీషన్ వేశారు. కొనుగోలు మొత్తాన్ని చెల్లించేసినప్పటికీ కంపెనీ ఫ్లాట్లను సకాలంలో అందజేయలేదని, సుమారు రూ. 113 కోట్లు డిఫాల్ట్ అయ్యిందని ఆరోపించారు. అయితే, తమ పరిధిలోని అంశాల కారణంగా జాప్యం జరిగినందువల్ల ఒప్పందం ప్రకారం దీనికి తాము బాధ్యులం కాదని రహేజా డెవలపర్స్ వాదించింది. పైగా మొత్తం కొనుగోలుదారుల్లో పిటీషనర్ల సంఖ్య 10 శాతం కన్నా తక్కువే ఉన్నందున ఈ పిటీషన్‌కు విచారణార్హత ఉండదని పేర్కొంది. కానీ కంపెనీ వాదనలను తోసిపుచ్చిన ఎన్‌సీఎల్‌టీ తాజా ఆదేశాలు జారీ చేసింది.

పీవీల వృద్ధి 0-2 శాతమే

హోల్‌సేల్ విక్రయాలపై ఇక్రా అంచనా

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో దేశవ్యాప్తంగా ప్యాసింజర్ వెహికిల్స్ (పీవీ) హోల్‌సేల్ విక్రయాల్లో వృద్ధి 0-2 శాతానికే పరిమితం అవుతుందని రేటింగ్స్ ఏజెన్సీ ఇక్రా అంచనా వేసింది. 'పీవీ పరిశ్రమ 3-6 శాతం వృద్ధి నమోదు చేస్తుందన్న గత అంచనాలను ఇక్రా తాజాగా సవరించింది. పండుగల సీజన్ ముందుగా రావడంతో 2024-25 ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-అక్టోబర్ కాలంలో తయారీ కంపెనీల నుంచి డీలర్లకు చేరిన ప్యాసింజర్ వెహికిల్స్ సంఖ్య 6 శాతం దూసుకెళ్లింది. అయితే అధిక నిల్వలు వృద్ధి వేగాన్ని మందగించేలా చేశాయి. 2023తో పోలిస్తే ఇటీవలి ఫెస్టివల్ సీజన్‌లో పీవీ హోల్‌సేల్ విక్రయాలు 6 శాతం అధికమై 6.5 లక్షల యూనిట్లు నమోదయ్యాయి. ఆకర్షణీయ డిస్కౌంట్లు, పోటీ వడ్డీ రేట్లు ఇందుకు దోహదం చేశాయి. ఇక 2024-25లో మొత్తం పరిశ్రమ 11-14 శాతం వృద్ధికి ఆస్కారం ఉంది. స్థిరమైన రీప్లేస్‌మెంట్ డిమాండ్, ఆరోగ్యకర రుతుపవనాల నేపథ్యంలో గ్రామీణ మార్కెట్లో మెరుగుదల ఇందుకు దారితీస్తుంది' అని ఇక్రా వివరించింది.

సెబీతో సెటిల్‌మెంట్‌కు ఓకే

ఎమర్జింగ్ ఇండియా ఫోకస్ ఫండ్స్

న్యూఢిల్లీ: విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్(ఎఫ్‌పీఐ) సంస్థ ఎమర్జింగ్ ఇండియా ఫోకస్ ఫండ్స్ తాజాగా క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీతో సెటిల్‌మెంట్ కుదుర్చుకుంది. ఎఫ్‌పీఐ నిబంధనల ఉల్లంఘన ఆరోపణల కేసుకు సంబంధించి సెబీకి సెటిల్‌మెంట్ ఫీజుగా రూ. 64.35 లక్షలు చెల్లించింది. ఫిట్ అండ్ ప్రోపర్ విధానాల ప్రకారం 2022 అక్టోబర్13- 2023 ఏప్రిల్ 11 మధ్య కాలానికి నిబంధనల ఉల్లంఘన కేసులో సెటిల్‌మెంట్‌కు ఆదేశాలు జారీ చేసినట్లు సెబీ పేర్కొంది. సెటిల్‌మెంట్ కోసం చట్టప్రకారం అన్నిటికీ సమ్మతి తెలియజేస్తూ ఎఫ్‌పీఐ చేసిన ప్రతిపాదనకుగాను తాజాగా ఆమోదముద్ర వేసినట్లు సెబీ వెల్లడించింది. ఈ కేసుకు సంబంధించి సెబీ ఫిబ్రవరిలో ఎమర్జింగ్ ఇండియా ఫోకస్ ఫండ్స్‌కు షోకాజ్ నోటీసు జారీ చేసింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

21-11-2024

విశాఖ	555-00
చిత్తూరు	593-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	570-00
విజయవాడ	575-00
రిటైల్ ధర (డజను)	78.00
హైదరాబాద్	560-00
వరంగల్	562-00
రిటైల్ ధర	6.20

ముడిచమురు... (బ్యారల్)

నైమెక్స్ లైట్ స్వీట్	68.23	$ 69.24
బ్రెంట్	72.95	$ 73.31

2 కంపెనీలు ఐపీవో బాటలో

- జాబితాలో సాత్విక్ గ్రీన్ ఎనర్జీ
- ఏజిస్ వొపాక్ టెర్మినల్స్ సైతం
- సెబీకి ప్రాథమిక పత్రాల దాఖలు

న్యూఢిల్లీ: తాజాగా రెండు కంపెనీలు పబ్లిక్ ఇష్యూ బాట పట్టాయి. ఇందుకు వీలుగా క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి ప్రాథమిక పత్రాలను దాఖలు చేశాయి. జాబితాలో ఎల్‌పీజీ, కెమికల్స్ స్టోరేజీ కంపెనీ ఏజిస్ వొపాక్ టెర్మినల్స్‌తోపాటు.. సోలార్ ప్యానళ్ల తయారీ కంపెనీ సాత్విక్ గ్రీన్ ఎనర్జీ చేరాయి. వివరాలు చూద్దాం..

రూ. 3,500 కోట్లపై దృష్టి

ఏజిస్ లాజిస్టిక్స్ అనుబంధ కంపెనీ ఏజిస్ వొపాక్ టెర్మినల్స్ సెబీకి ముసాయిదా ప్రాస్పెక్టస్‌ను దాఖలు చేసింది. వీటి ప్రకారం ఐపీవోలో భాగంగా రూ. 3,500 కోట్ల విలువైన ఈక్విటీని కొత్తగా జారీ చేయనుంది. తద్వారా రూ. 3,500 కోట్లు సమీకరించాలని భావిస్తోంది. ఐపీవోకంటే ముందుగా షేర్ల జారీ ద్వారా రూ. 700 కోట్లు సమకూర్చుకునే ప్రణాళి



కల్లో ఉంది. దీంతో ఐపీవో పరిమాణం ఆమేర తగ్గవచ్చు. ఇష్యూ నిధుల్లో రూ. 2,027 కోట్లు రుణ చెల్లింపులకు, రూ. 671 కోట్లు పెట్టుబడి వ్యయాలకు వెచ్చించనుంది. వీటితో మంగళూరువద్ద క్రియోజెనిక్ ఎల్‌పీజీ టెర్మినల్‌ను ఏర్పాటు చేయనుంది. మిగిలిన నిధులను కార్పొరేట్ అవసరాలకు వినియోగించనుంది. కంపెనీలో ప్రస్తుతం వొపాక్ ఇండియా బీవీకి 50.1 శాతం, ఏజిస్ లాజిస్టిక్స్‌కు 47.31 శాతం చొప్పున వాటా ఉంది. 2024 జూన్‌కల్లా దేశవ్యాప్తంగా 18 స్టోరేజీ ట్యాంకులను నిర్వహిస్తోంది. పెట్రోలియం, వెజిటబుల్ ఆయిల్, లూబ్రికెంట్స్, ఎల్‌పీజీ, ప్రొపేన్, బ్యుటేన్ తదితరాల నిల్వకు వీటిని వినియోగించవచ్చు.

రూ. 1,150 కోట్లకు రెడీ

సోలార్ ఫొటో వోల్టాయిక్ మాడ్యూళ్ల తయారీ కంపెనీ సాత్విక్ గ్రీన్ ఎనర్జీ సెబీకి ముసాయిదా ప్రాస్పెక్టస్‌ను దాఖలు చేసింది. వీటి ప్రకారం స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్టింగ్ ద్వారా రూ. 1,150 కోట్లు సమీకరించే యోచనలో ఉంది. దీనిలో రూ. 850 కోట్లు తాజా ఈక్విటీ జారీ ద్వారా, మరో రూ. 300 కోట్లు ప్రమోటర్ల షేర్ల విక్రయం ద్వారా సమకూర్చుకోనుంది. ప్రస్తుతం కంపెనీలో ప్రమోటర్ల వాటా 90 శాతంగా నమోదైంది. ఈక్విటీ జారీ నిధుల్లో రూ. 553 కోట్లు ఒడిషాలో 4 గిగావాట్ల సోలార్ పీవీ మాడ్యూల్ తయారీ ప్లాంటు ఏర్పాటుపై వెచ్చించనుంది. మరో రూ. 96 కోట్లు అనుబంధ సంస్థ సాత్విక్ సోలార్ ఇండస్ట్రీస్ రుణ చెల్లింపులకు కేటాయించనుంది. 2024 జూన్‌కల్లా 1.8 గిగావాట్ల నిర్వహణ సామర్థ్యాన్ని కలిగి ఉంది. కంపెనీ ప్రధానంగా సోలార్ ప్రాజెక్టులకు ఎండ్‌టు ఎండ్ ఈపీసీ సర్వీసులను అందిస్తోంది. ఈ ఏడాది ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో రూ. 246 కోట్ల ఆదాయం, రూ. 21 కోట్లకుపైగా నికర లాభం ఆర్జించింది.

25 నుంచి రాజేష్ పవర్ సర్వీసెస్ ఐపీవో

హైదరాబాద్: విద్యుత్ రంగానికి సేవలు అందించే 'రాజేష్ పవర్ సర్వీసెస్ లిమిటెడ్ (ఆర్‌పీఎస్ఎల్) ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపీవో) ఈ నెల 25న ప్రారంభం కానుంది. 27న ఇష్యూ ముగుస్తుంది. రూ.160.5 కోట్లను సమీకరించేందుకు కంపెనీ ఐపీవో చేపట్టింది. ఒక్కో షేరుకు రూ.320-335ను ధరల శ్రేణిగా ప్రకటించింది. బీఎస్ఈ ఎస్ఎంఈ ప్లాట్‌ఫామ్‌పై లిస్ట్ అవుతుంది. ఎస్ఎంఈ ఐపీవో కావడంతో ఒక ఇన్వెస్టర్ కనీసం 400 షేర్లతో కూడిన ఒక లాట్‌కు దరఖాస్తు చేసుకోవాలి. గరిష్ఠ ధర రూ.335 ప్రకారం రూ.134,000 కనీస మొత్తాన్ని ఇన్వెస్ట్ చేయాల్సి ఉంటుంది. ఐఎస్‌కే అడ్వైజర్స్ ప్రైవేటు లిమిటెడ్ బుక్ రన్నింగ్ లీడ్ మేనేజర్ కాగా, బిగ్‌షేర్ సర్వీసెస్ రిజిస్ట్రార్‌గా వ్యవహరించనున్నాయి. ఐపీవోలో భాగంగా 27.9 లక్షల ఈక్విటీ షేర్లను (రూ.10 ముఖ విలువ) తాజాగా జారీ చేయనుంది. ఇప్పటికే కంపెనీలో వాటాలు కలిగిన ఇన్వెస్టర్లు 20లక్షల షేర్లను ఆఫర్ ఫర్ సేల్ ద్వారా విక్రయించనున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలల కాలానికి రూ.313 కోట్ల ఆదాయంపై రూ.27.68 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది.



గిగ్ వర్కర్లకు ఫుల్ డిమాండ్



- పండుగల్లో 12 లక్షల మందికి ఉపాధి అవకాశాలు
- లాజిస్టిక్స్, రిటైల్ రంగాల్లో నియామకం

ముంబై: ఈ ఏడాది పండుగల సందర్భంగా తాత్కాలిక కార్మికులకు భారీ డిమాండ్ ఏర్పడింది. గతేడాదితో పోల్చితే గిగ్ వర్కర్లు (తాత్కాలిక ఉద్యోగులు)/ఫ్రీలాన్సర్ల డిమాండ్ 23 శాతం పెరిగినట్లు 'అవ్సార్' గిగ్ వర్కర్స్ నివేదిక వెల్లడించింది. రిటైల్ రంగంలో వచ్చిన మార్పులు, కస్టమర్ల వినియోగం, వారి అంచనాలు పెరగడం, ఈ కామర్స్ సంస్థల విస్తరణ ఈ డిమాండ్‌కు మద్దతునిచ్చినట్లు తెలిపింది. పండుగల సందర్భంగా 12 లక్షల తాత్కాలిక ఉపాధి అవకాశాలు ఏర్పడినట్లు వెల్లడించింది. ఉద్యోగ నియామక సేవలు అందించే అవ్సార్ తన ప్లాట్‌ఫామ్‌పై డేటాను విశ్లేషించిన అనంతరం ఈ వివరాలు విడుదల చేసింది. లాజిస్టిక్స్, రిటైల్, ఈ కామర్స్, కస్టమర్ సపోర్ట్ రంగాలపై అధ్యయనం చేసింది. ద్వితీయ శ్రేణి పట్టణాలైన సూరత్, జైపూర్, లక్నో తాత్కాలిక పనివారికి ప్రధాన కేంద్రాలుగా మారినట్టు తెలిపింది. ముంబై, ఢిల్లీ ఎన్‌సీఆర్, బెంగళూరు మొత్తం మీద ఉపాధి పరంగా ముందున్నట్టు, మొత్తం డిమాండ్‌లో ఈ మూడు మెట్రోల నుంచే 53 శాతం ఉన్నట్టు వెల్లడించింది. సంప్రదాయంగా మెట్రోల్లో కనిపించే తాత్కాలిక కార్మికుల సంస్కృతి, టైర్ 2 పట్టణాలకూ విస్తరిస్తున్నట్టు పేర్కొంది.

పెరిగిన వేతనాలు: నైపుణ్య మానవవనరులను ఆకర్షించేందుకు ఈ సీజన్‌లో కంపెనీలు అధిక వేతనాలను ఆఫర్ చేసినట్టు తెలిపింది. ఫీల్డ్ టెక్నీషియన్లకు ప్రతి నెలా రూ.35,000, కస్టమర్ సపోర్ట్ ఎగ్జిక్యూటివ్‌లు, డెలివరీ బాధ్యతలకు రూ.18,000-28,000 వరకు చెల్లించినట్టు వివరించింది. అధిక డిమాండ్ ఉండే నైపుణ్య పనుల నిర్వహణకు మానవ వనరుల కొరత, సేలకు డిమాండ్ అధిక వేతనాలకు దారితీసినట్టు తెలిపింది. ప్రధానంగా లాజిస్టిక్స్, రిటైల్, ఈ కామర్స్ రంగాలు తాత్కాలిక ఉద్యోగులకు ఈ ఏడాది పండుగల సీజన్‌లో ఎక్కువ ఉపాధి కల్పించినట్టు వెల్లడించింది. దేశ ఉపాధి రంగంపై గిగ్ ఎకానమీ దీర్ఘకాలం పాటు ప్రభావం చూపిస్తుందని అంచనా వేసింది.

పట్టణాల్లో తగ్గిన నిరుద్యోగం

సెప్టెంబర్ త్రైమాసికంలో 6.4%

పట్టణ ప్రాంతాల్లో నిరుద్యోగ రేటు సెప్టెంబర్‌తో ముగిసిన మూడు నెలల కాలంలో 6.4 శాతానికి దిగొచ్చింది. గతేడాది ఇదే త్రైమాసికంలో నిరుద్యోగం 6.6 శాతంగా ఉంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికం (ఏప్రిల్-జూన్)లోనూ పట్టణ ప్రాంతాల్లో నిరుద్యోగం 6.6 శాతంగా ఉండడం గమనార్హం. నేషనల్ శాంపిల్ సర్వే కార్యాలయం (ఎన్ఎస్ఎస్‌వో) 24వ పీరియాడిక్ లేబర్ సర్వే వివరాలను విడుదల చేసింది. పట్టణాల్లో 15 ఏళ్లు నిండిన మహిళల్లో నిరుద్యోగ రేటు సెప్టెంబర్ చివరికి 8.4 శాతంగా నమోదైంది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికం నాటికి ఇది 8.6 శాతంగా ఉంది. ఇక ఈ ఏడాది జూన్ చివరికి 9 శాతంగా ఉంది. 15 ఏళ్లు నిండిన పురుషులకు సంబంధించి పట్టణ నిరుద్యోగం సెప్టెంబర్ చివరికి 5.7 శాతానికి తగ్గింది. క్రితం ఏడాది ఇదే కాలంలో ఇది 6 శాతం కాగా, ఈ ఏడాది జూన్ చివరికి 5.8 శాతంగా ఉంది. జూలై-సెప్టెంబర్ కాలంలో కార్మికుల భాగస్వామ్య రేటు 50.4 శాతానికి మెరుగుపడింది. క్రితం ఏడాది సెప్టెంబర్ చివరికి ఇది 50.1 శాతంగా ఉంది.

ఈఎస్ఐసీలోకి 20.58 లక్షల కొత్త సభ్యులు

సెప్టెంబర్‌లో నమోదు



ఎంప్లాయీస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఈఎస్ఐసీ) నిర్వహించే ఈఎస్ఐ పరిధిలోకి సెప్టెంబర్‌లో కొత్తగా 20.58 లక్షల మంది చేరారు. 2023 సెప్టెంబర్‌లో కొత్త సభ్యుల నమోదు 18.88 లక్షలుగా ఉంది. అంటే 9 శాతం మందికి అదనంగా ఉపాధి లభించినట్టు తెలుస్తోంది. ఈ వివరాలను కేంద్ర కార్మిక శాఖ వెల్లడించింది.

230 కొత్త సంస్థలు

ఈఎస్ఐ పథకం పరిధిలో సెప్టెంబర్‌లో కొత్తగా 230 సంస్థలు నమోదు చేసుకున్నాయి. ఇక 20.58 లక్షల కొత్త సభ్యుల్లో 49 శాతం మేర 25 ఏళ్లలోపు వయసువారే ఉన్నారు. మహిళా సభ్యులు 3.91 లక్షల మంది కాగా, అలాగే 64 మంది ట్రాన్స్‌జెండర్లు కూడా కొత్తగా చేరారు.

ఏజెంటిక్ ఏఐకి యువతలో ఆమోదం ఎక్కువ

జెన్ ఎక్స్, మిలీనియల్స్ మొగ్గు ● సేల్స్ ఫోర్స్ అధ్యయనంలో వెల్లడి



భారత్‌లో ఏజెంటిక్ ఏఐ (కృత్రిమ మేధ) స్వీకరణలో జెనరేషన్ ఎక్స్, మిలీనియల్స్ నుంచి మొగ్గు ఎక్కువగా ఉన్నట్టు సేల్స్‌ఫోర్స్ అధ్యయనం వెల్లడించింది. ఆటానమస్ ఏజెంట్లను ఏజెంటిక్ ఏఐగా చెబుతారు. స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకుని టాస్క్‌లను అమలు చేయగలదు. మానవ ప్రమేయం లేకుండానే అనుభవాల నుంచి నేర్చుకోగలదు. రిటైల్, ఈ కామర్స్ రంగాల్లో వ్యక్తిగత సిఫారసులు, ఇన్వెంటరీ నిర్వహణలో, లాజిస్టిక్స్‌లో సరఫరా చైన్ నిర్వహణలో దీన్ని అమలు చేస్తున్నారు. హెల్త్‌కేర్, ఫైనాన్స్, టెలికం, ఐటీ, కస్టమర్ సేవలు తదితర రంగాల్లో ఏజెంటిక్ ఏఐ వినియోగానికి అనుకూలతలు ఎక్కువగా ఉన్నట్టు చెబుతారు. జెనరేషన్ జెడ్, బేబీ బూమర్స్ కంటే మిలీనియల్స్, జెన్ ఎక్స్‌లో ఎక్కువ మంది ఏజెంటిక్ ఏఐ స్వీకరణ పట్ల ఆసక్తిగా ఉన్నట్టు సేల్స్‌ఫోర్స్ ఏఐ అనుసంధానిత కస్టమర్ రీసెర్చ్ సర్వే వెల్లడించింది. ఏజెంటిక్ ఏఐని కస్టమర్ అనుభవాన్ని మెరుగుపర్చడంలో వినియోగించేందుకు జెన్ ఎక్స్‌లో 58 శాతం, మిలీనియల్స్‌లో 57 శాతం జెన్ జెడ్‌లో 51 శాతం, బేబీ బూమర్స్‌లో 42 శాతం ఆసక్తిగా ఉన్నారు. 1946-64 మధ్య జన్మించిన వారిని బేబీ బూమర్లుగా, 1965-1980 మధ్య జన్మించిన వారిని జెనరేషన్ ఎక్స్‌గా, 1981-1996 మధ్య జన్మించిన వారిని మిలీనియల్స్‌గా, 1997-2012 మధ్య జన్మించిన వారిని జెనరేషన్ జెడ్‌గా పిలుస్తున్నారు.

కస్టమర్ల నమ్మకం కాపాడుకోవాలి..

వినియోగదారుల విశ్వాసం ఎనిమిదేళ్ల కనిష్టానికి చేరిందని సేల్స్‌ఫోర్స్ అధ్యయన నివేదిక తెలిపింది. ఏఐ లాంటి అత్యాధునిక సాంకేతికతల నేపథ్యంలో ఇంతకుముందెన్నడూ లేని విధంగా కస్టమర్ విశ్వాసాన్ని చూరగొనడం కీలకంగా మారినట్టు పేర్కొంది. ఇందుకు పారదర్శకత కీలకమని పేర్కొంది. భారత్ సహా పలు దేశాల్లోని 15,015 మంది కస్టమర్ల అభిప్రాయాల ఆధారంగా ఈ నివేదికను సేల్స్‌ఫోర్స్ రూపొందించింది.

సీమాంతర లాజిస్టిక్స్ ప్రోగ్రాం విస్తరించిన అమెజాన్



న్యూఢిల్లీ: ఈ-కామర్స్ దిగ్గజం తమ సీమాంతర లాజిస్టిక్స్ ప్రోగ్రాం 'గ్లోబల్ సెల్లింగ్ సెల్లర్ ఎక్స్‌పోర్ట్స్ అండ్ డెలివరీ' (సెండ్)ను మరింతగా విస్తరించింది. అమెరికా, బ్రిటన్, జర్మనీకి భారత్ నుంచి విమాన, సముద్ర మార్గాల్లో సరుకులు రవాణా చేసేందుకు కొత్తగా మూడు సంస్థలను నియమించుకున్నట్లు సంస్థ వివరించింది. భారతీయ ఎగుమతిదార్లు విదేశాలకు ఉత్పత్తులను మరింతగా ఎగుమతి చేసేందుకు ఇది దోహదపడగలదని పేర్కొంది. బుకింగ్, ట్రాకింగ్, పేమెంట్స్ ప్రక్రియలు సులభతరం అయ్యేలా అన్ని ఫీచర్లను అమెజాన్ సెల్లర్ సెంట్రల్‌లో పొందుపర్చినట్లు సంస్థ వివరించింది. పోటీ సంస్థల కన్నా తక్కువ వ్యయాలకే సెండ్ సేవలను అందిస్తున్నట్లు పేర్కొంది. ఎగుమతుల విషయంలో పాటించాల్సిన నిబంధనలన్నింటికి సంబంధించి విక్రేతలకు సహకారం అందించేందుకు డ్యాష్‌బోర్డ్‌లా ఉపయోగపడే ఎక్స్‌పోర్ట్ నేవిగేటర్‌ను కూడా ప్రవేశపెట్టినట్లు సంస్థ వివరించింది.

పెనాల్టీపై అప్పీలుకు మెటా నిర్ణయం

న్యూఢిల్లీ: వాట్సాప్ గోప్యతా పాలసీకి సంబంధించి కాంపిటీషన్ కమిషన్ (సీసీఐ) రూ. 213 కోట్లు జరిమానా విధించడంపై అప్పీలుకెళ్లనున్నట్లు సోషల్ మీడియా దిగ్గజం మెటా వెల్లడించింది. 2021లో అమల్లోకి తెచ్చిన అప్‌డేట్‌లో యూజర్ల వ్యక్తిగత మెసేజీల గోప్యతకు భంగం కలిగించే మార్పులేమీ చేయలేదని స్పష్టం చేసింది. వాస్తవానికి డేటా సేకరణ, వినియోగంపై మరింత స్పష్టతనివ్వడంతో పాటు పలు బిజినెస్ ఫీచర్లను కూడా ప్రవేశపెట్టామని పేర్కొంది. వివిధ సేవలతో ప్రజలు, వ్యాపార సంస్థలకు వాట్సాప్ ఎంతో ఉపయోగకరమైనదిగా ఉంటోందని, ఇదంతా మెటా సహకారంతోనే సాధ్యపడుతోందని వివరించింది. మాతృసంస్థ మెటాతో యూజర్లు తమ డేటాను తప్పనిసరిగా షేర్ చేసుకునేలా 2021లో పాలసీని అప్‌డేట్ చేయడం పోటీ నిబంధనలకు విరుద్ధమంటూ సీసీఐ రూ. 213 కోట్ల జరిమానా విధించిన సంగతి తెలిసిందే.

అన్నింటికీ ఒక్కటే టీడీఎస్

- అన్ని వైఫల్యాలను నేరంగా చూడొద్దు
- అసోచామ్ కీలక సూచనలు



న్యూఢిల్లీ: అన్ని రకాల చెల్లింపులకు 1 శాతం లేదా 2 శాతం టీడీఎస్ (మూలం వద్దే పన్ను కోత) అమలు చేయాలని వాణిజ్య మండలి 'అసోచామ్' ప్రభుత్వానికి కీలక సూచన చేసింది. వివాదాల నివారణకు, పన్ను నిబంధనల అమలును సులభతరం చేసేందుకు ఇలా కోరింది. బడ్జెట్‌కు ముందు కేంద్ర ఆర్థిక శాఖకు పలు సూచనలతో కూడిన వినతపత్రాన్ని అందించింది. కొన్ని రకాల టీడీఎస్ వైఫల్యాలను నేరంగా పరిగణించరాదని కూడా కోరింది. కొన్ని రకాల చెల్లింపులకు టీడీఎస్ అమలు చేయకపోవడాన్ని నేరంగా చూడరాదని, ప్రభుత్వ ఖజానాకు నష్టం కలిగించడం ద్వారా పన్ను చెల్లింపుదారు ప్రయోజనం పొందిన కేసుల్లోనే ఇలా చేయాలని అసోచామ్ ప్రెసిడెంట్ సంజయ్ నాయర్ సూచించారు. ''వివాదాలను తగ్గించడం, నిబంధనల అమలు మెరుగుపరచడం పన్ను సంస్కరణల లక్ష్యం అవుతుందని భావిస్తున్నాం. ఈ దిశగా కార్పొరేట్ రంగం నిర్మాణాత్మక సూచనలు చేసింది. పెట్టుబడులు, వినియోగాన్ని పెంచే చర్యల కోసం కూడా కార్పొరేట్ ఇండియా చూస్తోంది''అని చెప్పారు. కంపెనీల విలీనాలు, వేరు చేయడాలకు పన్ను న్యూట్రాలిటీని అందించాలని కూడా అసోచామ్ కోరింది. పన్ను అంశాల్లో సమానత్వాన్ని ట్యాక్స్ న్యూట్రాలిటీగా చెబుతారు. మూలధన లాభాల మినహాయింపులు లేదా నష్టాలను క్యారీ ఫార్వార్డ్ చేసుకునే విషయంలో, విలీనాలు, డీమెర్జర్లు (వేరు చేయడం), గుంపగుత్తగా విక్రయించడంలో ప్రస్తుతం నిబంధనల పరంగా అంతరాలు ఉండడంతో అసోచామ్ ఇలా కోరింది. బైబ్యాక్‌ల రూపంలో వచ్చిన దాన్ని డివిడెండ్‌గా పరిగణించాలని సూచించింది.

ఫెడెక్స్ ఐదు కొత్త కార్గో విమాన సర్వీసులు

దక్షిణ భారత్‌కు మరింత అనుసంధానత



హైదరాబాద్: ఎక్స్‌ప్రెస్ రవాణా సేవల కంపెనీ ఫెడరల్ ఎక్స్‌ప్రెస్ కార్పొరేషన్ (ఫెడెక్స్) దక్షిణ భారత్ ప్రాంతాలకు అంతర్జాతీయ మార్కెట్ అనుసంధానత కల్పించేందుకు కొత్తగా ఐదు కార్గో విమాన సేవలను ప్రారంభించినట్టు ప్రకటించింది. ఆసియా పసిఫిక్ ప్రాంతం నుంచి కీలక దిగుమతులకు ఈ విస్తరణ వీలు కల్పిస్తుందని, యూరప్, యూఎస్ఏకి ఎగుమతుల వృద్ధికి సాయపడుతుందని కంపెనీ తెలిపింది. అలాగే, లాజిస్టిక్స్, సరఫరా చైన్‌కు అనుకూలిస్తుందని, అంతర్జాతీయ వాణిజ్యంలో దక్షిణ భారత్ పాత్రను బలోపేతం చేస్తుందని పేర్కొంది. ''దేశ వృద్ధిలో దక్షిణాది కీలక పాత్ర పోషిస్తోంది. ప్రముఖ ఎలక్ట్రానిక్స్ తయారీ సంస్థలు, ఆటోమోటివ్, హెల్త్‌కేర్ కంపెనీలకు కేంద్రంగా ఉంటోంది. నూతన ఫ్లయిట్ సేవలు ఈ ప్రాంత డిమాండ్‌ను తీర్చేందుకు ఫెడెక్స్ తీసుకున్న వ్యూహాత్మక నిర్ణయం''అని ఫెడెక్స్ సీఈవో, సీఏవో రిచర్డ్ వి.స్మిత్ ప్రకటించారు.

ఆర్ఎంజడ్ భారీ పెట్టుబడులు



న్యూఢిల్లీ: రియల్టీ రంగంలో ఉన్న బెంగళూరు కంపెనీ ఆర్ఎంజడ్ భారీ పెట్టుబడులకు సిద్ధమైంది. డేటా సెంటర్ ఆపరేటర్ కోల్ట్ డేటా సెంటర్ సర్వీసెస్‌తో సమాన వాటాగా సంయుక్త భాగస్వామ్య కంపెనీ ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించింది. ఆర్ఎంజడ్ డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పార్ట్‌నర్స్ ద్వారా భారత డేటా సెంటర్ మార్కెట్లో 1.7 బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టనున్నట్టు ఆర్ఎంజడ్ వెల్లడించింది. ఈ నిధులతో తొలుత నవీ ముంబై, చెన్నైలోని అంబత్తూర్‌లో ఇప్పటికే ఉన్న కేంద్రాల్లో అభివృద్ధిని వేగవంతం చేస్తారు. భవిష్యత్తులో అదనంగా మూడవ కేంద్రాన్ని జోడిస్తారు. అన్ని దశలు పూర్తి అయితే డేటా సెంటర్ల పూర్తి సామర్థ్యం 250 మెగావాట్లు ఉంటుందని కంపెనీ తెలిపింది. యూరప్, జపాన్‌తోపాటు భారత్‌లో కోల్ట్ డేటా సెంటర్ సర్వీసెస్ 25 ఏళ్లుగా డేటా సెంటర్ల అభివృద్ధి, నిర్వహణలో నిమగ్నమై ఉంది.

పేపర్ పరిశ్రమకు దిగుమతుల దెబ్బ

- చైనా నుంచి కొనుగోళ్ల వెల్లువ
- సుంకాన్ని పెంచాలన్న ఐపీఎంఏ



న్యూఢిల్లీ: పేపర్, పేపర్‌బోర్డ్ దిగుమతులు 2024-25 ఏప్రిల్-సెప్టెంబర్ కాలంలో 9,92,000 టన్నులకు చేరుకున్నాయి. గతేడాది ఇదే కాలంతో పోలిస్తే దిగుమతులు 3.5 శాతం పెరిగాయని ఇండియన్ పేపర్ మాన్యూఫ్యాక్చరర్స్ అసోసియేషన్ (ఐపీఎంఏ) తెలిపింది. చైనా నుండి ఎగుమతులు గణనీయంగా అధికం కావడమే ఇందుకు కారణమని అసోసియేషన్ వెల్లడించింది. దేశంలో తగినంత ఉత్పత్తి సామర్థ్యాలు ఉన్నప్పటికీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి అర్ధ భాగంలో చైనా నుండి కాగితం, పేపర్‌బోర్డ్ దిగుమతులు 44 శాతం దూసుకెళ్లాయి. వాణిజ్య మంత్రిత్వ శాఖ గణాంకాల ప్రకారం అధిక ఎగుమతులు కారణంగా 2023-24లో ఆసియాన్ దేశాల నుండి ఈ ఉత్పత్తుల దిగుమతులు 34 శాతం పెరిగి 19.3 లక్షల టన్నులకు చేరుకున్నాయి. ఈ వారం ప్రారంభంలో ఆర్థిక, వాణిజ్య మంత్రిత్వ శాఖలతో జరిగిన ప్రీ-బడ్జెట్ సమావేశాలలో అసోసియేషన్ తన గళాన్ని వినిపించింది. కాగితం, పేపర్‌బోర్డ్ దిగుమతిపై బేసిక్ కస్టమ్స్ సుంకాన్ని 10 నుండి 25 శాతానికి పెంచాలని సిఫార్సు చేసింది.

క్లిష్ట పరిస్థితుల్లో పరిశ్రమ..

రెండు కోవిడ్ సంవత్సరాల్లో కొంత నియంత్రణ తర్వాత.. భారత్‌కు కాగితం సరఫరా పెరుగుతూనే ఉందని ఐపీఎంఏ ప్రెసిడెంట్ పవన్ అగర్వాల్ తెలిపారు. 'దేశీయ తయారీ పరిశ్రమ వృద్ధిని దిగుమతులు దెబ్బతీస్తున్నాయి. దీంతో ఇక్కడి ప్లాంట్లు తక్కువ సామర్థ్యంతో నడుస్తున్నాయి. పరిశ్రమ నిరుత్సాహంతో కొట్టుమిట్టాడుతోంది. చైనా, చిలీ, ఇటీవల ఇండోనేషియా నుండి పెరుగుతున్న దిగుమతుల దృష్ట్యా వర్జిన్ ఫైబర్ పేపర్‌బోర్డ్‌ను దేశీయంగా తయారు చేస్తున్న కంపెనీలకు పరిస్థితి చాలా క్లిష్టంగా ఉంది. ఈ దేశాల నుంచి భారత్‌కు సరఫరా 2020-21 నుండి మూడు రెట్లు ఎక్కువయ్యాయి. దేశీయ కాగితపు పరిశ్రమ ఇప్పటికే సామర్థ్యాలను పెంపొందించడానికి గణనీయంగా మూలధన పెట్టుబడులు పెట్టినప్పటికీ, వాటి ఫలితాలు రావడానికి చాలా సమయం పడుతుంది. దోపిడీ దిగుమతులు పెరగడం వల్ల లాభదాయత ప్రభావితమైంది' అని వివరించారు.



సింధు శుభారంభం

- 20వసారి బుసానన్‌పై నెగ్గిన భారత స్టార్ షట్లర్
- పోరాడి గెలిచిన లక్ష్య సేన్
- సాత్విక్–చిరాగ్ జోడీ కూడా ముందంజ

షెన్‌జెన్: చైనా ఓపెన్ మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్–750 బ్యాడ్మింటన్ టోర్నీలో రెండో రోజు భారత షట్లర్లు మెరిశారు. బరిలోకి దిగిన వారందరూ విజయాన్ని అందుకున్నారు. మహిళల సింగిల్స్‌లో ప్రపంచ మాజీ నంబర్‌వన్ పీవీ సింధు, రైజింగ్ స్టార్ మాళవిక బన్సోద్... పురుషుల సింగిల్స్‌లో భారత నంబర్‌వన్ లక్ష్య సేన్ శుభారంభం చేసి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లారు. పురుషుల డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి జోడీ... మహిళల డబుల్స్‌లో పుల్లెల గాయత్రి–ట్రిసా జాలీ ద్వయం కూడా గెలిచి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టాయి.

మళ్లీ సింధుదే పైచేయి...

ప్రపంచ 11వ ర్యాంకర్ బుసానన్ ఒంగ్‌బమ్‌రుంగ్‌ఫన్ (థాయ్‌లాండ్)తో 21వసారి ఆడిన సింధు ఈసారీ తన ఆధిపత్యాన్ని చాటుకుంది. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 19వ ర్యాంక్‌లో ఉన్న సింధు 21–17, 21–19తో బుసానన్‌ను ఓడించింది. బుసానన్‌పై సింధుకిది 20వ విజయం కావడం విశేషం. 50 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సింధుకు గట్టిపోటీ లభించినా కీలకదశలో ఆమె పాయింట్లు గెలిచి విజయాన్ని ఖరారు చేసుకుంది. గతవారం జపాన్ మాస్టర్స్ టోర్నీలోనూ తొలి రౌండ్‌లో బుసానన్‌పైనే సింధు గెలిచింది. నేడు జరిగే ప్రిక్వార్టర్ ఫైనల్లో సింగపూర్ ప్లేయర్ యో జియా మిన్‌తో సింధు ఆడుతుంది. మరోవైపు ప్రపంచ 36వ ర్యాంకర్, భారత రైజింగ్ స్టార్ మాళవిక బన్సోద్ సంచలన విజయంతో శుభారంభం చేసింది. ప్రపంచ 21వ ర్యాంకర్ లైన్ హొమార్క్ జార్స్‌ఫెల్డ్ (డెన్మార్క్)తో జరిగిన మ్యాచ్‌లో మాళవిక 20–22, 23–21, 21–16తో విజయాన్ని అందుకుంది. 74 నిమిషాలపాటు జరిగిన ఈ



పోరులో మాళవిక తొలి గేమ్‌ను కోల్పోయినా ఆందోళన చెందకుండా ఆడి ఆ తర్వాతి రెండు గేముల్లో నెగ్గి ముందంజ వేసింది. ఈ గెలుపుతో ఈ ఏడాది కొరియా ఓపెన్‌లో జార్స్‌ఫెల్డ్ చేతిలో ఎదురైన ఓటమికి బదులు తీర్చుకుంది. నేడు జరిగే ప్రిక్వార్టర్ ఫైనల్లో సుపనిద (థాయ్‌లాండ్)తో మాళవిక తలపడుతుంది.

ఏడో ర్యాంకర్‌కు షాక్

పురుషుల సింగిల్స్ విభాగంలో భారత స్టార్ లక్ష్య సేన్ సంచలన విజయంతో బోణీ చేశాడు. ప్రపంచ 7వ ర్యాంకర్ లీ జి జియా (మలేసియా)తో జరిగిన తొలి రౌండ్‌లో ప్రపంచ 17వ ర్యాంకర్ లక్ష్య సేన్ 21–14, 13–21, 21–13తో గెలిచాడు. లీ జి జియాపై లక్ష్య సేన్‌కిది ఐదో విజయం కావడం విశేషం. 57 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో లక్ష్య సేన్ ఆటలో నిలకడ లోపించింది. అయితే కీలకదశలో అతడు గాడిలో పడటంతో విజయం దక్కింది. నిర్ణాయక మూడో గేమ్‌లో స్కోరు 15–11 వద్ద లక్ష్య సేన్ వరుసగా ఐదు పాయింట్లు గెలిచి 20–11తో విజయానికి చేరువయ్యాడు. ఆ తర్వాత అతను రెండు పాయింట్లు కోల్పోయాక మరో పాయింట్ నెగ్గి విజయాన్ని ఖరారు చేసుకున్నాడు.

గాయత్రి జోడీ ముందుకు....

మహిళల డబుల్స్ తొలి రౌండ్‌లో పుల్లెల గాయత్రి–ట్రిసా జాలీ జోడీ 21–15, 21–14తో హు లింగ్ ఫాంగ్–జెంగ్ యు చియె (చైనీస్ తైపీ) జంటను ఓడించింది. ఈ గెలుపుతో భారత జంట సీజన్ ముగింపు టోర్నీ వరల్డ్ టూర్ ఫైనల్స్‌కు అర్హత సాధించే అవకాశాన్ని మెరుగుపర్చుకుంది. మరోవైపు పురుషుల డబుల్స్‌లో డిఫెండింగ్ చాంపియన్ జోడీ సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి జోడీ 12–21, 21–19, 21–18తో లీ జె హుయె–యాంగ్ పో సువాన్ (చైనీస్ తైపీ) జంటను ఓడించింది. పారిస్ ఒలింపిక్స్ తర్వాత సాత్విక్–చిరాగ్ ఆడుతున్న తొలి టోర్నీ ఇదే కావడం గమనార్హం.



తిలక్@3

- కెరీర్ బెస్ట్ ర్యాంక్‌లో హైదరాబాద్ బ్యాటర్
- 69 స్థానాలు ఎగబాకిన తిలక్ వర్మ
- మళ్లీ నంబర్‌వన్ ఆల్‌రౌండర్‌గా హార్దిక్ పాండ్యా
- ఐసీసీ టి20 ర్యాంకింగ్స్

దుబాయ్: దక్షిణాఫ్రికాతో టి20 సిరీస్‌లో రెండు సెంచరీలతో విజృంభించిన భారత యువ ఆటగాడు ఠాకూర్ తిలక్ వర్మ అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) టి20 ర్యాంకింగ్స్‌లో అదరగొట్టాడు. సఫారీలపై 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్'గా నిలిచిన తిలక్ వర్మ ఐసీసీ బుధవారం విడుదల చేసిన టి20 బ్యాటింగ్ తాజా ర్యాంకింగ్స్‌లో తొలిసారి టాప్–10లోకి ప్రవేశించడమే కాకుండా... కెరీర్ అత్యుత్తమంగా 3వ స్థానానికి చేరుకున్నాడు. ఈ క్రమంలో తిలక్ 69 స్థానాలు ఎగబాకడం విశేషం. ఈ జాబితాలో ఆ్రస్టేలియా ఓపెనర్ ట్రావిస్ హెడ్ (855 పాయింట్లు) తొలి స్థానంలో ఉండగా... ఇంగ్లండ్ ప్లేయర్ ఫిల్ సాల్ట్ (828 పాయింట్లు) రెండో ర్యాంక్‌లో ఉన్నాడు. ప్రస్తుతం భారత్ నుంచి అత్యుత్తమ ర్యాంక్ గల ఆటగాడిగా తిలక్ వర్మ (806 పాయింట్లు) నిలవగా... సూర్యకుమార్ (788 పాయింట్లు) ఒక స్థానం కోల్పోయి నాలుగో ర్యాంక్‌కు పరిమితమయ్యాడు. భారత్ నుంచి యశస్వి జైస్వాల్ (8వ ర్యాంక్) కూడా టాప్–10లో చోటు దక్కించుకున్నాడు. ఇదే సిరీస్‌లో రెండు సెంచరీలతో సత్తా చాటిన ఓపెనర్ సంజూ సామ్సన్ 22వ ర్యాంక్‌కు చేరాడు.



నాలుగు నెలల తర్వాత...

ఆల్‌రౌండర్ల జాబితాలో హార్దిక్ పాండ్యా నాలుగు నెలల తర్వాత మళ్లీ అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. ఈ ఏడాది జూన్ 29న తొలిసారి నంబర్‌వన్ ర్యాంక్‌కు ఎగబాకిన పాండ్యా ఆ తర్వాత తన టాప్ ర్యాంక్‌ను కోల్పోయాడు. అయితే దక్షిణాఫ్రికాతో సిరీస్‌లో అటు బ్యాట్‌తో ఇటు బంతితో రాణించిన హార్దిక్ 244 పాయింట్లతో మళ్లీ నంబర్‌వన్ ర్యాంక్‌లో నిలిచాడు. బౌలర్ల ర్యాంకింగ్స్‌లో భారత్ నుంచి అత్యుత్తమంగా రవి బిష్ణోయ్ ఎనిమిదో ర్యాంక్‌లో ఉన్నాడు.


క్వార్టర్ ఫైనల్లో రిత్విక్ జోడీ



సాక్షి, హైదరాబాద్: రొవరెటో ఓపెన్ ఏటీపీ చాలెంజర్ టెన్నిస్ టోర్నీ పురుషుల డబుల్స్ విభాగంలో హైదరాబాద్ ప్లేయర్ బొల్లిపల్లి రిత్విక్ చౌదరీ శుభారంభం చేశాడు. ఇటలీలో జరుగుతున్న ఈ టోర్నీలో పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో రిత్విక్–శ్రీరామ్ బాలాజీ (భారత్) జోడీ 6–4, 6–3తో డానియల్ మసూర్–అలెక్సీ వటుటిన్ (జర్మనీ) జంటపై విజయం సాధించింది. 63 నిమిషాల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో రిత్విక్–బాలాజీ జోడీ ఏడు ఏస్‌లు సంధించింది. మూడు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. తమ సర్వీస్‌లో నాలుగుసార్లు బ్రేక్ పాయింట్లను కాపాడుకొని... ప్రత్యర్థి సర్వీస్‌ను రెండుసార్లు బ్రేక్ చేసింది.

లండన్ ఒలింపిక్స్... మళ్లీ మారిన పతక విజేత!

తొమషోవా పాయె... రోబెరి వచ్చే...





మొనాకో: లండన్ ఒలింపిక్స్ (2012) జరిగి ఓ పుష్కర కాలం పూర్తయ్యింది. ఈలోపు రియో (2016), టోక్యో (2020), పారిస్ (2024) ఒలింపిక్స్ క్రీడలు కూడా ముగిశాయి. అయితే లండన్ విశ్వక్రీడల్లో మహిళల 1500 మీటర్ల పరుగు పందెంలో పతకాల పందెం ఇంకా ఇంకా కొనసాగుతోంది. ఈసారి డోపీగా తేలిన రష్యా రన్నర్ తాత్యానా తొమషోవా పతకం (కాంస్యం) కోల్పోతే, అమెరికా రన్నర్ షానన్ రోబెరి అందుకోనుంది. ఈ ఈవెంట్‌లో మూడు రంగులు (స్వర్ణం, రజతం, కాంస్యం) మారడం మరో విశేషం. అలా ఒలింపిక్స్ చరిత్రలో ఇప్పుడిదీ నిలిచిపోనుంది. 12 ఏళ్ల క్రితం టర్కీ అథ్లెట్లు అస్లి కాకిర్ అల్ప్‌టెకిన్, గమ్జే బులుట్ వరుసగా స్వర్ణం, రజతం గెలుపొందారు. కానీ వీరిద్దరు ఇదివరకే డోపీలుగా తేలి అనర్హత వేటుకు గురయ్యారు. దీంతో ఐదో స్థానంలో ఉన్న తొమషోవాకు కాంస్యం లభించింది. ఇప్పుడు ఆమె కూడా డోపీ కావడంతో ఆరో స్థానంలో ఉన్న అమెరికన్ రోబెరి కాంస్య పతకం అందుకోనుంది. టర్కీ, రష్యా అథ్లెట్లపై ప్రపంచ అథ్లెటిక్స్ నిషేధం విధించింది. మారిన పతకాలను ప్రపంచ చాంపియన్‌షిప్ లేదంటే భవిష్యత్‌లో జరిగే ఒలింపిక్స్‌లో ప్రదానం చేస్తారు.

కేరళకు రానున్న మెస్సీ బృందం

- వచ్చే ఏడాది భారత్‌లో రెండు స్నేహపూర్వక మ్యాచ్‌లు ఆడనున్న ప్రపంచ చాంపియన్ అర్జెంటీనా
- ప్రత్యర్థులుగా ఖతర్, జపాన్ జట్లు!
- కేరళ క్రీడల మంత్రి వెల్లడి

తిరువనంతపురం: అంతా అనుకున్నట్లు జరిగితే... భారత క్రీడాభిమానులు, కేరళ ఫుట్‌బాల్ ప్రేమికులు ప్రపంచ చాంపియన్ అర్జెంటీనా జట్టు ఆటగాళ్ల విన్యాసాలు ప్రత్యక్షంగా చూస్తారు. రెండు అంతర్జాతీయ స్నేహపూర్వక మ్యాచ్‌లు ఆడేందుకు... స్టార్ స్ట్రయికర్ లియోనెల్ మెస్సీ సారథ్యంలోని అర్జెంటీనా జట్టు వచ్చే ఏడాది కేరళకు రానుందని ఆ రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి అబ్దుల్ రహమాన్ బుధవారం ప్రకటించారు. ఈ మ్యాచ్‌లను కేరళ రాష్ట్ర ప్రభుత్వమే నిర్వహిస్తుందని... వేదికతో పాటు, ప్రత్యర్థి జట్లు ఎవరనే విషయాన్ని త్వరలోనే వెల్లడిస్తామని ఆయన చెప్పారు. ప్రస్తుతానికైతే ఖతర్, జపాన్ జట్లను ఆహ్వానించాలనే ఆలోచన ఉందని ఆయన వివరించారు. 'ఫుట్‌బాల్ స్టార్ మెస్సీతో కూడిన ప్రపంచ నంబర్‌వన్ ఫుట్‌బాల్ జట్టు అర్జెంటీనా వచ్చే ఏడాది కేరళకు రానుంది. ఆ జట్టు ఇక్కడ రెండు మ్యాచ్‌లు ఆడనుంది. దీనిపై అర్జెంటీనా ఫుట్‌బాల్ సంఘంతో కలిసి త్వరలోనే సంయుక్త ప్రకటన విడుదల చేస్తాం' అని రహమాన్ పేర్కొన్నారు. ఇటీవల స్పెయిన్ పర్యటన సందర్భంగా అర్జెంటీనా జాతీయ జట్టును ఆహ్వానించినట్లు ఆయన తెలిపారు. దీనికి ఆ జట్టు నుంచి సానుకూల స్పందన వచ్చిందని... త్వరలోనే దీనిపై మరింత స్పష్టత వస్తుందని అన్నారు. మ్యాచ్‌కు సంబంధించిన ఏర్పాట్లు, భద్రత తదితర అంశాలను ప్రభుత్వమే పర్యవేక్షిస్తుందని మంత్రి చెప్పారు. అయితే తమ షెడ్యూల్ ప్రకారం అర్జెంటీనా ఫుట్‌బాల్ సంఘమే భారత పర్యటనకు సంబంధించిన తేదీలను వెల్లడించనుందని పేర్కొన్నారు. అర్జెంటీనా ఆడనున్న మ్యాచ్‌ను ప్రత్యక్షంగా 50 వేల మంది అభిమానులు చూసేలా ఏర్పాటు చేస్తామని మంత్రి వెల్లడించారు. ఈ ప్రతిష్టాత్మక మ్యాచ్‌ను నిర్వహించే శక్తి సామర్థ్యాలు కేరళ ప్రభుత్వానికి ఉన్నాయని రహమాన్ పేర్కొన్నారు. రెండు మ్యాచ్‌ల నిర్వహణకు రూ. 100 కోట్లు ఖర్చు అవుతుందని, ఈ మొత్తాన్ని స్పాన్సర్ల ద్వారా సమకూరుస్తామని ఆయన తెలిపారు.



తెలుగు టైటాన్స్ దూకుడు

యు ముంబాపై ఘనవిజయం



నోయిడా: సమష్టి ప్రదర్శనతో సత్తా చాటిన తెలుగు టైటాన్స్ ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) 11వ సీజన్‌లో ఏడో విజయం నమోదు చేసుకుంది. గత మ్యాచ్‌లో 'టేబుల్ టాపర్' హరియాణా స్టీలర్స్‌ను మట్టికరిపించిన టైటాన్స్... తాజాగా పట్టికలో రెండో స్థానంలో ఉన్న యు ముంబాను బోల్తా కొట్టించింది. బుధవారం జరిగిన హోరాహోరీ పోరులో తెలుగు టైటాన్స్ 31–29 పాయింట్ల తేడాతో మాజీ చాంపియన్ యు ముంబాపై గెలుపొందింది. చివరి వరకు ఉత్కంఠ భరితంగా సాగిన పోరులో టైటాన్స్ జట్టు రెయిడింగ్‌లో విఫలమైనా... డిఫెన్స్‌లో రాణించింది. టైటాన్స్ తరఫున ఆశిష్ నర్వాల్ 8 పాయింట్లు సాధించగా... సాగర్ నర్వాల్, అజిత్ పవార్, మన్‌జీత్ తలా 4 పాయింట్లు సాధించారు. యు ముంబా తరఫున రోహిత్ 8 పాయింట్లు, మన్‌జీత్ 7 పాయింట్లతో పోరాడారు. ఓవరాల్‌గా మ్యాచ్‌లో టైటాన్స్ 12 రెయిడ్ పాయింట్లు సాధించగా... యు ముంబా 18 పాయింట్లు సాధించింది. లీగ్‌లో 11 మ్యాచ్‌లాడిన తెలుగు టైటాన్స్ 7 విజయాలు, 4 పరాజయాలతో 37 పాయింట్లు ఖాతాలో వేసుకొని పట్టికలో ఐదో స్థానానికి ఎగబాకింది. మరోవైపు యు ముంబా 12 మ్యాచ్‌లాడి 7 విజయాలు, 4 పరాజయాలు, ఒక 'టై'తో 40 పాయింట్లు సాధించి పట్టికలో రెండో స్థానంలో ఉంది. దబంగ్ ఢిల్లీ, గుజరాత్ జెయింట్స్ మధ్య జరిగిన మరో మ్యాచ్ 39–39తో 'టై'గా ముగిసింది. నేడు బెంగాల్ వారియర్స్‌తో తెలుగు టైటాన్స్ (రాత్రి 8 గంటలకు), బెంగళూరు బుల్స్‌తో హరియాణా స్టీలర్స్ (రాత్రి 9 గంటలకు) తలపడతాయి.



పెర్త్‌లో బౌన్సీ పిచ్

- క్యూరేటర్ ఐజాక్ మెక్‌డొనాల్డ్ వెల్లడి
- శుక్రవారం నుంచి భారత్, ఆ్రస్టేలియా మధ్య తొలి టెస్టు

పెర్త్: అకాల వర్షం కారణంగా పెర్త్ పిచ్‌ను పూర్తిగా సిద్ధం చేయలేకపోయామని ప్రధాన క్యూరేటర్ ఐజాక్ మెక్‌డొనాల్డ్ పేర్కొన్నాడు. ప్రతిష్టాత్మక 'బోర్డర్–గావస్కర్ ట్రోఫీ' సిరీస్‌లో భాగంగా శుక్రవారం నుంచి పెర్త్ వేదికగా తొలి టెస్టు ప్రారంభం కానుండగా... బుధవారం అక్కడ అసాధారణ వర్షం కురిసింది. దీంతో పిచ్ ఉపరితలం కాస్త దెబ్బ తిందని... సాధారణంగా ఇక్కడ కనిపించే పగుళ్లు ఈసారి ఎక్కువ లేవని పేర్కొన్నాడు. పెర్త్‌లోని 'వాకా' పిచ్ అసాధారణ పేస్, అస్థిర బౌన్స్‌కు ప్రసిద్ధి. గతంలో ఇక్కడ జరిగిన మ్యాచ్‌ల్లో పేసర్లు వికెట్ల పండగ చేసుకున్నారు. అయితే ఈసారి పిచ్ దీనికి భిన్నంగా స్పందించే అవకాశం ఉందని ఐజాక్ అన్నాడు. 'ఇది సంప్రదాయ పెర్త్ టెస్టు పిచ్ మాత్రం కాదు. వర్షం కారణంగా పిచ్‌ను కవర్లతో కప్పి ఉంచడం వల్ల ఒక రోజంతా వృథా అయింది. ఎండ బాగా కాస్తే తిరిగి పేస్‌కు అనుకూలించడం ఖాయమే. సాధారణ సమయానికంటే ముందే పిచ్‌ను సిద్ధం చేసే పని ప్రారంభించాం. ప్రస్తుతానికి పిచ్‌పై తేమ ఉంది. అది పొడిబారితే మార్పు సహజమే. పిచ్‌పై ఉన్న పచ్చిక పేసర్లను ఊరిస్తుంది. మ్యాచ్ రోజు వర్ష సూచన లేదు. అయితే ఉష్ణోగ్రతలు కూడా ఎక్కువ ఉండవు. రోజంతా ఎండ కాస్తే పిచ్ సంప్రదాయ పద్ధతిలో మారిపోతుంది' అని ఐజాక్ వివరించాడు. 'వాకా' పిచ్‌పై 8 నుంచి 10 మిల్లీమీటర్ల గడ్డి ఉండనుందని క్యూరేటర్ చెప్పాడు. పిచ్‌పై అసాధారణ పగుళ్లు ఏర్పడేందుకు తగిన సమయం లేకపోయినా... అనూహ్య బౌన్స్ మాత్రం తప్పకపోవచ్చని అభిప్రాయపడ్డాడు.



నితీశ్

నితీశ్ రెడ్డి ఆట చూడాల్సిందే



మోర్కెల్

- ఆ్రస్టేలియా పిచ్‌లపై ఆంధ్ర ఆల్‌రౌండర్ ప్రదర్శనపై దృష్టి
- కచ్చితంగా రాణిస్తాడన్న భారత బౌలింగ్ కోచ్ మోర్కెల్
- శుబ్‌మన్ గిల్ గాయంపై మ్యాచ్ రోజే స్పష్టత

పెర్త్: ఆ్రస్టేలియా పర్యటనలో భారత యువ ఆల్‌రౌండర్, ఆంధ్ర ప్లేయర్ నితీశ్ కుమార్ రెడ్డి ఆకట్టుకుంటాడని టీమిండియా బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్ విశ్వాసం వ్యక్తం చేశాడు. భారత్, ఆ్రస్టేలియా మధ్య శుక్రవారం నుంచి ఐదు మ్యాచ్‌ల 'బోర్డర్–గావస్కర్ ట్రోఫీ' టెస్టు సిరీస్ ప్రారంభం కానుండగా... బుధవారం భారత జట్టు ప్రాక్టీస్ సెషన్‌లో పాల్గొంది. అనంతరం మీడియా సమావేశంలో మోర్కెల్ మాట్లాడాడు. 'అటు బౌలింగ్, ఇటు బ్యాటింగ్ చేయగల సామర్థ్యం నితీశ్ సొంతం. ఈ పర్యటనలో అతడి ఆట చూసేందుకు ప్రతి ఒక్కరూ ఆసక్తిగా ఉన్నారు. నితీశ్ కుమార్ రెడ్డిలో ప్రతిభకు కొదవలేదు. అతడు ఆల్‌రౌండ్ సామర్థ్యం గల ఆటగాడు. అతడి బౌలింగ్‌లో పదును ఉంది. మనం ఊహించిన దానికంటే ఎక్కువ వేగంగా అతడి బంతి బ్యాట్‌ను తాకుతుంది. ఆ్రస్టేలియా పిచ్‌లపై అతడి బౌలింగ్ బాగా ఉపయోగపడుతుంది. స్వింగ్ బౌలింగ్‌కు అనుకూలమైన ఆసీస్ పిచ్‌లపై నితీశ్ మరింత ప్రమాదకారి కాగలడు. సరైన దిశలో వినియోగిస్తే అతడు ఉపయుక్త బౌలర్ అవుతాడు. ప్రతి బంతిని వికెట్ లక్ష్యంగా సంధించడం అతడి నైపుణ్యం. పేస్ ఆల్‌రౌండర్ స్థానాన్ని భర్తీ చేయడానికి నితీశ్‌కు ఇది చక్కటి అవకాశం. ప్రపంచంలోని ఏ జట్టయినా మంచి పేస్ ఆల్‌రౌండర్ ఉండాలని కోరుకుంటుంది. తమ పేసర్లకు మరింత విశ్రాంతి నివ్వగల ఆల్‌రౌండర్ లభిస్తే అంతకుమించి ఇంకే కావాలి' అని మోర్కెల్ అన్నాడు. ఐపీఎల్ ద్వారా వెలుగులోకి వచ్చి... టి20ల్లో మెరుపుల ద్వారా టెస్టు జట్టులో స్థానం దక్కించుకున్న నితీశ్ కుమార్ రెడ్డి... ఆ్రస్టేలియాతో తొలి మ్యాచ్‌లో అంతర్జాతీయ టెస్టు అరంగేట్రం చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. షమీ వంటి సీనియర్ పేసర్ లేకపోవడంతో అతడి స్థానంలో సీమ్, బౌన్స్‌ను వినియోగించుకోగలగడంతో పాటు లోయర్ ఆర్డర్‌లో ధాటిగా బ్యాటింగ్ చేయగల సత్తా ఉన్నా నితీశ్‌ను తుది జట్టులోకి ఎంపిక చేసే చాన్స్ ఉంది.



గిల్

గిల్ గాయంపై ఆ రోజే స్పష్టత


ప్రాక్టీస్ మ్యాచ్ సందర్భంగా గాయపడ్డ యువ ఆటగాడు శుబ్‌మన్ గిల్ విషయంలో మ్యాచ్ రోజు నిర్ణయం తీసుకుంటామని మోర్కెల్ పేర్కొన్నాడు. ఫీల్డింగ్ చేస్తున్న సమయంలో గిల్ ఎడమ బొటన వేలికి గాయం కాగా... అతడు వేగంగా కోలుకుంటున్నట్లు సమాచారం. ఇప్పటికే వ్యక్తిగత కారణాల వల్ల రెగ్యులర్ కెప్టెన్ రోహిత్ శర్మ ఆ్రస్టేలియాతో తొలి టెస్టుకు దూరం కావడంతో... టాపార్డర్ కాస్త బలహీనంగా కనిపిస్తుండగా... గిల్ కూడా మ్యాచ్ ఆడకపోతే జట్టుకు ఇబ్బందులు తప్పకపోవచ్చు. ఈ నేపథ్యంలో చివరి వరకు వేచి చూసే ధోరణి అవలంభించాలని టీమ్ మేనేజ్‌మెంట్ భావిస్తోంది. మ్యాచ్ రోజు వరకు గిల్ ఫిట్‌నెస్ సాధించాలని కోరుకుంటోంది. 'గిల్ రోజు రోజుకు మెరుగవుతున్నాడు. టెస్టు మ్యాచ్ ప్రారంభానికి ముందు అతడిపై నిర్ణయం తీసుకుంటాం' అని మోర్కెల్ పేర్కొన్నాడు. 'ఆ్రస్టేలియా పిచ్‌లపై బుమ్రాకు మంచి అనుభవం ఉంది. నాయకత్వ గ్రూప్‌లో బుమ్రా కూడా భాగం. అతడు గతంలో ఇక్కడ చాలా మంచి ప్రదర్శనలు చేశాడు. జట్టును ముందుండి నడిపించడాన్ని ఇష్టపడే బౌలర్ అతడు. మిగిలిన వాళ్లు అతడిని అనుసరిస్తారు' అని మోర్కెల్ అన్నాడు.

ఒత్తిడిని దరిచేరనివ్వం...

స్వదేశంలో న్యూజిలాండ్ చేతిలో 0–3తో టెస్టు సిరీస్ కోల్పోయిన నేపథ్యంలో భారత జట్టు ఒత్తిడిలో ఉందని అంతా అనుకుంటున్నారని... అయితే దాన్ని మార్చి వేసుకునేందుకు ఆ్రస్టేలియా పర్యటనకు మించింది లేదని మోర్కెల్ అన్నాడు. ప్రపంచ క్రికెట్‌లో ఆ్రస్టేలియాలో రాణిస్తే వచ్చే పేరు ప్రఖ్యాతులు వేరని పేర్కొన్నాడు. 'ప్రతి ఒక్కరు ఒత్తిడిని ఎలా ఎదుర్కొంటారు అని అడుగుతున్నారు. మా వరకు దాన్ని పక్కన పెట్టేసి మెరుగైన ప్రదర్శనపైనే దృష్టి పెట్టాం' అని మోర్కెల్ అన్నాడు.

మహారాష్ట్ర ఓటింగ్ దృశ్యాలు



ఓటేసిన ప్రముఖులు: ఉద్ధవ్ ఠాక్రే దంపతులు



కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ దంపతులు


సచిన్ టెండూల్కర్, భార్య అంజలి, కుమార్తె సారా


ముకేశ్ అంబానీ, కుమారుడు అనంత్


ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంతదాస్ దంపతులు


అక్షయ్‌కుమార్


ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భాగవత్


మహారాష్ట్ర సీఎం ఏక్‌నాథ్ షిండే

సగం మంది ఇంటి నుంచే పనిచేయండి

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఢిల్లీ సర్కార్ ఆదేశం | ఢిల్లీలో ఇంకా క్షీణిస్తున్న వాయు నాణ్యత

సాక్షి, న్యూఢిల్లీ: ఈ సీజన్‌లోనే అత్యంత చలిరాత్రిని చవిచూసిన ఢిల్లీవాసులు బుధవారం సైతం పొగచూరిన సూర్యోదయాన్నే ఆస్వాదించాల్సిన దుస్థితి దాపురించింది. హస్తినవాసుల చలి, వాయుకాలుష్య కష్టాలు మరింత పెరిగాయి. మంగళవారం రాత్రి 11.1 డిగ్రీ సెల్సియస్ అత్యల్ప ఉష్ణోగ్రత నమోదైందని భారత వాతావరణ శాఖ బుధవారం ప్రకటించింది. బుధవారం ఉదయం 9 గంటలకు ఢిల్లీలో వాయు నాణ్యతా సూచీ(ఏక్యూఐ) 426గా నమోదైందని కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి ప్రకటించింది. దీంతో కాలుష్య నియంత్రణ మండలి ఇంకా 'తీవ్రం' కేటగిరీనే కొనసాగిస్తోంది. కాలుష్యం కోరల్లో చిక్కిన ఢిల్లీలో ఇంకా జనం సొంత, ప్రజారవాణా వాహనాల్లో తిరిగితే కాలుష్యం మరింత పెరగొచ్చన్న ఆందోళనలు ఎక్కువయ్యాయి. రోడ్లపై జనం రద్దీని తగ్గించే ఉద్దేశ్యంతో ఢిల్లీ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల్లో సగం మంది ఇంటి నుంచే పని(వర్క్ ఫ్రమ్ హోం)చేయాలని ఆమ్ ఆద్మీ సర్కార్ సూచించింది. అయితే అత్యయక సేవల విభాగాలైన ఆరోగ్యం, పారిశుద్ధ్యం, నీటిపారుదల, అగ్నిమాపకదళం, పోలీసులు, విద్యుత్, విపత్తు స్పందన దళం వంటి విభాగాల సిబ్బందికి ఈ వర్క్ ఫ్రమ్ హోం నిబంధన వర్తించదు. ప్రస్తుతం ఢిల్లీ రాష్ట్ర ప్రభుత్వంలో దాదాపు 80 శాఖలు, విభాగాల్లో మొత్తంగా 1.4 లక్షల మంది సిబ్బంది ఉన్నారు. ''ప్రభుత్వ సిబ్బందితోపాటు పరిశ్రమలు, ప్రైవేట్ సంస్థలు సైతం 50 శాతం మందిని ఇంటి నుంచే పనిచేయిస్తే మంచిది. మీ వంతుగా నగరంలో వాయుకాలుష్యాన్ని తగ్గించినవారవతారు. ఉదయం 10.30 గంటల నుంచి 11 గంటల మధ్య పనివేళలను కొద్దిగా మార్చండి. దీంతో ఆఫీస్‌వేళల్లో రోడ్లపై వాహనాల రద్దీ తగ్గి కాలుష్యం కాస్తయినా మటుమాయం కావొచ్చు'' అని ఢిల్లీ రాష్ట్ర పర్యావరణ శాఖ మంత్రి గోపాల్ రాయ్ 'ఎక్స్' వేదికగా కోరారు. ''ఎక్కువ మంది సిబ్బంది రాకపోకల కోసం ప్రైవేట్ సంస్థలు షటిల్ బస్సు సేవలను వినియోగించుకోవాలి. ఢిల్లీ ప్రభుత్వం సైతం గవర్నమెంట్ ఉద్యోగుల కోసం ఇదే నియమాన్ని అమలుచేస్తోంది'' అని రాయ్ సూచించారు. ఈ సందర్భంగా పొరుగురాష్ట్రాలను పాలిస్తున్న బీజేపీపై విమర్శలు గుప్పించారు. ''ఢిల్లీ చుట్టూతా బీజేపీపాలిత రాష్ట్రాలే ఉన్నాయి. ఢిల్లీ పొరుగున ఉన్న ఉత్తరప్రదేశ్, హరియాణా, రాజస్థాన్, మధ్యప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వాలు తమ వంతుగా కాలుష్యాన్ని తగ్గించడంలో పూర్తిగా విఫలమయ్యాయి. మా సర్కార్ అనుసరిస్తున్న కాలుష్య నివారణ విధానాలనే మీరూ ఆచరించండి' అని రాయ్ హితవుపలికారు.

కొనసాగుతున్న గ్రేప్–4 నిబంధన

కాలుష్యం ఏమాత్రం తగ్గకపోవడంతో సోమవారం అమలుచేసిన నాల్గవ గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్(గ్రేప్)ను ఢిల్లీ ప్రభుత్వం ఇంకా కొనసాగిస్తోంది. గ్రేప్–4 నియమాల్లో భాగంగా ఢిల్లీ పరిధిలో నిర్మాణ, కూల్చివేత కార్యకలాపాలపై నిషేధం కొనసాగుతోంది. స్కూళ్లను మూసేశారు. డీజిల్‌తో నడిచే మధ్యస్థాయి, భారీ రవాణా వాహనాలను ఢిల్లీలోనికి అనుమతించట్లేరు. పాతకాల ఢిల్లీలో ఉదయం చాలా ప్రాంతాల్లో అరకిలోమీటర్‌లోపు ఉన్నవి కూడా కనిపించనంతగా మంచు దుప్పటి కప్పేసింది. రన్‌వే సరిగా కనిపించని కారణంగా ఢిల్లీ అంతర్జాతీయ విమానాశ్రయంలో విమానాల ల్యాండింగ్, టేకాఫ్ కష్టంగా మారింది. పలు విమానాలు చాలా ఆలస్యంగా నడుస్తున్నాయి. రైళ్ల ఆలస్యం సరేసరి. చలి, తీవ్ర కాలుష్యం కారణంగా చిన్నారులు, వృద్ధులు కళ్ల మంటలు, శ్వాస సంబంధ ఇబ్బందుల్ని ఎదుర్కొన్నారు. వాయు నాణ్యతా సూచీని గణించే ఢిల్లీలోని 38 మానిటరింగ్ స్టేషన్లలోనూ పరిస్థితి ఇంకా రెడ్‌జోన్‌లోనే కొనసాగుతోంది. ఆదివారం ఢిల్లీలో వాయునాణ్యత మరీ దారుణంగా పడిపోయి 'సివియర్ ప్లస్'గా రికార్డవడం తెల్సిందే. దీంతో సోమవారం నుంచి గ్రేప్–4ను అమల్లోకి తెచ్చారు. ప్రతి ఏటా చలికాలంలో ఉష్ణోగ్రతలు తగ్గి కాలుష్యవాయు గాఢత అలాగే కొనసాగుతుండటంతో ఢిల్లీ వాసుల వాయుకష్టాలు పెరుగుతుండటంతో 2017 ఏడాది నుంచి ఈ గ్రేప్ నిబంధనలను అమలుచేస్తున్నారు.

వాతావరణ సాధకుల్లో
తగ్గిన భారత ర్యాంక్

బాకు(అజర్‌బైజాన్): వాతావరణ మార్పులపై పోరులో భారత్ ర్యాంక్ కాస్తంత తగ్గింది. కాలుష్య నివారణ చర్యలు, కాలుష్య ఉద్గారాల కట్టడి వంటి కార్యక్రమాలతో భారత్ తన వంతు కృషిచేస్తున్నాసరే గతంతో పోలిస్తే భారత ర్యాంక్ రెండు స్థానాలు దిగజారడం గమనార్హం. 60 దేశాల ఈ జాబితాలో భారత్ ఈ ఏడాది 10వ ర్యాంక్ సాధించింది. ఆయా దేశాలు వాతావరణంలోకి విడుదల చేసే కర్బన ఉద్గారాలు, పునరుత్పాదక ఇంధన వినియోగం, పునర్వినియోగ విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం, వాతావరణ మార్పు కట్టడికి అవలంభిస్తున్న విధానాలను పరిగణనలోకి తీసుకుని ఈ ర్యాంక్‌లను ఇస్తారు. జర్మన్‌వాచ్, న్యూ క్లైమేట్ ఇన్‌స్టిట్యూట్, క్లైమేట్ యాక్షన్ నెట్‌వర్క్ ఇంటర్నేషనల్‌లు సంయుక్తంగా ఈ ర్యాంక్‌లను నిర్ణయిస్తాయి. అజర్‌బైజాన్‌లోని బాకు నగరంలో జరుగుతున్న కాన్ఫెరెన్స్ ఆఫ్ పార్టీస్(కాప్)29 సదస్సులో భాగంగా బుధవారంక్లైమేట్ ఛేంజ్ పర్ఫామెన్స్ ఇండెక్స్(సీసీపీఐ 2025) నివేదికను విడుదల చేశారు. అయితే తమ దేశంలో అద్భుతంగా కాలుష్యాన్ని కట్టడిచేసిన దేశాలకు కట్టబెట్టే తొలి మూడు ర్యాంక్‌లను ఎవరికీ ఇవ్వకపోవడం గమనార్హం. ఏ దేశం కూడా సీసీపీఐ ప్రమాణాలను అందుకోకపోవడమే ఇందుక కారణం. నెదర్లాండ్స్‌కు నాలుగో ర్యాంక్ దక్కింది. భారత్‌కు 10వ ర్యాంక్ వచ్చింది. ప్రపంచంలోనే అత్యధిక కర్బన ఉద్గారాలను వెదజల్లే సంపన్న దేశాలైన చైనా 55వ ర్యాంక్‌తో, అమెరికా 57వ ర్యాంక్‌తో అట్టడుగున నిలిచాయి. అర్జెంటీనా 59వ ర్యాంక్ సాధించగా ప్రపంచంలోనే అత్యధిక చమురు, గ్యాస్‌ను ఉత్పత్తి చేస్తున్న రష్యా 64వ ర్యాంక్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ 65వ ర్యాంక్, సౌదీ అరేబియా 66వ ర్యాంక్, ఇరాన్ 67వ ర్యాంక్ సాధించాయి. భూమిపై పెరుగుతున్న కర్బన ఉద్గారాలకు 63 దేశాలే ప్రధాన కారణమని సీసీపీఐ పేర్కొంది.

పొగడ్తలు, చీవాట్లు

''ప్రపంచంలోనే అత్యధిక జనాభా గల దేశంగా ఉండటంతో భారత్‌లో తలసరి కర్బన ఉద్గారాల పరిమాణం తక్కువగా కనిపిస్తోంది. గత దశాబ్ద కాలంలో పునరుత్పాదక ఇంధన వినియోగం బాగా పెరిగింది. హరిత ఇంధనం వినియోగం పెంచేందుకు భారత్ కృషిచేస్తోంది' అని నివేదిక పొగిడింది. తలసరి కర్బన ఉద్గారాల విషయంలో ప్రపంచ సగటు 6.6 టన్నుల కార్బన్‌డయాక్సైడ్‌తో సమానంగా ఉంది. భారత్‌లో మాత్రం ఇది 2.9 టన్నుల కార్బన్ డయాక్సైడ్(టీసీఓ2ఈ)గా ఉంది. ''ఎంత స్థాయిలో కర్బన ఉద్గారాలు వెదజల్లితే అంతేస్థాయిలో శోషించుకునేలా 2070కల్లా కర్బన తటస్థత (నెట్ జీరో) సాధిస్తానని, 2030కల్లా 500 గిగావాట్ల పునరుత్పాదక విద్యుత్ సామర్థ్యాన్ని సాధిస్తానని భారత్ పెద్దపెద్ద లక్ష్యాలే నిర్దేశించుకుందిగానీ ఆచరణ ఆ స్థాయిలో లేదు. విద్యుత్ వాహనాలు ముఖ్యంగా ద్విచక్ర విద్యుత్ వాహనాలను ప్రోత్సహిస్తూ భారత్ దూసుకు పోతోంది. కానీ ఇప్పటికీ భారత్ విద్యుత్ ఉత్పత్తి కోసం అత్యధికంగా బొగ్గుపైనే ఆధారపడుతోంది. బొగ్గు వనరులను అధికంగా సమకూర్చుకుంటున్న తొలి 10 దేశాల్లో భారత్ కూడా ఉంది. ఇంకా బొగ్గు ఆధారిత విద్యుత్ ఉత్పత్తిని మరింత పెంచుకోవాలని చూస్తోంది'' అని భారత్‌పై సీసీఐపీ ఆగ్రహం వ్యక్తంచేసింది.

హామీలను నిలబెట్టుకోవాలి: భారత్

అభివృద్ధి చెందుతున్న దేశాలకు వాతావరణ మార్పుల నిరోధక నిధులు ఇస్తామని గతంలో ఇచ్చిన హామీలను సంపన్న దేశాలు నిలబెట్టుకోవాలని భారత్ కోరింది. కాప్29 సదస్సు సందర్భంగా జరిగిన అత్యున్నత స్థాయి మంత్రుల చర్చా కార్యక్రమంలో భారత్ తరపున మహిళా సంధానకర్త రాజశ్రీ రాయ్ మాట్లాడారు. 'అనూహ్య వాతావరణ పరిస్థితుల కారణంగా పేద దేశాల్లో ప్రజలు బ్రతకడమే కష్టంగాఉంది. ఈ తరుణంలో తగు నిధుల మంజూరు అవశ్యమని కాప్28లో తీసుకున్న తీర్మానం చాటుతోంది. వర్ధమాన దేశాలకు అందే నిధులు రుణం రూపేణాకాకుండా గ్రాంట్‌లాగా అందాలి' అని రాయ్ డిమాండ్‌చేశారు.

5.8 కోట్ల రేషన్ కార్డుల తొలగింపు

సాక్షి, న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా సుమారు 5.8 కోట్ల రేషన్ కార్డులను ప్రజా పంపిణీ వ్యవస్థ నుంచి తొలగించినట్లు కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. డిజిటలైజేషన్, ఆధార్ సీడింగ్ కారణంగా రేషన్ కార్డుల డూప్లికేషన్, డి–డూప్లికేషన్‌లను గుర్తించి పీడీఎస్ నుంచి తొలగించారు. దేశంలో సమర్థవంతమైన, పారదర్శకమైన ప్రజా పంపిణీ వ్యవస్థకు తాము కట్టుబడి ఉన్నామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. అందులో భాగంగా రేషన్ కార్డుల డిజిటలైజేషన్ ప్రక్రియ కొనసాగిస్తున్నామని, ఇప్పటిదాకా 80.6 కోట్ల లబ్ధిదారులకు చెందిన 20.4 కోట్ల రేషన్ కార్డుల డిజిటలైజేషన్ పూర్తయిందని తెలిపింది.

ఒక్కో బందీకి రూ.42 కోట్లు!

- గాజా వాసులకు నెతన్యాహు ఆఫర్
- యుద్ధక్షేత్రంలో పర్యటించిన ప్రధాని
- హమాస్ కథ ముగిసిందని ప్రకటన



జెరూసలేం: ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు గాజా వాసులకు బంపర్ ఆఫరిచ్చారు. హమాస్ వద్ద బందీలుగా ఉన్న ఇజ్రాయెలీలను విడిపించి తీసుకొస్తే ఒక్కో బందీకి ఏకంగా రూ.42 కోట్ల (50 లక్షల డాలర్ల) చొప్పున ఇస్తామని ప్రకటించారు. ఇజ్రాయెల్ సైన్యం కార్యకలాపాలను ప్రత్యక్షంగా పరిశీలించేందుకు రక్షణ మంత్రి, ఆర్మీ చీఫ్‌తో కలిసి ఆయన గాజాలో పర్యటిస్తున్నారు. యుద్ధ దుస్తులు, బాలిస్టిక్ హెల్మెట్‌తో ఉన్న నెతన్యాహు గాజా సముద్రతీర ప్రాంతంలో ఓ వీడియోను రికార్డ్ చేశారు. హమాస్ వద్ద కనీసం మరో 101 మంది ఇజ్రాయెలీలు బందీలుగా ఉన్నట్టు సమాచారం. వారిని విడిపించే ప్రయత్నాలను మరింత ముమ్మరంగా కొనసాగిస్తామని నెతన్యాహు స్పష్టం చేశారు. వారినెలాగైనా సురక్షితంగా విడిపిస్తామన్నారు. ''గాజా కల్లోలం నుంచి బయటపడాలనుకునే స్థానికులకు నేను చెప్పేదొక్కటే. మా బందీలను తీసుకురండి. మీ కుటుంబంతో సహా సురక్షితంగా గాజా నుంచి బయట పడొచ్చు. పైగా భారీ నగదు బహుమానమూ అందుతుంది'' అని చెప్పారు. ''హమాస్ సైనిక సామర్థ్యాలను సమూలంగా నాశనం చేశాం. యుద్ధం ముగిసినా పాలస్తీనాను అదిక ఎప్పటికీ పాలించలేదు'' అని స్పష్టం చేశారు. హమాస్‌ను పూర్తిగా నిర్మూలిస్తామని మరోసారి శపథం చేశారు. హమాస్ మిలిటెంట్లు 2023 అక్టోబర్ 7న ఇజ్రాయెల్‌పై మెరుపు దాడి చేసి 1,200 మందికి పైగా పౌరులను పొట్టన పెట్టుకోవడం తెలిసిందే. 250 మందికి పైగా ఇజ్రాయెలీలను బందీలుగా పట్టుకెళ్లారు. వారిని విడిపించేందుకు ఇజ్రాయెల్, హమాస్ మధ్య చర్చలు కొద్ది నెలలుగా నిలిచిపోయాయి.

విద్యా మంత్రిగా లిండా

- వాణిజ్య మంత్రిగా లుట్నిక్
- సీఎంఎస్ చీఫ్‌గా మెహ్మెట్
- ముగ్గురిదీ వివాదాస్పద నేపథ్యమే



వాషింగ్టన్: అమెరికా కాబోయే అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరిన్ని నియామకాలు చేపట్టారు. వరల్డ్ రెజ్లింగ్ ఎంటర్టైన్మెంట్ (డబ్ల్యూడబ్ల్యూఈ) సహ వ్యవస్థాపకురాలు లిండా మెక్‌మహన్‌ను విద్యా మంత్రిగా నియమించారు. వాణిజ్య మంత్రిగా కాంటార్ ఫిట్జ్‌గెరాల్డ్ సీఈఓ లుట్నిక్‌ను ఎంచుకున్నారు. కీలకమైన సెంటర్స్ ఫర్ మెడికేర్ అండ్ మెడిఎయిడ్ సర్వీసెస్ (సీఎంఎస్) అడ్మినిస్ట్రేటర్‌గా ప్రముఖ హృద్రోగ నిపుణుడు, టీవీ హోస్ట్ డాక్టర్ మెహ్మెట్ ఊజ్‌ను నియమించారు. ఇప్పటిదాకా ట్రంప్ చేపట్టిన ఇతర నియామకాల మాదిరిగానే ఈ ముగ్గురిది కూడా వివాదాస్పద నేపథ్యమే కావడం విశేషం.

ట్రంప్‌కు లిండా చిరకాల నేస్తం. ట్రంప్ తొలి హయాంలో స్మాల్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్‌కు సారథిగా ఉన్నారు. ఈసారి ట్రంప్ ఎన్నికల ప్రచారానికి 6 మిలియన్ డాలర్లకు పైగా విరాళాలు సేకరించారు. దశాబ్దాల నాయకత్వ అనుభవం, విద్య, వ్యాపారాల్లో లోతైన అవగాహనను విద్యార్థులు, కార్మికులను శక్తిమంతులను చేయడానికి ఉపయోగిస్తారని ట్రంప్ విశ్వాసం వెలిబుచ్చారు. విద్యా శాఖపై ప్రచార సమయంలో ట్రంప్ విమర్శలు గుప్పించడం, దాన్ని మూసేస్తానని చెప్పడం తెలిసిందే. వృథా అరికట్టే విభాగానికి సారథిగా నియమితుడైన ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ కూడా విద్యా శాఖ అనవసరమని అభిప్రాయపడ్డారు. తదనుగుణంగానే విద్య శాఖను రాష్ట్రాల చేతుల్లో పెట్టే ప్రయత్నానికి మెక్‌మహన్ సారథ్యం వహిస్తారని ట్రంప్ ప్రకటించారు.

మెక్‌మహన్ తన భర్తతో కలిసి 1980లో రెజ్లింగ్ లీగ్ స్థాపించారు. రెజ్లింగ్‌ను ఎంతగానో ఇష్టపడే ట్రంప్‌తో నాటినుంచే సాన్నిహిత్యం పెరిగింది. సెనేట్‌కు పోటీ చేసేందుకు 2009లో డబ్ల్యూడబ్ల్యూఈ సీఈఓ పదవికి రాజీనామా చేశారు. కనెక్టికట్ రాష్ట్ర విద్యా బోర్డులో సేవలందించారు. ట్రంప్ అనుకూల థింక్ ట్యాంక్ 'అమెరికా ఫస్ట్' పాలసీ ఇనిస్టిట్యూట్‌కు నాలుగేళ్లుగా చైర్‌పర్సన్‌గా ఉన్నారు. తల్లిదండ్రుల హక్కుల కోసం పోరాడుతున్నారు. 2012లో డబ్ల్యూడబ్ల్యూఈ రింగ్ సైడ్ అనౌన్సర్ మృతి కేసులో ఆమెపై అభియోగాలున్నాయి.

వాణిజ్యమంత్రిగా లుట్నిక్ ఎంపికను చైనాపై ట్రంప్ కఠిన వైఖరిలో భాగంగా చూస్తున్నారు. అన్ని దిగుమతులపై సుంకాలు పెంచుతామని ప్రచారంలో ట్రంప్ హామీ ఇవ్వడం తెలిసిందే. చైనా వస్తువులపై 60 శాతం, అన్ని దిగుమతులపై 10 శాతం పన్నులకు లుట్నిక్ ఇటీవల మద్దతు ప్రకటించారు.

లుట్నిక్ నియామకానికి ఆరోగ్య మంత్రిగా నియమితుడైన రాబర్ట్ ఎఫ్ కెనెడీ జూనియర్, మస్క్ తదితరులు మద్దతిచ్చారు. అమెరికా ఉత్పాదక ఉద్యోగాలను చైనా తన్నుకుపోయిందని లుట్నిక్ గతంలో పలుమార్లు చెప్పారు. అమెరికాలో ఫెంటానిల్‌కు డ్రగ్ మహమ్మారికి చైనాయే కారణమని, అమెరికాపై తీవ్రంగా దాడి చేస్తోందని మండిపడ్డారు. కాంటార్ ఫిట్జ్‌గెరాల్డ్‌తో పాటు లుట్నిక్ ఫైనాన్షియల్ టెక్నాలజీ సంస్థ బీజీసీ గ్రూప్, రియల్ ఎస్టేట్ సేవల సంస్థ న్యూమార్క్ గ్రూపులకు లుట్నిక్ అధిపతి. లుట్నిక్ సంస్థల ప్రధాన కార్యాలయం వరల్డ్ ట్రేడ్ సెంటర్‌లోనే ఉంది. 2001 సెప్టెంబర్ 11న దానిపై జరిగిన ఉగ్ర దాడిలో లుట్నిక్ సోదరుడితో సహా వందలాది మంది సంస్థ ఉద్యోగులు మరణించారు. బరువు తగ్గించే ఔషధాలు, 'మిరకల్' క్యూర్ వంటి విషయాల్లో తప్పుడు సలహాలిచ్చారని మెహ్మెట్ ఆరోపణలు ఎదుర్కొన్నారు. కరోనాకు మలేరియా మందులు వాడితే చాలని చెప్పి విమర్శలపాలయ్యారు.

బిట్‌కాయిన్ కేసులో
గౌరవ్ మెహతాకు సీబీఐ సమన్లు

న్యూఢిల్లీ/ముంబై: అధిక లాభాలు ఆశజూపి అమాయక ప్రజల నుంచి పెట్టుబడులుగా దాదాపు రూ.6,600 కోట్లు వసూలుచేసిన గెయిన్ బిట్‌కాయిన్ పోంజీ స్కామ్ ఉదంతంలో ఆడిట్ కంపెనీ ఉద్యోగి అయిన గౌరవ్ మెహతాపై కేంద్ర దర్యాప్తు సంస్థలు దృష్టి సారించాయి. మహారాష్ట్ర ఎన్నికల ప్రచారం కోసం బిట్‌కాయిన్లను నగదుగా మార్చుకున్నారంటూ మహారాష్ట్ర కాంగ్రెస్ చీఫ్ నానా పటోలే, ఎన్సీపీ(ఎస్పీ) నాయకురాలు సుప్రియాసూలే ఛాటింగ్ ఉదంతంలో మెహతా పేరు ప్రధానంగా ప్రస్తావనకు రావడంతో మెహతాకు సీబీఐ బుధవారం సమన్లు జారీచేసింది. పోంజీ స్కామ్‌ను మనీలాండరింగ్ కోణంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ సైతం దర్యాప్తు చేయడం తెల్సిందే. బుధవారం ఈడీ అధికారులు ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్‌లో మెహతాను ఆయన నివాసంలోనే విచారించి కొన్ని కంప్యూటర్లు, డిజిటల్ ఉపకరణాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా మెహతా వాంగ్మూలాన్ని నమోదుచేశారు. ఇది జరిగిన కొద్దిసేపటికే మెహతాకు సీబీఐ సమన్లు జారీచేసింది. వీలైనంత త్వరగా తమ ఎదుట హాజరుకావాలని సూచించింది. ఈ పోంజీ స్కామ్‌లో గతంలో బాలీవుడ్ నటి శిల్పాశెట్టి భర్త, వ్యాపారి రాజ్‌కుంద్రాకు చెందిన రూ.98 కోట్ల విలువైన ఆస్తులను ఈడీ ఏప్రిల్‌లో అటాచ్‌చేయడం తెల్సిందే.

రూ.1,000 కోట్ల పెయింటింగ్!

రెన్ మార్గిట్ కళాఖండానికి రికార్డు ధర



బెల్జియం సర్రియలిస్ట్ ఆర్టిస్టు రెన్ మార్గిట్ చేతినుంచి జాలువారిన ఈ ప్రఖ్యాత పెయింటింగ్ వేలం రికార్డులను బద్దలు కొట్టింది. న్యూయార్క్‌లో క్రిస్టీస్ నిర్వహించిన తాజా వేలంలో ఏకంగా రూ.1,021 కోట్లు (12.1 కోట్ల డాలర్లు) పలికి సంచలనం సృష్టించింది. అధివాస్తవికతను చిత్రించే పెయింటింగుల్లో అత్యధిక ధర పలికిన రికార్డును సొంతం చేసుకుంది. దీనికి 9.5 కోట్ల డాలర్ల దాకా పలకవచ్చని నిర్వాహకులు అంచనా వేస్తే వాటిని కూడా అధిగమించేసింది!

1954కు చెందిన ఈ పెయింటింగ్ అధివాస్తవికతకు సంబంధించి అత్యుత్తమ వ్యక్తీకరణగా విమర్శకుల ప్రశంసలు పొందింది. మార్గిట్ వేసిన 27 ప్రఖ్యాత పెయింటింగ్‌ల కలెక్షన్ 'ద ఎంపైర్ ఆఫ్ లైట్'లో దీన్ని మణిపూసగా చెబుతారు. వీధి దీపపు వెలుగుల్లో ఇల్లు, దీపంతో సహా నీటిలో దాని ప్రతిబింబం, ముందూ వెనకా చెట్లు, పైన నీలాకాశం, తెల్లని మబ్బులతో చూసేందుకు సాదాసీదాగా కన్పించే ఈ పెయింటింగ్ వాస్తవానికి అత్యున్నత స్థాయి మార్మికతకు అద్దం పడుతుందని కళాప్రియులు చెబుతారు. మార్గిట్ వేసిన మరో రెండు పెయింటింగులు కూడా కోటి, 37 లక్షల డాలర్ల చొప్పున అమ్ముడయ్యాయి.

– సాక్షి, నేషనల్ డెస్క్

అమెరికా పార్లమెంట్‌లో
బాత్‌రూమ్ గొడవ

- ట్రాన్స్‌జెండర్ డెమొక్రటిక్ నేతను మహిళల బాత్‌రూమ్‌లోకి అనుమతించబోమన్న రిపబ్లికన్లు
- సారా మెక్‌బ్రైడ్‌ను అడ్డుకునేందుకు బిల్లు తెచ్చిన ట్రంప్ వర్గం
- తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేసిన డెమొక్రటిక్ నేతలు

వాషింగ్టన్: అమెరికా పార్లమెంట్ చరిత్రలో తొలిసారిగా ప్రతినిధుల సభకు ఎన్నికై చరిత్ర సృష్టించిన డెమొక్రటిక్ నేత, ట్రాన్స్‌జెండర్ సారా మెక్‌బ్రైడ్‌పై అధికార రిపబ్లికన్ పార్టీ సభ్యులు కారాలుమిరియాలు నూరుతున్నారు. ఇన్నాళ్లూ పబ్లిక్ టాయిలెట్లు, పాఠశాలల్లో ట్రాన్స్‌జెండర్లు ఏ బాత్‌రూమ్ వాడాలన్న దానిపై మొదలైన చర్చ ఇప్పుడు పార్లమెంట్‌లోనూ జరగబోతోంది. అయితే పార్లమెంట్ ఇరుసభలైన ప్రతినిధుల సభ, సెనేట్‌లో రిపబ్లికన్లదే ఆధిపత్యంకావడంతో వారు ప్రతిపాదించే బిల్లు ఆమోదం పొందే అవకాశాలే ఎక్కువ. అయితే వ్యక్తి గౌరవాన్ని భంగపరుస్తూ ఏకైక ట్రాన్స్‌జెండర్ చట్టసభ మెంబర్‌పై రిపబ్లికన్ సభ్యులంతా ఏకమై విరుచుకుపడతారా? అని డెమొక్రాట్లు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. అధ్యక్ష ఎన్నికలతోపాటు సెనేట్, ప్రతినిధుల సభకూ ఎన్నికలు జరిగాయి. ప్రతినిధుల సభ ఎన్నికల్లో భాగంగా డెలావర్‌లోని ఎట్ లార్జ్ హౌస్ డిస్ట్రిక్ట్ నుంచి రిపబ్లికన్ అభ్యర్థిపై 72వేలకుపైగా మెజారిటీతో గెలిచి అమెరికా కాంగ్రెస్‌కు ఎన్నికైన తొలి ట్రాన్స్‌జెండర్‌గా 34 ఏళ్ల సారా రికార్డుసృష్టించడం తెల్సిందే. అయితే పురుషునిగా జన్మించి ట్రాన్స్‌జెండర్‌గా మారినంతమాత్రాన సారాను మహిళల బాత్‌రూమ్‌లోకి అనుమతించబోమని రిపబ్లికన్ నాయకురాలు, సౌత్ కరోలినా ఫస్ట్ కాంగ్రెషనల్ డిస్ట్రిక్ట్ నుంచి ప్రతినిధుల సభకు ఎన్నికైన నాన్సీ మేస్ కరాఖండీగా చెప్పారు. ఈ మేరకు సారాను అడ్డుకోవాలంటూ హౌస్ ఆఫ్ రెప్రజెంటేటివ్స్‌లో ఆమె బిల్లు ప్రవేశపెట్టారు. ''సారాకు వ్యతిరేకంగా మేం ఇంత మాట్లాడుతున్నా సారా నుంచి స్పందన లేదు. అంటే తను పురుషుడు అని ఒప్పుకున్నట్లే. మేం సారాను మహిళల బాత్రూమ్, స్పేస్, లాక్ రూమ్, చేంజింగ్ రూమ్‌లకు అనుమతించబోం. ఈ మేరకు పార్లమెంట్ ప్రోటోకాల్ అధికారులు తగు చర్యలు తీసుకోవాలి''అని నాన్సీ మేస్ డిమాండ్‌చేశారు. ఈ ఉదంతంపై సారా స్పందించారు. అమెరికా ఎదుర్కొంటున్న సమస్యల నుంచి దృష్టి మరల్చేందుకే రిపబ్లికన్లు నన్ను లక్ష్యంగా చేసుకున్నారు. ప్రతి ఒక్క అమెరికన్‌కు తనకు నచ్చినట్లు జీవించే హక్కుంది. ఈ హక్కును గౌరవిస్తూ, పార్లమెంట్ సభ్యులు సభలో నాకు మద్దతు పలుకుతారని ఆశిస్తున్నా'అని సారా 'ఎక్స్'లో ఒక పోస్ట్‌చేశారు. జన్మతః పురుషుడైన సారా తన 21 ఏళ్ల వయసులో అమ్మాయిగా మారాడు.

ఢిల్లీలో కాలుష్యం బారిన మూడొంతుల కుటుంబాలు

న్యూఢిల్లీ: ఢిల్లీ–ఎన్‌సీఆర్ పరిధిలోని 75 శాతం కుటుంబాలు కాలుష్య సంబంధ సమస్యలను ఎదుర్కొంటున్నాయని తాజాగా చేపట్టిన ఒక సర్వేలో వెల్లడైంది. ఆ కుటుంబాల్లో కనీసం ఒకరు గొంతు, దగ్గు ఇతరత్రా కాలుష్య సంబంధ అనారోగ్యం బారిన పడుతున్నారని ఆ సర్వే పేర్కొంది. 'లోకల్‌సర్కిల్స్'సంస్థ చేపట్టిన సర్వే వివరాలు తాజాగా విడుదలయ్యాయి. వాయు కాలుష్యం పెరగడంతో తరచూ తలనొప్పి వస్తోందని 58 శాతం కుటుంబాలు తెలిపాయి. శ్వాస తీసుకోవడం ఇబ్బందిగా మారిందని, ఆస్థమాతో బాధపడుతున్నామని 50 శాతం కుటుంబాలు చెప్పాయి. ఢిల్లీ, గురుగ్రామ్, నోయిడా, ఫరీదాబాద్, ఘజియాబాద్‌లోని వేలాది కుటుంబాల నుంచి వివరాలు సేకరించారు. కాలుష్య కట్టడికి ఎయిర్ ప్యూరిఫయర్లను వాడుతున్నామని 27 శాతం కుటుంబాలు తెలిపాయి. తాము ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవట్లేదని 23 శాతం కుటుంబాలు వెల్లడించాయి. తమ కుటుంబాల్లో కనీసం ఒకరు వాయుకాలుష్య కారక వ్యాధుల బారిన పడుతున్నారని నవంబర్ ఒకటో తేదీన 69 శాతం కుటుంబాలు చెప్పగా నవంబర్ 19నాటికి ఈ సంఖ్యం 75 శాతానికి పెరిగింది.

సుప్రీంకోర్టు భవన రూపశిల్పి ఎవరు?

ప్రభుత్వాంగాల్లో న్యాయశాఖకు అత్యంత ప్రాముఖ్యం ఉంటుంది. న్యాయశాఖ సామర్థ్యం కంటే ప్రజాస్వామ్యానికి మరో గీటురాయి లేదని 'లార్డ్ బ్రైస్' అనే రాజనీతి విశ్లేషకుడు వ్యాఖ్యానించారు. ఈస్ట్ ఇండియా పరిపాలనా కాలంలో 1773లో రూపొందించిన రెగ్యులేటింగ్ చట్టం ద్వారా కలకత్తాలోని ఫోర్టు విలియమ్స్‌లో 1774లో మొదటిసారిగా సుప్రీంకోర్టును స్థాపించారు. భారతదేశంలో న్యాయ వ్యవస్థ అభివృద్ధిలో కార్న్‌వాలీస్ ప్రధాన పాత్ర పోషించాడు. అందువల్ల ఇతడిని 'భారత న్యాయ వ్యవస్థ పితామహుడు' అంటారు.



సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
పాలిటీ

భారత న్యాయ వ్యవస్థ - సుప్రీంకోర్టు

భారత రాజ్యాంగం అయిదో భాగంలో ప్రకరణ 124 నుంచి 147 వరకు సుప్రీంకోర్టు నిర్మాణం, అధికారం, విధుల గురించి పేర్కొన్నారు. భారత ప్రభుత్వ చట్టం-1935 ద్వారా ఫెడరల్ కోర్టును అత్యున్నత న్యాయస్థానంగా ఏర్పాటు చేశారు. భారత రాజ్యాంగం ద్వారా 1950 జనవరి 28న సుప్రీంకోర్టు అమల్లోకి వచ్చింది. సుప్రీంకోర్టు అమల్లోకి వచ్చిన తర్వాత అంతకుముందున్న ప్రివి కౌన్సిల్ (ఇంగ్లండ్‌లో ఉండేది) రద్దయింది. ఇది అత్యున్నత న్యాయస్థానంగా పనిచేసేది.

'Whence Law, Thence Victory' (ధర్మమే జయిస్తుంది) అనేది సుప్రీంకోర్టు మోటో (Moto). సుప్రీంకోర్టు భవన రూపశిల్పి 'గణేష్ బికాజీ డియోల్కర్'.

భారత న్యాయ వ్యవస్థ-లక్షణాలు: భారత న్యాయ వ్యవస్థ ఏకీకృత, సమగ్ర, స్వతంత్ర ప్రతిపత్తి ఉన్న సర్వోన్నత న్యాయ వ్యవస్థ. సాధారణంగా సమాఖ్య ప్రభుత్వాల్లో ద్వంద్వ న్యాయ వ్యవస్థ ఉంటుంది. అంటే కేంద్ర, రాష్ట్ర వ్యవస్థలకు వేర్వేరుగా న్యాయ శాఖలుంటాయి. కానీ భారతదేశంలో న్యాయశాఖ విభజన లేదు. దేశంలోని న్యాయస్థానాలన్నీ సుప్రీంకోర్టు పర్యవేక్షణలో పనిచేస్తాయి.

నిర్మాణం

ప్రకరణ 124(1) ప్రకారం సుప్రీంకోర్టులో ఒక ప్రధాన న్యాయమూర్తి, పార్లమెంట్ నిర్ణయించిన సంఖ్యలో ఇతర న్యాయమూర్తులు ఉంటారు. 2009 ఫిబ్రవరిలో సుప్రీంకోర్టు జడ్జీల సంఖ్యను పెంచారు. ప్రస్తుతం ఒక ప్రధాన న్యాయమూర్తి, 33 ఇతర సాధారణ న్యాయమూర్తులు ఉన్నారు.

ప్రారంభంలో ఒక ప్రధాన న్యాయమూర్తి, ఏడుగురు సాధారణ న్యాయమూర్తులు ఉండేవారు. వీరి సంఖ్యను..

- 1956లో 11కు
- 1960లో 14కు
- 1977లో 18కి
- 1986లో 26కు
- 2008లో 31కి పెంచారు. ఈ సవరణ 2009 ఫిబ్రవరి నుంచి అమల్లోకి వచ్చింది. ప్రస్తుతం మొత్తం 34 మంది ఉన్నారు.

న్యాయమూర్తుల నియామకం:

ప్రకరణ 124(2) ప్రకారం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, ఇతర న్యాయమూర్తులను రాష్ట్రపతి నియమిస్తారు. రాష్ట్రపతి అధికార ముద్రతో స్వయంగా సంతకం చేసిన ఆదేశం (By Warrant Under Hand and Seal) ద్వారా వీరు నియమితులవుతారు.

ప్రధాన న్యాయమూర్తి నియామకం:

రాజ్యాంగంలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి ప్రత్యేక అర్హతలను పేర్కొనలేదు. సాధారణంగా సీనియర్ న్యాయమూర్తిని నియమిస్తారు. 1950 నుంచి 1973 వరకు ఇదే నియమాన్ని పాటించారు. కానీ, 1973లో కేశవానంద భారతి కేసు తర్వాత ముగ్గురు సీనియర్ న్యాయమూర్తులను (జె.ఎం.షలాత్, ఎ.ఎన్. గ్రోవర్, కె.ఎస్.హెగ్డే) కాదని, జూనియర్ అయిన ఎస్.ఎన్.రేను ప్రధాన న్యాయమూర్తిగా నియమించారు. అదేవిధంగా 1977లోనూ సీనియర్ న్యాయమూర్తి అయిన హెచ్.ఆర్.ఖన్నాను కాదని ఎం.హెచ్. బేగ్‌ను ప్రధాన న్యాయమూర్తిగా నియమించారు.

తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి:

ప్రకరణ 126 ప్రకారం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి పదవిలో ఖాళీ ఏర్పడినా లేదా అనివార్య కారణాల వల్ల విధులను నిర్వర్తించలేని సందర్భంలో.. రాష్ట్రపతి తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిని నియమిస్తారు.

తాత్కాలిక న్యాయమూర్తులు (Ad hoc judges):

ప్రకరణ 127 ప్రకారం సుప్రీంకోర్టు న్యాయమూర్తుల్లో 'కోరమ్' లేనప్పుడు, రాష్ట్రపతి పూర్వానుమతితో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని, కొంతమంది తాత్కాలిక న్యాయమూర్తులను నియమించవచ్చు. తాత్కాలిక న్యాయమూర్తిగా నియమితులయ్యే వ్యక్తికి, సుప్రీంకోర్టు న్యాయమూర్తి నియామకానికి సంబంధించిన అన్ని అర్హతలు ఉండాలి.

ప్రకరణ 128 ప్రకారం, సుప్రీంకోర్టులో కేసులు అధికంగా ఉన్నప్పుడు పదవీ విరమణ చేసిన జడ్జీలను కూడా పదవిలో కొనసాగమని రాష్ట్రపతి అనుమతితో ప్రధాన న్యాయమూర్తి కోరవచ్చు.

జడ్జీల నియామకం-వివాదం-కొలీజియం

సుప్రీంకోర్టు జడ్జీల నియామక విషయంలో రాష్ట్రపతి ప్రధాన న్యాయమూర్తిని సంప్రదించే విషయంపై సుప్రీంకోర్టు విభిన్న అభిప్రాయాలను వ్యక్తీకరించింది. 1982లో మొదటి జడ్జీ కేసులో తీర్పు చెబుతూ 'సంప్రదించడం అంటే సాధారణంగా అభిప్రాయాలు తెలుసుకోవడమే, వాటిని పరిగణనలోకి తీసుకోవచ్చు, తీసుకోకపోవచ్చు' అని స్పష్టం చేసింది. రెండో జడ్జీ నియామకం సందర్భంగా 1993 కేసులో 'సంప్రదింపు అంటే సమ్మతి (Concurrence)' అనే అర్థాన్ని చెప్పారు. అదేవిధంగా 1998లో 3వ జడ్జీ నియామకం కేసులో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సలహాతో పాటు, నలుగురు సీనియర్ న్యాయమూర్తులను (కొలీజియం) కూడా సంప్రదించాలని పేర్కొంది. ఈ నలుగురు జడ్జీల్లో ఇద్దరు భిన్నాభిప్రాయాలు వ్యక్తీకరిస్తే, కొలీజియం సలహాను రాష్ట్రపతికి పంపాల్సిన అవసరం లేదు.

లోపాలు: అధికార పృథక్కరణ సూత్రం ప్రకారం ప్రభుత్వ అంగాలైన శాసన, కార్య నిర్వాహక, న్యాయ శాఖలు తమకు నిర్దేశించిన విధులను మాత్రమే నిర్వర్తించాలి. ఒకరి విధుల్లో మరొకరు జోక్యం చేసుకోకూడదు. అలా జరిగితే ప్రజల హక్కులకు భంగం కలగడంతో పాటు నియంతృత్వానికి దారితీస్తుందని ప్రఖ్యాత ఫ్రెంచి రాజనీతి తత్వవేత్త 'మాంటెస్క్యూ' పేర్కొన్నాడు. నియామకాలు కార్య నిర్వాహక పరిధిలోకి వస్తాయి. ఇందులో న్యాయస్థానాల జోక్యం సాధారణంగా అనుమతించరు. రాజ్యాంగంలోని కొలీజియం విధానం సుప్రీంకోర్టు సృష్టించిన వివాదాస్పద అంశం. న్యాయమూర్తులే న్యాయమూర్తులను నియమించడం సమంజసం కాదు. ఇది వృత్తిపరమైన సౌభ్రాతృత్వానికి (Professional Fraternity)కి దారితీస్తుంది. పారదర్శకత, జవాబుదారీతనానికి విఘాతం వాటిల్లుతుంది.

ప్రత్యేక వివరణ: ప్రస్తుతం పై పద్ధతిలో మార్పు తీసుకు వస్తూ 'జాతీయ న్యాయ నియామకాల కమిషన్'ను ఏర్పాటు చేస్తూ 99వ రాజ్యాంగ సవరణ బిల్లును 2014లో ఆమోదించారు.

జాతీయ న్యాయ నియామకాల కమిషన్ - రాజ్యాంగ సవరణ: కొలీజియం వ్యవస్థలో ఉన్న లోపాలను సరిదిద్దడానికి, న్యాయమూర్తుల నియామకం, బదిలీ, క్రమశిక్షణ చర్యలు, ఖాళీల గుర్తింపు మొదలైన అన్ని విషయాల్లో మరింత పారదర్శకంగా ఉండేందుకు, పౌర సమాజానికి భాగస్వామ్యం కల్పిస్తూ కొత్త పద్ధతిని ఈ సవరణ ద్వారా ప్రతిపాదించారు.

జాతీయ న్యాయమూర్తుల నియామక కమిషన్ (నేషనల్ జుడీషియల్ అపాయింట్‌మెంట్స్ కమిషన్-ఎన్.జె.ఎ.సి.) బిల్లు-2014ను ఆగస్టు 13న లోక్‌సభ, ఆ మరుసటి రోజునే రాజ్యసభ ఆమోదించింది. సగానికి తక్కువ కాకుండా రాష్ట్ర శాసనసభలు ఈ బిల్లును ఆమోదించాయి. ఈ కమిషన్‌కు రాజ్యాంగ ప్రతిపత్తి కల్పించడానికి 99వ రాజ్యాంగ సవరణ చేశారు. ఇది రాజ్యాంగబద్ధ సంస్థ.

కమిషన్ - నిర్మాణం - ప్రకరణ 124ఎ

జాతీయ న్యాయమూర్తుల నియామక కమిషన్ (ఎన్.జె.ఎ.సి)లో మొత్తం ఆరుగురు సభ్యులు ఉంటారు.

- కమిషన్‌కు ఛైర్మన్‌గా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి వ్యవహరిస్తారు.
- సుప్రీంకోర్టులోని ఇద్దరు సీనియర్ న్యాయమూర్తులు సభ్యులుగా ఉంటారు.
- మరో సభ్యుడు కేంద్ర న్యాయశాఖ మంత్రి.
- ఇద్దరు ప్రముఖులు పౌర సమాజం నుంచి ప్రాతినిధ్యం వహిస్తారు. వీరిలో ఒకరు ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, అల్ప సంఖ్యాక వర్గానికి చెందిన వారై ఉండాలి. లేకపోతే మహిళ ఉండాలి. ఈ ఇద్దరు సభ్యులను ప్రధాన మంత్రి అధ్యక్షతన ఉన్న కమిటీ ఎంపిక చేస్తుంది. ప్రధాని అధ్యక్షతన ఉన్న ఈ కమిటీలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు సభ్యులుగా ఉంటారు. పౌర సమాజం నుంచి ఎన్నికైన ప్రముఖుల పదవీకాలం మూడేళ్లు. వీరిని ఒకసారి మాత్రమే నియమించాలి. పునర్ నియామకానికి అర్హులు కారు.

ఎన్.జె.ఎ.సి. - విధులు (ప్రకరణ 124బి)

- సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, ఇతరన్యాయమూర్తులు, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, ఇతర న్యాయమూర్తుల నియామకానికి కమిషన్ సిఫార్సులు చేస్తుంది.
- హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, ఇతర న్యాయమూర్తుల బదిలీల్లో చొరవ తీసుకుంటుంది.
- ఉన్నత న్యాయస్థానాల్లో న్యాయమూర్తుల ఖాళీలను గుర్తించి ప్రభుత్వానికి తెలియజేస్తుంది.

సుప్రీంకోర్టు న్యాయమూర్తుల నియామక పద్ధతి

- సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా అపార అనుభవం ఉన్న సీనియర్ న్యాయమూర్తినే నియమిస్తారు.
- ప్రకరణ 124 బి ప్రకారం సమర్థత, ప్రతిభ ఉన్నవారినే ఇతర న్యాయమూర్తులుగా నియమించాలి.
- కమిషన్‌లోని ఏ ఇద్దరు సభ్యులు అంగీకరించకపోయినా, అలాంటి వారిని న్యాయమూర్తిగా నియమించేందుకు వీలులేదు.

హైకోర్టు న్యాయమూర్తుల నియామకం

- ప్రధాన న్యాయమూర్తిగా నియమించడానికి సీనియార్టీతో పాటు, సమర్థత, ప్రతిభ పరిగణనలోకి తీసుకుంటారు.
- హైకోర్టు ఇతర న్యాయమూర్తులను 217(2) ప్రకారం నియమిస్తారు. ఈ సందర్భంలో ఇద్దరు ఇతర సీనియర్ న్యాయమూర్తులను, న్యాయవాదులను ప్రధాన న్యాయమూర్తి సంప్రదించాలి.
- సంబంధిత రాష్ట్ర ముఖ్యమంత్రి, గవర్నర్‌లను కూడా ఎన్‌జేఏసీ సంప్రదించాలి.
- హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, ఇతర న్యాయమూర్తుల బదిలీ విషయంలోనూ రాష్ట్రపతి నేషనల్ జుడీషియల్ అపాయింట్‌మెంట్ కమిషన్ (NJAC)ని సంప్రదించాల్సి ఉంటుంది. కమిషన్ ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకుంటే తప్పనిసరిగా ఆ నిర్ణయం మేరకు వ్యవహరించాలి.

99వ రాజ్యాంగ సవరణ - ముఖ్యాంశాలు

- **కొత్తగా చేర్చిన ప్రకరణలు:** 124(ఎ), 124(బి), 124(సి)
- **124(ఎ):** జాతీయ న్యాయమూర్తుల నియామక కమిషన్ నిర్మాణం.
- **124(బి):** జాతీయ న్యాయమూర్తుల నియామక కమిషన్ విధులు.
- **124(సి):** నియామక ప్రక్రియకు సంబంధించి చట్టాలు చేసే అధికారం పార్లమెంట్‌కు కల్పించడం.
- **సవరించిన ప్రకరణలు:** 124, 127, 128, 217, 222, 224, 224(ఎ), 231.

ఆగ్‌మార్క్ ముద్ర ఏ వస్తువులకు చెందింది?

టెట్/డీఎస్సీ- ప్రత్యేకం
సోషల్

విలువ సిద్ధాంతం

మార్కెట్.. వస్తువులు, సేవల అమ్మకాలు, కొనుగోళ్లకు సంబంధించింది. ఇక్కడ వస్తు సేవల ధరలను నిర్ణయిస్తారు. ఆర్థిక వ్యవస్థలో ఉత్పత్తి చేసిన వస్తువులను ప్రజలు వినియోగించాలంటే ముందుగా మారకం జరగాలి. వస్తువులు, సేవల అమ్మకాలు, కొనుగోళ్లను మారకం లేదా వినిమయం అంటారు.

నేటి ఆధునిక కాలంలో సమాచార వ్యవస్థ, సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందడం వల్ల 'నిర్ణీత ప్రదేశం' అవసరం లేకుండానే అమ్మకాలు, కొనుగోళ్లు జరుగుతున్నాయి. ఉత్తరాలు, ఏజెన్సీలతోపాటు టెలిఫోన్, ఫ్యాక్స్, ఇంటర్నెట్, కంప్యూటర్లు తదితర సౌకర్యాల ద్వారా వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు.

మార్కెట్ వర్గీకరణలో మూడు ప్రధాన అంశాలున్నాయి. మార్కెట్‌లోని వస్తువు, ఆ వస్తువుకున్న అమ్మకందార్ల సంఖ్య, కొనుగోలుదారుల సంఖ్యలు మొదటి అంశం. ఒక వస్తువు ఎంత భౌగోళిక విస్తీర్ణానికి విస్తరించి ఉంది అనేది రెండో అంశం. డిమాండ్‌కు అనుగుణంగా సప్లయ్ ఏ విధంగా మార్కెట్‌లో సర్దుబాటు అవుతుందనేది మూడో అంశం. ఇది వివిధ కాలవ్యవధులపై ఆధారపడి ఉంటుంది.

పోటీని బట్టి మార్కెట్లు:
పోటీని బట్టి మార్కెట్లు రెండు విధాలుగా ఉన్నాయి. అత్యధిక సంఖ్యలో అమ్మకందార్లు, కొనుగోలుదార్లు ఈ మార్కెట్‌లో ఉంటారు. ఇక్కడి పరిస్థితులు పోటీని పెంచేలా ఉంటాయి. ఈ మార్కెట్‌ను సంపూర్ణ పోటీ అంటారు. పరిమితమైన సంఖ్యలో ఉత్పత్తిదార్లు, కొనుగోలుదార్లు ఉండే మార్కెట్‌ను అసంపూర్ణ పోటీ అంటారు. ఉత్పత్తిదార్ల సంఖ్య ఆధారంగా ఇవి ఏకస్వామ్యం, ఏకస్వామ్య పోటీ, పరిమితస్వామ్య మార్కెట్‌లుగా ఉన్నాయి.

స్థలాన్ని, ప్రదేశాన్ని బట్టి మార్కెట్లు:
స్థలాన్ని బట్టి స్థానిక, జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లుగా వర్గీకరించారు. ఇవి ఒక వస్తువు పరిమాణం లేదా ఎంతమేరకు మార్కెట్ ఉందో తెలుపుతాయి. కొన్ని వస్తువులకు పరిమిత విస్తీర్ణంలో కొనుగోళ్లు, అమ్మకాలు జరుగుతాయి. మరికొన్నింటికి వివిధ దేశాల్లో విస్తృత మార్కెట్ ఉంటుంది. మన్నిక ఆధారంగా ఒక వస్తువుకు మార్కెట్ విస్తీర్ణం, డిమాండ్ ఉంటుంది.

కాలాన్ని బట్టి మార్కెట్లు:
ఒక వస్తువు సప్లయ్‌లో సర్దుబాట్లను అనుసరించి మార్కెట్లున్నాయి. కాల వ్యవధి ప్రకారం వస్తువు సప్లయ్‌లో మార్పులు జరుగుతాయి. దీన్ని బట్టి మూడు రకాల మార్కెట్లు ఉన్నాయి. అవి అతి స్వల్పకాలిక, స్వల్పకాలిక, దీర్ఘకాలిక మార్కెట్లు.

సంపూర్ణ పోటీ మార్కెట్:
అమ్మకందార్లు, కొనుగోలుదార్ల మధ్య పోటీ సంపూర్ణంగా లేదా పరిపూర్ణంగా ఉంటే దానిని సంపూర్ణ పోటీ మార్కెట్ లేదా పరిపూర్ణ పోటీ మార్కెట్ అంటారు. ఈ మార్కెట్లో ఒక కాలంలో ఒక వస్తువుకు ఒకే ధర ఉంటుంది. మార్కెట్లో నిర్ణయమైన ధరనే అమ్మకందార్లు, కొనుగోలుదార్లు అంగీకరిస్తారు. సజాతీయ వస్తువులుంటాయి. సంస్థల స్వేచ్ఛా ప్రవేశం, నిష్క్రమణ, ఉత్పత్తి కారకాల గమనశీలత, సంపూర్ణ జ్ఞానం, రవాణా ఖర్చులు, పోటీ ప్రకటనలు ఉండవు. సగటు రాబడి (AR) రేఖ X అక్షానికి సమాంతరంగా ఉంటుంది.

సంపూర్ణ పోటీ మార్కెట్‌లో డిమాండ్, సప్లయ్‌లు వస్తువు సమతౌల్యధరను నిర్ణయిస్తాయి. ఉత్పత్తిదార్లు సప్లయ్‌ను.. కొనుగోలుదార్లు మార్కెట్ డిమాండ్‌ను నిర్ణయిస్తారు. ఏ ధర వద్ద సప్లయ్, డిమాండ్ సమానం అవుతాయో ఆ ధరను సమతౌల్యధర అంటారు.



నిర్ణీత కాలంలో వివిధ ధరల వద్ద కొనుగోలు చేసే వస్తు పరిమాణాన్ని వైయక్తిక డిమాండ్ అంటారు. ఈ ధరను మార్కెట్లో కొనుగోలుదార్లు ఏ పరిమాణంలో కొంటారో దాన్ని డిమాండ్ అంటారు. వస్తుధర తగ్గితే డిమాండ్ పెరుగుతుంది. ధర పెరిగితే కొనుగోలుదార్లు తక్కువ వస్తువులను డిమాండ్ చేస్తారు.

వివిధ ధరల వద్ద ఉత్పత్తిదార్లు లేదా అమ్మకందార్లు ఎంత పరిమాణాన్ని విక్రయించడానికి సంసిద్ధత వ్యక్తం చేస్తారో దాన్ని సప్లయ్ అంటారు. ధర పెరిగితే సప్లయ్‌ను అమ్మకందార్లు పెంచుతారు. ధర తగ్గితే సప్లయ్‌ను తగ్గిస్తారు.

సమతౌల్య ధర వద్ద అమ్మకందార్ల, కొనుగోలుదార్ల మధ్య వస్తురాశి వినిమయం జరుగుతుంది. ఆ వస్తురాశిని సమతౌల్య వస్తురాశి అంటారు. వస్తువు ధరను డిమాండ్, సప్లయ్‌లు నిర్ణయిస్తాయి. ఇవి ఒకదానినొకటి వ్యతిరేకంగా ఉంటాయి.

ధరపై సప్లయ్, డిమాండ్‌ల్లో ఏది ఎక్కువ ప్రభావం చూపుతుందనే అంశాన్ని మార్కెట్ కాల వ్యవధి ఆధారంగా విశ్లేషించారు. కాలవ్యవధిని మార్షల్ 3 రకాలుగా వర్గీకరించారు. అవి..

1) మార్కెట్ కాలం
2) స్వల్పకాలం 3) దీర్ఘకాలం

- మార్కెట్ కాలంలో సప్లయ్ స్థిరంగా ఉంటుంది. డిమాండ్ పెరిగితే ధర పెరుగుతుంది. డిమాండ్ తగ్గితే ధర తగ్గుతుంది. దీన్ని బట్టి మార్కెట్ కాలంలో ధర మీద డిమాండ్ ప్రభావం ఎక్కువ ఉంటుందని చెప్పవచ్చు.
- స్వల్పకాలంలో.. ఒక ఉత్పత్తి సంస్థ తన వద్ద ఉన్న పరికరాలను, యంత్రాలను ఉపయోగించుకొని ఎక్కువ ముడిపదార్థాలను, శ్రామికులను నియమించి ఉత్పత్తిని పెంచడానికి ప్రయత్నం చేస్తుంది. స్థిర సాధనాలను పెంచడానికి అవకాశం లేనందున సప్లయ్‌ని అనుకున్నంత పరిమాణంలో సాధించలేకపోతుంది.
- దీర్ఘకాలంలో ఎక్కువ ఉత్పాదక శక్తి కలిగిన కొత్త యంత్రాలను ప్రవేశపెట్టి డిమాండ్ పెరిగిన మేరకు సప్లయ్‌ని పెంచవచ్చు. ఈ కాలంలో అన్ని సాధనాలు చర సాధనాలే. అందువల్ల అన్ని వ్యయాలు చర వ్యయాలే. దీర్ఘకాలంలో డిమాండ్ పెరిగిన మేరకు సప్లయ్ పెరుగుతుంది.

సంపూర్ణ పోటీ మార్కెట్‌లో సమష్టి డిమాండ్, సమష్టి సప్లయ్‌లు కలిసి సమతౌల్య ధరను నిర్ణయిస్తాయి. పరిశ్రమలో నిర్ణయించిన ధరను ప్రతి సంస్థ స్వీకరిస్తుంది. ధరను బట్టి సంస్థ తయారుచేసే వస్తురాశి నిర్ధారితం అవుతుంది. ప్రతి సంస్థ సమతౌల్యం పొందడానికి ప్రయత్నం చేస్తుంది. ఉపాంత వ్యయం, ఉపాంత రాబడి సమానంగా ఉండాలి (MC = MR). MC రేఖ MR రేఖను కింది నుంచి ఖండిస్తూ పైకి పోవాలి.

అసంపూర్ణ పోటీ మార్కెట్:
ఏకస్వామ్యాన్ని ఆంగ్లంలో 'మోనోపాలి' అంటారు. 'మోనోపాలి' అంటే ఒకే ఒక అమ్మకందారుడు ఉండే మార్కెట్ అని అర్థం. ఒకే అమ్మకందారుడు ఉండి సమీప ప్రత్యామ్నాయాలు లేని మార్కెట్‌ను ఏకస్వామ్య మార్కెట్ అంటారు. దీన్నే గుత్తాధిపత్య మార్కెట్ అని కూడా అంటారు. ఉత్పత్తి తరహా, ముడి పదార్థాల సప్లయ్, పేటెంట్ హక్కులు, ప్రభుత్వ విధానాలు మొదలైన అంశాలు ఏకస్వామ్య సంస్థ కొనసాగడానికి సహకరిస్తాయి.

మాదిరి ప్రశ్నలు

1. ఏకస్వామ్య పోటీ సిద్ధాంతం ఎవరిది?
   1) కార్‌నాట్ 2) చాంబర్లిన్
   3) రాబిన్‌సన్ 4) పాల్ స్వీజీ
2. ఒకే ఒక అమ్మకందారు ఉన్న మార్కెట్?
   1) ద్విదాధిపత్యం 2) పరిమితస్వామ్యం
   3) శుద్ధ ఏకస్వామ్యం 4) ఏదీకాదు
3. సంస్థ తన వస్తు అమ్మకాలను పెంచుకోవడానికి చేసే వ్యయాలను ఏమంటారు?
   1) అమ్మకపు వ్యయాలు
   2) అవకాశ వ్యయాలు
   3) అప్రకటిత వ్యయాలు
   4) ప్రకటిత వ్యయాలు
4. పరిమితస్వామ్యాన్ని వివరించిన ఆర్థికవేత్త ఎవరు?
   1) అగస్టిన్ 2) కార్‌నాట్
   3) మార్షల్ 4) పాల్ స్వీజీ
5. ఆగ్‌మార్క్ ముద్ర ఏ వస్తువులకు చెందింది?
   1) వ్యవసాయ వస్తువులు
   2) వినియోగ వస్తువులు
   3) మూలధన వస్తువులు 4) పైవన్నీ
6. ఒక సంస్థ ధరను పెంచితే మిగతా సంస్థలు ధరను పెంచని మార్కెట్ ఏది?
   1) ఏకస్వామ్యం 2) ద్విదాధిపత్యం
   3) పరిమిత స్వామ్యం 4) ఏకస్వామ్యపోటీ
7. అసంపూర్ణ పోటీలో భాగం కానిదేది?
   1) ఏకస్వామ్యం 2) సంపూర్ణపోటీ
   3) పరిమిత స్వామ్యం
   4) ద్విదాధిపత్యం
8. ధరల దృఢత్వం ఉన్న మార్కెట్?
   1) మోనోపాలి 2) సంపూర్ణపోటీ
   3) డ్యుయోపాలి 4) పరిమితస్వామ్యం
9. ద్విదాధిపత్యాన్ని గురించి వివరించిన ఆర్థికవేత్త ఎవరు?
   1) మార్షల్ 2) రికార్డో
   3) స్వీజీ 4) కార్‌నాట్
10. సంస్థకు స్వల్పకాలంలో లాభాలు ఎలా ఉంటాయి?
    1) సామాన్యంగా 2) గరిష్టంగా
    3) స్థిరంగా 4) కనిష్టంగా
11. వ్యాపార ప్రకటనలపై చేసే ఖర్చు వేటికి సంబంధించింది?
    1) అమ్మకపు వ్యయాలు
    2) అవకాశ వ్యయాలు
    3) అప్రకటిత వ్యయాలు
    4) ప్రకటిత వ్యయాలు
12. దీర్ఘకాలంలో కూడా అత్యధిక లాభాలను ఆర్జించే మార్కెట్ ఏది?
    1) ఏకస్వామ్యం 2) పరిమిత స్వామ్యం
    3) ద్విదాధిపత్యం 4) పైవన్నీ
13. కిందివానిలో డిమాండ్‌ను బట్టి ఏర్పడని మార్కెట్ ఏది?
    1) అంతర్జాతీయ మార్కెట్
    2) స్థానిక మార్కెట్
    3) జాతీయ మార్కెట్
    4) సంపూర్ణ పోటీ మార్కెట్
14. సగటు వ్యయ కనిష్ట బిందువునేమంటారు?
    1) స్థిరవ్యయం
    2) అభిలషణీయ ఉత్పత్తి
    3) చర వ్యయం 4) ఏదీకాదు
15. కొద్దిమంది అమ్మకందార్లు ఉండి అనేక మంది కొనుగోలుదార్లు ఉన్న సంస్థ ఏది?
    1) ద్విదాధిపత్యం 2) ఏకస్వామ్యం
    3) పరిమిత స్వామ్యం 4) ఏదీకాదు
16. ఉత్పత్తి వ్యయం, అమ్మకపు వ్యయాలు లేని మార్కెట్ ఏది?
    1) ఏకస్వామ్య పోటీ
    2) పరిమిత స్వామ్యం
    3) ద్విదాధిపత్యం 4) ఏదీకాదు
17. ఏకస్వామ్యంలో రాబడి రేఖలు ఏ విధంగా ఉంటాయి?
    1) స్థిరంగా 2) ధనాత్మకంగా
    3) రుణాత్మక వాలు 4) ఏదీకాదు
18. గరిష్ట లాభాలను సంస్థ ఏ కాలంలో ఆర్జిస్తుంది?
    1) అతిదీర్ఘకాలం 2) దీర్ఘకాలం
    3) స్వల్పకాలం 4) పైవన్నీ
19. సన్నిహిత ప్రత్యామ్నాయాలు లేని వ్యవస్థ ఏది?
    1) ఏకస్వామ్యం 2) ఏకస్వామ్యపోటీ
    3) పరిమిత స్వామ్యం 4) ద్విదాధిపత్యం
20. సంపూర్ణ పోటీలో ధర నిర్ణయం ఏ విధంగా జరుగుతుంది?
    1) సప్లయ్
    2) సమష్టి సప్లయ్, సమష్టి డిమాండ్ కలిసి
    3) డిమాండ్ 4) ఏదీకాదు
21. ఏకస్వామ్య పోటీలో సంస్థకు స్వల్ప కాలంలో వచ్చేవి?
    1) నష్టాలు 2) గరిష్ట లాభాలు
    3) గరిష్ట లాభాలు, నష్టాలు
    4) సామాన్య లాభాలు
22. ఇటుకలకు ఉండే డిమాండ్ ఏది?
    1) అంతర్జాతీయ 2) స్థానిక
    3) జాతీయ 4) ఏదీకాదు
23. మార్కెట్ కాలంలో సప్లయ్?
    1) సాపేక్ష వ్యాకోచత్వం
    2) సాపేక్ష అవ్యాకోచత్వం
    3) పూర్తి అవ్యాకోచత్వం
    4) పూర్తి వ్యాకోచత్వం
24. జాతీయ డిమాండ్ లేని వస్తువు ఏది?
    1) గోధుమ 2) పంచదార
    3) వస్త్రాలు 4) చేపలు
25. మార్కెట్ల వర్గీకరణలో ఉండే అంశాలు?
    1) ఐదు 2) మూడు
    3) నాలుగు 4) ఏదీకాదు
26. ధర నాయకత్వం ఉన్న ఆర్థిక మార్కెట్‌కు ఉదాహరణ?
    1) ఏకస్వామ్య పోటీ
    2) పరిమిత స్వామ్యం
    3) పరిపూర్ణ పోటీ 4) ద్విసామ్యం

సమాధానాలు

1) 2; 2) 3; 3) 1; 4) 4;
5) 1; 6) 3; 7) 2; 8) 4;
9) 4; 10) 2; 11) 1; 12) 1;
13) 4; 14) 2; 15) 2; 16) 3;
17) 3; 18) 3; 19) 1; 20) 2;
21) 3; 22) 2; 23) 3; 24) 4;
25) 2; 26) 2.

విద్య, ఉద్యోగ సమాచారం

కొచ్చిన్ షిప్‌యార్డ్‌లో సీనియర్ ప్రాజెక్ట్ ఆఫీసర్ పోస్టులు

కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్‌కు చెందిన కోల్‌కతా షిప్‌యార్డ్ రిపేర్ యూనిట్ ఒప్పంద ప్రాతిపదికన సీనియర్ ప్రాజెక్ట్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 03.
» **విభాగాలు:** మెకానికల్, ఎలక్ట్రికల్.
» **అర్హత:** కనీసం 60 శాతం మార్కులతో బీఈ/బీటెక్(ఎలక్ట్రికల్/మెకానికల్) ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 35 ఏళ్లు మించకూడదు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, ఓబీసీ అభ్యర్థులకు మూడేళ్లు, పీడబ్ల్యూబీడీ అభ్యర్థులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
» **వేతనం:** నెలకు మొదటి ఏడాది రూ.47,000, రెండో ఏడాది రూ.48,000, మూడో ఏడాది రూ.50,000.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 03.12.2024.
» **వెబ్‌సైట్:** https://cochinshipyard.in

సీఈఐఎల్, మహారాష్ట్రలో వివిధ ఉద్యోగాలు

మహారాష్ట్రలోని సర్టిఫికేషన్ ఇంజినీర్స్ ఇంటర్నేషనల్ లిమిటెడ్(సీఈఐఎల్) ఒప్పంద ప్రాతిపదికన వివిధ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **పోస్టులు:** ఇన్‌స్పెక్షన్ ఇంజనీర్, సీనియర్ ఆఫీసర్, అసోసియేట్-1/2/3.
» **విభాగాలు:** క్వాలిటీ అష్యూరెన్స్/క్వాలిటీ కంట్రోల్, ఫైనాన్స్ అండ్ అకౌంట్స్, హ్యూమన్ రిసోర్స్ అండ్ అడ్మినిస్ట్రేషన్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో కనీసం 50 శాతం మార్కులతో డిప్లొమా, సీఏ, బీఈ/బీటెక్(మెకానికల్/ఎలక్ట్రికల్/ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్/ప్రొడక్షన్), బీబీఏ, బీసీఏ, ఎంబీఏ ఉత్తీర్ణతతో పాటు పని ఉండాలి.
» **వయసు:** 45 ఏళ్లు మించకూడదు. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, పీడబ్ల్యూబీడీలకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ, వైద్య పరీక్షలు, సర్టిఫికేట్‌ల పరిశీలన ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఈమెయిల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఈమెయిల్:** recruit@hr3@ceil.co.in
» **పని ప్రదేశాలు:** ముంబై, ఢిల్లీ.
» **దరఖాస్తు విధానం:** ప్రకటన వెలువడిన 15 రోజుల్లోపు దరఖాస్తు చేసుకోవాలి.
» **ప్రకటన వెలువడిన తేది:** 13.11.2024.
» **వెబ్‌సైట్:** https://ceil.co.in

పట్టణీకరణ-పరిణామాలు

1901 జనాభా లెక్కల ప్రకారం భారత్ మొత్తం జనాభాలో పట్టణ జనాభా 11.4 శాతంగా ఉంది. ఇది 2001 నాటికి 28.53 శాతానికి, 2011 నాటికి 31.6 శాతానికి పెరిగింది. స్వాతంత్ర్యానంతరం దేశ స్థూల జాతీయోత్పత్తిలో వ్యవసాయ రంగ వాటా క్రమంగా తగ్గగా పారిశ్రామిక, సేవా రంగాల వాటా క్రమేణా పెరుగుతూ వెళ్లింది. 1941 తర్వాత ఢిల్లీ, ముంబై, కోల్‌కతా, చెన్నై లాంటి నగరాల్లో వృద్ధి అధికమైంది. ప్రపంచ వ్యాప్తంగా సాంకేతిక పరిజ్ఞానం ప్రజలకు అందుబాటులోకి వచ్చింది. తద్వారా భారత్‌లో ఆర్థికవృద్ధి అధికమవడంతో పాటు ప్రజల జీవన ప్రమాణాలు కూడా పెరిగాయి. పబ్లిక్ రంగంలో వృద్ధి కారణంగా పట్టణ ప్రాంతాల్లో ప్రజా రవాణా, రోడ్లు, నీటిసరఫరా, విద్యుత్ లాంటి అవస్థాపన సౌకర్యాలు మెరుగయ్యాయి.

ప్రపంచబ్యాంకు - పట్టణీకరణ

ఆర్థికవృద్ధి ప్రక్రియలో పట్టణీకరణ భాగమని ప్రపంచబ్యాంకు పేర్కొంది. భారత ఆర్థికవ్యవస్థలో పట్టణ ప్రాంతాల భాగస్వామ్యం విస్మరించలేనిది. భారత్ ఆర్థిక ఉత్పత్తిలో నగరాల వాటాను 2/3గా ప్రపంచబ్యాంకు పేర్కొంది. పెరుగుతున్న జనాభాకు ఆశ్రయం కల్పించడం, నవకల్పనలు, సాంకేతిక పరిజ్ఞానం, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ఆకర్షించటం లాంటి అంశాల్లో భారత్‌లోని నగరాల పాత్రను ప్రపంచ బ్యాంకు ప్రశంసించింది. వచ్చే రెండు దశాబ్దాల కాలంలో పట్టణ జనాభా 377 మిలియన్ల (2011లో) నుంచి 590 మిలియన్లకు చేరుకోగలదని అంచనా వేస్తున్నారు. ఆర్థిక అవసరాల కారణంగా భారత్‌లోని గ్రామీణ జనాభా పట్టణ ప్రాంతాలకు వలస వెళ్తున్నారు. దీంతో భారత్‌లోని పట్టణాలు, నగరాలు వేగంగా విస్తరిస్తున్నాయని ప్రపంచబ్యాంకు పేర్కొంది. 2050 నాటికి భారత్‌తో పాటు చైనా, ఇండోనేసియా, నైజీరియా, అమెరికాలో పట్టణ జనాభా వృద్ధి అధికంగా ఉంటుందని ప్రపంచ బ్యాంకు పేర్కొంది.

ప్రపంచ పట్టణ జనాభా

ఒక అంచనా ప్రకారం 2011–50 మధ్యకాలంలో ప్రపంచ పట్టణ జనాభా 3.6 బిలియన్ల నుంచి 6.3 బిలియన్లకు పెరగనుంది. అభివృద్ధి చెందిన, చెందుతున్న దేశాల్లో జనాభా పెరుగుదల అధికంగా ఉంది. 2020 నాటికి ఆసియాలో సగం జనాభా, 2035 మధ్యనాటికి ఆఫ్రికాలో సగం జనాభా పట్టణ ప్రాంతాల్లో నివసిస్తుందని అంచనా వేస్తున్నారు. ఈ అంచనాల ప్రకారం 2011–30 మధ్యకాలంలో ప్రపంచ పట్టణ జనాభాలో 1.4 బిలియన్ల పెరుగుదల ఉండనుంది. ఈ మొత్తంలో చైనా వాటా 279 మిలియన్లు కాగా భారత్ వాటా 218 మిలియన్లుగా ఉంది. ప్రపంచ పట్టణ జనాభా పెరుగుదలలో భారత్ వాటా 15.5 శాతానికి పైగా ఉంటుందని ఐక్యరాజ్యసమితి 2012లో తెలిపింది.

స్వాతంత్ర్యానంతరం భారత్ ప్రధానంగా పేదరికం, నిరుద్యోగం, ఆర్థిక వెనుకబాటుతనం లాంటి సమస్యలను ఎదుర్కొంది. ఆర్థికాభివృద్ధిని వేగవంతం చేయడానికి అప్పటి ప్రధాని జవహర్‌లాల్‌నెహ్రూ సైన్స్ అండ్ టెక్నాలజీ రంగానికి అధిక ప్రాధాన్యం ఇచ్చారు. ఈ క్రమంలో మిశ్రమ ఆర్థిక వ్యవస్థను అవలంబించే భారత్‌లో ప్రైవేటు రంగం అభివృద్ధి చెందింది. దీని ఫలితంగా దేశంలో పట్టణీకరణ వేగవంతమైంది.



పట్టణ జనాభా పెరుగుదలకు ముఖ్య కారణాలు

1. పట్టణ ప్రాంత జనాభాలో సహజ పెరుగుదల
2. గ్రామీణ ప్రాంతాలను పట్టణ ప్రాంతాలుగా తిరిగి వర్గీకరించడం
3. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణ ప్రాంతాలకు నికర వలసలు

ఉపాధి రహిత వృద్ధి

భారత్‌లో స్థూల దేశీయోత్పత్తి వృద్ధిరేటు అధికంగా నమోదవుతోంది. అయినప్పటికీ గ్రామీణ ప్రాంతాలు ఉపాధి రహిత వృద్ధిని చవిచూశాయి. గత దశాబ్దకాలంలో స్థూల దేశీయోత్పత్తి సగటు వార్షిక వృద్ధి 5 శాతానికి పైగా నమోదైంది. అదే సమయంలో ఉపాధివృద్ధిలో పెరుగుదల స్వల్పంగా ఉంది. 2004-05 నుంచి 2009-10 మధ్య కాలంలో వ్యవసాయరంగంలో 23.3 మిలియన్లు, తయారీ రంగంలో 4.02 మిలియన్ల మంది ఉపాధిని కోల్పోయారు. ఇతర రంగాల్లో కొత్తగా 1.74 మిలియన్ల మందికి ఉపాధి అవకాశాలు లభించాయి. 1999-2000, 2009-2010 గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో (గ్రామీణ మహిళలు మినహా) నిరుద్యోగిత రేటులో స్వల్ప తగ్గుదల నమోదైంది. అల్ప ఉద్యోగిత రేటు పట్టణ ప్రాంతాలతో పోల్చినప్పుడు గ్రామీణ ప్రాంతాల్లోనే ఎక్కువగా ఉంది. భారత్‌లోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని నిరుద్యోగిత రేటు శ్రామిక మార్కెట్ స్థితి, ఉపాధి అవకాశాలను కచ్చితంగా స్పష్టపరచడం లేదు. 2011లో ఎన్ఎస్ఎస్ఓ నిర్వహించిన సర్వే ప్రకారం పురుషులకు సంబంధించి గ్రామీణ ప్రాంతాల్లో 10 శాతం, పట్టణ ప్రాంతాల్లో 4.9 శాతం, మహిళలకు సంబంధించి గ్రామీణ ప్రాంతాల్లో 7 శాతం, పట్టణ ప్రాంతాల్లో 4.5 శాతం మంది అదనపు పని కోసం ఆసక్తి ప్రదర్శించారు. ఈ సర్వేలో శ్రామికుల్లో అనేక మంది ప్రస్తుతం చేస్తున్న పని ద్వారా తగినంత ప్రతిఫలం లభించడం లేదని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణ ప్రాంతాలకు వలసలు పెరిగాయి. 2005-06లో భారత ప్రభుత్వం ప్రారంభించిన జవహర్‌లాల్ నెహ్రూ జాతీయ పట్టణ రెన్యువల్ మిషన్ కింద కేంద్రీకృత ప్రణాళికలో భాగంగా మూడంచెల వ్యవస్థను ప్రవేశపెట్టారు. దీంతో గ్రామీణ పట్టణ సంబంధాలు మెరుగయ్యాయి.

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
ఇండియన్ ఎకానమీ

పట్టణ జనాభా

భారత్‌లోని మొత్తం పట్టణ జనాభాలో 2011 లెక్కల ప్రకారం మహారాష్ట్రకు 13.5 శాతం, ఉత్తర ప్రదేశ్‌కు 11.8 శాతం, తమిళనాడుకు 9.3 శాతం వాటా ఉంది. 2011లో పట్టణ ప్రాంతాల్లో 377 మిలియన్ల మంది నివసించగా, ఒక మిలియన్ జనాభాకు పైగా ఉన్న నగరాల్లో 43 శాతం మంది నివసిస్తున్నారు. 2001లో మిలియన్ జనాభా ఉన్న నగరాల సంఖ్య 35 ఉండగా, 2011 నాటికి 53కు పెరిగాయి. ఉత్తరప్రదేశ్, కేరళల్లో చెరో 7 నగరాలు, మహారాష్ట్రలో ఆరు నగరాలు ఉన్నాయి. 53 పట్టణ పరిధి కలిగిన ప్రాంతాల్లో మూడు అతిపెద్ద మెగాసిటీలు (పది మిలియన్లకు పైగా జనాభా ఉన్న ప్రాంతాలు)గా గ్రేటర్ ముంబై (18.4 మిలియన్లు), ఢిల్లీ (16.3 మిలియన్లు), కోల్‌కతా (14.1 మిలియన్లు) లు నిలిచాయి. జనాభా పరంగా చెన్నై 8.7 మిలియన్లు, బెంగళూరు 8.5 మిలియన్లు కలిగి ఉన్నాయి. పది మిలియన్ జనాభాపైగా ఉన్న నగరాల్లో జనాభివృద్ధి, 2001–2011 మధ్యకాలంలో తగ్గింది. గ్రేటర్ ముంబై పట్టణ పరిధి జనాభా వృద్ధి 1991–2001 మధ్య 30.47 శాతం కాగా, 2001–2011 మధ్య 12.05 శాతంగా నమోదైంది. ఇదే కాలానికి సంబంధించి ఢిల్లీ పట్టణ పరిధి జనాభివృద్ధి 52.24 శాతం నుంచి 26.69 శాతానికి తగ్గింది. కోల్‌కతాలో 19.60 శాతం నుంచి 6.87 శాతానికి తగ్గింది.

పట్టణీకరణ పెరగడానికి కారణాలు

- పట్టణీకరణ భారతీయ సమాజంలో సాధారణ లక్షణంగా కనిపిస్తుంది. పరిశ్రమల సంఖ్యలో వృద్ధి కారణంగా నగరాల సంఖ్య పెరిగింది. పారిశ్రామికీకరణ ఫలితంగా ప్రజలు ఉపాధి కోసం పారిశ్రామిక ప్రాంతాలకు తరలి వెళ్తున్నారు. ఫలితంగా పట్టణాలు, నగరాల సంఖ్య పెరుగుతోంది. పారిశ్రామికీకరణ ఉపాధి అవకాశాలను విస్తృతపరిచింది. దీంతో పట్టణ జనాభా పెరుగుతూ వెళ్తోంది.
- సామాజిక అంశాలైన విద్య, ఆరోగ్య సౌకర్యాల అందుబాటు, తాగునీరు, పారిశుద్ధ్య సౌకర్యాల లభ్యత కారణంగా గ్రామీణ ప్రాంత ప్రజలు పట్టణ ప్రాంతాలకు తరలి వెళ్తున్నారు.
- గ్రామీణ ప్రజలు జీవనోపాధి కోసం వ్యవసాయ రంగంపైనే ఆధారపడాలి. భారత వ్యవసాయ రంగం రుతుపవనాలపై ఆధారపడి ఉంది. కరవు పరిస్థితులు, ప్రకృతి వైపరీత్యాల ప్రభావంతో వలసలు పెరిగాయి.
- సాంకేతిక పరిజ్ఞానం అందుబాటుతో పాటు మెరుగైన అవస్థాపనా సౌకర్యాల అందుబాటు కారణంగా సౌకర్యవంతమైన జీవనం సాగించవచ్చనే అభిప్రాయంతో గ్రామీణ ప్రజలు పట్టణ ప్రాంతాలకు వెళ్తున్నారు.
- ఒకవైపు పట్టణాలు, నగరాల సంఖ్య పెరుగుతుంటే, మరోవైపు గ్రామీణ సమాజం పట్టణ సంస్కృతిని అలవర్చుకుంటోంది. పట్టణ ప్రజల వాణిజ్య సంస్కృతిని అవలంబించడం గ్రామీణ సమాజంలో కనిపిస్తోంది. విద్యావ్యాప్తి కారణంగా అక్షరాస్యత రేటు పెరిగి, గ్రామీణ ప్రజల్లో ఆధునికత పెరిగింది.
- ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవడం.
- మహిళల్లో ఆలోచనా పరిజ్ఞానం పెరగడం.
- ఆధునిక రవాణా, సమాచార సౌకర్యాల పెరుగుదల.
- రాజకీయాల్లో క్రియాశీలకంగా పాల్గొనడం.
- బ్యాంకులు, అనేక విత్త సంస్థలు అందుబాటులో ఉండటం.
- గ్రామీణ వినియోగదారుల్లో అవగాహన పెరగడం.
- అధునాతన వస్తు ఉత్పత్తులకు డిమాండ్.
- భారతదేశంలో ఆర్థికాభివృద్ధిని వేగవంతం చేయడంలో భాగంగా పట్టణీకరణ లక్ష్యాన్ని పదకొండో ప్రణాళికలో ఎంచుకోవడం.
- సంస్కరణల అమలు కాలంలో ప్రైవేట్‌రంగ ప్రాధాన్యం పెరగడంతో పాటు ప్రైవేట్ రంగ పెట్టుబడులు అధికంగా పట్టణ ప్రాంతాల్లో కేంద్రీకృతమవడం.
- దేశవిభజన సమయంలో ప్రజల వలస.
- సహజంగా పట్టణ జనాభా పెరగటానికి మరణరేటు తగ్గుదలతోపాటు జననాల రేటు ఎక్కువగా ఉండటం కారణమైంది.

పట్టణీకరణ ప్రభావం

- ఆర్థిక, సాంఘిక, రాజకీయ, సాంస్కృతిక, పర్యావరణ అంశాలు పట్టణీకరణపై ప్రభావం చూపుతాయి. సామాజికంగా, సాంస్కృతికంగా మీడియా పట్టణీకరణను ప్రోత్సహిస్తోంది.
- పెద్ద నగరాల్లో చెత్త పెద్ద సమస్యగా నిలిచింది. వాయు, నీటి, ధ్వని కాలుష్యం లాంటి సమస్యలు పట్టణ ప్రజల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం కలుగజేస్తాయి.
- మురికివాడలు పెరగడంతోపాటు పేదరికం, నిరక్షరాస్యత, నిరుద్యోగం పెరిగి ప్రజల జీవన ప్రమాణం కుంటుపడుతుంది.
- అధిక పట్టణీకరణ కారణంగా నేరాల రేటు పెరుగుతోంది. నేరాల రేటు పెరుగదలకు పేదరిక నిర్మూలనలో ప్రభుత్వ వైఫల్యం కారణమవుతోంది.

పట్టణీకరణ ప్రయోజనాలు

- ఆర్థికవ్యవస్థలో వృద్ధిరేటు పెరుగుదల.
- వాణిజ్య కార్యకలాపాల్లో వృద్ధి.
- సాంఘిక, సాంస్కృతిక సమన్వయం (ఇంటిగ్రేషన్).
- సమర్థమైన సేవల అందుబాటు.
- వనరుల అభిలషణీయ వినియోగం.

What is N's position with respect to K?

BANK EXAMS
REASONING

MODEL QUESTIONS

Directions (Q. No. 1-2): Study the given information carefully and answer the given questions.

Twenty students are standing in a straight line, facing north. Rina is standing sixth from the left end. There are only three students between Rina and Shweta. Radha is standing exactly between Shweta and Rina. Tina is standing sixth to the right of Radha. Anita is standing fourth from the right end of the line. There are more than four students between Rina and Tina.

1. How many people are standing between Anita and Tina?
   1) One 2) Two 3) Three
   4) None 5) More than three
2. What is Shweta's position with respect to Anita?
   1) Sixth to the left
   2) Eighth to the left
   3) Seventh to the left
   4) Ninth to the left
   5) None of these
3. Which of the following will come in place of the question mark (?) in the following series based on the English alphabetical order?
   ZYW VUS RQO ? JIG
   1) KMN 2) MNK 3) NLK
   4) NMK 5) NML

Directions (Q. No. 4-8):

Study the given information carefully and answer the given questions.

Eight people J, K, L, M, N, O, P and Q are sitting around a circular table, facing the centre, not necessarily in the same order. O is sitting third to the right of M. There is only one person sitting between M and J. There are only three people between J and K. P is an immediate neighbour of J. There are only three people between P and L. N is second to the right of P.

4. Which of the following is true regarding the given arrangement?
   1) M is an immediate neighbour of K.
   2) N is an immediate neighbour of J.
   3) P is second to the left of O.
   4) There are four people between N and O.
   5) None is true
5. Who is sitting second to the left of the one who is sitting second to the left of Q?
   1) M 2) K 3) N 4) L 5) J



6. Four of the following five are alike in a certain way based on their seating positions in the above arrangement and so form a group. Which does not belong to the group?
   1) PQ 2) KL 3) MN
   4) QO 5) KO
7. What is N's position with respect to K?
   1) Second to the left
   2) Second to the right
   3) Third to the left
   4) Third to the right
   5) Fourth to the left
8. How many people are sitting between K and P when counted from the right side of K?
   1) One 2) Two 3) Three
   4) None 5) More than three

Directions (Q. No. 9-13):

Study the given information carefully and answer the given questions.

Auditions for a show were held in seven different cities of India - Chennai, Bangalore, Cochin, Mumbai, Delhi, Bhopal and Kolkata - not necessarily in the same order during the first seven months of the year 2011 (starting in January and ending in July). The auditions were held only in one city during a month. Auditions in only four cities were held between the Kolkata audition and the Cochin audition. The Kolkata audition was not held in June. Only one audition was held between the Kolkata audition and the Bangalore audition. The Chennai audition was held immediately after the Kolkata audition. The Delhi audition was held immediately before the Bhopal audition. The Bhopal audition was not held in May.

9. How many auditions were held between the Mumbai audition and the Chennai audition?
   1) One 2) Two 3) Three
   4) None 5) More than three
10. Which of the following statements is true according to the given sequence?
    1) Mumbai audition was held in July.
    2) Delhi audition was held in April.
    3) Cochin audition was held before May.
    4) Kolkata audition was held in January.
    5) None is true
11. Four of the following five are alike in a certain way based on the given sequence and hence form a group. Which does not belong to the group?
    1) January - Kolkata
    2) March - Bangalore
    3) June - Cochin
    4) May - Delhi
    5) February - Chennai
12. During March, the audition was held in which of the following cities?
    1) Bangalore 2) Kolkata
    3) Mumbai 4) Chennai
    5) None of these
13. The audition in Mumbai was held in which of the following months?
    1) July 2) May 3) February
    4) March 5) None of these

Directions (Q. No. 14-16):

Read the following information carefully and answer the questions that follow.

Saurabh, Raman, Sushant, Shoumya, Anu and Swati are six friends. Each of them has a different weight, Anu's weight is more than Saurabh's but less than Shoumya's. Only one person is heavier than Sushant. The one whose weight is second lowest is 46 kg and Sushant's weight is 58 kg. Shoumya is not the heaviest. Swati is not heavier than Saurabh.

14. Whose weight is the second highest?
    1) Shoumya 2) Raman
    3) Sushant
    4) Can't be determined
    5) None of these
15. If Sushant is 8 kg heavier than Anu, what is the possible weight of Shoumya?
    1) 47 kg 2) 44 kg 3) 55 kg
    4) 60 kg 5) None of these
16. Which of the following statements is true?
    1) Raman's weight is 56 kg.
    2) Swati is heavier than Anu.
    3) Raman is the heaviest.
    4) Shoumya is the heaviest.
    5) None of these

Directions (Q. No. 17-23):

Study the following information carefully and answer the given questions.

Eight friends O, P, Q, R, Z, T, U and V are sitting around a circle, facing the centre, but not necessarily in the same order. P is second to the left of U, who is fourth to the right of Q. V is opposite O, who is second to the right of Z. O is not an immediate neighbour of P or U. R is an immediate neighbour of Q.

17. Who among the following is opposite Z?
    1) Q 2) R 3) P 4) T 5) O
18. Starting from O, if all the friends are made to sit in alphabetical order in clockwise direction, the position of how many (excluding O) will remain unchanged?
    1) One 2) Two 3) None
    4) Three 5) None of these
19. Who among the following sits third to the left of U?
    1) O 2) T
    3) Q 4) R 5) Z
20. Which of the following pairs are the immediate neighbours of T?
    1) O, Z 2) Q, P 3) Z, V
    4) R, O 5) None of these
21. If the places of O and V are interchanged, who is third to the right of Q?
    1) V 2) O 3) Z 4) T 5) P
22. Which of the following is true, with respect to the given seating arrangement?
    1) O sits on the immediate right of Z.
    2) U sits exactly between V and P.
    3) Z sits second to the right of V.
    4) Q is an immediate neighbour of P.
    5) None of these
23. T is related to P in a certain way. Similarly, Q is related to U, according to the given seating arrangement. Who among the following is related to Z, following the same pattern?
    1) Q 2) P 3) V 4) O 5) R

Answers, Explanations


(1-3):



Anita is 4th from the right end. Thus, in the row, Anita's position from the left end (20 + 1- 4) = 17th

1. 2 2. 3
3. 4; Move four letters backwards in the alphabet for the corresponding letter of the next tern.

4 - 8:



4.2 5. 1 6. 5
7.3 8.2

(9 - 13):

Month	City
January	Mumbai
February	Kolkata
March	Chennai
April	Bangalore
May	Delhi
June	Bhopal
July	Cochin


9. 1
10. 5
11. 4
12. 4
13. 5

(14 -16):

Raman > Sushant > Shoumya > Anu > Saurabh > Swati
Sushant ↓ 58 kg; Saurabh ↓ 46 kg

14. 3
15. 3;
    Anu's weight = 58 - 8 = 50 kg
    Shoumya's weight lies between Anu's and Sushant's. Thus, the possible weight of Shoumya is 55 kg.
16. 3

(17-23):



17. 2 18. 3
19. 4 20. 1
21. 2 22. 3
23. 5

